# మిసిమి

...పాతికేండ్ల సారస్వత సేవ...

చింతనాత్మక సారస్వతం

మాసపత్రిక జనవరి, 2014 ₹ 25

సంస్థాపక సంపాదకులు
ఆలపాటి రవీంద్రనాథ్ (1922 - 1996)

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
***- Dammapada.***

**సంపుటి 25** **జనవరి 2014** **సంచిక 1**



*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹25 సంవత్సరానికి : ₹300
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060


## ఈ నెల...


చతుర్ముఖ జ్యోతి ..... 5
– ప్రొ. రావినూతల సత్యనారాయణ

తెలుగు భాషావ్యవహారం : విలక్షణత ..... 13
– డా॥ యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి

ఆధునిక తెలుగు సాహిత్యం: అధిక్షేప కావ్యాలు ..... 17
– డా॥ బూదరాజు రాధాకృష్ణ

పోర్చుగీసు యాత్రికుడు గాస్పర్ కొరీయ ..... 21
– డా॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

ప్లాస్టిక్ పూలు ..... 24
– అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

మనిషి ఎందుకు జీవిస్తున్నాడు? ..... 28
– సూర్యదేవర సంజీవదేవ్

అసంబద్ధ వాదం – త్రిపుర కథలు ..... 32
– అంపశయ్య నవీన్

మహాభారతంలో పాత్రలు: కర్ణుని స్వగతం ..... 41
– ప్రొ. శ్రీమతి ఐరావతీ కర్వే
– భావపరిశీలన : రవీంద్రనాథ్

తెలుగు సాహిత్యంలో హేతువాదం ..... 49
– రావిపూడి వెంకటాద్రి

కళాపూర్ణోదయము – కథా సంవిధాన వైచిత్రి ..... 59
– డా॥ జి.వి.కృష్ణారావు

సంత్ కబీరు మార్మికవాదం ..... 63
– కోడూరు పుల్లారెడ్డి

గురజాడ అప్పారావుతో మధురవాణి ..... 75
– పురాణం సుబ్రహ్మణ్య శర్మ

మానవవాద అనుభవాల పర్యటన ..... 86
– డా॥ నరిసెట్టి ఇన్నయ్య

ఘంటసాల – జ్ఞాపకాలు ..... 90
– వి.ఎన్.ఆర్. మూర్తి

పుస్తక పరిచయం ..... 92

లేఖాసాహిత్యం ..... 94


*ముఖచిత్రం* : సిద్ధేంద్రయోగి
*రెండవ అట్ట* : ఆలపాటి రవీంద్రనాథ్ } *చిత్రకారుడు : గిరిధర్ గౌడ్*
*మూడవ అట్ట* : సంక్రాంతి
*నాల్గవ అట్ట* : మేఘై శ్మేరురమంబరం | *డా॥ టి. సాయికృష్ణ*


(*వివరాలు : 3లో...*)

తొలి సంచిక

**మిసిమి** ఇరవై అయిదవ ఏట అడుగుపెడుతోంది. ఆలపాటివారి ఆలోచనలో ఆవిర్భవించి ఒడిదుడుకుల మడుగులు దాటుకొని ఈ వెండి వెలుగులో పండుగ జరుపుకుంటోంది.

ఈ ప్రయాణంలో ఎందరో మహోమహులు తమ రచనలతో **మిసిమి** పుటలను పునీతం చేశారు. ఆది కవి నుంచి – అన్నమయ్య వరకు; సిద్ధార్థుని నుంచి – సిద్ధేంద్రయోగి వరకు; కాళిదాసు నుంచి – కన్యాశుల్కం వరకు; భరతుని దగ్గర నుంచి – బాలమురళి వరకు; మహాభారతం నుంచి – మహా ప్రస్థానం వరకు ఒకటేమిటి – **మిసిమి** స్పర్శ తగలని సారస్వత పార్శ్వం లేదంటే అతిశయోక్తి కాదు. సమాజ రుగ్మతల, వైయక్తిక వేదనల వ్యాస సంచితాలతో, కవితా సంకలనాలతో **మిసిమి** మెరిసింది.

సమకాలీన సిద్ధాంత వాదాలతో – తత్త్వవేత్తల అధ్యయన సాధ్యాసాధ్యాలతో అతలాకుతలమై నిలదొక్కుకుంది. సర్వ ధర్మాలను దర్శింపజేసింది.

వచన కవితా ప్రవాహానికి, కథనాల ఎత్తిపోతల పాతానికి ఎదురీది నిలిచింది. ప్రచార సాధనాలకు దూరంగా, వ్యాపార ధోరణికి, లాభాపేక్షకు అతీతంగా స్థిరపడింది.

ఇది తెలుగు పత్రికారంగంలో పండుగ జరుపుకోవలసిన సందర్భమే...

దీనికి ముఖ్యకారణాలు **మిసిమి** సంస్థాపక సంపాదకుల వినిర్మల సంకల్పం – కళాజ్యోతి యాజమాన్యం వారి అచంచలమైన అంకితభావం.

ప్రస్తుతానికి వస్తే – మొదటి సంచిక నుంచి – ఇప్పటివరకూ చదివి జాగ్రత్త చేసిన పాఠక పండితులు మమ్మల్ని తరచూ కలుస్తుంటారు. వారి ఆదరణ, ప్రతిఫలం ఆశించని అపురూపమైన ప్రేమ మాకు ప్రోత్సాహకాలు.

**మిసిమి** పరిణామ క్రమం గత మూడు సంవత్సరాలుగా మా శ్రేయోభిలాషులు గమనిస్తున్నారు.

సారస్వత విభాగాలన్నింటినీ స్పృశించే మా ప్రయత్నం, కనిపించని శ్రమ, ఎంతో కాలహరణం కూడా – అయినా మా పాఠకులకు అరుదైన, విలువలుగల రచనలను అందించాలనే తపనకు, మా శ్రమకు ప్రతిఫలం చదువరుల స్పందనలే!

నేటి తరానికి పఠనాసక్తి సన్నగిల్లిపోతుందని వాపోతున్నాం – ఎన్నో పత్రికలు మూత పడుతున్నాయని వింటున్నాం. ఈ తరుణంలోనే నడిమి వయసు పాఠకులనుద్దేశించి పలు విషయాలను తెలియజేసే రచనలు – భాషను అభిలాషగా చేసే సారస్వతాన్ని సరసరీతిలో అందించే ప్రయత్నమే మాది. ఆ విధంగా మరో రెండు దశాబ్దాలు ఈ పాఠకులతో **మిసిమి** పసిడి పండుగ చేసుకోవచ్చని కొండంత ఆశ ఉండటంలో అందరి అండదండలు ఉంటాయని అనుకుంటున్నాము.

గత సంచికలలోని ఆణిముత్యాలు కొన్ని – కొత్త పాఠకులకోసం అందిస్తున్నాం.

నటరాజును స్ఫురింపజేసే సిద్ధేంద్రయోగి భంగిమతో ఈ నెల ముఖచిత్రం – ప్రత్యేకం. ఈ చిత్రం వెనుక కథ కూడా ఆసక్తికరం.

సిద్ధేంద్ర యోగి

**మిసిమి** సమాలోచక మండలి కోరుకునేది – తెలుగు కలకాలం వెలుగుతుండాలని – విద్య ఉద్యోగాలకే పరిమితం కాకుండా జ్ఞాన సముపార్జనకు, సమాజ బాధ్యతకూ దారి చూపాలని – రేపటి పౌరులు వినయ విధేయతలతో, బాధ్యతాయుతంగా, ఆత్మవిశ్వాసంతో, ధీమంతులుగా తమ కర్తవ్యాన్ని, ఋజువర్తనతో నెరవేర్చాలని, కేవలం ధన సంపాదనే విజయం కాదని – జీవితంలోను – సమాజంలోను ఆనందాన్ని నింపుకోవటం విజయానికి కొలమానమని తెలిసి మసలుకోవాలని – అందుకు **మిసిమి** పత్రికలోని రచనలు తోడ్పడతాయని తెలియజెప్పటమే.

**– సంపాదకులు**

# సిద్ధేంద్ర యోగి

**సి**ద్ధేంద్ర యోగి అనే పేరు వినగానే మనస్సుకు స్ఫురించేది నాట్యకళా దృశ్య చిత్రం.

శతాబ్దాల క్రిందట ఈ నాట్య కళకు ఒక నిర్దిష్ట రూపం కల్పించి నాట్య కళోన్నతికి శ్రమించి, శైలి విధానానికి రూపు రేఖలు దిద్దిన కూచిపూడి నాట్య కళాపితామహుడు అపర భరతముని ఈ సిద్ధేంద్ర యోగి, నాట్య కళాతరంగిణిలో ఓలలాడిన రసపిపాసి.

వీరి కాలము, పుట్టు పూర్వోత్తరాల గురించి చరిత్రకారులు ఎన్నో భేదాభిప్రాయాలు వెలిబుచ్చారు, వారు రచించి రూపొందించిన *భామాకలాపము* నృత్య రూపకము యావదాంధ్ర నాట్యకళా చరిత్రలో ఆచంద్రతారార్కం మకుటాయమానంగా విలసిల్లుతుంది.

సిద్ధేంద్రయోగి యొక్క భావ చిత్రములు, భావ శిల్పములు ఇంతకు ముందు రెండు, మూడు పద్ధతులలో చూసియున్నాను. సిద్ధేంద్ర యోగి... వృద్ధ నాట్యాచార్యునిగా యోగీశ్వరుని భంగిమలో ఉన్న ఈ చిత్రాలనే ఆలంబనగా చేసుకొని, సిద్ధేంద్ర యోగి యౌవన వయస్కునిగా, దృఢ శరీరాకృతిలో సుందర రూపు రేఖా విలాసముతో నాట్యానుగుణ లక్షణములు కలిగిన నాట్య కళా బోధకునిగా ఊహించుకొని చిత్రించినది ఈ రూప చిత్రము.

ఇట్టి సిద్ధేంద్రుని నాట్య భంగిమను నటరాజ నాట్య పాద విన్యాసముతో పోల్చి శరీర ఊర్ధ్వ భాగమున ఎడమ చేతిలో కుటిల దండము ధరించినట్లు, ఇది అతని సంప్రదాయ సంకేతముగా ఉన్నట్లు చిత్రించడమైంది. మరియు ఆతని కుడి చేత వ్యాఖ్యాన ముద్రతో నాట్యవిద్యను బోధించుచున్నట్లు సూచించాను.

సిద్ధేంద్ర యోగి వెనుక చిత్రించిన చిత్ర సంయోజనములో (Compositional Values) నటరాజు యొక్క ఎడమ చేతి ముద్రలో అగ్ని పాత్ర ధరించినట్లు సూచించి, అగ్నికి బదులుగా కాంతి పుంజమును ఉంచి, ఆ కాంతి కిరణ తేజస్సు సిద్ధేంద్రుని ముఖమున ప్రసరించి ప్రకాశించునట్లు, ఆ నటరాజు కుడి హస్తమును అభయ హస్తముతో చూపించి, ఆ హస్తమునందు చిరు మువ్వను (లయ, తాళమునకు ప్రతీకగా) సిద్ధేంద్రునికి ప్రసాదించునట్లు జరిగింది.

ఇచ్చట గురు శిష్య పరంపరను ప్రత్యేకించి ఉదహరించాలి. భగవంతుని ఆశీర్వాద బలము మువ్వ రూపమున సిద్ధేంద్రునికి దక్కగా, సిద్ధేంద్రుని నుండి ప్రసాదింపబడిన నాట్య కళాశీర్వాదము వ్యాఖ్యాన ముద్ర ద్వారా నాట్యము మనకు కారణమాయెను. కృషి, దీక్ష, పట్టుదల యోగముగా ఆత్మ పరమాత్మతో అనుసంధానం చేసినప్పుడే మోక్ష ప్రాప్తి కాగలదనే తత్వాన్ని ఈ చిత్రము ద్వారా వ్యక్తపరచడానికి ప్రయత్నించాను.

సిద్ధేంద్రుడు రససిద్ధి పొంది, భవ బంధముల నుండి దూరమై, విరాగియైనట్లు వారు ధరించిన కాషాయ వస్త్రము, త్యాగము, వైరాగ్యమునకు సంకేతముగా చిత్రించాను, అంతేకాక నేపథ్యంలో ''బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానమును'' చిత్రించి, కూచిపూడిని చారిత్రక సాక్ష్యముగా చిత్రించ సాహసించితిని. ఈ రూప చంద్రుడు "మహా మంజీరనాదము" (గుంటూరు) ప్రదర్శన కొరకు చేసినా, 10వ తేది నవంబరు 2013 నాడు హైదరాబాద్ నగరమున రవీంద్ర భారతిలో ప్రదర్శింపబడిన "భామా కలాపము" సంగీత, సాహిత్య, నృత్య సంగమం కార్యక్రమంలో భాగముగా ప్రేక్షక మహాశయుల కొరకు శ్రీ కె.ఆర్.కె.యమ్ మెమోరియల్ ఆర్ట్స్ – అకాడెమీ సౌజన్యముతో శ్రీ ఆంజనేయ రెడ్డిగారు మరియు ఎ.బి.కె. ప్రసాద్‌గారి చేతుల మీదుగా ఆవిష్కరించుట నా భాగ్యముగా తలంచితిని.

ఇది యొక చిత్రకారుని భావనకు ప్రతిబింబమైన ప్రయోగాత్మక రూపమే తప్ప, గత చిత్రములను త్రోసిపుచ్చుటకు చిత్రించిన చిత్రము కాదు అని విజ్ఞులు, మేధావులు భావించగలరు.

**– గిరిధర్ గౌడ్**

రవీంద్రనాథ్

**రెండవ అట్ట :** ఆలపాటి రవీంద్రనాథ్ చౌదరి వాణిజ్య రంగంలో మేటి. సాహిత్య, లలితకళలలో ఉత్తమాభిరుచి గలవారు. వాటిని వ్యాపారాత్మకంగా కాక సామాజిక పరంగా, బాధ్యతాయుతంగా, అత్యున్నత స్థాయిలో పత్రికలను నడిపారు. వారిలోని ధీశక్తి, నాయకత్వపు లక్షణాలు, ఆత్మవిశ్వాసంలోను ఆయన వ్యక్తి చిత్రణలో ఇనుమడింపజేసే ప్రయత్నం చేశాము. అందుకుగాను వివిధ దశలలో ఆయన ఛాయా చిత్రాలను ప్రఖ్యాత మూర్తి చిత్రకారుడైన, రాయన గిరధర్‌కు పంపగా వాటిని కూలంకషంగా పరిశీలించి లిఖించిన చిత్రమే – ఈ రెండవ అట్టమీద బొమ్మ. కాల్పనికత, ఊహాతీతంగా ఊపిరి పోసుకున్న వాస్తవ చిత్రీకరణ ఇది. అడిగిన వెంటనే శ్రమించి ఈ చిత్రం గీసి మాకు అందించిన గిరిధర్‌కు కృతజ్ఞతలు చెప్పుకుంటుంది ఈ వెండి వెలుగుల మిసిమి.

**మూడవ అట్ట : డూడూ బసవన్న**

సంక్రాంతి

స్వతహాగా చిన్న రైతులయిన వీరు కూలీ, నాలీ చేసుకుంటూ కేవలం సంక్రాంతి నెలపట్టిన తరువాత బసవన్నను రంగురంగుల గుడ్డలతో అలంకరించి, కొమ్ములకు మువ్వలు, చిరు గంటలు కట్టి, సన్నాయి ఊదుతూ పల్లెటూళ్ళలో ప్రదర్శనగా వస్తారు.

**నాల్గవ అట్ట :** *చిత్రకారుడు* – డా॥ టి. సాయికృష్ణ

## సాకెత దివెకెదరము

మేఘైర్మేదుర మంబరమంబరం

మేఘైర్మేదుర మంబరం

శ్లో॥ మేఘైర్మేదుర మంబరం వన భువశ్శ్యామా స్తమాలద్రుమైః
నక్తం భీరుయం త్వమేవ తదిమంరాధే గృహంప్రాపయః
ఇత్థం నందనిదేశ తశ్చలితయోః ప్రత్యధ్వ కుంజద్రుమం
రాధామాధవయోర్జయంతి యమునాకూలే రహః కేలయః ॥

– *జయదేవుని అష్టపది*

"ఓ రాధా! ఆకశమున మేఘములు దట్టముగా క్రమ్ముకున్నాయి. అరణ్యమంతా చీకటి కానుగచెట్లచే అంధకార బంధురమైనది. కృష్ణుడు రాత్రులందు భయపడుచుండును కావున ఈ నిశీథి సమయమున అతనికి తోడుగా వెళ్ళి అతనిని ఇల్లు చేర్చవలయును" అని ఆ రాధకు కృష్ణున్ని అప్పగించాడు నందుడు.

# చతుర్ముఖ జ్యోతి

*– రావినూతల సత్యనారాయణ*

"రవీంద్ర స్మృతిసంచిక" సుందరమైన తెలుగు లిపిలో, అతి సుందరమైన చిత్రపటాలతో, ఆకర్షణీయ చిత్రాలతో, చక్కని కాగితంపై, మనసు నాకట్టుకొనే మంచి రచనలతో, తెలుగునాడులో నేడు ప్రసిద్ధులైన మేధావులందరు, ఈ సంపుటికి రచనలందజేసి, శ్రీ రవీంద్రనాథ్ పై వారికి గల అవ్యాజ ప్రేమను, హృదయ కంపనలను, ఆదరాభిమానాలను, శ్రద్ధా భక్తులను, వ్యక్త పరచారు. అన్ని వయసుల వారు, ఆ సౌజన్య మూర్తి పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని (మూర్తిమత్వం) మన ముందు ప్రతిష్టించారు. "రవీంద్ర స్మృతి" సంపుటి సంపాదక మహాశయులు "సహవాసి" (జంపాల ఉమామహేశ్వర రావు గారు) ప్రశంసనీయులు. ఈ స్మృతి సంపుటికి, దాదాపు 45మంది ప్రముఖులు తమ తమ రచనలు అందజేశారు.

ఈ పుస్తకాన్ని "రవీంద్ర చతుర్ముఖ జ్యోతి"గా భావించి, అందులోని విశేషాలు నాలుగు స్రవంతులుగా ప్రవహించి ఏకోన్ముఖమై శిల్ప సాగరంగా పరిణతి చెందిన విధానాన్ని, విశేషాలను, విజ్ఞులైన పాఠకులముందు ఉంచుటయే ఈ వ్యాసం యొక్క ప్రధానోద్దేశం. ఆ ప్రయత్నంలోని సఫలతా మూల్యాంకణం విజ్ఞులకే వదులుదాం!

**చతుర్ముఖ జ్యోతి:**

దీనిని నాలుగు పాయలుగా భావించడమైనది. ఆ నాలుగు పాయలు: రవీంద్రనాథ్, వారి పరిచయ స్రవంతి, పత్రికలు (జ్యోతి, రేరాణి, కినిమా), ***మినిమి.*** ఈ చతుర్ముఖ జ్యోతిలోని తొలిపాయ రవీంద్రనాథ్ గారి జీవిత విశేషాలు. ఆయన బాల్య చర్యలను గూర్చి మనకు ఎక్కువ విశేషాలు తెలియనప్పటికీ, కొన్ని వివరాలు తెలుసుకొనుట మన కర్తవ్యం.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రములో, తెనాలి తాలుకా గోవాడ అనే గ్రామంలో ఓ రైతు కుటుంబంలో నవంబరు నాలుగవ తేదీన 1922వ సంవత్సరం లో జన్మించారు శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ గారు. ఆయన తల్లి తండ్రులు ఆలపాటి వెంకటరామయ్య, అమ్మెమ్మ గారలు. రవీంద్రనాథ్ గారికి ఒక సోదరుడు, ముగ్గురు అక్కచెల్లెండ్రు.

రవీంద్రనాథ్ గారి విద్యాభ్యాసం కింగ్ జార్జి కొరొనేషన్ హైస్కూల్‌లో ప్రారంభ మైనప్పటికీ, మధ్యలోనే ఆగి పోయింది. సహజంగా స్వేచ్ఛాప్రియుడైన రవీంద్రనాథ్‌కు, క్రమశిక్షణ చట్రములో నడిచే పాఠశాల వాతావరణం నచ్చలేదు. అందు చేత స్కూలు చదువుకు త్వరలోనే స్వస్తి చెప్పారు. అంతేగాని, విద్యాభ్యాసానికి కాదు. ఇంట్లో ఉపాధ్యాయులని పెట్టుకొని విద్యాభ్యాసము కొనసాగించారు. పట్టాలకు, పరీక్షల కోసం కాకుండా, అసలైన జ్ఞాన సముపార్జనకు నిష్ఠతో ప్రయత్నించారు. తనకు గల అభిమాన విషయాలపై మంచి పుస్తకాలను తెప్పించుకొని స్వయంగా పఠించే పద్ధతిని అలవర్చుకొన్నారు.

రవీంద్రనాథ్ గారికి స్కూల్లో సీనియర్ విద్యార్థి కొసరాజు సాంబశివరావు, ఆనాటి రవీంద్రనాథ్ చురుకుతనాన్ని గురించి, అప్పటి అల్లరి పనుల గూర్చి తన తీపి జ్ఞాపకాలుగా చెప్పేవారు. చిన్నతనం నుంచే రవీంద్రనాథ్‌గారిపై తన తాత గారైన దేవయ్యగారి ప్రభావం కొంత ఎక్కువగా ప్రస్ఫుటించేది. గోవాడ గ్రామం ఆనాటి రాజకీయాలలో సక్రియాత్మకంగా ఉండేది. కాంగ్రెసు పార్టీ ప్రభావం ఆ గ్రామంలో కొంత హెచ్చుగానే కనిపించేది! గోవాడ గ్రామం కాంగ్రెసు నాయకులను బాగా ఆకర్షించింది. రవీంద్ర గారికి 10ఏండ్ల ప్రాయంలోనే గాంధీజీని చూచే అవకాశం లభించింది. రవీంద్రనాథ్ పై గాంధేయ ప్రభావం ఉన్నదనడానికి, ఆయన ఖద్దరు ధరించడం, శాకాహారం తీసుకొనడం నిదర్శనాలుగా చెప్పుకొనవచ్చు.

1934వ సంవత్సరం నుండి రవీంద్రనాథ్‌గారు సొంత చదువులలో ఎక్కువ సమయం వినియోగించేవారు. తరచుగా తెనాలి వస్తూ పోతుండటంతో, తెనాలిలోని వ్యక్తుల ప్రభావం ఆయన మీద పడనారంభించింది. ఆంధ్రా పారిస్‌గా పేరు పొందిన తెనాలిలో నాటక శాలలు, ప్రింటింగు ప్రెస్సులు, పత్రికలు ఎక్కువ సంఖ్యలోనే ఉండేవి. సామాన్యంగా చురుకైన ఆలోచనాపరుడైన రవీంద్రనాథ్‌గారి ఊహలు ప్రింటింగ్ వ్యాపారం వైపు మళ్ళాయి! ఈ మధ్యకాలంలో రవీంద్రనాథ్ గారికి అబ్బూరి రామకృష్ణారావు గారితో పరిచయమేర్పడింది.

రామకృష్ణారావుగారి లాంటి పెక్కు మేధావులను డా.ఎమ్.ఎన్.రాయ్ స్థాపించిన రాడికల్ డెమోక్రటిక్ పార్టీ ఆకర్షించింది. వారిలో త్రిపురనేని గోపీచంద్, అబ్బూరి వరద రాజేశ్వరరావు, ఆలపాటి రవీంద్రనాథ్ ముఖ్యులు. శ్రీ రామకృష్ణారావుగారి ఆధ్వర్యంలో వీరంతా ఆ పార్టీకి కార్య కర్తలుగా పనిచేసేవారు.

1942వ సంవత్సరంలో, తన 21వ యేట రవీంద్రనాథ్‌గారి వివాహం చెరుకూరి బాపనయ్య, భ్రమరాంబల కుమార్తె కళావతితో జరిగింది. సామాజిక చైతన్యం కోసం పోరాటం జరిపిన విఖ్యాత వ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరి ఆధ్వర్యం వహించి ఆ వివాహాన్ని జరిపించారు. ఆ వివాహంలో పాల్గొన్న మరో ప్రసిద్ధ వ్యక్తి ఆంధ్ర విశారద శ్రీ తాపీ ధర్మారావుగారు. ఆ రోజుల్లో ఆ వివాహాన్ని అభ్యుదయ వివాహంగా పేర్కొన్నారు.

తెనాలిలో అనేక ప్రభావాలకు గురైన రవీంద్రనాథ్, రామస్వామి చౌదరి, తాపీ గార్ల ప్రభావానికి కూడా కొంత మేరకు లోనయ్యారు. ఆనాటి పరిస్థితులలో వారిరువురు చైతన్యం తేవడంలో బాగా ఉపకరించారన్నారు.

రవీంద్రనాథ్‌గారు తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్ పెట్టడం వారి జీవితంలో ఒక ముఖ్య మలుపు. అది వ్యాపార రీత్యా అవసరమేగాక, ఆయన వ్యక్తిత్వాన్ని వికసింప జేసుకోడానికి ప్రధాన సాధనమయింది. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం ప్రింటింగ్ ప్రెస్సులు చాలా కీలక పాత్ర వహించాయి. అవి కళాకారులు, పండితులు, గాయకులు, నటులు, ఉపాధ్యాయులు కలిసే చర్చా వేదికలుగా ఉపకరించేవి. ఆ తరుణంలో ఆ ప్రెస్‌ల అన్నిటి మధ్య రవీంద్రనాథ్ తన ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించారు. దాని పేరు జ్యోతి ప్రెస్ అని పెట్టారు. ఆ రోజుల్లో జ్యోతి ప్రెస్ రాడికల్ హ్యూమనిష్టులకు, హేతువాదులకు, స్వతంత్ర ఆలోచనాపరులకు కూడలిగా పేరుబడింది.

ప్రింటింగ్ ప్రెస్‌కు బాగా పని సమకూర్చుకోవలసిన ఆవశ్యకత శ్రీ రవీంద్రనాథ్‌ను తరచు మద్రాసు ప్రయాణాలకు పురిగొల్పింది. ఈ రంగంలో పోటీకూడా హెచ్చుగానే ఉండేది. రవీంద్రనాథ్‌కు పని సమకూర్చే విషయంలో మాట సహాయం చేసిన వారిలో శ్రీయుతులు బెజవాడ గోపాలరెడ్డి, అబ్దుల్, వామన రావు (డి.జి.ఐ.), బుల్లెయ్య (విద్యాధికారి), గోవింద రాజుల నాయుడు మొదలైన ప్రభృతులుండేవారు. సినిమా రంగంలో సహితం శ్రీయుతులు కొంగర జగ్గయ్య, డి.వి. నరసరాజు, పాలగుమ్మి పద్మరాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, కాంచనమాల, రవీంద్రనాథ్ గారికి అత్యంత సన్నిహితులు.

ప్రింటింగ్ ప్రెస్ చక్కగా నడుస్తున్న కాలంలో రవీంద్రనాథ్ గారి ఆలోచనా సరళి పత్రికల వైపు మరలింది. మద్రాసులో పత్రికలకు కావలసిన సమాచారం, పాత మేగజైనులు, పుస్తకాలు లభించేవి. మూర్ మార్కెట్టులో ఈ సామాగ్రి అంతా చౌకగా దొరికేది. ఆ రోజుల్లోనే, రవీంద్రనాథ్ గార్కి మద్రాసులో శ్రీశ్రీ, ఆరుద్రలు సన్నిహిత మిత్రులయ్యారు. ఒక వైపు జాతీయోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. మరో వైపు ఎమ్.ఎన్.రాయ్ ఎదురీతగా రాజకీయాలలో వివేచన ఉండాలనీ, వికేంద్రియకరణ రాజకీయంగాను, ఆర్థిక పరంగాను వుండాలన్న వాదనను ప్రచారం చేయ మొదలెట్టాడు. రాయ్ భావాలు చాలా మంది తెలుగు వారిని ఆకర్షించాయి. రాడికల్ డెమోక్రాటిక్ పార్టీ ఏర్పాటు, దానికి త్రిపురనేని గోపీచంద్ కార్యదర్శి కావడం, ఇంకా ఎన్నో పరిణామాలు జరగడం, ఎం.ఎన్.రాయ్ రెండోసారి తెనాలి రావడం, అన్నీ వెనువెంటనే జరిగి పోయాయి.ఈ పరిణామాల ప్రభావం రవీంద్రనాథ్‌పై కూడా కొంత పడింది. రవీంద్రనాథ్‌గారు రాయ్‌గారి భావాలకు దగ్గరయ్యారు. ఆ స్ఫూర్తి తోనే పత్రికలు స్థాపించారు. రమణీయకత, కళలు, విమర్శల నిమిత్తం ఒక పత్రిక (జ్యోతి), కళా పోషణ, సెక్సును శాస్త్రీయంగా చెప్పడానికి రేరాణి పత్రికను ఉద్దేశించారు.

జ్యోతి పత్రిక ప్రారంభంతో ఆంధ్రాలో కొత్త గాలి వీచింది. కొత్త రచయితలకు అవకాశం లభించింది. రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో పలువురు రచయితలు వెలుగులోకి వచ్చారు. ఇతర పత్రికలు వేయని రచనలు చలంగారి రచనలు జ్యోతిలో చోటు సంపాదించాయి. ముఖాలు పరికించక, రచనలోని పస చూచి ప్రచురించే సాంప్రదాయాన్ని రవీంద్రనాథ్ జ్యోతి ద్వారా ప్రవేశ పెట్టారు. జ్యోతి పత్రికను రేషణలిస్టు పత్రికగా పేర్కొన్న రవీంద్రనాథ్, ఆ విధానికి తగ్గట్టుగానే పత్రికను నడిపారు. ఎమ్.ఎన్.రాయ్ ఆలోచనా ప్రవంతిలోని శాస్త్రీయ ధోరణి రవీంద్రనాథ్‌ను బాగా ఆకర్షించింది. రాడికల్ హ్యూమనిస్టులలో రవీంద్రనాథ్‌కు సన్నిహితులైన వారు ఆవుల గోపాల కృష్ణమూర్తి, జి.వి. కృష్ణారావుగార్లు. అలాగే తెనాలి నుండి సినిమా పత్రిక నడిపి,

కొత్త దారులు, నూతన పద్ధతులు తెలుగు వారికి తెలియ పరిచారు.

పత్రికా నిర్వహణ (అంటే తెనాలిలో ప్రారంభించిన జ్యోతి, రేరాణి, సినిమా) ద్వారా రవీంద్రనాథ్ గారు చాలామంది కొత్త రచయితలను తెలుగు వారికి పరిచయం చేశారు. వారిలో ముఖ్యులు శారద (నటరాజన్), రావూరి భరద్వాజ, ధనికొండ హనుమంతరావు ఇత్యాదులు. అంతేకాక, చాలామంది ప్రముఖులతో తమ పరిచయాన్ని, స్నేహాన్ని పెంపొందించు కొన్నారు. వ్యక్తిగా, మేధావిగా వికసించారు. బాహ్య సౌందర్యముతో పాటు, హృదయ సంస్కారాన్ని పెంపొందించు కొన్నారు. అభిప్రాయాలు కలువని వారితో సహితం అత్యంత సౌమ్యతతో వ్యవహరించి, వయసులోని తార తమ్యతను పాటించక, అభిమాన ఆప్యాయతలు కనబరచుటలో ఆయనకు ఆయనే సాటి అని పేరుబడ్డారు.

రవీంద్రనాథ్

వ్యక్తిగా కొన్ని నియమాలను స్వయంగా నిర్ణయించుకొని, వాటిని అనుసరిస్తూ, నియమబద్ధ మైన జీవన శైలిని అలవర్చు కొన్నారు. శరీరానికి, వ్యాయామ, ఆహార, విశ్రాంతులు అత్యంత ముఖ్య సాధనాలుగా భావించి, వాటిని క్రమం తప్పకుండా పాటించే వారు. వ్యాయామానికి ప్రతి రోజూ సాయంత్రాలు టెన్నిసు ఆట ఆడే వారు. ఆహార, విశ్రాంతుల విషయంలోను, చాలా కచ్చితంగా వ్యవహరించే వారని ప్రతీతి. వీటన్నితో పాటు జ్ఞాన సముపార్జనకై, మంచి పుస్తకాలు, విదేశాలలో ప్రచురితమైన Times పత్రిక మొదలైన మేగజైనులు తెప్పించుకొని చదివే వారు. మంచి పుస్తకాలు తాను చదువుటయే కాక, చాలామంది మిత్రుల చేత కూడా చదివించేవారుట.

మూఢాచారాలు గాని, మూఢ నమ్మకాలు గాని వారి దరికి చేరిన వివరాలు సహితం మనకు తెలియవు. ఇక మత విషయానికి వస్తే, రవీంద్రనాథ్ బౌద్ధ తత్త్వ ప్రియుడని తెలియుచున్నది. బౌద్ధంపై చాలా గ్రంథాలు, కొన్ని అరుదైనవి, సేకరించి చదివారని తెలియనగుచున్నది. బుద్ధుని గొప్ప తాత్వికునిగా, చింతనా పరుడుగా, నీతి మంతుడుగా ఆయన భావించారు. నిత్య జీవితంలో బుద్ధుడు చెప్పిన కొన్ని విషయాలు తరచు ఉల్లేఖించే వారని ప్రసిద్ధి! భిక్షకు వెళ్ళినప్పుడు ఎవరు ఏదిచ్చినా అది స్వీకరించాలే గాని, ఫలానిది కావాలనో, ఇచ్చింది వద్దనో భిక్షువులు అనరాదని బుద్ధుడు చెప్పాడట. అంతేకాక, బోధకులు స్థానిక భాషను తప్పని సరిగా నేర్చుకోవాలని, దానితో పాటు కొంత వైద్యం వస్తే మంచిదని బుద్ధుడు భావించాడట! ఈ విషయాలన్నీ రవీంద్రనాథ్ కు చాలా నచ్చిన అంశాలు.

రవీంద్రనాథ్‌గారు వ్యాపారంలో నష్టాలకు గురికాక తప్ప లేదు. తెనాలిలో తాము ప్రారంభించిన పత్రికలు మూత పడినవి. 1957వ సంవత్సరంలో ముద్రణా యంత్రాం గాన్ని హైదరాబాదు తరలించారు. హైదరాబాదులో కళాజ్యోతి ప్రెస్ ను అన్ని హంగులతో ఆధునిక యంత్రాంగంతో స్థాపించే ప్రయత్నం లో నిమగ్నులై తను ఊహించిన విధంగా ఆ ప్రెస్‌ను తీర్చిదిద్దటంలో విజయాన్ని సాధించారు. రవీంద్రనాథ్ గారు ఉదయం నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రెస్ కార్య కలాపాల్లోనే నిమగ్నమయ్యే వారు. రవీంద్రనాథ్ కుమారులు ప్రెస్ పనులకు ఆధ్వర్యం వహించే వరకూ శర్మ గారనే వ్యక్తి ప్రెస్ కార్య కలాపాలు నిర్వహించేవారు.

సాయంత్రాలు ఫతే మైదాన్‌లో టెన్నిస్ ఆడడం, మిత్రులతో గడపడం రవీంద్రనాథ్ గారి నిత్య కృత్యాలలో భాగమయ్యాయి. పుస్తక ప్రదర్శనలకు వెళ్ళుట, నచ్చిన పుస్తకాలు కొని తన లైబ్రరీకి చేర్చుట రవీంద్రనాథ్‌గారి మరో కార్యక్రమంగా ఉండేది. సికింద్రాబాదు క్లబ్బులోని గ్రంథాలయం, ముఖ్యంగా మేగజైన్స్ సెక్షన్ (Magazines Section) అంటే ఆయనకు చాలా యిష్టం. హైదరాబాదులో అనేక మంది మిత్రులతో, కొత్త వారి పరిచయాలతో తన

మానసిక పరిధిని పరిణతం చేసుకోవడం వారికి అలవాటుగా మారింది. అలాతరచుగా కలిసే వారిలో అబ్బూరి రామకృష్ణారావుగారు పేర్కొనదగిన వారు. ఆ రోజుల్లో రవీంద్రనాథ్ గారిని తరచు కలిసిన మిత్రు లలో బూదరాజు రాధాకృష్ణ, తాళ్ళూరి నాగేశ్వరరావు, అశ్వినీకుమార్ (విజయవాడ), రావూరి భరద్వాజ, సినారే, సి. ధర్మారావు ఆయనకు బాగా సన్నిహితులు.

వయసు మీరుతున్న కొలదీ ప్రెన్ బాధ్యతలన్నీ కుమారుల కప్పగించి, తాను విశ్రాంతిగా తన సమయాన్ని సభలు, సాహిత్య గోష్ఠులు, ఇతర సామాజిక వ్యవహారాలలో గడిపే వారు.

*చాలామంది ఆయన తన తత్వం గురించి చెబుతూ "నేను నేనే. నేను కు అర్థం చెప్పుకోవడానికి నేను నానుంచి బయటకు పోవలసిన పని లేదు. జీవితంలో అనేక సన్నివేశాలు ఎదురవుతూ ఉంటాయి. వాటిల్లో నా పాత్రను నిర్వహిస్తూ ఉంటాను. మామూలుగా ఈ పాత్రల పరంగా నేను "ఇది", "ఫలానా" అని చెప్పుకొంటాం. కేవలం నేను తండ్రి, భర్త, స్నేహితుడూ, మొదలయిన పాత్రల సంయోగం మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువ. నాకు కొన్ని ఆశంసలు, ఆకాంక్షలు, లక్ష్యాలు ఉంటాయి. నన్ను నేను వాటి పరంగా నిర్వచించుకొంటాను. ఏదో ఒకటి చేస్తూ ఉంటాను. అదే జీవితం కాదు. అదే నేను కాదు. ... "నేను కావాలనుకొన్నది అయ్యాను" అని చెప్పుకొచ్చారు.*

**రవీంద్రనాథ్ పరిచయ ప్రవంతి :**

చిరు ప్రాయంలోనే రవీంద్రనాథ్‌గారికి ఎక్కువమంది పరిచయస్తులు తయారయ్యారు. దానికి కారణం ఆయన ఆకర్షణీయ వ్యక్తిత్వం. సాధారణంగా స్నేహం, వయస్సులో అనుభవంలో సమవుజ్జీల మధ్య ఉంటుంది. అందులోనూ, సంప్రదాయ శృంఖలాలని తెంచుకోలేని సమాజంలో, ఈ అంతరాలని తొలగించుకొని మైత్రిని నెరపటం చాలా అరుదు. అభిప్రాయాలు కలవని వారితో కూడా అత్యంత సౌజన్యంతో వ్యవహరించి, అభిమానాప్యాయతలు కనబరచుటలో ఆరి తేఱినవారు రవీంద్రనాథ్‌గారు. అందుకే మరి – ఇంతమంది కవులు, పండితులు, విద్యావేత్తలు, మేధావులు, రచయితలు, న్యాయమూర్తులు, అడ్మినిస్ట్రేటర్లు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికులు, సినీ ప్రముఖులు, ఇంకా ఇతర జీవన రంగాలలోని మాన్యులు, సామాన్యులతో రవీంద్రనాథ్‌గారి పరిచయాలు, స్నేహ బంధాలు వెల్లివిరిశాయి.

తరచుగా స్నేహితులని తన Nest కి ఆహ్వానించి, అతిథి మర్యాదలు జరిపి, తాజాగా తాను చదివిన గ్రంథాల సారాంశాన్ని వారికి చెప్పి చర్చిస్తే గాని, ఆయనకు సంతృప్తి కలిగేది కాదు. సినారే గారు వ్యాఖ్యానించినట్లుగా "భావ ప్రేరకంగా వున్న ఏ చిన్న అంశం దొరికినా, హేతువుకు ఏతామెత్తే ఓ వాక్యం కంటబడినా, రవీంద్రునికి నిలువెల్లా పారవశ్యం." నిరాఘాటంగా ఆ ఆనందానుభూతి ఆర్థిక పరమైన కాల మానాలకు అతీతం. సంస్కృతి ఆయన రక్తములోనే వుంది (Culture is in his blood).

మిత్రమండలి దృక్పథంతో రవీంద్రనాథ్ గారిని దర్శిద్దామా! రవీంద్రుని దృష్టిలో వ్యాపారం వ్యాపారమే, వినోదం వినోదమే, విజ్ఞానం విజ్ఞానమే! వ్యాపార దృష్టిని, వైజ్ఞానిక దృష్టి నుంచి భిన్నంగా ఉంచిన వివేకి ఆయన... జీవితాంతం మానవీయ ప్రవృత్తిని, అవ్యాజ మైత్రిని తన మనుగడలోని అవిభాజ్య పార్శ్వాలుగా మలుచుకొన్నారు డా. ఆలపాటి రవీంద్రనాథ్. "ఆయన ఎంతగా 'నా ఆల్టర్ ఈగో' అయినా ఆయనలో రస, సౌందర్యాలు తొణికిసలాడుతుంటే, నన్ను సిద్ధాంతాలూ, దర్శనాలు, తర్కం ఆకట్టుకొన్నాయి. ఫలితంగా ఆయన పచ్చని చెట్టు అయితే, నేను ఎండు వారిన కట్టెను – ఇద్దరం ఒకే వృక్షానికి చెందిన వారమైనా ఈ తేడా ***మిసిమి***లో ప్రతి ఫలించింది" అంటారు అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి – ***మిసిమి***కి రవీంద్రనాథ్ గారి తర్వాత సంపాదకత్వం వహించిన వారు.

"రవీంద్రనాథ్ గారు చాలా ముందు చూపున్న భావుకులు. నా జీవితానికింత స్థిరత్వం ప్రసాదించిన వారికి పాదాభి వందనం" అని తమ సన్నిహితత్వాన్ని ప్రకటించారు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ రావూరి భరద్వాజ.

"శ్రీ రవీంద్రనాథ్‌గారు వస్త్రధారణ నుంచి ప్రతి అంశములోనూ సౌందర్యాన్ని, ఆధునికత, హుందా తనాన్నిచ్చి, విలువలు పెంచే సంప్రదాయ బద్ధత పాటిస్తూ జీవితంలో సమతౌల్యం ప్రదర్శించి, తన జీవితాన్ని విలువలతో, ప్రయోజనాత్మకంగా అనుభవించిన వ్యక్తి."

సాంస్కృతిక పునర్జీవన కృషిలో రవీంద్రనాథ్ ప్రముఖ పాత్ర వహించారు. ఆకాశవాణి ప్రసారం చేసే వివిధ కార్య క్రమాల బాగోగులు విమర్శనాత్మకంగా రేడియో రివ్యూ – శీర్షికను మొట్ట మొదట తెలుగు పత్రికలలో ప్రవేశ పెట్టిన వారు రవీంద్రనాథ్ గారే! అంతేకాదు, హేతువాద భావ వ్యాప్తికి శాస్త్రీయ భావనల ప్రచారానికీ చేయూతనిచ్చి సాంఘిక చైతన్యానికి పాటుపడినవారు ఆయన.

One of the cousins of Dr. Ravindranath, Alapati Krishna Kumaran, opines that his cousin Dr. Ravindranath known by his colleagues, friends and competitors as well, for his drive for success in the publishing world and his desire for service to the society. He has written a long article about his cousin and the factors that influenced the making of his personality. Prof. Krishna Kumaran happens to be a Professor Emeritus of Marquette Varsity, U.S.A.

ప్రముఖ చిత్రకారుడు ఎస్సారె (రహమత్ ఆలీ) కుంచె తీర్చిన అక్షర చిత్రం ప్రకారం "హృదయ సౌందర్యం, బాహ్య సౌందర్యం మేలిమి కోవకు చెందిన వ్యక్తుల్లో రవీంద్రనాథ్ ఒకరు. నిండు విగ్రహం, పసిడి ఛాయ, వయసుతో పాటు పెరుగుతూ పోయిన విశాలమైన నుదురు, చక్కటి ముక్కు, గంభీరంగా కనిపించే ఆ ముఖ కవళికల్ని సెకన్లలో ఆహ్లాదంగా మార్చగలిగే అరుదైన చిరునవ్వు ఆయన స్వంతాలు". ఇంతకంటే గొప్పగా ఏ మహామనీషి మనకు కనిపిస్తాడు?! పరిమళించే పరిపూర్ణ వ్యక్తిత్వం.! కాదు, మూర్తిమత్వం!

**చతుర్ముఖ జ్యోతి – మూడవ పాయ. (జ్యోతి, రేరాణి, కినిమా)**

1946 రవీంద్రనాథ్‌గారి జీవితంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకొన్నది. ఆ సంవత్సరంలో ఆయన జ్యోతి ప్రెస్ ప్రారంభించారు. అదే సంవత్సరం, 'జ్యోతి', 'రేరాణి' పత్రికలు కూడా స్థాపించి, వాటి సంపాదకత్వం చేపట్టారు.

'జ్యోతి' పత్రిక పెట్టుటలోని ప్రధానోద్దేశము రమణీయకత, కళలు, విమర్శలను ప్రోత్సాహించుట. ఈ మేరకు, రచనలోని స్థాయి, పస చూచి ప్రచురించే సాంప్రదాయాన్ని రవీంద్రనాథ్ ప్రవేశ పెట్టారు. ఆ రోజుల్లో ప్రముఖ పత్రికలలో చాలా భాగం మద్రాసు నుండి ప్రచురితమయ్యేవి. దానికి ముఖ్య కారణం ముద్రణా సౌకర్యాలు మద్రాసులో ఉన్నట్లు ఇతర చిన్న పట్నాలలో లేక పోవడమే. ఆ తరుణంలో రవీంద్రనాథ్‌గారు సాహసించి తెనాలిలో జ్యోతి వెలిగించారు. 'జ్యోతి' ప్రతిభ తైలంగా గల చాలా వత్తుల్ని వెలిగించింది. ఆంధ్రాలో జ్యోతి ప్రచురణతో కొత్త గాలి వీచింది. ధైర్యంగా నూతన మార్గాలు అవలంబించే వారికి ఒక నమ్మదగిన వేదిక లభించింది. ఇతర పత్రికలు వేయని రచనలు, చలం రచనలు వగైరా జ్యోతిలో చోటు చేసుకున్నాయి! 'జ్యోతి' పత్రిక 'రేషనలిస్టు' పత్రికగా పేరు గడించింది. కొన్ని రంగాలలో ఇతర పత్రికలు చేయని, చేయజాలని పాత్ర నిర్వహించింది. రేడియో ప్రసారాలను, దినపత్రికల నాయకత్వాన్ని నిశితంగా పరిశీలించి విమర్శనాత్మక వ్యాసాలు వ్రాయ మొదలెట్టింది.

రవీంద్రనాథ్ అనేక మంది రచయితలకు అభివ్యక్తి కల్పించారు. ఎవ్వరికీ తెలియక అడవిలో పడి వున్న రచయితలను వెలుగులోనికి తెచ్చి, అడవి కళాఖండాలను రసాస్వాదుల దృష్టికి తెచ్చారు. 'శారద' రచనలు అలా వెలుగు చూచినవే. ఒక్క శారదే కాదు, ఈనాటి ప్రసిద్ధ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ రావూరి భరద్వాజగారు కూడా ఆ కోవలోనికి చెందిన వారే! వారి రచన "అలనాటి ప్రాణం" చరిత్ర సృష్టించిన విషయం పాఠకులకు విదితమే. ఆలూరి భుజంగ రావు, ప్రకాశరావు, శార్వరి, అమరశ్రీ, తాళ్ళూరి నాగేశ్వర రావు, హితశ్రీ, కొలను బ్రహ్మానంద రావు, నన్నపనేని సుబ్బారావు, పోలవరపు శ్రీహరి రావు ఇత్యాదులంతా రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో ప్రసిద్ధులైన వారే! వీరిని పైకి తీసుకు రావడంలో రవీంద్రనాథ్ ఒక కొలమానాన్ని వాడారు. అదే! "రచన బాగా ఉండటం, ఉండక పోవడమే"! ఆ కొలబద్దను ఆయన కఠినంగా అమలుపరచారు.

'జ్యోతి' ప్రధానంగా కథల పత్రిక (పక్ష పత్రిక). అయినా, అందులోనూ కవితలు, వ్యాసాలు, నాటికలు, విమర్శలు కూడా ప్రచురిత మయ్యేవి. ఆనాటి ప్రసిద్ధ కథకులు చాలామంది జ్యోతికి వ్రాసే వారు. చలం, కుటుంబ రావు, గోపీచంద్, మల్లాది రామకృష్ణ

శాస్త్రి, పి.వి. సుబ్బారావు, జి.వి. కృష్ణారావు లాంటి వారు జ్యోతికి తమ రచనలు పంపే వారు. అలాగే, శివం, శ్రీనివాసరావు, శారద, శార్వరి, ప్రకాశ రావు, హితశ్రీ, లాంటి వారెందరో జ్యోతికి వ్రాసే వారు.

రేరాణి తెనాలి నుండి ప్రచురించిన తొలి మనో వైజ్ఞానిక మాస పత్రిక. అది రవీంద్రనాథ్ సంపాదకత్వంలోనే వెలువడింది. సిగ్మండ్ ఫ్రాయిడ్, హావలాక్ ఎల్లీస్, మేరీ స్టోప్స్ వంటి రచయితలను తెలుగు వారికి పరిచయం చేసిన ఘనత డా. రవీంద్రనాథ్ గారికే చెందుతుంది. ఆ రోజుల్లో రేరాణి ప్రతి సంచికలోను చలం కథో, చౌడేశ్వరి గారి రచనో తప్పక చోటు చేసుకొనేది. చాలా కాలం ధనికొండ హనుమంత రావు రేరాణి పత్రికలో పని చేశారు. తర్వాత 'అభిసారిక' అనే పత్రిక సొంతంగా మొదలెట్టారు.

లైంగిక విషయాల ప్రస్తావనే బూతుగా, అశ్లీలంగా పరిగణించే రోజుల్లోనే అత్యంత సాహసంతో హావలాక్ ఎల్లీస్ రచనల అనువాదాలు 'రేరాణి'లో రవీంద్రనాథ్‌గారు ప్రచురించి, ఆయన వైజ్ఞానిక దృక్పథాన్ని, ముందు చూపును, ప్రగతి శీలతను వెల్లడించారు. 'రేరాణి' నిజానికి శాస్త్రీయ లైంగిక విజ్ఞాన పత్రికగా కూడా పేరు తెచ్చుకుంది. ఈనాడు అందరూ ఆర్భాటం చేస్తున్న అనేక సమస్యలను గురించి దాదాపు 60 సంవత్సరాల క్రితమే మంచి మంచి వ్యాసాలు 'జ్యోతి', 'రేరాణి' పత్రికలలో ప్రచురించి భవిష్యత్తుకు మార్గదర్శకులయ్యారు రవీంద్రనాథ్‌గారు.

అలాగే కినిమా పత్రిక మూలంగా మంచి సినిమాలను, మంచి నటులను గూర్చిన అనేక వ్యాసాలు ప్రచురించి సినిమా రంగానికి కూడా గొప్ప సేవ జేశారు రవీంద్రనాథ్ గారు. తెనాలి నుండి వెలువడిన తొలి సినిమా మాస పత్రిక 'సినిమా'.

**చతుర్ముఖ జ్యోతి – నాల్గవ పాయ – మిసిమి :**

"రవీంద్రనాథ్ అంటే ***'మిసిమి', 'మిసిమి'*** అంటే రవీంద్రనాథ్. ఆ రెండు అవిభాజ్యం".

ఇది వరకు ఏ పత్రికకు లేనటువంటిది, కుడి, ఎడమల (ఎటువైపు నుండి చదివినా) తేడా రానిది **'మిసిమి'** అనే పేరు! పత్రికకు ఈ పేరును సూచించిన వారు బూదరాజు రాధాకృష్ణగారు. ***మిసిమి*** అంటే నూతన కాంతి, నవనీతం (వెన్న) అని రెండర్థాలు. ఆ పదం, దాని అర్థం సప్రమాణంగా చూపనిదే రవీంద్రనాథ్‌గారికి సంతృప్తి కలుగలేదు. అందుకే ఈ పద ప్రయోగానికి నిదర్శనంగా అల్లసాని పెద్దనగారి మనుచరిత్ర నుండి –

**"మిసిమి పర సీమ వల రాజు మేనమామ**
**వే వెలుంగుల దొర జోడు రే వెలుంగు"**

అనే పద్యంలోని వాక్యాలు ఉల్లేఖించడం జరిగింది. అలాగే నవనీతం అనే అర్థంలో ఎవరు ఎక్కడ వాడారో కూడా ఉదాహరణ పూర్వకంగా వివరించారు శ్రీ బూదరాజు రాధాకృష్ణగారు.

**"మిణుకు టూర్పుల వాని / మిసిమి మేతల వాని**
**మెరుగు ఛామన ఛాయ మేని వాని ...**

అలాగే నవనీతం అనే అర్థంలో తెనాలి రామకృష్ణ కవి తన 'పాండురంగ మహాత్మ్యం' అన్న కావ్యంలో పైన ఉదహరించిన వాక్యాలలో వాడారు.

***మిసిమి*** పక్ష పత్రికగా ఆరంభమై, తర్వాత మాస పత్రికగా మారింది. జ్యోతి (కళాజ్యోతి) ప్రెస్‌కు విదేశాల నుండి నాణ్యమైన కాగితం తెప్పించాలంటే పత్రిక పేరిట కోటా సాధ్యమనే దృష్టితో పక్ష పత్రికను ఆరంభించారు రవీంద్రనాథ్ గారు. పత్రికకు తగిన మేటర్ విషయంలో డా.ఎన్.ఇన్నయ్య గారు సహకరించారు. నాలుగు సంచికలు వచ్చే సరికి, పత్రిక ఆపేయాలా, కొనసాగించాలా అనే ప్రశ్న ఎదురైంది. రవీంద్రనాథ్‌గారి కుమారులు ఆయన్ను ప్రోత్సహించి, పత్రికను ఆపరాదనే నిర్ణయానికి కారకులయ్యారు. ఆ విధంగా ***మిసిమి*** నిలదొక్కుకొని మాస పత్రికగా మారింది. రవీంద్రనాథ్ గారు తమ పూర్తి సమయాన్ని వినియోగించి ***మిసిమి***ని ఒక ప్రామాణిక పత్రికగా రూపొందించారు. రవీంద్రనాథ్‌గారు ***మిసిమి***కి రూపకల్పన చేసి జవ జీవాలు నింపిన సంపాదకుడు మాత్రమే కాదు ఆ ***మిసిమి***ని అందరికీ వెలుగు నందించే 'పసిమి'గా తీర్చి దిద్దారు. రవీంద్రనాథ్‌గారి లక్ష్య శుద్ధి మహత్మ్యం వలన ఇప్పుడు ***మిసిమి*** రజతోత్సవం కూడా జరుపుకుంటోంది!

***మిసిమి*** అందరికి అందుబాటులో ఉండదు. అంటే, మిసిమిలో ప్రచురితమయ్యే కొన్ని కొన్ని రచనలు అందరికీ మింగుడుపడవు! వాటి 'స్థాయి' ఒక కనీస స్థాయిని అధిగమించిన వారికే అందుబాటులో ఉంటుంది. వారినే మేధావి పాఠకులంటున్నాము. మేధావులు, మేధావి పాఠకులు ఒకరే కారు. మేధావి పాఠకులు (చలసాని ప్రసాదరావు). ***మిసిమి*** మేధావుల పత్రిక. మేధావి పాఠకుల పత్రిక. ఆ పాఠకుల కోసం ఈ మేధావుల కలం పట్టించిన సంపాదకుడు డా. రవీంద్రనాథ్. ఆ పని కూడా గతంలో ఎవరు చేయని స్థాయిలో, ఊహించని రీతిలో చేశారాయన.

తనతో పాటు **మిసిమి** కూడా 'పసిమి'గా వెలిగి పోయేటట్లు చేశారు. విద్యావంతులైన ఆధునిక తెలుగు పాఠకుల కంటికి పంచ రంగుల పసిమిగా మేధకు బరువైన మేతగా, హస్త భూషణంగా కూడా తీర్చి దిద్దా – రాయన. **మిసిమి** ముందు, వెనుకా ఎన్నెన్ని, ఎందరెందరు ప్రసిద్ధ చిత్రకారుల అపురూప కళా ఖండాలు మిల మిల లాడాయి!? వాటి ముద్రణలో ఏ పాశ్చాత్య ముద్రణకు తీసిపోని నైపుణ్యాన్ని ఎంతగానో సాధించారు. ఉన్నవి కాసిన్ని పేజీలే, అయినా ఎంత బరువైనది **మిసిమి**?!

''నేర్చుకొనిన దేనినైనా స్వీయానుభవాలతో సమీక్షించుకుని స్వీయ సమాజావసరాలకు అనువర్తింప జేయడం సృజనశీలుర పని. ఈ అంశాన్ని గురించి ఒకసారి రవీంద్రనాథ్‌గారితో చర్చించినప్పుడు, అలా రాసే వారూ, రాయ గల వారు ఉండాలి కదా?'' అన్నారాయన (చలసాని). అలాంటి మౌలిక రచనలు కనబడినప్పుడు, వాటి రచయితలను గూర్చి వాకబు చేసి, వారిచేత రచనలు చేయించి ప్రముఖంగా ప్రచురించిన సంపాదకుడు రవీంద్రనాథ్. సంపాదకుడంటే ... ఏదో, వచ్చిన రచనల్లోంచి పనికి వస్తాయనుకున్నవి నాలుగు ఎన్నిక చేసి అచ్చుకిచ్చే ప్రచురణకర్తగా ఉండిపోకూడదు. తమ పాఠకులకు ఏం అందించాలని ఆశిస్తున్నారో, అలాంటి రచనలకు ప్రణాళిక రూపొందించి, ఆ ప్రకారం, ఆయా రచనలను సమర్థులను కొన్న వారి చేత రాయించి ప్రచురించే వాడే నిజమైన సంపాదకుడు. అలాంటి సంపాదకుడు డా. రవీంద్రనాథ్. అందుచేతనే **మిసిమి**కి అంతటి స్థాయి వచ్చింది. ఆ స్థాయి నిలుపుదలకే తమ సంపూర్ణ శక్తి సామర్థ్యాలను వాడుతున్నారు ప్రస్తుత సంపాదకులు.

రవీంద్రనాథ్ రచయితలకు స్వయంగా ఫోనులు చేసి వ్యాసాలు తెప్పించడమే కాక, స్టేట్స్‌మన్, టైం లాంటి పత్రికలలో వచ్చిన సమాచారం అనువాదం చేయించి చక్కటి తెలుగు శీర్షికలుగా ప్రచురించడం, సుప్రసిద్ధ మానవతావాది ఎంబ్రోసు వ్రాసిన *Devils Dictionary* వరుసగా **మిసిమి**లో ప్రచురించారు. ఫోను ద్వారా ఎందరో ప్రముఖ వ్యక్తులను సంప్రదించి **మిసిమి**ని బాగా పెంపొందించే కార్యక్రమం చేపట్టారు. ఈ విధంగా **మిసిమి**కి విశిష్ట వ్యక్తిత్వం కల్పించారు. విజ్ఞుల దృష్టి **మిసిమి** వైపుకు మరలింది. గ్రంథాలయాలు **మిసిమి**కి Subscription పంప ప్రారంభించాయి. రాను రాను **మిసిమి** ఒక ప్రముఖ సాహిత్య పత్రిక స్థానం గడించింది.

తర్వాత కాలంలో 'టైం' పత్రికలో పాల్ జాన్సన్ పుస్తకం 'ఇంటలెక్చువల్స్' పై పెద్ద రివ్యూ వచ్చింది. అది చదివిన తరువాత ఆ పుస్తకం తెప్పించి దానిలోని విశేషాలు కొన్నింటిని సీరియలుగా తెలుగు చేసి శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి గారు 'మేధావుల మెతకలు' అనే శీర్షికతో వ్యాసాలుగా **మిసిమి** పాఠకుల కందజేశారు. దానితో **మిసిమి** కీర్తి మిన్నంటింది.

అటు తర్వాత **మిసిమి** ప్రచురించిన రచనలలో ప్రముఖమైనవి పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారి 'మధురవాణి ఇంటర్వ్యూలు'. ఈ శీర్షిక క్రింద ప్రచురించబడిన రచనలు పాఠక లోకాన్ని అమితంగా ఆకర్షించాయి. పురాణం గతించిన తర్వాత, భమిడిపాటి రామగోపాలం సంకలన కర్తగా పూనుకోగా, 'మధురవాణి ఇంటర్వ్యూలు' – గ్రంథ రూపంలోకి కళాజ్యోతి పరి వర్తించింది. 'మేధావుల మెతకలు', 'మధురవాణి ఇంటర్వ్యూలు'– రెండూ డా.రవీంద్రనాథ్ సంపాదకత్వానికి హైలైట్లే.



జూన్ (2012)

పురుషులందు పుణ్యపురుషులు వేరయినట్లు పత్రికలలో ఉత్తమశ్రేణి పత్రికలు వేరుగా ఉంటాయి. అటువంటిది **మిసిమి** మాసపత్రిక పూర్వం జ్యోతి, రేరాణి పత్రికలను నిర్వహించి ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించిన ఆలపాటి రవీంద్రనాథ్ దీని ఎడిటర్, అన్నీనూ. ఈ పత్రిక అన్ని బుక్‌స్టాల్స్‌లో దొకరదు. ముచ్చటైన గెటప్ కన్నుల పండువు చేసే ముద్రణ. అచ్చెరవు గొలిపే చిత్రాలు.

సాహిత్య సంస్థలు ఎదగాలనుకునే తాపత్రయం కల యువతీ యువకులు తప్పకుండా సంపాదించి చూడవలసిన అరుదైన పత్రిక మిసిమి. కవిత్వం ప్రకటించకపోవడం దీని ప్రత్యేకత. అల్లాగే కథలూ.

*- ఉదయం, దినపత్రిక.* (**మిసిమి**, 1993)

ఈ సమయంలోనే సాధారణంగా అడగనిదే రాయని సంజీవదేవ్ తమంతట తాము వ్యాసాలు వ్రాసి ***మిసిమి***కి పంపించారు. ఈ విశేష చర్య డా.సంజీవదేవ్ గార్కి ***మిసిమి*** పట్ల ఉన్న అభిమానానికి గీటురాయిగా పరిగణించదగినది. కళలు, సాహిత్యంతో పాటు సైకాలజీ పై డా. రవీంద్రనాథ్ గారికి ప్రత్యేక దృష్టి ఉండేది. అందులో భాగంగానే సి. నరసింహంగారు ప్రచురించిన *'వ్యక్తిత్వ వికాసం'* నుండి కొన్ని భాగాలు ***మిసిమి***లో ప్రచురించారు. కథలను ***మిసిమి***లో ప్రోత్సహించక పోవుట రవీంద్రనాథ్ గారి ప్రత్యేకత. అయినప్పటికీ, చలసాని ప్రసాదరావు, శేషగిరిరావు గార్ల కళల అంశాలు ఆయనకు నచ్చాయి. అలాగే ముఖచిత్రం, మిగిలిన అట్టలపై చిత్రాలు ఎంపికకు కాలాన్ని బాగా వినియోగించి సఫలీకృతులయ్యారు. రాజకీయ అంశాలపై పరిశోధనాత్మక వ్యాసాలు ఏటుకూరి బలరామమూర్తి మొదలైన వారు ఎవరైనా వ్రాస్తే అవి ***మిసిమి***లో చోటు చేసుకొనేవి. ***మిసిమి***లో పద ఔచిత్యాల విషయంలో బూదరాజు రాధాకృష్ణను, పాత ఆసక్తికర సంఘటనలకు *ఆంధ్రపత్రిక*లో పనిచేసి రిటైర్ అయిన శర్మ గారిని తరచు సంప్రదించే వారు.

***మిసిమి***ని గురించి మేధావులు రకరకాల అభిప్రాయాలు వ్యక్తపరచారు. (***మిసిమి*** గురించి కొంతమంది మేధావుల అభిప్రాయాలు ఈ పత్రికలో ఇవ్వడం జరిగింది.) ఇంత కంటే గొప్ప కితాబులేముంటాయి! అందుకే, 1995వ సంవత్సరంలో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం రవీంద్రనాథ్ గారికి గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది. మన విశ్వవిద్యాలయాలు ఇలాంటి పని చేయవు కదా?! మన పద్ధతి ఇంట గెలిచి రచ్చ గెలుచుట కాదు. రచ్చ గెలిచి ఇంటి గౌరవాన్ని ఆశించుట. ఇంతటితో ***మిసిమి*** అభినందన మాలను ముగిస్తూ ఈ నాలుగవ స్రవంతిని సంపూర్ణం చేయడమైనది.

తండ్రిపై పిల్లల ఆదరాభిమానాలు మూల్యాంకణాతీతమైనవి! ఆ దృష్టితో చూస్తే, రవీంద్రనాథ్‌గారి కుమారులు, కుమార్తె వారి యందు వెల్లడించిన భావజాలం అత్యంత అమూల్యమైనది. అన్నిటి కంటే గొప్ప విశేషం, తమ తండ్రిగారి మానస పుత్రిక ***మిసిమి***ని ఎలాంటి లోటూ లేకుండా పోషించుట! అది వారికి తమ తండ్రిపై గల గాఢానురాగం చెప్పక చెబుతోంది.




ఈ వ్యాసాన్ని చతుర్ముఖ జ్యోతిగా చిత్రించాలని ఆశించాను కాని అన్ని విషయాలు ఆ నాలుగు పాయలలో ఇముడ్చలేక పోయాను. ఉదాహరణకు, మిసిమిలో ప్రచురిత మైన కొన్ని ముఖ్య రచనలు, డా. రవీంద్రనాథ్ గారికి ప్రముఖులు వ్రాసిన ఉత్తరాలు, రవీంద్రనాథ్ గారు స్వర్గస్తులైన తర్వాత వారికి వారి మిత్ర మండలి (స్రవంతి) వ్యక్త పరచిన హృదయ వేదనా సందేశాలు, రవీంద్రనాథ్ గారి అంతిమ యాత్రకు సంబంధించిన అనేక వివరాలు విశ్లేషణాత్మక వివరణ పొందలేదు. కారణం డా. రవీంద్రనాథ్ గార్ని చతుర్ముఖ జ్యోతిగా చిత్రించాలన్న ప్రబల వాంఛ. అందుకు విజ్ఞులైన పాఠకులు మన్నిస్తారని ఆశిస్తా.

**ముగింపు:**

డా. రవీంద్రనాథ్ గారు ప్రముఖ వ్యక్తి, సౌజన్య మూర్తి, సంభాషణా చతురుడు, దాతృత్వంలో ఎముక లేని చేయి. జీవితాన్ని సమ్యక్ దృష్టితో దర్శించి, మంచిని పెంచి, జ్ఞానాన్ని పంచి, మానవతను ఎల్ల వేళలా మరవక, అందరికీ అందుబాటులో ఉండి తారతమ్యాలు విసర్జించి, అజాత శత్రువుగా ప్రసిద్ధికెక్కారు. వారు తెలుగు పత్రికా రంగానికి, తెలుగు జాతి వికాసానికి, అనేక విధాల సేవ చేసిన మేధావి, వదాన్యుడు. ఇంతమంది ప్రముఖులు ఆయన స్నేహ సౌహార్థాన్ని తనివితీరా ఆస్వాదించారు, అమృత ఘడియలైన ఆయన జీవిత కాలంలో నివసించే అదృష్టాన్ని పొందగలిగారు. ఆ కాలంలో ఆంధ్రదేశం బయట కాలం గడిపిన నేను ఆయన వ్యక్తిగత దర్శనానికిగాని, వారితో మాట్లాడే అవకాశానికి గాని నోచుకోలేదు. అది నా దురదృష్టం. అయినప్పటికీ వారి స్మృతి సంపుటిని పరిశీలించి, వారిని గూర్చిన వివరాలు ఈ వ్యాస రూపంలో అందరి ముందు ఉంచే అవకాశాన్ని నాకు కల్పించి, ఎనలేని సంతృప్తిని నాకు కలుగ జేసినందులకు ***మిసిమి*** సంపాదకులకు నా కృతజ్ఞతా పూర్వక నమఃసుమస్సులందజేస్తున్నాను.

**ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ**
**ఫోన్** : 9618524702

# తెలుగు భాషావ్యవహారం : విలక్షణత

– యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి

**ప్రవేశిక :**

**భా**ష-భావప్రసారానికి వాహిక. ఇది మౌఖిక ప్రధానమైనది. మొదట భాష వాగ్వ్యవహారంలో ఉంటుంది. ఆ భాషకు లిఖిత రూపం ఏర్పడడానికి కొన్ని వేల సంవత్సరాలు పడుతుంది. మౌఖిక భాషను పూర్తిగా లేఖనంలో చూపడం సాధ్యం కాదు. భాషావ్యవహర్తలకు భాషద్వారా ఒనగూరే ప్రయోజనాలలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, సామాజిక ప్రతిష్టలు కూడా చేరతాయి. కొన్ని సార్లు విద్యావంతుల లేఖన వ్యవహారాలను నేర్చుకొని (లేఖనం ప్రమాణంగా) వ్యవహర్తలు మౌఖిక భాషను సరిదిద్దు కొంటుంటారు. మౌఖికభాష లేఖన రూపంలోకి మారేప్పుడు జాగ్రత్త వహించాలి. భాషాస్వరూపాన్ని అర్థం చేసుకొన్నప్పుడే ఇది సాధ్యం.

మాట్లాడే భాషకూ, రాసే భాషకూ వ్యత్యాసం స్పష్టంగా గుర్తించగలగటం, మాట్లాడే భాషను రాసేటప్పుడు తలెత్తే ఇబ్బందులకు పరిష్కారాలను అన్వేషించటం ఎంతో అవసరం. ముందు ఆధునిక లిఖిత భాషా ప్రామాణికతను సాధించాలి. దీని ప్రయోజనం ప్రామాణిక వ్యాకరణ రచన. వీటిని ప్రజలు పొందాలంటే వారు ఆ భాషపై అభిమానంతో వ్యవహరించాలి. అలా జనబాహుళ్యంలో వ్యాప్తమయిన భాషని ప్రభుత్వం ఆదరించాలి.

**నేపథ్యం :**

ప్రాచీనకాలంలో కొన్నాళ్ళు సంస్కృతం రాజభాషగా ఉండి తరువాత తెలుగు రావడానికి కారణం ఇదే. అలా ప్రభుత్వం ఆదరించి, పాలనవ్యవహారాలలో చోటు కల్పించినప్పుడే భాషకు భద్రత వస్తుంది. గౌరవం ఇనుమడిస్తుంది. ఆ భాషను వ్యవహరించిన ప్రజలకు కూడా గౌరవం కలుగుతుంది.

పాశ్చాత్యులనుంచి మాతృభాషా వినియోగాన్ని, మన పక్కనే ఉన్న తమిళసోదరుల నుండి మాతృభాషాభిమానాన్ని మనం చూసి నేర్చుకోవాలి. తమిళదేశంలో సంప్రదాయానికీ, భాషకీ పెద్దపీట వేస్తారు. మనకి సంప్రదాయం, భాష ఏ కొందరికో సంబంధించినవనే అపోహ ఉంది. భాషకు సంబంధించిన మంచి చెడ్డలు, యోగక్షేమాలు భాషా పండితులే చూసుకోవాలనే నిర్లక్ష్య వైఖరి కూడా కన్పిస్తోంది. భాష ఒక సమాజపు ఉమ్మడి సొత్తు అని గుర్తించడం వల్లనే తమిళుల కార్యక్రమాలు భాషాప్రాధాన్యంతోనే ప్రారంభమవుతాయి. 'తిరుక్కురళ్' చదవనిదే ఏ సభా ప్రారంభం కాదు. ఇంతటి అభిమానం ఉండడం వల్లనే అన్యభాషాపదాల వ్యాప్తిని జీర్ణించుకొనే పరిస్థితులలో తమిళ భాషాసమాజం లేదు. ఏదైనా కొత్తపదాన్ని వాడవలసివస్తే కచ్చితంగా కొత్తపదాన్ని తమిళభాషలో కల్పిస్తారు. లేకపోతే

ఏప్రిల్ (2011)

బాల్యం నుంచి భారతి లాంటి పత్రికలు చదివి, సాహిత్య కాంక్షతో అధ్యయనం చేసి, సాహిత్య సౌరభాలను ఆఘ్రాణించటానికి తాపత్రయపడేవాళ్ళలో నేనొకడిననే ఉత్సాహం పోలేదు. కాని సాహిత్య శైలి పూర్వ ఔన్నత్యాన్ని కోల్పోయినట్టుంది. కారణాలు ఏమైనా నేడు మనకు ఆదర్శపూరితమైన విజ్ఞాన దర్పణం లభించటంలేదు. ***మిసిమి*** సమకాలీన తెలుగు సంస్కృతి సహారాలో ఓ చిన్న ఒయాసిస్, సాహిత్యం వుంది, తర్కం వుంది. వేదాంతసారం, సాంఘిక విశ్లేషణలు వున్నాయి. ఇది అసాధారణ మాసప్రతిక, ఒక మధురమైన మహానుభూతి.

**– డా॥ సూరత్తు వేణుగోపాలరావు, ఐ.పి.ఎస్. (రిటైర్డ్)**

ఆ పదాలకే ముక్కుమొహం చెక్కేసి వాడేస్తారు. పరభాషను ఎంతగా మనదనుకొని పూసుకొని తిరిగినా మాతృభాష మాతృభాషే, పరభాష పరభాషే అంటూ తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి – (మాతృభాష మనకి కళ్ళు. పరభాష కళ్ళజోడు) అన్న మాటలు స్మరించదగ్గవి.

పాలకులు మొదట తమభాషను పాలితులపై రుద్దడానికి ప్రయత్నం చేస్తారు. తెలుగు విషయంలోనూ అదే జరిగింది. ఆంగ్లవిద్యనే కాదు, సనాతన సంస్కృత విద్యని కూడా కాదని మాతృభాషలోనే సాంకేతిక విషయాలను బోధించాలని రాజా రామమోహన్ రాయ్ పిలుపునిచ్చారు. 1822లో తన సొంత ఖర్చులతో ఒక పాఠశాలను స్థాపించారు. సమకాలీన సమాజంలోని అన్ని పాఠశాలలోనూ దాదాపుగా ఆంగ్లమాధ్యమంలోనే శాస్త్ర సాంకేతిక విషయాలను బోధిస్తున్నారు. దానికి విరుద్ధంగా ఆయన తన పాఠశాలలో వారి మాతృభాష అయిన బెంగాలీలో బోధన ప్రారంభించారు. వివిధ శాస్త్రాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలను ఆయన బెంగాలీ భాషలో రాసి ఆనాడే మాతృభాషలో అధ్యయనం జరగవలసిన అవసరాన్ని గుర్తించి లోకానికి తెలియ చెప్పారు.

ఇంగ్లీషు సంపన్న భాష, భారతీయభాషలు పేదభాషలన్న వాదాన్ని రామమనోహర్ లోహియా తిప్పికొట్టారు. ఆరు లక్షలపదాలకు పైచిలుకు పద సంపదతో తులతూగుతున్న దేశ భాషలు తెలుగు, తమిళం వంటి భాషలని కేవలం రెండున్నర లక్షల పదాలు మాత్రమే ఉన్న ఆంగ్లంకంటే భావవ్యక్తీకరణలోగానీ, శాస్త్రాంశాల బోధనలోగానీ ఏమాత్రమూ తీసిపోవని ఉద్ఘాటించారు. కేవలం వాడుకలో లేకపోవడం వల్లనే దేశభాషలు వెనుకబడుతున్నాయనీ వాడుకలోకి తెస్తే అత్యాధునిక శాస్త్రాలను సైతం అందించగల సామర్థ్యం వీటికి ఉందన్నారు.

మాతృభాషలోనే శాస్త్రసాంకేతిక విషయాలను అధ్యయనం చేసిన జపాన్, చైనా, రష్యా వంటి దేశాలు నేడు ప్రపంచంలోనే శాస్త్ర సాంకేతికరంగాలలో ముందు నిలిచి మాతృభాష అభివృద్ధి నిరోధకం కాదని నిరూపించాయి.

వైవిధ్యం భాషకు సహజలక్షణం. భాషను ఉపయోగించే వ్యవహర్తలందరి భాషలలోనూ తేడా ఉంటుంది. ఒకే భాషను మాట్లాడే సమాజాలన్నీ ఒకేలా మాట్లాడవు. సమానమైన ఉచ్చారణ వ్యవస్థనూ కలిగి ఉండవు. ఒకే వ్యక్తి ఒక్కొక్క చోట ఒక్కొకలా మాట్లాడతాడు. చదువు, పరిసరాల ప్రభావం, భాషావగాహన, అభ్యాసం, ఆసక్తి, అభిరుచి వ్యవహర్తభాషను తీర్చిదిద్దుతాయి.

**రూపవైవిధ్యం :**

మాట్లాడేభాష రాసేభాష రెండూ పరస్పరం ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటాయని ముందే అనుకొన్నాం. మాట్లాడేభాష వల్ల రాసే భాష మార్పుకు లోనవుతుంది. ఇంగ్లీషు ప్రభావాన్నే తీసుకుందాం. చదువరి ఇంగ్లీషు పదాలను తెలుగు వ్యాకరణ నిర్మాణానికి తగిన విధంగా మార్చుకొని ప్రయోగిస్తాడు. అదే విద్య లేనివాడు అనుకరించి ప్రయత్నం చేసి కృత్రిమంగా మాట్లాడతాడు. ఉచ్చారణలో పదాలు శిథిలమవుతాయి. తెలుగు పదాలను కూడా ఆంగ్లోచ్చారణతో పలకటం మరో పద్ధతి. శ, ష, స, లు ఆధునిక తెలుగులో ఆంగ్ల, హిందీ భాషల ప్రభావం వల్ల ఒకదాని స్థానంలో మరొకటి ఉచ్చరింపబడతాయి.

విద్యావంతుల వ్యవహారంలో భాష శిథిలం కాదు. ధ్వనుల స్వభావాలు మారవు. యథాతథంగా ఉంటాయి. అన్యదేశ్యాలు మూల భాషలలోలాగే ఉంటాయి. పదాలను సరైన ఉచ్చారణలో పలకటం అన్యదేశాలపై సొంతభాష ప్రత్యయాలను చేర్చి పలకటం కన్పిస్తుంది. చదువరుల భాష వ్యక్తి వ్యక్తికీ మారుతుంది. ఈ లక్షణం మౌఖిక రూప భాషకు అంతటా అంటే అన్ని స్థాయిలలోనూ ఉంటుంది. సమాజంలో ఒకరకంగా అంతరంగిక సమాజంలో ఇంకో రకంగా ఉంటుంది. బయట నలుగురితో మాట్లాడే భాషలో ఉచ్చారణ బావుంటుంది. తప్పులుండవు. ఇంట్లో సామాజిక నేపథ్యం, మాండలికత ప్రస్ఫుటమవుతాయి.

నిరక్షరాస్యుల భాష చదువరుల భాషలా ఉండదు. పూర్తి భిన్నం. వీరి భాష శ్రవణాధారం. కృతకంగా ఉంటుంది. బాహ్య ప్రపంచ సంపర్కం ఈ భాషని ప్రభావితం చేస్తుంది. విద్యావంతులు, స్వల్ప విద్యావంతులు, అవిద్యావంతులు ప్రతిష్ఠ కోసమే వైవిధ్యంతో మాట్లాడతారు. చదువరుల విద్యా సంస్కారం దోషాల్ని పరిహరిస్తుంది. ఇదంతా ప్రతిష్ఠ కోసమే. స్వల్ప విద్యావంతులు విద్యావంతుల్ని అనుసరిస్తారు. అన్యదేశ్యాలను గొప్పగా వాడతారు. ఈ వాడకంలో అంధానుసరణే కన్పిస్తుంది.

**మాండలిక వైవిధ్యం :**

మాండలికం అంటే భాషా వైవిధ్యం. ఈ వైవిధ్యం స్వల్పమైనది. ఈ వైవిధ్యం అవగాహన క్షమతను కల్గి ఉంటుంది. ఇది లేనినాడు ఆ భాష మాండలికం నుండి ప్రత్యేక భాషా స్థితిని పొందుతుంది. మాండలికాల వల్ల సాహిత్య చరిత్ర మూలాలు కూడా అందుతాయి కాబట్టి మాండలికాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. సాంస్కృతిక చరిత్ర, భాషా చరిత్ర మూలాలను మాండలికాల ద్వారా తెలుసుకోవచ్చు. ప్రామాణిక భాషలో కన్పించని ఎన్నో పదాలు మాండలికాలలో కన్పిస్తాయి. కావ్యభాషానుశీలనం వల్ల కవి గురించిగానీ, కవి కాల ప్రాంతాదుల గురించి గానీ చెప్పటం కష్టం. కానీ ఆయా కవులు ప్రయోగించిన మాండలిక పదాల ద్వారా ఇది సాధ్యం. మాండలిక భాషకు ప్రాంతం, వర్గం, సమీప సంపర్కం, సంస్కృతి కారణాలు. ఏ భాషలోనైనా వాక్య నిర్మాణం, క్రియ, కాల సంఖ్యా వాచకాలు కల ప్రాథమిక పదజాలం అందరికీ ఒకటే ఉన్నా పాక్షికమే. ఇది కాక మిగతా వ్యవహారంలో వైలక్షణ్యమే మాండలికత.

**ప్రసార మాధ్యమాలు – భాషా వైవిధ్యం :**

పత్రికలు చేసే ప్రయోగాలు భాషపై వ్యవహర్తలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రజల వాడుకలో ప్రచురంగా ఉన్న పదాలను పత్రికలూ స్వీకరిస్తాయి. అలా స్వీకరించే టప్పుడు ఆయా ప్రయోగాలను భాషా లక్షణాలకు అనుగుణంగా సరిచేయాలి. అలాగే అన్యదేశాలకు కొత్త పదాలు తయారుచేసినపుడు స్వీకృతభాషా లక్షణానుసారంగా పదనిర్మాణం చేయాలి. భాషాపరంగా ఇది పత్రికల విధి. ఇలా పరిష్కరించుకొన్న తర్వాత మాత్రమే పదాలను పత్రికలలో వాడాలి. ఎందుకంటే ఆ పదాలే మళ్లీ వ్యవహారంలో రూఢికెక్కుతాయి. ఇది ఒక రకంగా మాట్లాడేభాషకూ, రాసే భాషకూ ఉండే సన్నని సరిహద్దు రేఖని చెరిపేస్తుంది. శబ్దాలంకారాలకోసమో, చమత్కారాల కోసమో పదాలను విరిచి ప్రయోగించటం అర్థరహితం.

ప్రసార మాధ్యమాలు కాలాన్ని బట్టి రూపం కూర్చుకొంటాయి. భాష విషయంలోనూ అంతే. నాటికీ, నేటికీ భాషలో అనేక అంతరాలు ఉన్నాయి. నాడు భాషపై పట్టు ఉండటం ఈ రంగంలో ప్రవేశించడానికీ రాణింపుకీ తొలి అర్హత. ఇప్పుడలా లేదు. నేడు వ్యాఖ్యాతల, నటుల ఎంపికలో భాషకంటే రూపానికే అధిక ప్రాధాన్యం. డబ్బింగ్ సౌకర్యం వచ్చాక నటులకు మాట్లాడే కష్టమూ తప్పింది. నేపథ్య గళ సమర్పకులూ భాషపై దృష్టి పెట్టటం లేదు. నేడు ప్రసార మాధ్యమాలన్నీ మాట్లాడే భాషలోనే తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రేడియో వినటం వరకే. టీవీలో శ్రవణంతో పాటు దృశ్యమూ ఉంటుంది. భాష స్పష్టంగా వాక్యాలు చిన్నవిగా ప్రతి పదమూ సార్థకంగా, ప్రయోగానుసారంగా ఉన్నప్పుడే రేడియో, టీవీలలోని భాష శ్రోతలను, ప్రేక్షకులనూ అలరిస్తుంది.



ఏప్రిల్ (2012)

*మా తెలుగు తల్లికి మల్లెపూదండ* అనే జాతీయ గీతాన్ని అమృతగళంతో ఆలపించి తెలుగు గుండెల్ని మాతృభక్తితో నింపిన టంగుటూరి సూర్యకుమారి గారి 86వ జయంతి సందర్భంగా స్త్రీ స్వేచ్ఛకు ప్రతీకగా ఆమె ప్రదర్శించిన బహుముఖ ప్రతిభను ***మిసిమి*** సంపాదకీయం ప్రస్తుతించటం అవశ్యం అభినందనీయం... తెలుగు వచన రచనకు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు చేసిన అపూర్వ సేవ, *రాయలసీమ వేమన* విశేషాలు, *రాగోపనిషత్తు* మొదలైన ఎన్నో ముఖ్యాంశాలను మన ***మిసిమి*** ద్వారా పాఠకలోకానికి అందిస్తున్న మీకు హృదయపూర్వకమైన అభినందనలు.

డిసెంబరు 2011 సంచిక ముఖచిత్రం *డొమినో కో వాడిన్*, రెండవ అట్ట *సూర్యకుమారి ఎల్విన్*, మూడవ అట్ట *సెయింట్ పెడ్రో బెసిలిక*, నాల్గవ అట్ట *మేరి* కావటం సమయోచితంగా ఉన్నది. చిత్రకారులు అభినందనీయులు... ***మిసిమి*** పత్రిక ఆద్యంతం అందులోని రచనలు, ముఖచిత్రాలతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇవి కూడా నూతన కాంతులతో ***మిసిమి*** ని సార్థకం చేస్తున్నాయి.

**- 'సాహిత్యబ్రహ్మ' డా॥వి.వి.ఎల్.నరసింహారావు, హైదరాబాదు.**

రేడియోలో శ్రవణం ద్వారానే శ్రోతలను ఆకట్టుకోవాలి. అంటే చూపించే వాటిని కూడా గొంతులోనే పలికించాలి. టీవీలు గానీ, చలన చిత్రాలు గానీ కొన్ని సందర్భాలలో మాటల ద్వారా కాక దృశ్యాన్ని చిత్రీకరించి భావాన్ని ప్రేక్షకులకు అందించవచ్చు. ఇది దృశ్య మాధ్యమంలో ఉండే సౌలభ్యమూ, సౌకర్యమూను. టీవీ కంటే చలన చిత్రంతో ప్రజాభాషకి సాన్నిహిత్యం ఎక్కువ. సహజసిద్ధమైన వ్యావహారిక భాష, సందర్భాన్ని బట్టి ఆయా మాండలికాలు, పాత్రోచితభాష ప్రయోగించే అవకాశం చిత్రాలలో ఉంటుంది. కొత్తగా ఏ పదమైనా జనం నాల్కలపై ఆడిందంటే చాలు అది త్వరగా సినిమాలలోకి వస్తుంది. మెల్లగా టీవీ రేడియోలలోకి చేరుతుంది. దీనికి కారణం భాష విషయంలో ఇవి కొంతవరకూ ప్రామాణికతను ప్రదర్శించటమే. ఇప్పుడు ఈ పరిస్థితి కొంతమారింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఎన్నో టీవీ ఛానళ్ళు ఎఫ్.ఎమ్.రేడియోలు రంగ ప్రవేశం చేశాయి. ఇవి కూడా సినిమాలతో పోటీ పడుతూ జనవ్యవహారంలో ఉన్న భాషను సత్వరం అందుకొని ప్రయోగిస్తున్నాయి.

ఉదా : సుత్తికొట్టు, క్లాసు పీకు, అంతసీనులేదు, కేక, కిర్రాకు.

**కల్పనా సాహిత్యం భాషావైవిధ్యం :**

మౌఖిక భాష ఆధారంగా రచనలు చేసేవారు భాషపట్ల కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అపశబ్దాలను పరిహరించాలి. జనవ్యవహారానికి విరుద్ధంగా ఉన్న రూపాలను స్వీకరించకూడదు. కొన్ని కొన్ని రూపాలు నియమితార్థంలో రూఢికెక్కి ఉంటాయి. అటువంటి వాటిని అదే అర్థంలో ప్రయోగించాలి.

పత్రికా భాషలో కంటే గ్రంథాలలో ఉన్న భాష సహజంగా, స్వతంత్రంగా ఉంటుంది. రచయిత సృష్టించే నూతన పదబంధాలు, విలక్షణార్థ ప్రయోగాలు భాషను పుష్టిమంతం చేస్తాయి. ఇది రచయితల భాషాసామర్థ్యాన్ని బట్టి ఉంటుంది. ఆధునిక కాలంలో కవిత్వం, కథానికలు ప్రాంతీయ వ్యవహార భాషలలో రాస్తున్నారు. దీనివల్ల ఒక మాండలిక భాషావ్యవహర్తకు వేరొక మాండలిక భాషతో పరిచయం ఏర్పడుతుంది. వారి అవగాహన పరిధి విస్తృతం అవుతుంది. ఇది మాండలిక భేదాలపట్ల వైషమ్యాలను తొలగించి గౌరవం కలిగిస్తుంది.

**ఉపసంహారం :**

తెలుగు ధ్వనులు, పదజాలం అన్యభాషా సంపర్కం వల్ల ఉచ్చారణలో మార్పుకు లోనవుతాయి. ఈ మార్పులు మౌఖికమైనవి, లేఖనంలో చూపకూడదు. భాష దోషరహితంగా ఉండటం ఎంత అవసరమో, సార్థకంగా ప్రయోగించటమూ అంతే అవసరం. ఏ నియమమైనా భాషావగాహనకు గానీ, అర్థబోధకు గానీ ఆటంకం కలిగించేలా ప్రవర్తించకూడదు. నిత్యనూతనమూ, ప్రయోగమూలమూ అయిన వ్యావహారికభాషా ప్రయోజనం దెబ్బతినకుండా భాషావ్యవహర్తలూ, భాషావేత్తలూ కృషి చేయాలి.

ఆధునిక తెలుగు భాషకు అన్ని మండలాలను సమన్వయపరిచే ఒక ప్రామాణికమైన వ్యాకరణం రూపొందాలి. జీవద్భాష అయిన తెలుగుకు ప్రామాణిక వ్యాకరణ రచన అత్యంత ఆవశ్యకం. అలాగే కష్టతరం. ఈ వ్యాకరణం సంపూర్ణంగా కాకపోయినా కొంతవరకూ భాషాపరమైన సమస్యలకు పరిష్కారాలను చూపుతుంది.

- డాక్టర్ యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి
తెలుగు అకాడమి, హైదరాబాదు,

ఆగష్టు (2011)

"MISIMI is one of those rarest of rare gems in terms of literary value which is difficult to be found in the contemporary scene, however deep one may fathom... Misimi is not a run of the mill magazine.... It is not often, that one comes across quality printing with quality features on quality subjects. MISIMI - Lustre, resplendent. It is a monthly, which contains everything a curious mind wants to know"...

- ది హిందూ (ఇంగ్లీషు దినపత్రిక)

# ఆధునిక తెలుగు సాహిత్యం

## అధిక్షేప కావ్యాలు

బూదరాజు

శ్రీ బూదరాజు రాధాకృష్ణ వ్రాసిన ఈ వ్యాసం *మిసిమి* ప్రారంభ సంచికలో మొదటి వ్యాసంగా ప్రచురించబడినది.

*– డా॥ బూదరాజు రాధాకృష్ణ*

తెలుగు సాహిత్యంలో ఇతర భారతీయ సాహిత్యాల్లో లాగానే హాస్య రసస్ఫోరకమైన అధిక్షేపణ చాలా తక్కువ. కొన్ని ఇతర సమాజాల్లోలాగా హాస్యమయమైన విమర్శకు గాని, చివరికి ఉత్సవాలకు గాని మన సమాజంలో స్థానం లేదు. మనం హాస్యాది దైవతమని భావించే వినాయకుడి పండుగలో కూడా సరదాల మీద దృష్టి తగ్గిపోతున్నది మనకు. ప్రాచీన రోమన్ సమాజంలో "Festival of Saturnalia" అనే పండుగ జోరుగా జరిగేది. ఆ సమయంలో రాజుల నుంచి సామాన్యులదాకా అందరూ నవ్వుతూ, వెక్కిరిస్తూ, వేళాకోళం చేస్తూ విమర్శిస్తూ కాలం దొర్లించే వాళ్ళు. మధ్యయుగాల్లో అనేక యూరోపియన్ దేశాల్లో "Feast of Fools" అనే వినోదాత్మకమైన పండుగ జరిగేది. బహిరంగ విమర్శలకూ, అధిక్షేపాలకు అవకాశమిచ్చే "Fasching" అనే సారస్వత లక్షణంగల పండగ ఆస్ట్రేలియాలో జరిగేది. నేటికీ ఆఫ్రికా ఖండంలోని 'అషాంతి' దేశంలో ప్రతి శుక్రవారం నాడూ ప్రజలు గుమిగూడి రాజును అతని సమక్షంలోనే నానా విధాలుగా ఆక్షేపిస్తుంటారు. ఆ రోజు ఏమన్నా చెల్లుతుంది. మరునాటి నుంచీ అలా చేయటం నిషిద్ధం–ప్రమాదకరం. ఇలాంటి సంప్రదాయాలు మనకు లేవు. ఉంటే–అవి మన సాహిత్యంలో ప్రతిబింబించేవి.

ఆధునిక సాహిత్యంలో – వీరేశలింగయుగం నుంచీ పెద్దసంఖ్యలో కాకపోయినా రకరకాల అధిక్షేప కావ్యాలు వెలువడ్డాయి. వాటినే ఇప్పుడు చర్చిద్దాం. ఈ రకం సాహిత్యం పద్యం, గేయం, వచనం లాంటి అనేక రూపాల్లో వచ్చింది. స్వభావరీత్యా వింగడిస్తే తెలుగులోని అధిక్షేప కావ్యాలను ప్రధానంగా మూడు రకాలని చెప్పవచ్చు– సాహిత్యక, సామాజిక, రాజకీయ కావ్యాలని వీరేశలింగం గారే ఆధునికయుగంలో అధిక్షేపకావ్యాలకు శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. ఆయన నాటికి వెర్రితలలు వేసిన ప్రబంధ ప్రక్రియనూ, అందులోని గతానుగతిక రచనా ధోరణినీ, అధిక్షేపిస్తూ, వీరేశలింగం రాసింది 'అభాగ్యోపాఖ్యానం' అనే కావ్యం. ప్రబంధాల్లో సాధారణంగా ఉదాత్త నాయికా నాయకులూ వారి శృంగార క్రీడలూ వర్ణితాలు. వీరేశలింగం గారి కథానాయికా నాయకులు అనుదాత్తులు. "అతనికి పొట్టగోసినను అక్షరమొక్కటి లేదు, కాగడాతో వెతకిన తెల్విలేదు" మొదలుగా నాయకుణ్ణి వర్ణిస్తాడు. ప్రబంధకవులు– ముఖ్యంగా క్షీణయుగ ప్రబంధ కవుల శబ్దాడంబర శుష్క వర్ణనలకు ప్రతిగా "డాయను భీతిబొంద మగడాయను, తల్పులు తీయమేని రండాయను, పల్కవేమి చెవుడాయను" ఇత్యాది దుర్భర ప్రసంగాలు కూడా అందులో ఉన్నాయి.

ప్రబంధ ప్రక్రియా సమిష్టిని అధిక్షేపించటమే ప్రధానంగా పెట్టుకొని ఆయన "అభాగ్యోపాఖ్యానం" రాశాడు. వచన గ్రంథాలనూ, నాటకాలనూ కూడా కావ్యాలంటే చాలమంది ఒప్పుకోరు. కానీ "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" అనే పండిత రాయల నిర్వచనం ప్రకారమయితే వీరేశలింగం గారి ప్రహసనాలూ, తిర్యగ్విద్వన్మహాసభ వంటి రూపకాలూ అధిక్షేప కావ్యాలనే చెప్పవచ్చు.

ఈ నిర్వచనం ప్రకారం గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' ఆధునిక సాహిత్యానికి మకుటాయమానమైన అధిక్షేప కావ్యమనాలి. సమాజంలోని వైరుధ్యాలను, లోపాలను, వంచనలను, అంతకన్నా సుకుమారంగా సుందరంగా సర్వాంగీణంగా అధిక్షేపించిన మరో గ్రంథం మనకు లేదంటే అతిశయోక్తి కాదు. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి 'గణపతి', మొక్కపాటి నరసింహశాస్త్రి "బారిష్టర్ పార్వతీశం" వంటివి కావ్యాలంటే, అధిక్షేప గ్రంథాలంటే సరిపెట్టుకుంటామనీ అనే వాళ్ళూ ఉన్నారు.

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి ''సాక్షి'' వ్యాసాలు, 'కంఠాభరణం' వంటి నాటకాలు మన సమాజ సాహిత్యాలను రెంటినీ అధిక్షేపించే రచనలు.

పద్యరచనల్నే కావ్యాలుగా పరిగణించినట్లయితే త్రిపురనేని రామస్వామి చౌదరి గారి "సూతపురాణం" అధిక్షేప పురాణం. తిరుపతి వేంకటకవుల 'గీరతం' వ్యక్తి దూషణ పూర్వకమైనా అధిక్షేప కావ్యమే. ఆ తరంలో కొప్పరపు వారూ, రామకృష్ణ కవులూ, తిరుపతి వేంకటకవులూ ఒకర్నొకరు అధిక్షేపిస్తూ బండ్లకొద్ది పద్యాలూ, పుస్తకాలూ రాసుకున్నారు. అయితే వాటి ప్రయోజనం పరిమితం.

'రావణదమ్మీయం– ఉరఫ్–లంకా విజయం' పద్ధతిలో నిర్మొమధామంగా దూషించిన కావ్యాలవి. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి చాటు పద్యాలు అధిక్షేపాలు. బహుశా రాజకీయులకు కూడా అన్వయించి అధిక్షేప ప్రక్రియను విస్తరించిన మొదటి తెలుగు కవి ఆయనే నేమో. సుప్రసిద్ధ రాజకీయ నాయకులందర్నీ వెక్కిరించి వేళాకోళమాడిన ఆంధ్రరత్న "గోపాల కిష్టాయి కొక్కిరాయి" అని ఆత్మనింద చేసుకొని, తన అధిక్షేపణల తీవ్రతను ఒక్కసారిగా తగ్గించి వేశారు. ఎంకి పాటలు మీద ఆయన రాసిన అధిక్షేపణ గేయం, గేయ ప్రక్రియలో తొలి అధిక్షేపణమేమో!

శతక వాఙ్మయంలో అనూచానంగా అధిక్షేపం కనిపిస్తుంది. వేమన పద్యాల్లో రకరకాల అధిక్షేపాలున్నాయి. ఆధునికులు చాలామంది ఇంకా శతకాలు రాస్తున్నారు; వాటిలో సామాజిక, రాజకీయ వ్యవస్థల మీద అంతో ఇంతో అధిక్షేపం కనిపించక పోలేదు. భావ కవిత్వం బాగా పేరు సంపాదించి స్థిరపడిన తర్వాత ఉత్తమ భావకవితకు, నిదర్శనగా ఉన్న దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి 'కృష్ణపక్షాన్ని' అధిక్షేపిస్తూ అనంతపంతుల రామలింగస్వామి గారి 'శుక్లపక్షం' వెలువడి కొంత సంచలనం తెచ్చింది. కానీ నిలవలేక పోయింది.

అధిక్షేపమనగానే ఈ శతాబ్దంలో గుర్తుకు వచ్చే రెండు పేర్లలో మొదటిది జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి గారిది. చమత్కారం, వెక్కిరింత సమపాళ్ళలో నడిపిన ఆ మహాత్ముడు తన పేరును కూడా రకరకాలుగా రాసుకున్నాడు. జరుక్, జరుక్‌శాస్త్రి, రుక్కుటేశ్వర్, మిణీశాస్త్రి వగైరాలుగా. ఆయన విశ్వనాథ సత్యనారాయణ గారిని అధిక్షేపిస్తూ "పాషాణపాక ప్రభూ" అని ముగించిన పద్యం చాల ప్రాచుర్యం పొందింది. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు బతికి ఉండగానే అవధాన ప్రదర్శనలు దేశంలో మార్మోగి పోతుండగానే, జరుక్ శాస్త్రి తిరుపతి వేంకటకవుల్నీ, అవధాన విద్యనూ అధిక్షేపిస్తూ చెప్పిన గేయం తమాషా అయింది.

**"లలాటన కుంకుమాగ్ని / బుజం మీద మబ్బు దుబ్బు**
**కాళ్ళకింద కిర్రుచెప్పు / అంగోస్త్రం, పొడుంకాయ**
**వ్యవధి లేని అవధానం / వెళ్ళిపోయిందెళ్ళి పోయింది."**

అని జరుక్‌శాస్త్రి వర్ణించాడు. వ్యక్తికీ విషయానికీ ముడిపెట్టి మరీ రాశాడు.

భిన్నరూపాల సాహిత్యంలో భావ కవిత్వాన్ని, అవధాన కవిత్వాన్ని మరిచిపోకుండా రాజకీయ, సామాజిక విషయాలను కూడా చేర్చుకుంటూ అధిక్షేప సాహిత్యం సృష్టించిన వాడు మాచిరాజు దేవీ ప్రసాద్. దేవులపల్లి కృష్ణశాస్త్రి భావ, ప్రణయ కవితలకు పోటీగా 'తాత విరహం' వంటి కావ్యాలు రాశాడు. విశ్వనాథ సత్యనారాయణగారి సంప్రదాయ వాదాన్ని అధిక్షేపిస్తూ "అచ్చొత్తించు శ్రీప్రెస్సులో శ్రీ అచ్చుల్ సరిపోయి ఏడ్చినవిటోయ్ శ్రీ విశ్వనాథేశ్వరా?" అని ప్రశ్నించాడు. శ్రీశ్రీ ''మహాప్రస్థాన'' గేయాలను అధిక్షేపిస్తూ ''రహదార్ల చరిత్ర సమస్తం, పరపీడా పరాయణత్వమన్నాడు. ప్రపంచయుద్ధ కాలం నాటి కాగితం కరువును, అప్పటి పొదుపు ఉద్యమాన్నీ, అధిక్షేపిస్తూ ఉత్తర ప్రత్యుత్తర రూపంలో రెండు వచన గ్రంథాలనూ, ఓ పద్య రచననూ చేసి ఇబ్బంది పాలైనాడు. ''కాగితం ఖర్చు చేయబోకండి మీరు కాగితం ఖర్చు చేయనీకండి అనుచు

అక్టోబరు (1998)

***మిసిమి*** ఒకటి రెండు రోజుల్లో చదివి అవతల పారవేసేది కాదు. అది ఆలోచనామృతాన్ని అందించేది. దాన్ని ఆస్వాదించడానికి తీరుబడి కావాలంటే తన కృషి సఫలమైందని భావిస్తూ, చిరునవ్వు చిందించే వారు డా. రవీంద్రనాథ్

**- డా. భీమ్ సేన్ నిర్మల్. (ప్రఖ్యాత హిందీ సాహిత్యవేత్త).**

విశ్వరూపాల వంద వేయి కోట్లు వాలు పోస్టరులంటించె వాడవాడ"

అని అప్పటి ప్రత్యేకాధికారి చేష్టలు వెక్కిరించి

"ఉన్న భార్య, దూరాన ఇరుక్కుపోయె! ప్రణయ లేఖమ్ము వ్రాయ పత్రమ్ములేదు! ప్రణయ కావ్యమ్ము వ్రాయ పత్రాలు లేవు" అని బాధ పడ్డాడు. అంత కరువులోనూ కవులు రచనా కండూతిని వదుల్చుకోలేక పోయారని అతడి అధిక్షేపం.

శ్రీశ్రీ 'సిరిసిరిమువ్వ శతకం', 'రుక్కుటేశ్వర శతకం' వంటివి అధిక్షేప కావ్యాలే. ప్రాచీన నీతి పద్యాల ధోరణిని అధిక్షేపిస్తూ శ్రీశ్రీ –

**"పిల్లలు పిల్లల చెట్టును / నల్లును ద్రావెడి కతాన నల్లి అనబడెన్**
**అల్లుడు దశమోగ్రహములు / వెల్లుల్లికి తీపిలేదు విశ్వమున జరూ!"**

అంటూ శ్రీశ్రీ అధిక్షేపించాడు. ఈ ధోరణిలోనే ఆరుద్ర అధిక్షేపిస్తూ గేయాలు రాశాడు. ఆయన మత, సామాజిక స్థితిగతులను కూడా అధిక్షేపిస్తూ

**"ఏకపత్నీ వ్రతము / ఎలుగెత్తి మన మతము వేల్పు భార్యలు శతము**
**ఓ కూనలమ్మా .....కాలవశమున మారి / చాల ముడుపులు**
**కోరి / దేవుడే వ్యాపారి / ఓ కూనలమ్మా!"**

ఇత్యాదిగా కూనలమ్మ పదాలను అధిక్షేపకంగా రాశాడు.

రాజకీయ సిద్ధాంతాలు ప్రధానంగా సామాజిక రుగ్మతలను అధిక్షేపిస్తూ రాసినవాళ్ళు సుప్రసిద్ధులు గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తులు. మల్లారెడ్డిగారి 'శంఖారావం'లో "అడగని వరమిచ్చు వేల్పులంటూ ఉన్నారురా?" అని గురువడిగితే శిష్యుడు చెప్పిన సమాధానం అధిక్షేపంగా ఉంటుంది. ప్రాచీన గురుశిష్య సంవాద సంప్రదాయ ధోరణిలో ఇది రాజకీయాధిక్షేపం చేయటం. అలాగే "ఇద్దరు పండితుల మధ్య ఒద్దిక లెట్లుండురా?" అనే గురువుగారి ప్రశ్నకు శిష్యుడి సమాధానం "అగ్గిమీద గుగ్గిలమ్ము! నిగ్గుదేరినట్లు గురూ!" అనేది రాంభట్ల కృష్ణమూర్తిగారి "శశవిషాణం" వంటి కావ్యాల్లోని సమస్త విషయాలూ రాజకీయ అధిక్షేపాలే. దసరా పద్యాలకు రాసిన పేరడీల్లో కూడా అది ప్రతిఫలిస్తుంది.

"అయ్యవార్లకు చాలు అర్ధజీతాలు

పిల్లవాళ్ళకు చాలు పూట పాఠాలు" మొదలుగా నడుస్తుంది అధిక్షేపం. దిగంబర కవులవంటి తీవ్రవాదులు సాగించిన రాజకీయ సాహిత్యక అధిక్షేపం చాలా సందర్భాల్లో సభాసాధువు కాదు. కానీ అధిక్షేపమే.

తెలుగువాళ్ళకు కోపతాపాలుగాని, ప్రేమాభిమానాలు గాని కొంచెం ముదురు పాకంలోనే ఉండటం వల్ల బహిరంగ ప్రదేశాల్లో ఇప్పటి సామాజిక ధర్మం ప్రకారం ఉదహరించడానికి వీలులేని అధిక్షేప కావ్యాలు చాలా ఉన్నాయి. ఒక విధంగా అవి తిట్టు కవితగా మారాయని అనిపిస్తుంది. సాక్షి వ్యాసాల్లోని అనేకాధిక్షేపాలను ఈ కాలంలో ప్రస్తావించటం కష్టం. దాసు శ్రీరాములుగారి "తెలుగునాడు" వంటి అధిక్షేప కావ్యాల్లో సమకాలంలో కులాల, శాఖల, ఉపశాఖల మీద నేటి సమాజన్యాయం ప్రకారం, న్యాయశాస్త్రం ప్రకారం రాయడానికి గాని, బహిరంగ స్థలాల్లో చదవడానికి గాని వీలులేని కులమత దూషణలున్నాయి. ప్రాచీన సాహిత్యంలోనే కాక సమకాలిక సాహిత్యాలలో కూడా ఇలాంటి అసహన ప్రసంగాలుండటం మన దురదృష్టం.

మానవజాతి ఉన్నంత కాలం దానిలో మంచితోబాటు చెడు కూడా ఉంటుంది. చెడును తీవ్రంగా ప్రతిఘటించటం ఒక ఎత్తయితే, వెక్కిరించి ఎత్తి చూపడం మరో పద్ధతి. మన ఆచార వ్యవహారాల్లో, మన సంప్రదాయాల్లో, రాజకీయ వ్యవస్థలో, సాహిత్యంలో ఉన్న లోపాలను అధిక్షేపించే సాహిత్యం తెలుగులోనే కాక మొత్తం భారతీయ సాహిత్యంలోనే చాలా కాస్త తక్కువనిపిస్తుంది. భగవద్గీత వంటి పవిత్రగ్రంథాన్ని అక్షరాక్షరం అధిక్షేపిస్తూ "ఉత్తర గీతలు" రాసుకున్న జాతిలో, పాణినీయం వంటి సూక్ష్మశాస్త్రం ప్రసంగాలకు అధిక్షేపాలు పరంపరగా చెప్పుకున్న జాతిలో,

జూలై (2009)

It does one's heart good to see a serious periodical like MISIMI, not only serving but marching from strength to strength, month by month. It is not a matter of Circulation but Cerebration. Even if there are a thousand readers influenced by its content, it will be a substantial gain to the intellectual life of the Telugu - speaking public.

**- Dr. Anjaneyulu (Author and Journalist).**

విమర్శను భరించలేని సౌకుమార్యం ప్రబలి పోవటమే ఆశ్చర్యకరం. అంతేకాదు హాస్యం అశ్లీలమయితే గాని రాణించదని, అధిక్షేపణ ఒక మతాన్నో, కులాన్నో, రాజకీయ పక్షాన్నో దూషించేవిగానే ఉండాలని చాలమంది నమ్ము తున్నట్లుంది. సంస్కృతంలోలాగా అన్యాపదేశ కావ్యాలు ప్రత్యేక ప్రక్రియగా నేటి తెలుగులో కూడా రాకపోవడం విచారకరం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో కరుణ ప్రధానంగా అధిక్షేపించిన మహాకవి జాషువా. ప్రత్యేకించి అధిక్షేపక ఖండకావ్యాలు రాయకపోయినా, రాసిన వాటిలో అధిక్షేపాన్ని కరుణామయంగా చొప్పించినవాడు జాషువాయేననిపిస్తుంది. ఆ అధిక్షేపంలో మెత్తని మందలింపేగాని ద్వేషంలేదు. తాను గాంధేయుడై తన పక్షం వాళ్ళే అధికారంలో ఉన్నా ఆయన సుకుమారంగా అధిక్షేపించాడు. గాంధీజీ మరణానంతరం మన సమాజంలో నిలిచిపోయిన యథార్థాన్ని అధిక్షేపిస్తూ జాషువా –

**"కలకల నవ్వెదు తాతయ్య / శిలమై, కలమై అనంత శిల్పంబునకున్**
**బలమిచ్చి మాయమయ్యెన్**
**కులమత తత్వములు పుంజుకొని తలయెత్తెన్"**

అని వాపోవటంతో మన సమాజంలో మాటకూ, చేతకూ పొంతన లేకపోవటాన్ని ఆయన అధిక్షేపించాడు.

మానవ సమాజంలోని అత్యధిక సంఖ్యాకులు దారిద్ర్య రేఖకు దిగువన ఉంటున్నారు. వారికి కావలసింది తిండీ, గుడ్డా, తలదాచుకొనేందుకు కాస్త జాగా. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో రత్నాలను వీధుల్లో రాసులుగా పోసి అమ్ముకునే వాళ్ళమని శాసనాలూ, కైఫియత్తులూ, ప్రబంధ వర్ణనలూ ఉటంకిస్తూ మన ప్రాచీన వైభవాన్ని కళ్ళకు కట్టేటట్లు వర్ణించినా సామాన్య ప్రజలకు కడుపు నిండదంటాడు జాషువా. అందుకే –

**"రేయిబవలు భారతీయ సంస్కృతి పేర / గండశిలలు చూపి కథలు చెప్పి**
**పేదవాని కడుపులోగల చిచ్చును, / గడపగలవె నీవు గగనవాణిని"**

అని ప్రశ్నిస్తాడు. ఇటువంటి అధిక్షేపాలు వెతికితే అనేకేతర కావ్యాల్లో కనిపిస్తాయి. కానీ అవి మన సాహిత్యంలో అధిక్షేప కావ్యాలకున్న కొరతను తొలగించలేవు.

ప్రాచీన సంప్రదాయం ప్రకారం హాస్యం మానవీయం కాదు. శుద్ధహాస్యం అంతకన్నాను. అధిక్షేపం హాస్యప్రధాన మనుకోనక్కర లేదు. దూషణ ప్రధానమనీ భావించ నక్కరలేదు. వాస్తవ పరిస్థితి చిత్రణద్వారా కూడా అధిక్షేపాన్ని సాధించవచ్చు. కడుపులోని బాధను కన్నీళ్ళతో కడు క్కోవడానికి అధిక్షేప సాహిత్యం అక్షరాలా ఉపయోగ పడుతుంది. ఈ శతాబ్దారంభంలో ప్రాచీన ధోరణిలోనే పుల్లకవి అనే చాటు కవి చేసిన అధిక్షేపం వినండి.

**"కోణంగి నాట్యములో కోతులాడించగా / ఊరబందులు తలలూపినట్లు**
**గూబకూతలు విని గువ్వలు తలలూచి / పోయి కాకుల వద్ద పొగడినట్లు**
**కాలువదరి నుండి కప్ప లంకించగా / ఎండ్రకాయలు తలెత్తినట్లు**
**ఎనుబోతు బిరుదులు మనుబోతు పొగడంగ**
**మేలు మేలని గొర్రె మెచ్చినట్లు**
**ఓగు ధగిడీలు తమలోన నొకరి నొకరు**
**మెచ్చుకొను చుందురెటు వంటి పిచ్చి**
**తనమో!"**

అని విస్తుపోతాడు. ఈ విధంగా చెట్టుమీదా పిట్టమీదా పెట్టి అధిక్షేపించే సంప్రదాయం ఉండేది. కందుకూరి వీరేశలింగం గారి "తిర్యగ్విద్యున్మహాసభ"లో అడివిలోని పశు పక్షులు మన సమాజంలోని అవకతవకలను ఇలాగే చర్చిస్తాయి. ఈ రకమైన అధిక్షేప కావ్యాలు మనకు చాలా తక్కువ. ఇక ముందు వస్తాయని ఆశిద్దాం.

(**మిసిమి** ఫిబ్రవరి 1990)

సెంప్టెబరు (2004)

"వేయి పూలు వికసించనీ" అన్న లక్ష్యంతో మెదడుకు పదును పెట్టే వ్యాసాలను కొన్ని, సమాచారం అందించేవి కొన్ని ప్రచురిస్తున్నారు. రాగద్వేషాలకు అతీతంగా సత్యాన్వేషణ చేయటం చాల కష్టమైన పనే. తన మాటల వలన చేతల వలన ఇతరులను ప్రభావితం చేసేవాడే మేధావి. అటువంటి రయితలు మనకు లేరనే నేననుకుంటున్నాను. అలాంటివి ఏ దేశంలోనున్నా, భాషలోనున్నా వెతికి ప్రచురిస్తే మంచిదని నా అభిప్రాయం. అది కష్టమైనదని నాకు తెలుసు. వాటితో బాటు, "నన్ను ప్రభావితం చేసిన వ్యక్తి, పుస్తకం" అన్న శీర్షిక కొంతమంది చేత వ్రాయించి ప్రచురిస్తే బాగుటుందేమో ఆలోచించండి. **మిసిమి**లో వ్యాసం గాని, కథ గాని ప్రచురించబడటం ఓ గొప్ప అనే భావం కలిగేలా చేయండి. - **ఎల్.వి.ఎన్. ధన్.**

# పోర్చుగీసు యాత్రికుడు గాస్పర్ కొరీయ

*– దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి*

విజయనగర పాలకుల కాలాన అనేకమంది విదేశీ యాత్రికులు దక్షిణ భారత దేశాన్ని సందర్శించారు. కొందరు తిరుమల, తిరుపతి, చంద్రగిరిలను కూడా సందర్శించారు. అట్టి వారిలో ఒకడు గాస్పర్ కొరీయ (క్రీ.శ. 1492–1567.) ఇతడు పోర్చుగీసు దేశీయుడు. తాను చూసిన అనేక విషయాల్ని ఇతడు గ్రంథస్థం చేశాడు. ఆ గ్రంథం పేరే *లెండాస్ డ ఇండియా (లెజెండ్స్) ఆఫ్ ఇండియా).* ఇది వ్రాతప్రతి రూపంలో క్రీ.శ. 1580ల తొలినాళ్ళలో ఇండియా నుండి పోర్చుగల్‌కు చేరింది. కాని పంతొమ్మిదవ శతాబ్ది రెండవ అర్ధభాగంవరకు ముద్రణకు నోచుకోబడలేదు. ఈ గ్రంథపు నాల్గవ వాల్యూంలో *ఆఫ్ ది రిచ్‌నెస్ ఆఫ్‌ది పగోడా ఆఫ్ ట్రిమెల్లే (తిరుమల), అండ్ ఆఫ్ ది పాంప్ విత్ విచ్ ది కింగ్ ఆఫ్ బిన్నేగ (విజయనగర) విజిట్స్ ఇట్* అనే అధ్యాయంలో పురటాసి బ్రహ్మోత్సవాలకు భక్తులు వచ్చేరీతి, విజయనగర పాలకులు వచ్చేరీతి, తిరుమల ఆలయ ఆదాయాలు వివరించబడి ఉన్నాయి. క్రీ.శ. 1534లో తాను తిరుమలకు వెళ్ళానని, ఆగష్టు నెలలో పూర్ణ చంద్రోత్సవాన్ని చూశానని (కొన్ని సంవత్సరాల్లో అవణి అవట్టం) కూడా తన గ్రంథంలో కొరీయ చెప్పుకొన్నాడు. కాని, అది పొరబాటు. నిజానికి అతను చూసింది క్రీ.శ. 1534లో సెప్టెంబర్ నెలలో జరిగిన పురటాసి బ్రహ్మోత్సవాలని తెలుస్తోంది. బహుశా శాంథోమ్‌లో ఉన్నప్పుడు ఇతడు పురటాసి బ్రహ్మోత్సవాల్ని చూడడానికి వెళ్ళినట్లు తెలుస్తోంది.

కొరీయ ఇంకా ఇలా చెప్పుకొన్నాడు : "నేను ఈ ఉత్సవాల్ని (ఆగష్టు, పూర్ణచంద్రోత్సవం) చూశాను. నాటి సంతను చూశాను. ఈ ఆలయ గృహం ఒక విశాలమైన వంట పోలాల్లో ఉంది. (నాటి తిరుమల, దాతల యాజమాన్యంలో, పోషణతో ఫలపుష్ప తోటలతో నిండి ఉండడాన్ని అతడు పొలాలుగా (ఫీల్డ్స్) గా భావించినట్లు ఉంది). ఈ ఉత్సవానికి పదిహేను రోజులకు మునుపే జనం సరుకుల కట్టలతో అక్కడికి చేరుకొన్నారు. మూడు నాలుగు మిలియన్ల జనం అక్కడికి చేరుకొనేవారు. అందులో మూడు వందలు, నాలుగు వందలు వేలమంది గుర్రాలపై చేరుకొనేవారు. ప్రపంచలోని అన్ని జాతీయ ప్రజల్నీ అక్కడ చూడవచ్చు. జనం నోటితో పలుకగల్గిన పేర్లు ఎన్నిఉన్నాయో అన్ని పేర్ల సరుకులూ ఇక్కడ లభించేవి. అసలు, ప్రపంచంలోనే కాదు, విశ్వంలోని సరుకులన్నీ ఇక్కడ (తిరుమలలో) లభించేవి. అంతేగాదు, ప్రతి సరుకూ ఎంత మోతాదులో కావాలన్నా లభించేది. ఇక్కడొక ముఖ్య విషయం చెప్పదలచాను. అదేమిటంటే, ఈ జనం (భక్తులు) పగోడా వద్ద (తిరుమల ఆలయానికి) తమ భక్తి కనపరచడానికి వెళ్ళేప్పుడు స్నానాలు చేసి, సుగంధం పూసుకొని, మంచి దుస్తుల్ని ధరించి, బంగారు ఆభరణాల్ని ధరించి వెళ్ళేవారు. పురుషులైతే తలనీలాలు తీయించుకొని వెళ్ళేవారు.

ఐతే, తలపై పొడవైన ఒక చిరు సిగను ఉంచుకొనేవారు. ఆ వెంట్రుకల్ని ముడి వేసుకొని (కొప్పు వలె) భగవంతునికి తమ వినమ్రతతో కూడిన భక్తి ప్రపత్తుల్ని తెలుపుకొనేవారు. భక్తులు చాలా మంది ఉండేవారు. కావున తగినంత మంది మంగలి వారు అక్కడక్కడా పెద్దపెద్ద చెట్ల క్రింద విడివిడిగా ఉండేవారు. వీరు, ప్రతి తల గుండు చేయడానికి 'కైక్సా' అనబడిన ఒక రాగి నాణేన్ని తీసుకొనేవారు. వీరికి చెట్ల క్రింది స్థలం, చెట్ల పైన నిండిపోయేంత వెంట్రుకలు లభించేవి. (అంటే, నాడు గుండు చేయగా వచ్చు వెంట్రుకలన్నీ మంగలి వారికే చెందేవి. ఆలయానికి ఎట్టి సంబంధం ఉండేది కాదు. ఇది ఆశ్చర్యకరమైన అంశం! ఈ వెంట్రుకల్ని మంగలి వారి నుండి కొనడానికి ఎవరో ఒకరు కాచుకొని ఉండేవారు. ఒకవైపు మంగలి వారు గుండు చేస్తూ ఉండగానే వీరు కొనుగోళ్ళు ప్రారంభించేవారు. వెయ్యి పర్దావోలు

(పగోడాలు), అంతకన్నా ఎక్కువ ధనాన్ని వీరు చెల్లించేవారు. కొనుగోళ్ళు చేసిన వారు వెంట్రుకల్ని చిక్కుతీసి, కలగలపు సైజులవిగా, మేలైనవిగా, పొడవైన జడలవలె కట్టలు కట్టే వారు. వీటిలో, స్త్రీలకు విగ్గులుగా, సవరాలుగా ఇతరమైనవిగా తయారుచేసి, అక్కడి కక్కడే సంతలోనే అమ్మేసి అత్యధిక లాభాల్ని పొందేవారు. (నాటి భారతదేశం ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా ఉండేది కావున పలు రకాల వ్యాపసాయిక ఉత్పత్తులు, పారిశ్రామిక (కుటీర పరిశ్రమ) ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తులు పుష్కలంగా లభిస్తుండేవి. ఉత్పత్తులు సరిగా లేని యూరోపియన్లు మన దేశానికి వచ్చి తీసుకెళ్ళేవారు. ఆధునిక పారిశ్రామిక విప్లవం యూరప్‌లో వచ్చాకనే పందొమ్మిదవ శతాబ్ది ఆరంభం నుండి మన దేశం వెనుకబడిన దేశంగా మారసాగింది).

ఈ విషయాలు తెలియజేశాక అక్కడి (తిరుమల) బావుల గురించి, చెరువుల గురించి యాత్రికులకు నీళ్ళు అమ్మడం (చలివేంద్రాల) గురించి, భక్తులకు నీటి సరఫరా చేయడం పవిత్రంగా భావించే ధనికులు త్రవ్వించే బావులు, చెరువులు గురించి కొరీయ వివరించాడు. యూరప్‌లో ఎక్కడా చూడనట్టి, ఊహించనట్టి రీతిలో ఎనిమిది క్రోసుల భూభాగం జనంతో నిండిపోయి ఉండడాన్ని చూసిన కొరీయ అది ఒక అద్భుత దృశ్యంగా తలంచాడు. అంతేగాక, అక్కడి సంతలో ఎవరైనా దొంగతనం చేసినట్లయితే విచారణ లేకుండా మరణ శిక్ష విధించబడే పరిస్థితి ఉండేదని తెలిపాడు. ఇక అక్కడి (ఉత్సవ సందర్భంగా) సంతకు సరుకులు తెచ్చేవారిపైగాని, వారి సరుకులపైగాని ఎలాంటి పన్నులు గాని, సుంకాలు గాని, విధింపబడేవి కావు. కావున అట్టి విధానం వారికి ప్రోత్సాహకంగా ఉండేది. అసలు, ఈ సంతల విజయానికి తిరుమల దేవాలయం, అక్కడి మొక్కుబడుల చెల్లింపులకై వచ్చే జనమే ప్రధాన కారణం అని కూడా తెలిపాడు.

కొరీయ ఇంకా ఇలా అన్నాడు : "భక్తులు దైవ దర్శనం చేసుకోవడానికై వచ్చిన రోజున దర్శన సందర్భంలో రాత్రంతా దర్శనంకై నిరీక్షించి చిన్నా పెద్దా తేడా లేకుండా ఎంతో కొంత తమ తమ ఆర్థిక స్థోమతకు తగినట్లు డబ్బు రూపంలో మొక్కుబడి చెల్లించుకొనేవారు. అక్కడకు వచ్చే పెద్ద పెద్ద ప్రభువులైతే పగోడా (తిరుమల ఆలయం) ఎదురుగా బంగారు నాణేల పెద్ద కువ్వ (కుప్ప/రాసి) ఏర్పరచేవారు. ఆ కువ్వ పది గోధుమల కొలమానాలకు (బహుశా కుంచాలకు) సమానంగా ఉండేది. కొందరు భక్తులైతే పగోడా గృహం (ఆలయం) ఎదుట శిరచ్ఛేదం చేసుకొని భక్తిని ప్రకటించుకొనేవారు. ఇక, మేకపోతులు, గొర్రెలు, లేత గొర్రెలు, లేత మేకలు పగోడాకు (ఆలయం/దైవం) బలి ఇవ్వబడేవి. భగవంతునిపై భక్తికి సూచనగా ఇవి ఒక మిలియన్ పైగా బలి ఇవ్వబడేవి. అలా, రక్తం చిందించబడి ఆలయానికి (దైవానికి) బలి రూపంలో మొక్కుబడి తీర్చుకొన్నాక భగవంతునిపై భక్తికి సూచనగా అక్కడి పేదలకు బలి ఇవ్వబడిన జంతువులు దానంగా ఇవ్వబడేవి. పొందిన వాళ్ళు వాటిని కసాయి వారికి అమ్మేవారు. దీనితో, అక్కడి సంతలో అన్ని రకాల మాంసాలూ పుష్కలంగా లభించేవి. ఇక్కడి సంతలో అన్ని ప్రాంతాల కరెన్సీలు చెల్లుబాటు అయ్యేవి."

ఇక తిరుమల ఆలయంతో తన కాలపు విజయనగర పాలకుల సంబంధాలు, తిరుమలకు రావడాలు గురించి వ్రాస్తూ కొరీయ ఇలా అన్నాడు : బిస్నేగ (విజయనగర) రాజు కూడా ఈ ఉత్సవానికి (పురటాసి బ్రహ్మోత్సవం) వచ్చేవాడు. వీలయినంతవరకు ఎలాంటి బాదరబందీ లేకుండా వచ్చేవాడు. అతనితోబాటు పదివేల అశ్వాలు వచ్చేవి. రెండు వందల వేల కాల్బలం వచ్చేది. వంద నుండి రెండు వందల మంది తన కుటుంబ స్త్రీలు వచ్చేవారు. వీరు పల్లకీలలో వచ్చేవారు. వీటిలో కూర్చోవడానికి, నిద్రపోవడానికి వసతి ఉండేది. వీరిని ఇతరులు చూడకుండా ఉండడంకై వీటికి తాళం వేసేవారు. ఐతే, చిన్న వెండి వల ద్వారా వీరు బయటకు చూసే వసతి ఉండేది. కూర్చోవడం, నిద్రపోవడంకై ఏర్పాటు గల పల్లకి బంగారు తాపడం కలిగి ఉండేది. దీనిలోపలి భాగం రిచ్‌గా ఉండేది. అక్కడ వీరికి ఇష్టమైనది చేసుకోవచ్చు, నిద్రపోవచ్చు, కూర్చొని ఉండవచ్చు. రాజు చిన్న చిన్న అంచెలు అంచెలుగా ప్రయాణం సాగించే వాడు. దీని వలన, రాజ స్త్రీలు కూర్చొని, నిద్రించే వాటిని తెరవాల్సిన అవసరం ఉండేది కాదు. ఇక, నేను (కొరీయ) వారి ఆచారాలు, విలువైన నగలు, ఆహారం, విలాసాలు గురించి చెప్పడం ఆరంభిస్తే అది పెద్ద చేంతాడంత లిస్ట్ అవుతుంది. అవి నమ్మశక్యం కానివిగా అనిపిస్తాయి. విజయనగరం నుండి చిన్న చిన్న అంచెలు అంచెలుగా ఈ పగోడాకు (ఆలయానికి) తన రాజ్య భూభాగాల్లో, తన సామంతుల ప్రాంతాల మీదుగా

రాజు ప్రయాణం సాగించేవాడు. తమ ప్రాంతాల మీదుగా రాజు ప్రయాణిస్తాడని, తమ ప్రాంతాల్లో నిద్రిస్తాడని, లేదా, ఒక రోజు విశ్రాంతి తీసుకొంటాడని తెలియగానే ఆయన ఆనందంగా గడపడానికై, ఆయా ప్రాంత సామంతులు అప్పటికప్పుడే నూతన విడిది గృహాన్ని నిర్మించి, అతనికి, అతని కుటింబీకులకు వారి స్థాయికి తగినట్లు, ఆహ్వానం పలికేవారు. ఈ గృహాల గోడలు మట్టి ముద్దలతో నిర్మింపబడి, టైల్స్‌తో కప్పబడి ఉండేవి. ఈ గృహాలు అత్యంత చక్కగా నిర్మింపబడి ఉండేవి. వాటిలో అద్భుత చిత్రలేఖనాలు, శిల్పాలు, చెక్కడాలు ఉంచబడేవి. అవి చెరువుల్ని, సుగంధ వృక్షాలుగల తోటలు మొదలైన ఆహ్లాదం కల్గించేవాటిని కలిగి ఉండేవి. గొప్ప గొప్ప స్పెయిన్ రాజులు కూడా వాటిలో కొంతకాలం విశ్రాంతి పొందాలని భావించే రీతిలో ఆ గృహాలు ఉండేవి. రాజు, ఆతనితో వచ్చిన కుటుంబీకులు, ప్రభువులు, ఇతరులు తృప్తిగా తినడానికి కావల్సినంత ఆహారం సిద్ధంగా ఉంచబడేది. ఇదంతా ఏర్పాటుచేసే సామంత ప్రభువుల్లో కొందరైతే ఒక్క రాత్రి విడిదికే కేవలం రాజుకే యాభైవేల బంగారు పర్దావోలు (పగోడాల డబ్బు) ఖర్చుచేసేవారు. రాజు విడిది చేసే రోజు కోసం వీరు (సామంత ప్రభువులు) ఈ గృహాల్ని నిదానంగా, పర్ఫెక్ట్‌గా నిర్మింపజేసేవారు.

రాజు విడిది పూర్తయ్యాక రాజు తన ప్రయాణాన్ని కొనసాగించడం ఆరంభించగానే ఆ విడిది ఏర్పాటు చేసిన ప్రభువు కూడా రాజు వెంబడి వెళ్లేవాడు. వెనువెంటనే రాజు వాడిన విడిది గృహాన్ని ధ్వంసం చేసేవారు. ఇందుకు కారణం రాజు విడిది చేసిన చోటున మరెవ్వరూ విడిది చేయకూడదు. (రాజు దైవాంశ సంభూతుడు అనే భావన కొరియ కాలానికి కూడా జనంలో మిగిలి ఉందని దీనిని బట్టి తెలుస్తోంది). మరుసటి ఏడాది కూడా అక్కడే విడిది చేయాలని రాజు నిర్ణయించుకొంటే ప్రభువులు మరలా కొత్త గృహాన్ని నిర్మించేవారు. ఆ తరువాత సంవత్సరాల్లో కూడా అలాగే కొత్త గృహాన్ని నిర్మించేవారు. రాజు ప్రయాణించే ప్రాంతాల్లోని ప్రభువులందరూ ప్రతి ఏడాదీ ఇదే రీతిగా చేసేవారు. ఇలా, విడిది ఆహార ఏర్పాట్లు చేయడంకై ఒక ప్రభువు మరొక సామంత ప్రభువుతో పోటీ పడేవారు. ఒకరికి మించి మరొకరు మేలైన రీతుల్లో వీటిని కల్పించడంకై ప్రయత్నించేవారు. ఇందులో ఎవరైతే బాగా చేస్తారో వారిని రాజు మెచ్చుకొనేవాడు. అలా మెచ్చుకోబడిన వాని గౌరవం అందరిలో పెరిగేది. ప్రతి ఏడాదీ క్రిందటి ఏడాది కన్నా మెరుగైన రీతిలో వీటిని కల్పించడంకై ప్రయత్నం జరిగేది. ఐతే, తన విడిది ఏర్పాట్లు తన రాజ్యాధిపతి స్థాయికి తగిన రీతిలో చేయనట్లయితే, ఆ ప్రాంత ప్రభువును బోర్లా పడుకోమని, రెండు వేల కొరడా దెబ్బల శిక్ష విధించబడేది. ఆ తరువాత ఏమీ జరుగనట్లు అతని సామంత రాజ్యానికి పంపబడేవాడు. ఇలా, విజయనగర రాజులు తిరుమల పురటాసి బ్రహ్మోత్సవాల్ని సందర్శించేవారు. (క్రీశ. 1476 నాటికి పురటాసి (సెప్టెంబరు) పంగుని (మార్చి) అను రెండు మాసాల్లో క్రీ.శ. 1638 నాటికి పురటాసి పంగుని, కార్తీక (నవంబరు) తై (జనవరి) ఆడి (ఆగష్టు) వంటి నెలల్లో పదకొండు బ్రహ్మోత్సవాలు జరిగేవి.

**డాక్టర్ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి**
రిటైర్డ్ ప్రొఫెసర్, తిరుపతి.
ఫోన్ : 9849584324

ఏప్రిల్ (1994)

హుస్సేన్ సాగరులో ఒక కలువ పువ్వు కనిపిస్తే ఎలా వుంటుంది? గంజాయి వనంలో ఒక తులసి మొక్క కనిపిస్తే అప్పుడు ఎలావుంటుంది? కాకుల గోల మధ్య ఒక కోయిల పాట వినిపించితే ఎలా వుంటుంది? తెలుగు వ్యాపార, వ్యవహార పత్రికల మధ్య **మిసిమి** అనే బంగారు పత్రికను చూచినప్పుడు ఖచ్చితంగా అలాగే వుంటుంది. పాఠకులు కొని చదువుకునే పత్రికలకూ చదువుకున్న వారు చదువుకునే పత్రికకూ వున్న తేడా తెలిస్తే, **మిసిమి** విశిష్టత అర్థం అవుతుంది.

- మహానగర్ దినపత్రిక 22-07-1995 సంపాదకీయం

# ప్లాస్టిక్ పూలు

– అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారు ఆలపాటి రవీంద్రనాథ్‌చౌదరి జీవన నిర్మ్రమణ అనంతరం మిసిమి పత్రిక సంపాదకత్వ బాధ్యతలు దశాబ్దన్నరకాలం వహించారు. బుద్ధఘోషుడు అనే పేరుతో బౌద్ధధర్మానికి సంబంధించి అనేక గ్రంథాలు రచించి బౌద్ధ పునురుద్ధరణ కార్యక్రమంలో తనవంతు పాత్రని నిర్వహిస్తున్నారు. రవీంద్రనాథ్ నా ఆల్టర్ ఇగో అని చెప్పకొన్న వెంకటేశ్వరరెడ్డిగారికి రవీంద్రనాథ్‌గారితో వ్యక్తిగత సాన్నిహిత్య సంబంధాలున్నాయి.

**ప్రేమ:** ప్రేమను నిర్వచించడం చాల కష్టం. అసలు నిర్వచనానికి అందనిది. చాలమంది ప్రేమలో పడతారు. They fall in love కాని అలా ప్రేమలో పడినవారు అందులో నిలబడరు. కావలసింది ప్రేమలో నిలబడడం. (Stand in love) ప్రేమను ఒక బలమైన వాత్సల్య సంవేదన అని చెప్పవచ్చు. అవతలి వారివైపుకు వాలి ఉండుట, లొంగి ఉండుట, ఒంగి ఉండుట అని కూడ చెప్పవచ్చు. అలాగని దీనిని 'బానిసతనం' (Slavery) గా భావించరాదు. బానిసతనంలో అవతలి వారికి లొంగి ఉండడం ఇష్టంతో కాదు, కాని ప్రేమలో అవతలి వారికి ఒంగి ఉండడం ఇష్టంతో జరుగుతుంది. ఆకాంక్షతో జరుగుతుంది. పట్టించుకోవడం ఉంటుంది. జాగరూకత ఉంటుంది. వారి అభివృద్ధి వికాసాలపై శ్రద్ధ ఉంటుంది. అలా వారు వికసించడంలో ప్రేమించే వారికి ఆనందం కలుగుతుంది.

మరి ప్రేమలో అనేక రకాలుంటాయి. సార్వత్రిక ప్రేమ (Universal Love) అందరినీ, అన్నింటిని ప్రేమించడం. ఇది బుద్ధుడు చెప్పిన ప్రేమ. "బహుజన హితాయ, బహుజన సుఖాయ, లోకానుకంపాయ, కదలండి భిక్షువులారా," అని బుద్ధుడు ఆదేశించాడు.

మరోరకం ప్రేమ తల్లీ-బిడ్డ ప్రేమ. ఈ ప్రేమ, పై సార్వత్రిక ప్రేమలాగే, షరతులు లేనిది. తల్లి తన బిడ్డను కేవలం ఆ బిడ్డ కోసమే ప్రేమిస్తుంది తప్ప, మరే కారణం ఉండదు. ఒకసారి ఒక పదేళ్ళ బాలుడు ఒక చీటి రాసి బల్ల మీద పెట్టాడు. ఆ చీటిలో ఇలా ఉంది: "అమ్మకు మంచినీళ్ళు తెచ్చి ఇచ్చినందుకు చార్జీ 1.00. దువ్వెన తెచ్చి ఇమ్మంది, అది తెచ్చి ఇచ్చినందుకు చార్జీ రు. 1.00. ఎదురు కొట్టుకు వెళ్ళి పంచదార తెమ్మంది, దానికి చార్జీ రు. 1.00. మొత్తం నాకు అమ్మ బాకీ రు.3.00". తరువాత అతడి తల్లి ఆ చీటి చూడడం జరిగింది. దానికి ప్రతిగా ఆమె మరొక చీటి రాసి అదే స్థలంలో ఉంచింది. "అతడికి స్నానం చేయించాను, చార్జి రు.0.00. బట్టలు తొడిగాను, దానికి చార్జి రు.0.00., తల దువ్వాను, దానికి చార్జి రు.0.00. మొత్తం వాడు నాకు బాకి రు.0.00". తల్లి రాసిన చీటి బిడ్డ చదివి సిగ్గుపడ్డాడు. తల్లిప్రేమను డబ్బుతో కొలవడం జరగదు. మరిదేనితోను కొలవలేము. అది షరతులు, హద్దులు, నిర్వచనాలు సూత్రాలు ఎరగని ప్రేమ.

అలాగే సోదరప్రేమ, దేవుని ప్రేమలుంటాయి. కాని ఇవి మాతృప్రేమలా షరతులు లేనివి కావు. నీవు మంచి వాడివి అయితేనే దేవుడు నిన్ను ప్రేమిస్తాడు. ఇది షరతుల ప్రేమ.

ఇహపోతే అబ్బాయి-అమ్మాయిల ప్రేమలుంటాయి. ఈ ప్రేమనే జనసామాన్యం ప్రేమగా భావిస్తుంది. సమాజంలో మిగతా ప్రేమలకంటే ఈ ప్రేమకే ప్రాచుర్యం హెచ్చుగా ఉంది. ఈ ప్రేమల గురించే మహాకవులు కాళిదాసు నుంచి షేక్స్పియర్, శరత్ దాకా గానం చేశారు. లైలా-మజ్నులు, రోమియో-జూలియట్‌లు, దేవదాసు-పార్వతులు, అనార్కలి-సలీముల ప్రేమ అజరామరమై తరతరాలుగ ప్రతివారి పెదవులపై నాట్యం చేస్తున్నది. కాని నిజంగా ఈ ప్రేమలో పెద్ద ఆదర్శం ఏమీలేదు. ప్రేమకోసం అంగలార్చే, ఆవురావురుమనే మానవాళి తన అంతర్గత

దాహాన్ని ఆ ప్రేమ కథలద్వారా తీర్చుకొంటున్నది, నాయికా నాయకులతో తాదాత్మ్యం చెందుతుంది. నిజంగా ఆ ప్రేమలో ఏముంది? ఒకరికోసం ఒకరి ఆరాటం తప్ప. తన ఆత్మ తృప్తికోసం సాగించే స్వార్థమే ప్రేమ తప్ప. వారి ఆత్మలు వైయక్తికాలు. స్వార్థకేంద్రాలు. అవి విస్తృతమై సార్వత్రికాలై, మానవాళిని మానవాళి కోసం ఎదిగే దశకు, ఎదగనివి. కాకపోతే ఆ కథలు విషాదాంతాలు కావడంతో తనలోని పరుడు (other) మేల్కొని ఒక కన్నీటి చుక్క విడుస్తాడు.

ఇటువంటి అబ్బాయి-అమ్మాయి ప్రేమ పూర్తిగా అమలినంగా ఉండదు. పైకి ఎటువంటి భాషలో ఆ ప్రేమను పొదిగినా, అట్టడుగున అంతరాంతరాళాలలో కొంచెం అయినా "కామవాసన" ఉండకపోదు. అసలు "చాలకశక్తి", "ప్రేరకశక్తి" అదే. పైకి అమాయకంగా కనిపించవచ్చు కాక. బుద్ధనిలాంటి ఋషులకు, అంతశ్చేతనలోని ప్రవృత్తులను, ఆసవాలను, అనుసయాలను, కాలుష్యాలను తుడిచివేసిన వారికే 'అమలినప్రేమ' సాధ్యం అవుతుంది.

**స్నేహం :** ఇహ స్నేహం విషయానికి వస్తే ఇదీ నిర్వచనానికి అందేదికాదు. కొన్నిసార్లు స్నేహానికి ప్రేమకు తేడా చెప్పడం కష్టమే అవుతుంది. ప్రేమలాగే స్నేహం ఇద్దరి మధ్య పరస్పర వాత్సల్యబంధం. ఈ పరస్పర బంధంలో లైంగిక, కౌటుంబిక సంబంధాలుండవు. స్నేహంలో పరస్పరత ఉంటుంది. ప్రేమలో పరస్పరత ఉండాల్సిన పనిలేదు. ఏకపక్ష ప్రేమలుంటాయి. తల్లి షరతులు లేకుండ ప్రేమిస్తే, బిడ్డ ప్రేమకు షరతులు విధిస్తాడు. స్నేహంలోనూ షరతులుండవు. కాకపోతే ఒకే ఒక షరతు ఉంది. స్నేహాన్ని ఇద్దరూ కోరుకోవాలి, ఏ ఒక్కరు కాదన్నా స్నేహం విరిగిపోతుంది. నిజమైన స్నేహంలో ఒకడు రెండోవాని నుంచి ఏమీ ఆశించడు. అది నిష్కామ స్నేహం. ఒకరు "ఉండడమే" రెండోవారికి ఆనందం.

స్నేహాన్ని పాళీలో 'మెత్త' అంటారు. మెత్త సంస్కృతంలో మైత్రి అయింది. ఈ పదానికి స్నేహం కంటే విస్తృతార్థం ఉంది. దీనిని "ప్రేమైక కరుణ" (loving kindness) అంటారు. అందుకని స్నేహితుల మధ్య ఉండేది ఆప్యాయత, మమకారం, కరుణ, సానుకూల ప్రతిస్పందనలు ఈ మైత్రీ బంధంలో ఉంటాయి.

స్త్రీ పురుషుల మధ్య స్నేహం ఉండడానికి వీలుందా అంటే చెప్పడం కష్టమే. ఇద్దరు స్త్రీల మధ్య స్నేహం లేదా ఇద్దరు పురుషుల మధ్య స్నేహం ఉండడానికి వీలుంది. కాని అదే అబ్బాయి-అమ్మాయిల మధ్య స్నేహం అంటే చెప్పడం కష్టం. ఎందుకంటే అబ్బాయి-అమ్మాయిల మధ్య 'లైంగిక-ఆకర్షణ' అనే ఒక అదనపు కారకం ప్రవేశిస్తుంది. అందుకని పైకి స్నేహమని చెప్పినా అందులో అంతో ఇంతో 'కామవాసన' ఉంటుంది.

ఇంతవరకు ప్రేమ-స్నేహాలను గురించి ఒక అవగాహనకు వచ్చాము. నిజంగా ప్రేమ-స్నేహాలకు సమాజంలో ఉన్న స్థానాన్ని గురించి ఎవరికి ఎటువంటి అనుమానాలు లేవు. నిజంగా సమాజం దృఢంగా మనగలగాలంటే వీటితో సామాజిక సంబంధాలు ప్లావితం కావాలి. మనిషిని మనిషిని కలిపి, అతడి 'ఏకాకితనాన్ని' పారదోలేవి ఇవే. ఇవి ప్రాచీనకాలం నుంచి సమాజం, కుటుంబం విచ్ఛిత్తి చెందకుండా కాపాడాయి. కాని నేటి ఆధునిక సమాజాన్ని చూస్తుంటే వీటి పాత్ర కుంటుపడిందా అనిపిస్తోంది. సమాజ సంబంధాలు పెళుసువారాయి. సంబంధాలు పొడిపొడిగా, ఎండువారిన కట్టెలుగా తయారయ్యాయి. దానితో సమాజం, కుటుంబం బీటలు వారిపోయాయి. ఒకరికి మరొకరి విషయం పట్టడంలేదు. ఎవరి దారి వారిదే అవుతున్నది. ఇలా ఎందుకు జరుగుతున్నదని విజ్ఞులైనవారు ప్రశ్నించుకోవాలి. దీనికి కారణాలు అనేకం.

దీనికి ముఖ్యకారణాన్ని ఆధునిక నాగరకతలోనే వెదకాలి.

1. ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం జీవితాన్ని

మే (2005)

'భారతి' నిలిచి పోయిన తరువాత తెలుగులో అలాంటి ఉన్నత స్థాయి పత్రికలు రాలేదు. ఆ లోటును రవీంద్రనాథ్ కలలు గన్న *మిసిమి* పూరించ సాగింది. అది (మిసిమి) అంతర్జాతీయంగా మేధావులు చర్చించే సమస్యలు సారస్వతంలో, కళలో గాని, సిద్ధాంతాలలో గాని, భౌతిక, మానసిక శాస్త్రాలలో గాని – అన్నింటికీ కేంద్రీకృతం.

**- ఆచార్య శేషాద్రి.**

భౌతికంగా సుకరం చేసింది. అడిగిందే తడవుగ. ఒక బటన్ నొక్కితే చాలు, అన్ని అందుబాటులోకి వస్తున్నాయి. ఆధునిక మానవుడు స్తనం మీది శిశువులా ఏ మాత్రం జాప్యాన్ని సహించలేకపోతున్నాడు. శిశువు ఆకలైతే పాలకోసం ఏడుస్తాడు. వెంటనే పాలివ్వాలి, లేకపోతే ఇంటి కప్పు లేచిపోతుంది. ఆ విధంగా తయారయ్యాడు ఆధునిక మానవుడు. తన అవసరాలు, సహజాతాలు అవ్యవహితంగా తృప్తిచెందాలి? ఏమాత్రం వాయిదా వేయలేడు. అంటే "ఆగలేని తనాని"కి అలవాటుపడ్డాడు. ఈ పరుగులో అతనికి తను తప్ప అన్యుడు కనిపించడం లేదు. తను, తన తృప్తి అంతా తానే అయిన ఈ స్వీయతృప్తి పరుగులో ఉచ్ఛనీచాలు మరిచి, స్నేహితుడు, ప్రేయసి, ప్రియుడు, తల్లి, తండ్రి, బంధువులు, ఇతరులను మరిచి, "ప్రేమైక కరుణ" అంటే మైత్రి లేని యాంత్రిక సంబంధాలతో మనుగడ సాగించి జీవితార్థాన్ని, జీవితంలోని రసాన్ని, వెన్నెలను విస్మరిస్తున్నాడు. అందుకే ఆధునిక జీవితంలో "పెళుసు ప్రేమ''లు ఎక్కువయ్యాయి. తుమ్మితే ఊడిపోయే ముక్కులయ్యాయి.

2. ఆధునిక సాంకేతిక జ్ఞానం తెచ్చిపెట్టిన మరో అనర్థం ఉంది. కమ్యూనికేషన్స్ ద్వారా, ప్రయాణ సౌకర్యాల ద్వారా ఈ సాంకేతిక జ్ఞానం దూరాన్ని చంపి వేసింది. దూరాన్ని చంపింది గాని మనిషి మనిషికి మధ్య దూరాన్ని పెంచింది. అసలు మానవ సంబంధాలు చిక్కగా, నిండుగా రసవత్తరంగా ఉండాలంటే మనిషి మనిషి రక్తమాంసాలతో, ఉద్వేగ నిరుద్వేగాలతో ఎదురెదురుగా ఉండాలి. కాని ఇది నేడు సాధ్యమవుతుందా? పూర్వమైతే ప్రయాణ సౌకర్యాలు మృగ్యంగా ఉన్న రోజులలో ఒక కుటుంబసభ్యులు అదే కుటుంబంతోనో, అదే ఊరులోనే ఉండేవారు. అలా ఒకరికొకరి రక్తమాంసాలతో దగ్గర దగ్గరగా ఉండేవారు. మరి నేడో ఉద్యోగాల పేరిటో, వలస పేరిటో, వ్యాపార ధనార్జన పేరిటో, మనుషులు ఈ భూమి మీద ఎక్కడెక్కడికో విసరి వేయబడుతున్నారు. పని ఒత్తిడి ఎక్కువైంది. దానితో ఒకరికొకరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకోవడవో, చూసుకోవడవో తప్ప, ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకొనే అవకాశాలు లేకుండా పోయాయి. ఎదురెదురుగా రక్తమాంసాల మనుషులు కూర్చొని మాట్లాడుకోవడం వేరు, ఏ సెల్‌ఫోన్ ద్వారానో ఒక బొమ్మ మరో బొమ్మతో మాట్లాడుకోవడం వేరు. ఈ తేడాను ప్రతి ఒక్కరు గుర్తించగలరు. ఈ పరిస్థితిని చూసి సిగ్మండ్ ఫ్రాయిడ్ తన "నాగరకత అపశృతులు" (Discontents of civilization) లో వాపోతాడు. ''ఈ విమానాన్ని ఎవరు కనిపెట్టమన్నారు? నా కొడుకు అంతదూరం ఉద్యోగం కోసం ఎందుకు పోవాలి? ఆ విమానమే లేకపోతే నా కొడుకు నా దగ్గరే ఉండేవాడు గదా.'' దీనివల్ల మనకు అవగతమయ్యేదేమంటే, సాంకేతికజ్ఞానం భూమిమీద దూరాన్ని తగ్గించినా, మనిషి మనిషికి మధ్య దూరాన్ని పెంచింది. ఫోన్ మనుషులను ఎంతగా కలుపుతుందో అంతగా విడదీస్తుంది. కాల, దేశాలలో సామీప్యత (Contiguity) లోపించినందువల్ల మనుషుల మధ్య సంబంధాలు ఎండిపోయాయి.

3. ఆధునిక జీవితం ఫలితంగా మానవజీవితం 'పరాయితనాన్ని' సంతరించుకొంది. అంటే మనిషి తనకు తాను, సమాజానికి, ప్రకృతికి దూరమయ్యాడు. బాహిరకుడయ్యాడు. తనే తనకు కొత్తవాడయ్యాడు. తన "ఇప్పుడు-ఇక్కడ" (now-here) ఉండడం మానివేశాడు. తను చేసే పనిలో దృష్టి నిలపక, తరువాత చేయబోయే పనిని గురించి ఆలోచిస్తాడు. ఆ తరువాత చేసే పనిలో గూడ దాని తరువాత చేయబోయే పనిని గురించి ఆలోచిస్తాడు. ఇలా ఎప్పుడూ గూడ తను చేసే 'పనిలో' "నివసించక" పరాయి ఇంటిలో నివసిస్తాడు. అలాంటివానికి స్నేహ, ప్రేమ మాధుర్యాలు ఏమి తెలుస్తాయి?

4. అంతేకాదు ఆధునిక నాగరకత, పారిశ్రామికీకరణల ప్రాభవంతో కొత్త మానవుడు ఆవిర్భవించాడు. అతడు "రాశి" (mass) మానవుడు. అంటే, "నలుగురిలో ఒకడు", "నలుగురితో పాటు నారాయణ", అతడు తన అనన్యతను, ప్రత్యేకతలను కోల్పోయినవాడు. పదిమందిలో ఉన్న పరాయివాడు. తనను తాను ఎవరికి సంబంధింప జేసుకోలేని శక్తిహీనుడు. ఈ శక్తిహీనుడు ప్రేమ, స్నేహాలను ఎలా నెరపగలడు?

5. మనిషి పరాయివాడు కావడంతో అతడు ఇతరుల చేతులలో "పనిముట్టు" (Instrument) అయ్యాడు. అతడు పరికరమే కాని రక్తమాంసాలున్న సజీవ మానవుడు కాడు. అందుకే అతనికి పరికరానికిచ్చే గౌరవమే దక్కుతుంది, కాని రక్తమాంసాలున్న మనిషికిచ్చే గౌరవం ఉండదు.

భర్తకు భార్య ఇంటిలో వంటచేసే పరికరంగా కనిపిస్తుంది. వంటగదిలోని ఒక స్టౌగా, కత్తిపీటగా, ఒక గరిటెగా కనిపిస్తుంది. పక్కలో సుఖాన్నిచ్చే దిండుగా కనిపిస్తుంది. భార్యకు భర్త అంతే, సంపాదించే రోబోట్‌గా, ప్రక్కలో సుఖాన్నిచ్చే లైంగికయంత్రం (Sex machine) గా కనిపిస్తాడు. అంతకంటే వారిద్దరు ఒకరి కొకరు ఏమీకారు. ఈ రెండు వస్తువులకు-భార్యాపిల్లలకు-వారు వద్దనుకొన్నా కద్దనుకొన్నా, పిల్లలు పుడతారు. ఈ పిల్లలడుగుతారు: "మీరు మమ్మల్ని మా కోసం కన్నారా? మీ లైంగిక సంతృప్తికి మేము పార్శ్వ ఉత్పత్తులము కామా?" అప్పుడు తలిదండ్రులు గుడ్లు మిటకరిస్తారు: "అబ్బాయిలూ మాకు తెలియకనే మిమ్మల్ని కన్నాం.'' ఇటువంటి భార్యాభర్తల మధ్య ప్రేమ-స్నేహాలేమిటి? అటువంటి పిల్లలకు తలిదండ్రుల మధ్య సంబంధాలు తీరుతెన్నులేమిటి?

6. మరోవిషయం: మనిషి ఆధునిక జీవితంలో వినిమయదారుడయ్యాడు. మార్కెట్టు, 'మనిషిని' 'వినిమయ మనిషి'గా మార్చింది. దైనందిన అవసరాల వరకు వినిమయం మంచిదే. నిజంగా ఈనాడు గ్లోబలీకరణంతో వస్తూత్పత్తి ఇంతింతై వటుడింతైనట్లు మార్కెట్లను ముంచెత్తడంతో వినిమయదారుడు ఉక్కిరి బిక్కిరై అవసరం లేకపోయినా వస్తువులను కొంటున్నాడు. For the love of shopping మనిషి మార్కెట్టు బానిస అయ్యాడు. నిజంగా ఈనాడు సెల్‌ఫోన్లే ఉపయోగించే వారిలో 95%మంది వాటి అవసరమే లేదు. గమ్మత్తు ఏమిటంటే మార్కెట్టు, మనిషిని 'మార్కెట్టు మనిషి'గా పరివర్తితం చేసింది, దాని అడ్వర్టైజ్‌మెంట్ల ఊదరతో. ఈ ఊదర వినిమయదారుల మనస్తత్వాలను విశ్లేషించి, వారిని ఆ వస్తువుకు బానిస అయ్యేట్టుగా చేస్తుంది. అలా మనిషి వినిమయుడై, ప్రేమ, రాగ స్నేహాలను మరిచాడు. వాటిని కూడ వినిమయ వస్తువులుగా పరిగణించసాగాడు. వినిమయదారుడుకాస్తా వినిమయ వస్తువుగా మారాడు.

7. ఆధునిక మానవుడు ఏకకాలమందే తన దృష్టిని, శ్రద్ధను, అనేక విషయాల మీద సారించవలసిన దుస్థితి వచ్చింది. ఒక ప్రక్క కాఫీ తాగుతూ, వార్తాపత్రిక చదువుతూ, సిగరెట్టు కాలుస్తూ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, వీలైతే టి.వి.చూస్తూ ఉంటాడు. ఈ అష్టావధానంలోలాగ దేనికీ న్యాయం చేయలేడు. అంటే అనేక విషయాలు ఒకేమాటు అతని దృష్టిలో పడడానికి పోటీ పడతాయి. మరి ఈ పోటీలో ప్రేమ-స్నేహాలకు వ్యవధి ఎక్కడ?

8. ఆధునిక జీవితంలో, ఇడియట్ బాక్స్ అయిన టి.వి.పాత్రను తక్కువగా అంచనా వేయడానికిలేదు. మనిషికి ఇంద్రియ తృప్తిని మరొక మనిషి మాత్రమే ఇవ్వగలడు. కాని టి.వి. Vicarious pleasure అంటే ప్రాతినిధ్య తృప్తిని అందిస్తోంది. కళ్ళను రంగులతో ముంచెత్తుతోంది. తల తిప్పనీయకుండ నాయికలు వాంప్‌లై, జబ్బలు, తొడలు దర్శింపజేస్తూ 'దర్శలాలస'ను సంతృప్తం చేస్తున్నారు. చూసేవాళ్ళు నాయికా నాయకులతో మమేకమై ప్రాతినిధ్య తృప్తిపొందుతున్నారు. ఇలా తృప్తి లభిస్తుంటే, ప్రేమ-స్నేహాల తృప్తికోసం కష్టపడడం ఎందుకు?

ఈ విధంగా రక్తమాంసాల మనిషిని, ఒక పనిముట్టుగా, పరాయివానిగా, వినిమయ వస్తువుగా, రాశి మానవునిగా, తనను తాను పోగొట్టుకొన్నాడు. అంటే తనను నిర్వచించే నిజమైన ప్రేమ, స్నేహాలను పోగొట్టుకొన్నాడు. ఏదో పరమార్థాన్ని మనసులోపల పెట్టుకొని చేసే మిథ్యాస్నేహాల, ప్రేమల వెంట, ఎండమావుల వెంట పరుగులు తీస్తున్నాడు. ఈ పరుగులతని దాహార్తిని తీర్చలేవు.

*(మిసిమి, జూన్ 2007)*



మే (2013)

*సిద్ధార్థ గౌతముని జీవనగాథ* ఎంతో సంయమనంతో రాసిన వ్యాసం. కట్టుకథలకు, మాయ మంత్రాలకు తావు లేకుండా గౌతముని జీవనయానాన్ని నిర్దిష్టంగా వివరించిన రచయితకు ధన్యవాదాలు... ఎంతో ప్రణాళిక, మానసిక పరిపక్వతగలవారే ఇంత వివరంగా చెప్పగలరు... *అగాధం* చక్కని సందర్భోచితమైన పదాలతో ఎంతో బాగుంది... ఫజులుల్లాఖాన్ రచనలో ఎన్నో లోపాలున్నాయి. చారిత్రక అసత్యాలున్నాయి. ఇలాంటి రచన ***మిసిమి***లో చోటు చేసుకోవడం విచారించాలి..."

**- అరుణ, జనగాం.**

# మనిషి ఎందుకు జీవిస్తున్నాడు?

– సూర్యదేవర సంజీవదేవ్

రసజీవి సంజీవదేవ్ 20వ శతాబ్దపు తెలుగు రచయితలలో ప్రముఖులు. లలితకళలు, తాత్త్వికత ఆధారంగా వ్రాసిన వ్యాసాలు ఎందరికో పాఠ్యాంశాలు. ఆయనది లలిత కోమలమైన ఒక ప్రత్యేకశైలి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన ఎందరికో స్ఫూర్తిప్రదాత.

మనిషి ఎందుకు జీవిస్తాడు? మరణించటం చేతకాక జీవిస్తాడా? ఎందుకు మరణిస్తాడు మనిషి? జీవించడం చేతకాక మరణిస్తాడా? మరణించటం చేతకాని వ్యక్తికి జీవించటం మాత్రం ఏవిధంగా చేతవుతుంది? నిజానికి, మరణించటం కంటే జీవించటం కష్టమైన పని. అంటే జీవించటం కంటే మరణించటం సులభమైనపని. సులభమైన పనిని చేయలేని వ్యక్తి కష్టమైన పనిని చేయగలడా? కనుక జీవించటం అనేది మరణించటం చేతకాక కాదు; కాని మరణించటం మాత్రం జీవించటం చేతకాక మాత్రమే. మరణం అనేది జీవితంలోని ఒక భాగం, జీవితం అనేది మరణంలోని భాగం కాదు.

మనిషి ఎందుకు జీవిస్తాడు? మనిషికూడ ఒక జీవి. జీవి ధర్మం జీవించటం కనుక జీవి అయిన మనిషి జీవించక ఏమి చేస్తాడు? అటువంటప్పుడు, మిగతా మనిషికాని జీవులంతా ఎందుకు జీవిస్తున్నాయో మనిషి అయిన జీవి కూడ అందుకే జీవిస్తున్నట్లా? కాదు.

మనిషికంటే భిన్నమైన జీవులన్నీ కేవలం జీవించే నిమిత్తమే జీవిస్తుంటాయి. అంటే, ఆకలిని తీర్చుకోవటం, సంతానాన్ని కనటం వాటిపని. మనిషి కూడా వాటివలెనే ఆకలిని తీర్చుకొంటాడు, సంతానాన్ని కంటాడు. కాని అంతటితోనే ఆగడు, ఇంకా ఎన్నో చేస్తాడు. అసలు ఆకలిని తీర్చుకొనే విధానంలో, సంతానాన్ని కనే విధానంలో కూడ మిగతా జీవులకూ మనిషికీ తేడా ఉంది. మిగతా జీవులకు ఆకలి తీరటం ప్రధానం, మనిషికి ఆకలి తీరటం కంటే కూడ నోటిరుచి ప్రధానం. సంతానం కనటానికంటే కూడ కామతృప్తి ప్రధానం. జంతుజాలానికి సంవత్సరం పొడవునా కామవాంఛ ఉండదు. కొన్ని తరుణాల్లో మాత్రమే వాటికి కామవాంఛ జనిస్తుంది. వాటి కామవాంఛ తీరటం అంటే వాటికి గర్భోత్పత్తి కూడ జరగటం అవుతుంది. కనుక వాటికి గర్భోత్పత్తి నిమిత్తమే కామవాంఛ కలుగుతుంది.

మనిషికి నిరంతరం కామవాంఛ కలుగుతుంది. కామతృప్తి జరిగినప్పుడల్లా గర్భోత్పత్తి జరగదు. వీటన్నిటినీ పరిశీలించి చూస్తే మనిషి కేవలం ఆకలి తీరటానికి మాత్రమే ఆహారం తినడు, కేవలం సంతానోత్పత్తి కోసమే కామవాంఛను తీర్చుకోడు; రుచి నిమిత్తం కూడ ఆహారం తింటాడు, సుఖానుభూతి నిమిత్తం కూడ కామవాంఛను తీర్చుకొంటాడు. దీని అర్థం మనిషి కేవలం ఏదో ప్రయోజనం నిమిత్తం కాక ఆనందం నిమిత్తం తన జీవితాన్ని సాగిస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి ఎందుకు జీవిస్తాడంటే ఆనందం నిమిత్తం జీవిస్తాడు. ఆనందం లభించక బాధలు లభించినపుడు మరణిస్తాడు. జగత్తులో జరుగుతున్న ప్రతి ఆత్మహత్యకూ కారణం ఆనందానికి బదులు బాధలు లభించటమే.

కనుక మనిషి మిగతా జీవులవలె జీవించే నిమిత్తం మాత్రమే జీవించడు. ఆనందం నిమిత్తం జీవిస్తాడు. ఆనందం కూడ అందరు మనుషులకూ ఒకటిగా వుండదనేది అందరెరిగిన బహిరంగ సత్యం. ఒకరి ఆనందం ఇంకొకరికి నిరానందం కావచ్చు. బాధలేకుండా ఉండటం మాత్రమే ఆనందం కాదు. అందుకని బాధవుండటం ఆనందం అనికాదు. బాధలేకుండా వుంటూ ఒక సుఖానుభూతి మానసంలో సజీవమై ఉండటం ఆనందం. బాధను తీసేసుకోటం, ఆనందాన్ని తీసుకోటం. అయితే, బాధను దేనితో తీసేయాలి? దానంత అది తొలగుతుందా? బాధ తొలగినందువల్ల ఆనందం వస్తుందా, లేక ఆనందం వచ్చినందున బాధ తొలగుతుందా? చీకటి వెలుగూ ఒకే చోట సహజీవనం చేయజాలనట్లే బాధా ఆనందం కూడ ఒకే తావున ఒకే సమయంలో కలిసి ఉండలేవు. చీకటి పోయినందువల్ల వెలుగు వస్తుందా, లేక వెలుగు వచ్చినందువల్ల చీకటి పోతుందా? సందేహం లేదు, వెలుగు వచ్చినందువల్లనే చీకటి పోతుంది. అదేవిధంగా ఆనందం ప్రవేశిస్తేనే కాని బాధతొలగదు.

ఎందుకు జీవిస్తాడు మనిషి? జీవితంలో ఆనందం అనేది

ప్రధానమైనా కూడ ఆనందం నిమిత్తమే జీవిస్తున్నాననే స్పృహ మనిషిలో నిరంతరం మేల్కొని ఉండదు. ఆనందమే తన ధ్యేయం అనేది తన అచేతనలో జీర్ణించి ఉంటుంది. అందుకే ఆనందాన్నివ్వని అనేక పనులను కూడ మనిషి చేస్తూనే ఉంటాడు. ఆనందం అనే ధ్యేయాన్ని అటువుంచి పరిశీలించి చూస్తే మనిషి చేస్తూనే ఉంటాడు. ఆనందం అనే ధ్యేయాన్ని అటుంచి పరిశీలించి చూస్తే మనిషి ఒకందుకే కాక ఎన్నిటి నిమిత్తమో జీవిస్తున్నాడు. అయితే, అవన్నీ కూడ ఆనందం నిమిత్తమే అన్న జ్ఞానకం మాత్రం వ్యక్తంగా ఉండక అచేతనలో దాగి అవ్యక్తంగానే ఉండి ఉంటుంది.

ఎందుకు జీవిస్తున్నాడు అన్నపుడు ఫలాన అందుకు జీవిస్తున్నాడని చెపితే, ఆ 'ఫలాని' అనేది ఒకటి మాత్రమే అయితే చాలదు. అది ఒకటి కంటే మించి ఉండాలి. అప్పుడు కాని సరిపోదు. ఇందులో మరొక విశేషం కూడ ఉన్నది. మనిషి అంటే ఒకడు మాత్రమే కాదు, మానవజాతి అంతా కూడ. మనిషి అంటే పురుషుడు, మనిషి అంటే స్త్రీ, మనిషి అంటే పిల్లలు, మనిషి అంటే బీదవాడు, ధనికుడు, పండితుడు, పామరుడు, రోగి, నిరోగి, ఇంకా ఎన్నో! వీరందరూ వేరు వేరు పనుల నిమిత్తం జీవిస్తున్నారు; నేపథ్యంలో మాత్రం వీరందరి ధ్యేయం ఆనందమే.

మనిషి ఏదో పని చేస్తూనే ఉంటాడు. ఏ పనిచేస్తున్నా కూడ జీవించే ఉంటాడు. జీవించి ఉండంది ఏ పనీ చేయలేదు; అదేవిధంగా ఏపనీ చేయంది జీవించి ఉండలేడు. జీవిస్తున్నంతవరకు ఏ పనీ చేయకుండా ఉండలేడు. ఏ పని చేయకపోయినా, జీవించటం అనే పనినైనా బ్రతికున్న మనిషి చేయక తప్పదు. జీవించటం కూడ పనే. కనుక ఏ పనీ చేయని మనిషి సృష్టిలేని లేదన్నమాట. మనిషికి పుట్టుకతో వచ్చిన పని జీవించటం అనేదే. మనిషి ఎందుకు జీవిస్తున్నాడంటే జీవించటానికే జీవిస్తున్నాడు అనటం ఉత్తమ సమాధానమేమో! కాని జీవించటం అనే పని జీవించటం ద్వారా జరగదు, మరేదైనా పనిద్వారా మాత్రమే జరుగుతుంది. అందుకే, జీవించే నిమిత్తం మనిషి మరేదైనా పనిని చేయాలి. మరేదైనా పని చేస్తేనే కాని మనిషి జీవించడు, జీవించి ఉంటేనే కాని మరేదైనా పనిచేయజాలడు. కనుక జీవించటం, మరొక పనిని చేయటం అనేవి మనిషి ఒకే సమయంలో చేస్తుండాలి.

తిండి తినంది మనిషి జీవించలేడు. జీవించివుంటేనే తిండి తినేది; చచ్చిన మనిషి తిండేమి తినగలడు? తిండి తింటేనే కాని మనిషి జీవించడు అన్నపుడు తిండి ఎట్లా దొరుకుతుంది అనే ప్రశ్న ఎదురవుతుంది. తిండి తినటం అనేపని మనిషిని జీవింపజేస్తుంది కాని జీవించటం అనేపని మనిషికి తిండి పెట్టదు. తిండి నిమిత్తం మరేదైనా పనిని చేయాలి.

జంతువులను చంపటం ద్వారా తిండి లభిస్తుంది, ఆకులను, కాయలను, దుంపలను సేకరించటం ద్వారా తిండి లభిస్తుంది. పైరులను పెంచటం ద్వారా తిండి లభిస్తుంది. అంటే జీవించటానికి ఇవన్నీ అవసరం అని. ఎందుకు జీవిస్తున్నాడు మనిషి అంటే ఈ పనులన్నీ చేయటానికి జీవిస్తున్నాడని అర్థమా? అవును, కాని వీటన్నిటిని కూడ చేయటానికే జీవిస్తున్నాడు కాని వీటిని మాత్రమే చేయటానికి జీవించటం లేదు.

జీవించాలంటే తిండి కావాలి, తిండి కావాలంటే ఆహారసేకరణనో, ఆహారోత్పత్తినో చేసుకోవాలి. వాటికి సమర్థత కావాలి. ఆ సమర్థత అందరికీ సమానంగా ఉండదు. సమర్థత కలవాళ్ళకు సరైన ఆహారం దొరకటం, సమర్థత తక్కువైన వాళ్ళకు తక్కువ ఆహారం దొరకటం, అసలు సమర్థత లేనివాళ్ళకు ఆహారమే లభించక పోవటం, ఆ కారణంగా కొందరు తిండి లేక వ్యాధిపీడితులు కావటం, దానితో మరణించటం.

ఈ సమర్థతా అసమర్థతల మూలంగా మానవుల్లో కలిమి, లేమి అనేది అతి ప్రాచీన కాలంలోనే ఏర్పడినాయి. అందువల్ల మానవులు పీడకులు, పీడితులు, లేక కొల్లగొట్టే వాళ్ళు, కొల్లగొట్టబడేవాళ్ళు అనే రెండు ప్రధాన వర్గాలుగా చీలిపోయినారు. సమర్థులుకలిమి ఉన్నవాళ్ళుగా, అసమర్థులు లేమి ఉన్నవాళ్ళుగా పరిగణించబడ్డారు. ఒక వర్గం వారు ఆకలితీరిన తరువాత ఏమిచేయాలని ఆలోచిస్తుంటే మరోవర్గం వారు ఆకలి తీరటానికి ఏమి చేయాలా అని ఆలోచించసాగేరు. మొదటివారు తినటానికి బ్రతుకుతుంటే రెండవవారు బ్రతకటానికి తింటున్నారు. పెంపుడు పిల్లీ, పెంచబడని పిల్లీ రెండున్నాయట. పెంపుడు పిల్లికి తిండికొదువ లేదు. యజమానులు రకరకాలైన పదార్థాలతో దాని పొట్ట నింపుతుంటారు. ఆకలి అనే సంగతే దానికి తెలియదు. అయినా, అది ఎలుకలు కనపడితే చంపి పారేస్తుంది తినకుండా. ఇక పెంచబడని పిల్లి తనకు కనిపించిన ఎలుకలను చంపి ఆకలి తీర్చుకొంటుంది.

కడుపు నిండిన పిల్లీ, ఆకలితో ఉన్న పిల్లీ రెండూ కూడ ఎలుకలను చంపుతాయి. కడుపు నిండిన పిల్లి క్రీడ నిమిత్తం ఎలుకలను చంపితే ఆకలితో ఉన్న పిల్లి తినటానికి వాటిని చంపుతుంది. అంటే మొదటిది ప్రాణులను చంపటానికి బ్రతుకుతుంది, రెండవది బ్రతకటానికి ప్రాణులను చంపుతుంది! ఈ విషయం విఖ్యాత ఆర్థికవేత్త గాల్ బ్రెయిత్

చెప్పినట్లు గుర్తు. ఎందుకు జీవిస్తున్నాడు మనిషి అనే ప్రశ్నకు కొందరు తిండి నిమిత్తమే జీవిస్తున్నారు, మరికొందరు తిండికంటే మించిన విషయాల నిమిత్తం జీవిస్తున్నారని సమాధానించ వలసి ఉంటుంది. ఆకలి తీరిన వాళ్ళు ఆహారాన్ని గురించి ఆలోచించాల్సిన పని ఉండదు కనుక శారీరక అవసరాలకంటే మానసిక అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వటం ద్వారా, వివిధాలైన విద్యలను, శాస్త్రాలను, కళలను అభ్యసించటం ప్రారంభించారు.

ప్రాథమిక భౌతిక అవసరాల అనంతరం, అంతకంటే సూక్ష్మమైన విషయాల్లో ఆనందాన్వేషణ చేయటం సహజం. దారిద్ర్యంతో బాధపడేవాళ్ళు ఆకలితీర్చుకొనే పనితోనే తీరిక లేకుండా ఉంటున్నపుడు ఇక మానసిక విషయాలను గురించి ఆలోచించే అవకాశం ఎక్కడ లభ్యం చేసుకోగలరు? అందువల్ల ఈ వర్గంలో విద్యాభ్యాసం, శాస్త్రజ్ఞానం, కళాభిజ్ఞత వికసించటానికి వీలు లేకుండా పోయింది.

మానవ సమాజం ఈ రెండు విధాలుగా చీలిపోవటంతో ధనికులూ దరిద్రులూ అనే లోతైన, వెడల్పయిన అఖాతం ఏర్పడింది మనుషుల్లో. ఈ అఖాతం పూడటానికి ధనికులు ఇంకా ఎక్కువ ధనికులు కావటం, దరిద్రులు ఇంకా ఎక్కువ దరిద్రులు కావటం ద్వారా జరగదు; ధనికులను దరిద్రులుగా మార్చటం ద్వారా కూడ జరగదు. ధనికులు దరిద్రులుగా మారితే లోకంలో అన్నమే దొరకదు.

దరిద్రులను ధనికులుగా మార్చటం ద్వారా మాత్రమే మానవకళ్యాణం వికసించటానికి వీలు. పండితులు పామరులు కావటం కాదు కావలసింది, పామరులు పండితులు కావాలి. ఆరోగ్యవంతులు రోగులుగా మారటం కాదు కావలసింది, రోగులు ఆరోగ్యవంతులుగా మారాలి. అదేవిధంగా ధనికులు దరిద్రులుగా కాక దరిద్రులు ధనికులుగా మారాలి. అందుకే దేశంలో దారిద్ర్యాన్ని తొలగించాలి. కనుకనే "గరీబీహటావో".

ప్రజలందరిలో ఆర్థిక సమృద్ధి ఏర్పడినప్పుడు ఆకలి బాధ తీరుతుంది. అది తీరినపుడు ఎన్నెన్నో మానవకళ్యాణానికి తోడ్పడేపనులను, ఎన్నెన్నో మానసిక శక్తులను వేల్కొల్పే పనులను, ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలను, ఎన్నో సృజనాత్మక ప్రక్రియలను, ఎంతో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, మనం నివసించే భూగోళాన్ని గురించే కాక, అనంతమైన బ్రహ్మాండ గోళంలోని అనేక విషయాలను గురించి కృషి చేసే అవకాశం దొరుకుతుంది.

ఎందుకు జీవిస్తున్నాడు మనిషి అనే ప్రశ్నకు అప్పుడు ఎన్నో సమాధానాలు దొరుకుతాయి. తినటానికి జీవిస్తున్నాడు, తిండిని ఉత్పత్తి చేసుకోవటానికి జీవిస్తున్నాడు, మనుషుల సంఖ్యను పెంచటానికి జీవిస్తున్నాడు(ప్రస్తుతం మనుషుల సంఖ్య తగ్గించటానికి జీవిస్తున్నాడు). జ్ఞానోపార్జనకోసం జీవిస్తున్నాడు, కళాసృష్టి నిమిత్తం జీవిస్తున్నాడు, ఆలోచించటానికి జీవిస్తున్నాడు, అనుభూతించటానికి జీవిస్తున్నాడు. ఆరోగ్యంగా ఉండాలని జీవిస్తున్నాడు, అకాలంలో మరణించకుండా ఉండాలని జీవిస్తున్నాడు, ఇంకా ఎన్నెన్నో పనుల నిమిత్తం జీవిస్తున్నాడు, కొందరు జీవిస్తున్నా కూడ తాము జీవిస్తున్నట్లు గుర్తుండదు వారికి!

జీవించటంపైన మనిషికి ఎంత అనురాగమో! జీవించటానికి మనిషి తన ధనాన్ని, మానాన్ని, ఎన్నిటినో వదులుకుంటాడు, ప్రాణాన్ని తప్ప! ఇది సాధారణ విషయం. ఇక ఇందులో అపవాదాలు లేకపోలేదు. కొందరుంటారు, తమ ధనం నిమిత్తం, మానం నిమిత్తం, ఇంకా చాలా వాటి నిమిత్తం తమ ప్రాణాన్ని వదులుకుంటారు. జీవితంలో ఆనందం దొరికినన్నాళ్ళు జీవించి దానికి బదులు బాధలు దొరకటం సాగినపుడు జీవించటానికంటే మరణించటానికి ఎక్కువ ఇష్టపడతారు; తమను తామే చంపుకొంటారు.

పర్యవసానం ఏమంటే మనిషి ఆనందం నిమిత్తమే జీవిస్తాడు, అది దొరకనపుడూ, దానికి బదులు బాధలు దొరుకుతున్నప్పుడూ తన్ను తాను ఈభూమి మీద లేకుండా చూచుకొంటాడు. మరణించినందున ఆనందం దొరకదు కాని బాధ లేకుండా పోతుంది. ఆనందాన్ని అనుభవించటం అందరికీ చేతవుతుంది కాని బాధను భరించటం అందరికీ చేతకాదు.

కొందరికి చావటం మాత్రమే తెలుసుకాని చంపటం తెలియదు; మరికొందరికి చంపటం మాత్రమే తెలుసుకాని చావటం తెలియదు; ఇంకొందరికి చంపటం తెలుసు, చావటం తెలుసు. ఇక చంపటం, చావటం రెండూ తెలియని వారు ఎందరో ఉంటారు. చంపటం తెలియనవసరం లేదు కాని చావటం మాత్రం తెలియాలి. లేనిచో వీరు మరణం ఆసన్నమైనప్పుడు వణికిపోతారు. మరణంపైన ఇష్టాన్ని పెంచుకోమని కాదు, మరణంపైన నిర్భయాన్ని పెంచుకోమని.

జీవితంలో మూడు ప్రధాన ఘట్టాలుంటాయి. జన్మించటం, జీవించటం, మరణించటం. జన్మించటం ఆది, మరణించటం అంతం, జీవించటం మధ్యది. ఆది అంతాల

మధ్యది జీవితం. అంటే పుట్టటానికీ, చావటానికీ మధ్యది బ్రతికుండటం. పుట్టుక భూతకాలానిది. భూతకాలం మళ్ళీరాదు. మనిషి జీవిస్తున్నప్పుడు మళ్ళీ జన్మించడు తాను స్వయంగా, ఇతర్లను మాత్రం జన్మింపచేస్తాడు.

జన్మించటం భూతకాలానికి చెందితే మరణించటం చెందుతుంది భవిష్యత్‌కు. ఈ రెంటికీ మధ్య ఉన్న జీవించటం చెందుతుంది వర్తమానానికి. మూడుకాలాల్లోకీ వర్తమానకాలం ఎక్కువ విలువైంది. కారణం, మిగతా రెండు కాలాలకు కూడ వర్తమానకాలం ప్రాతిపదిక. వర్తమానంలోని ప్రతిక్షణం భూతకాలంలోకి జారిపోతుంటుంది; భవిష్యత్‌లోని ప్రతిక్షణాన్ని వర్తమానం తనలోకి తీసుకొంటుంటుంది.

మూడు కాలాల్లోకి వర్తమానకాలం ఎక్కువ విలువయినట్టిది అయినట్లే జననం, జీవితం, మరణం ఈ మూడిటిలోకీ వర్తమానానికి చెందిన జీవితం ఎక్కువ విలువైంది. నిజానికి జననం లేంది జీవితం లేదు, మరణం లేంది జీవితపు పరిణామం లేదు. అయినా, ఈ రెంటి కంటే జీవితమే ప్రధానమైంది, కారణం, జననం మరణం కూడ జీవితం నుండే జన్మిస్తాయి. మనిషి జన్మించటం తన తల్లిదండ్రుల జీవితాలనుండే. కనుక మనిషి జన్మించేది జీవితం నుండే, తిరిగి జీవితాన్ని అందుకొనేది జననం నుండే. జీవితం లేంది మరణం కూడ లేదు.

జీవితం నుండి జననం, మరణం మాత్రమే కాక ఇంకా ఎన్నో ఆవిర్భవిస్తాయి. సాహిత్యం, సంగీతం, చిత్రం, శిల్పం, నాట్యం, నృత్యం, శాస్త్రం ఇంకా అటువంటివి, అటువంటివి కానివి ఎన్నో జీవితం నుండే ప్రాదుర్భవిస్తాయి. అయితే, అందరి జీవితాల నుండి అవన్నీ ఉద్భవిస్తాయా అంటే ఉద్భవించవు; కొద్దిమంది జీవితాల నుండి మాత్రమే అవి ఉద్భవిస్తాయి. ఎక్కువ మంది జీవితాలు వాటిని ఆస్వాదిస్తాయి.

ఎందుకు జీవిస్తాడు మనిషి? శ్రేయం నిమిత్తం, ప్రేయం నిమిత్తం జీవిస్తాడు. శ్రేయం అనేది మేలు కలిగించేది, ప్రేయం అనేది ఆనందం కలిగించేది. జీవితంలో ఈ రెండూ ప్రధానమైన ప్రధానాలు.

ఒక వస్తువు తినటానికి మధురంగా ఉంటుంది. అది ప్రేయం. కాని అది కడుపులో నొప్పిని కలిగిస్తుంది. కనుక అది ప్రేయం అయినప్పటికీ శ్రేయం కాదు. మరొక వస్తువు శరీరానికి ఆరోగ్యం కలిగిస్తుంది, కాని అది తింటూంటే చేదుగా ఉంటుంది. కనుక అది శ్రేయమే కాని ప్రేయం కాదు.

ఒక కావ్యం ఎంతో రసాత్మకంగా రచించబడింది. కాని దానిలోని విషయం సమాజానికి కీడు కలిగించేదిగా ఉన్నది. అటువంటప్పుడది ప్రేయమైందే కాని శ్రేయమైంది కాదు. మరోకావ్యం ఎక్కువ రసాత్మకంగా రచించబడలేదు, కాని అందులోని విషయం సమాజానికి మేలు కలిగించేదిగా ఉన్నది. కనుక అది శ్రేయమైంది కాని ప్రేయమైంది కాదు. ఇంకో కావ్యం రసాత్మకంగాను రచించబడింది, అందులోని విషయం సమాజానికి శ్రేయం కలిగించేదిగాను ఉన్నది. అందువల్ల ఆ కావ్యం శ్రేయమైందీ ప్రేయమైందీ కూడ.

జీవితం కూడ అంతే; తాను సుఖంగా జీవించటం ప్రేయం, తన తోటివారిని సుఖంగా జీవింప చేయటం శ్రేయం. తన సుఖజీవనం ఇతరులకు దుఃఖజీవనంగా పరిగణించకూడదు. తన సంతోషం ఇతరులకు కూడ సంతోషంగా ఉండాలి కాని ఇతరులకు విషాదంగా ఉండకూడదు.

ఇతరులను బాధించి తాను ఆనందం పొందటం, ఇతరుల చేత బాధించబడి ఇతరులకు ఆనందం ఇవ్వటం రెండూ వాంఛనీయాలు కావు. మొదటిదాన్ని మనోవైజ్ఞానిక పరిభాషలో 'శాడిజం' అనీ, రెండవదాన్ని 'మెసోకిజం' అనీ అంటారు. ఇతరులను బాధించటం ఎంత అవాంఛనీయమో ఇతరుల చేత బాధించబడటం కూడ అంతే. ఒకరికి బాధ ఇవ్వకూడదు, ఒకరి నుండి బాధను అందుకోకూడదు. ఇతరులను భయపెట్టటం, ఇతరులకు భయపడటం రెండూ కూడ మానవ లక్షణాలు కాదు, మానవతానీతి కాదు, ఆదర్శ జీవనరీతి కాదు.

జీవితంలోని దుఃఖదైన్యాలు పూర్తిగా నశించి సుఖశాంతులు పూర్తిగా వికసించటం అనేది జరగటం మంచిదే కాని ఆ విధంగా జరగటం ఎంతవరకు సంభవమో! దుఃఖదైన్యాలు కొంతవరకు తరగటం, సుఖశాంతులు కొంతవరకు పెరగటం సంభవమైన విషయం, మనిషి కష్టాలకు తాను దూరంగా పారిపోక కష్టాలను తన నుండి దూరంగా పారద్రోలటం సముచితం.

''ఎందుకు మనిషి జీవిస్తాడు'' అనే ప్రశ్న ఎందుకవసరం? దీని బదులు "ఎట్లా మనిషి జీవిస్తాడు" అనేది ఎక్కువ అవసరమేమో!

ఎందుకు జీవిస్తాడు మనిషి?

జీవిస్తాడు తన శ్రేయం కోసం, సమాజశ్రేయం కోసం. జీవిస్తాడు తన ప్రేయం కోసం, సమాజ ప్రేయం కోసం.

తానే సమాజం అనుకోవటం స్వార్థం.

సమాజమే తాననుకోవటం నిస్వార్థం.

*(మిసిమి, మార్చి 1997)*

త్రిపుర

# అసంబద్ధ వాదానికి ప్రతీకలు
# త్రిపుర కథలు

– అంపశయ్య నవీన్

"క్లాం"దరు రచయితలు పాఠకులకు పని కల్పిస్తే నేను మాత్రం విమర్శకులకు పని కల్పించాను" అని చెప్పుకున్నాడు జేమ్స్‌జాయిస్. అలా తెలుగు కథానికా రచయితల్లో పాఠకులకంటే ఎక్కువగా విమర్శకులకు పని కల్పించిన రచయిత త్రిపుర–రాశిలో ఆయన రాసింది చాలా తక్కువే అయినా, వాసిలో మాత్రం ఆయన రచనలు యెన్నతగినవి.

రెండు ప్రపంచయుద్ధాల మధ్య కాలంలో (1914–1945) చాలా మంది మేధావుల్లో ఒక దైన్యం, ఒక నిర్లిప్తత, ఒక నిర్వేదం, ఒక నిరాశ నిస్పృహల్లాంటి భావనలు కల్గాయి. కొన్ని కోట్ల మంది అమాయక ప్రజలు తమ ప్రాణాల్ని కోల్పోయారు. కొన్ని శతాబ్దాల పాటు శ్రమించి నిర్మించుకున్న మానవనాగరికతా చిహ్నాలన్నీ క్షణాల్లో భస్మీపటలమయ్యాయి. ఎందుకింత భయంకరమైన విధ్వంసం జరిగింది? అని ప్రశ్నించుకుంటే సంతృప్తికరమైన, సహేతుకమైన సమాధానం లభించలేదు. అసలు మానవులనే వాళ్ళు సహేతుకంగా ప్రవర్తిస్తారా? వాళ్లను బుద్ధి నడిపిస్తుందా? లేక పుట్టుకతో వచ్చే సహజాతాలు (ఇన్‌స్టింక్ట్) నడిపిస్తాయా? అని ప్రశ్నించుకుంటే నకారాత్మక సమాధానమే లభించింది. మానవులు సహేతుకంగా ప్రవర్తించరు. వాళ్ళని వాళ్ళ సహజాతాలే నడిపిస్తాయి...

అసలు మానవ జీవితానికి అర్థమనేదేలేదు – మానవ జీవితమేకాదు, సమస్త సృష్టి అర్థరహితం. అసంబద్ధం. ప్రపంచంలోనూ, జీవితంలోనూ హేతుపరత్వం లేదు. హేతు విరుద్ధతే ఉంది. మానవ స్వభావం అంటూ సాధారణీకరించటానికేమీలేదు. ఇదీ మానవ స్వభావం అంటూ సర్వకాలాలకు, సర్వమానవులకు వర్తించే నిర్వచనం యేదీలేదు. మానవుడనేవాడు తాను చేసే పనుల ద్వారా తన స్వభావాలన్నీ అప్పటికప్పుడు సృష్టించుకుంటూ పోతాడే తప్ప దేన్నీ హేతుబద్ధంగా చెయ్యడు. ఇలాంటి భావాలన్నింటికీ కేంద్ర సూత్రమేమిటంటే ప్రపంచం అసంబద్ధమైనదనేది ఇలాంటి భావాల్లోంచే అస్తిత్వవాదం (ఎగ్జిస్టెన్షియ లిజం) అసంబద్ధవాదం (అబ్సర్డిజమ్) అనే తత్త్వ ధోరణులు యూరోపంతా వినిపించాయి. జీన్‌పాల్ సార్త్ర, అల్బర్ట్‌కేము, సామ్యూల్ బెకెట్ మొదలైన ఎందరో రచయితలు తమ రచనల ద్వారా అస్తిత్వవాదాన్ని, ముఖ్యంగా అసంబద్ధవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ వాదాలతో బాగా ప్రభావితులైన తెలుగు రచయితల్లో త్రిపుర ఒకరు.

త్రిపురకు సామ్యూల్ బెకెట్ రచనలు అన్నా, కాఫ్కారచనలు అన్నా, కేమూ రచనలు అన్నా చాలా ఇష్టం. ఆ తరహా రచనల్నే త్రిపుర చేశాడు.

సామ్యూల్ బెకెట్ రచించిన *వెయిటింగ్ ఫర్ గోడో* అన్న నాటకాన్ని 1952లో పారిస్‌లో ప్రదర్శించినపుడు అది చాలా గొప్ప సంచలనాన్ని సృష్టించింది. అసంగత లేక అసంబద్ధ వాదానికి (అబ్సర్డిజమ్) ఈ నాటకం అద్దం పట్టిందన్నారు. ఈ నాటక రచనతో Absurd Theatre అనే సరికొత్త నాటక రచనా ధోరణికి శ్రీకారం చుట్టినట్టయిందన్నారు. త్రిపుర ఈ నాటకంతో గాఢంగా ప్రభావితులైన వాళ్ళళ్ళో ఒకడు.

*వెయిటింగ్ ఫర్ గోడో* నాటకంలో యేముంది? అంటే యేమీలేదు అనేదే సమాధానం. ఎందుకంటే యేమీ లేకపోవడమే ఆ నాటకం యొక్క ప్రత్యేకత. యేమీ లేకుండానే ఈ నాటకం రెండు గంటలపాటు సాగుతుంది. ఇద్దరు వ్యక్తులు – వాళ్ళు దేశదిమ్మరులు (ట్రాంప్స్) – వాళ్ళల్లో ఒకడి పేరు ఎస్ట్రాగన్, ఇంకొకడి పేరు వ్లాడిమీర్ – వీళ్ళిద్దరు ఒక రోడ్డు పక్కన నిల్చుని 'గోడో' అనే వాడు వస్తాడని ఎదురుచూస్తుంటారు. వాళ్ళిద్దరికీ ఇంతకు ముందు పరిచయమేలేదు. ఇద్దర్నీ కలిపింది ఒకటే అంశం – ఇద్దరూ గోడో అనేవాడు అక్కడకు వస్తాడని ఎదురు చూడటం. అలా

ఎదురు చూస్తూ యేదేదో – ఒక దానితో ఒకటి సంబంధం లేని విషయాలను మాట్లాడు కుంటుంటారు. మధ్యలో ఒక యజమాని, అతని బానిస వచ్చిపోతూ "గోడో రావచ్చునని" ఒకసారి, "వస్తాడో రాడో మాకు తెలీదని" మరొకసారి చెప్పి పోతుంటారు – అసలు గోడో ఎవరో, ఎందుకొస్తానన్నాడో, వస్తాడో రాడో – ఎవరికీ తెలీదు – చివరకు గోడో రానే రాడని నిర్ధారించుకొని వాళ్ళిద్దరూ ఎస్ట్రాంగన్, వ్లాడిమీర్ వెళ్లిపోతారు. ఇది *వెయిటింగ్ ఫర్ గోడో* ఇతి వృత్తం.

గోడో అంటే దేవుడని, అతడసలు లేనేలేడని, అయినా మనం అతని కోసం ఎదురు చూస్తూనే ఉంటామని, ఎంత సేపు ఎదురుచూసినా ఫలితం శూన్యమని ఈ నాటకం చెబుతుంది. ఈ జీవితానికి అర్థం లేదు. జీవితం అసంబద్ధం – అహేతుకం – అయినా మనం ఈ జీవితానికి యేదో అర్థాన్ని ఆపాదించుకుంటాం. పుట్టినప్పటి నుండి చనిపోయేవరకు మానవుడు ఎప్పుడూ ఏదో ఒకదాని కొరకు ఎదురు చూస్తూనే ఉంటాడని కూడా ఈనాటకం చెబుతుంది.

త్రిపురను అస్తిత్వవాదం (Existentialism) అసంబద్ధవాదం (Absurdism) అరాచకవాదం (Anarchism) శూన్యవాదం, (Nihilism) జెన్‌బుద్ధిజం (Zen Buddhism) లాంటి వాదాలు ప్రభావితం చేశాయని త్రిపురకు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన కనకప్రసాద్‌గారు చెబుతున్నారు. ఈ వాదాలన్నింటి సారాంశం: మానవ జీవితానికి అర్థంలేదని, మానవ జీవితం చాలా అసంబద్ధమూ, అహేతుకమూ అయినదని. మానవుడు చేసే పనుల ద్వారానే అతడేమిటో తెలుస్తుందని – అర్థం లేని జీవితానికి ప్రతీవ్యక్తీ యేదో అర్థాన్ని కల్పించుకుంటాడని – ఇదీ త్రిపుర కథలన్నింటికీ నేపథ్యం.

త్రిపుర కథల సంపుటిలోని *భగవంతం కోసం* అనే కథను *వెయిటింగ్ ఫర్ గోడో* నాటకానికి సంక్షిప్త రూపం అనొచ్చు. ఈ కథలో ఓ వ్యక్తి భగవంతం అనేవాడి కోసం ఎదురు చూస్తుంటాడు. భగవంతం ఎవరో కథకుడు మనకు చెప్పడు. అలాగే అతని కోసం ఎదురుచూస్తున్న ఈ కథను నేనూ అంటూ చెబుతున్న ఆ వ్యక్తెవరో కూడా మనకు తెలీదు. త్రిపుర కథలన్నీ ఇలా నేను అంటూ సాగే ఉత్తమ పురుషలోనే చెప్పబడ్డాయి. "భగవంతం వస్తానన్న కాలం దాటి 46 నిమిషాలయింది. భగవంతం ఇంకా రాలేదు. వస్తాడా ఈ రోజు? అసలు ఎప్పుడేనా వస్తాడా?" ఇలా ప్రారంభమౌతుందీ కథ. కథంతా భగవంతం కోసం ఎదురుచూస్తూ – అతడు– అతని చుట్టూ ఉన్న మనుషుల్ని,పరిసరాలను పరిశీలించటమే – యేడో నెండర్ బస్సులో వస్తాడా? లేక పదమూడో నెంబర్ బస్సులో వస్తాడా? అంటూ ఎదురు చూడటమే.

"భగవంతం చెప్పకుండా వస్తాడా? ముందు చెప్పినా ఎట్నించి వస్తాడో తెలీదు – ఎట్నించి వస్తాడో తెలిసినా అనుకున్న టైమ్‌కు రాడు. వచ్చినా అతనితో ఏమిటి మాట్లాడటం?" ఇలా అనుకుంటాడు.

ఈ కథ చెబుతున్నతడు ఓ హోటల్లో కూర్చుని భగవంతం కోసం ఎదురు చూస్తున్నాడు. హోటల్లో రక రకాల వ్యక్తులొచ్చి యేవేవో మాట్లాడుకుంటుంటే అతడు వింటుంటాడు. "మనకు ఇండిపెండెన్స్ ఏమిటి? మనం శుద్ధ వెధవలం. మనకు కెరెక్టరొకటా? ఉత్త ఫకీరు జాతి మనది" అంటాడొకడు. "మనిషి గుండులాగుంటాడు కాని బ్రహ్మకానిస్టిపేషన్" అంటాడు ఇంకొకడు ఎవడ్ని గురించో.

కథ పూర్తయ్యేలోగా భగవంతం అనేవాడు రాడని మనకు తెలుస్తూనే ఉంటుంది. నిజంగానే రాడు. "అట్నుంచి ఏడో నెంబర్ బస్సులోనూ రాడు – ఇట్నుంచి 13వ నెంబర్ బస్సులోనూ రాడు నా పిచ్చిగాని" అంటూ త్రిపుర ముగిస్తాడీ కథను – 7,13 అన్న సంఖ్యలు స్పష్టంగా చెప్పలేని యేదో విషాదానికి ప్రతీకలని అనుకోవాలి. అసలీ భగవంతం అనే వాడెవడు? లేని భగవంతుడనుకోవాలి. లేదా మృత్యువు అనుకోవాలా?

కథలో ఒకచోట "భగవంతం పేరులోనే ఉంది సనాతనత్వం– పాతఫక్కీ పిలకలు, కిర్రు చెప్పులు, చెవులకి కుండలాలు, ఆరవేసిన అంగవస్త్రాలు వినిపిస్తాయి. కనిపిస్తాయి ఈ పేర్లో. నేను అతని కోసం హోటల్లో కూర్చుని నిరీక్షించటం పెద్ద పేరడాక్స్" అంటాడతడు. అంటే భగవంతుడికి మన సనాతనులిచ్చిన రూపం ఇలాంటిదే – అతడెవరో, ఎలా ఉంటాడో తెలీని అతని కోసం ఇతడెందుకు ఎదురు చూస్తున్నాడో – అతడొచ్చినా అతనితో ఇతడు యేం మాట్లాడాలో తెలియదుట. అంతా నాన్‌సెన్స్... మనం ఒక అర్థం లేని వ్యర్థ ప్రపంచంలో... మనం ఏం చేస్తున్నామో ఎందుకు చేస్తున్నామో తెలీని ప్రపంచంలో నివసిస్తున్నామని. అంతా శూన్యమని ధ్వని. అబ్సర్డిజమ్ లేక అసంగత వాదానికి కథా రూపమే ఈ కథ.

త్రిపుర ఎక్కువగా ఉత్తర భారతదేశంలోనూ, ఈశాన్య భారతదేశంలోనూ నివసించాడు. అందువల్ల ఆ ప్రాంతాలే ఈయన రాసిన కథలకు కథా స్థలాలయ్యాయి.

*పాము* అనే కథలో ప్రధాన పాత్ర శేషాచలపతిరావు. ఈ కథలోనే కాకుండా, ఇంకాకొన్ని ఇతర కథల్లో కూడా కనిపిస్తాడు. ఈ కథ వారణాసిలో జరుగుతుంది. ఇతడు కొంత కాలం ఆర్మీలో పనిచేసి, దేన్నో ఫోర్జరీ చేసి, పట్టుబడి ఉద్యోగం పోగొట్టుకున్నాడు. యే పనిని హేతుబద్ధంగా చెయ్యడు. జీవితం పట్ల గౌరవం లేదు – ప్రేమా లేదు. తన చుట్టూవున్న వాళ్ళను మోసం చేస్తున్నానన్న పశ్చాత్తాపం లేదు – ఉమాడే అనే ఓ అందమైన అమ్మాయికి కావలసిన ఓ పుస్తకాన్ని లైబ్రరీ నుండి దొంగిలించి, ఆమెకిస్తాడు. వారణాసి చూడటానికొచ్చిన ఓ అమెరికన్ జంటకు గైడ్‌గా ఉంటానని చెప్పి వాళ్ళ దగ్గర్నించి పర్స్ దొంగిలిస్తాడు. ఆ డబ్బుతో చిత్తుగా తాగి "రేపు సాల్వడార్ డాలీని (అధివాస్తవిక చిత్రకారుడు) అవుతానని" నిద్రపోతాడు. ఇంతే కథ.

జీవితానికర్థం లేదు. అంతా అసంబద్ధం అన్న తాత్త్విక సూత్రానికి ఈ కథ మరో ఉదాహరణ. "విదేశీయులు జాగ్రత్తగా ఉంటారు. ముక్కు మొహం తెలీని ఈ శేషాచలపతిని వాళ్ళెలా నమ్మి పర్స్ పోగొట్టుకున్నారన్న" ప్రశ్నలు ఇలాంటి కథకు వర్తించవు– ఎందుకంటె జీవితంలో జరిగే సంఘటనలన్నీ అసంబద్ధంగానే జరుగుతాయని రచయిత చెప్పదల్చుకున్నాడు. యేదీ క్రమబద్ధంగా, సహేతుకంగా జరగదని చెప్పడమే కథకుని లక్ష్యం.

*హోటల్లో* అనే కథ మన సమాజంలోని రకరకాల మనుష్యులు ఓ హోటల్లో చేరి ఎలా, యేం మాట్లాడుకుంటారో రచయిత తనేమీ చెప్పకుండా, ఆ మాట్లాడుకుంటున్న వాళ్ళెవరో చెప్పకుండా వాళ్ళ మాటల్నే మనకు వినిపించాడు.

"యదవ నాయాల... పదిరూపాయలిస్తేగాని ఫైలు ముట్టుకోడానికీలులేదన్నాడు. మళ్ళీ చూస్తే కుర్రకుంక. ఆ యదవ మొఖాన్ని ఆ పది కొట్టి సంతకమెట్టించుకొచ్చా – ఏం జేస్తాం? సస్తామా?" అంటున్నాడొకడు.

"ఈ కాలం యదవలంతా ఇంతేనాయనా – డబ్బు సేతిలో పడెయ్యందే పనిసెయ్యరు" అని అతని మాటలు వింటున్నవాడి సమాధానం – ఆ కాలంలోనే కాదు, ఈ కాలంలో కూడా అదే పరిస్థితి అని మనం నవ్వుకుంటాము.

ఇలాంటి వాళ్ళందర్ని వింటున్న చూస్తున్నా భాస్కరరావు (చాలా కథల్ని మనకీ భాస్కరరావే చెబుతాడు) వాళ్ళను గురించి "మెత్తగా నల్లగా చుంచులాంటి ముఖాలు... రహస్యంగా నక్కలాంటి ముఖాలు. అప్పుడే చంపిన గేదెని చీరుతున్న పులిముఖాలు. దుమ్ములగుండు ముఖాలు... బెదిరిన కుందేలు ముఖాలు. సన్నగా పగగా పాము ముఖాలు. మాల్కొలిచ్ సిగరెట్ పాకెట్ మీద ముఖంలాంటి ముఖాలు. డిటెక్టివ్ ముఖాలు– దొంగముఖాలు" అనుకుంటాడు. ఇదీ తన చుట్టూ ఉన్న సమాజం పట్ల రచయిత దృక్పథం అనుకోవాలి. అసంగతవాదులుకు సమాజం పట్లగానీ, జీవితం పట్లగానీ గౌరవం ఉండదు.

*చీకటి గదులు* అన్న కథలో మళ్ళీ మనకు భాస్కరమే కనిపిస్తాడు. కోరి వచ్చిన కల్యాణిని కాదంటాడు. ఆమె ఎవడితోనో లేచిపోతుంది. ఆమె తిరిగొచ్చినప్పుడు ఆమె తనకు కావాలనుకుంటాడు. కానీ ఈసారి అతని మిత్రుడే – శేషాచలపతిరావు ఆమెను ఎగరేసుకుపోతాడు. అంతా అసంబద్ధమే. ఆమె కోరివచ్చినపుడు ఆమెనెందుకు తిరస్కరించాడో తెలీదు. ఎవడితోనో లేచే పోయొచ్చిన ఆమెను ఇప్పుడెందుకు కావాలనుకున్నాడో తెలీదు. ఆమెను రిసీవ్ చేసుకోవడానికి తనొక్కడే వెళ్లకుండా, మిత్రుడు శేషాచలపతి రావును ఎందుకు వెంట తీసుకెళ్ళాడో తెలీదు. అంతా అహేతుకమే – అసంబద్ధమే.

*ప్రయాణికులు* కథ ఆర్మీకి–అంటే ఎయిర్ ఫోర్స్ వాళ్ళకు సంబంధించింది. ఈ కథలో కూడా మళ్ళీ శేషాచలపతిరావు మనకు దర్శనమిస్తాడు.

భాస్కరం భార్య సుశీలను "ఎవరాబిచ్"? నీ భార్యా!" అంటాడు శేషాచలపతి. "నువ్వు సుశీలను చూడకుండానే వెళ్తున్నావు" అని భాస్కరం అతనితో అన్నప్పుడు. అయినా భాస్కరం అతన్నేమీ అనలేకపోతాడు.

ఈ కథను గూర్చి వాకాటి పాండురంగారావు అన్నట్టు "అనుభవాలను, అబ్జర్వేషన్లను వర్తమానాన్ని, ఎర్నెస్ట్ హెమింగ్వే ఇంగ్లీషులాంటి తెలుగులో శాండ్విచ్ చేసి, అలతి అలతి మాటలతో, అందమైన పొత్తికడుపు మడతల లాంటి ఇమేజిరీలతో, ఈనాటి సాదా పాఠకుడిని అదరగొట్టే శైలిలో త్రిపుర చిక్కగా వండి డ్రెస్టిన్ బౌల్‌తో వడ్డించిన పరవాణ్ణం ఈ కథ".

*సుబ్బారాయుడి రహస్య జీవితం* అన్న కథను త్రిపుర చైతన్య స్రవంతి శిల్పంలో చెప్పాడు. చైతన్య స్రవంతి శిల్పధోరణి త్రిపుర కథల్లో అక్కడక్కడా రేఖామాత్రంగా కనిపిస్తూనే ఉంటుంది. త్రిపురను ప్రభావితం చేసిన రచయితల్లో జేమ్స్ జాయిస్ కూడా ఒకరు. అయితే ఈ కథ త్రిపుర జేమ్స్ థర్మన్ అనే రచయిత రాసిన కథకు

అనుసరణ అని చెప్పాడు. *జర్కన్* అనే కథలో త్రిపుర జర్కన్ అనే వజ్రాన్ని గూర్చి చెప్పాడు. ఈ కథలో ఒకచోట భాస్కర్ ఇలా అనుకుంటాడు.

''తన్నుతాను తెలుసుకోవాలి. తనకేదికావాలో తెలుసుకోవాలి. తెలుసుకోవచ్చని తెలుసుకోవాలి. తనలోంచి తాను వేరుపడి, తనను తాను వేరే చూసుకోవడం నేర్చుకోవాలి. ఆ క్షణంలో అతను యేమిటి చేయాలో అతని గమ్యం యేమిటో అతనికి తెలుస్తుంది" యే వ్యక్తయినా సరే, తనను తాను తెలుసుకోవాలంటే తనను తాను వేరే వ్యక్తిలా విశ్లేషించు కోవాలనే ఒక గొప్ప వాస్తవం మనకీ కథలోని ఈ మాటల్లో కనిపిస్తుంది.

కనిపించని *ద్వారం* కథను గురించి ఆర్.ఎస్.సుదర్శనం అన్నట్టు జీవితంలో కనిపించని అర్థమే ఈ కథ. తనకు తండ్రంటే ప్రేమో, ద్వేషమో తేల్చుకోలేక పోతాడు ఈ కథలోని నారాయణ. నారాయణ తండ్రి, నారాయణ తల్లిని చంపేశాడట. నారాయణ కళ్ళముందే చంపేశాడట! ఆ కారణంగా తండ్రంటే ద్వేషం. కానీ తండ్రి మంచివాడే. మంచిగా మాట్లాడ్తాడు. అతనిలోని కలుపుగోలుతనం నారాయణ కిష్టం. అతడు తన తల్లినెందుకు చంపాడో నారాయణ మనకు చెప్పడు.

నారాయణ అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ తనతో తను మాట్లాడుకుంటూ, తనను తను శిక్షించు కుంటుంటాడు. కథలోని ఈ దృశ్యాలు చూస్తున్నపుడు మనకు గోపీచంద్ నవల *అసమర్థుని జీవయాత్ర*లోని సీతారామారావు గుర్తొస్తాడు. ఆర్.ఎస్.సుదర్శనం అన్నట్టు గోపీచంద్ ఒక నవలలో విడమర్చిన ఇతివృత్తాన్ని త్రిపుర ఈ కథలో కుదించాడనిపిస్తుంది. నారాయణ అసమర్థుడు కాడు. సమర్థుడే. కానీ తండ్రి తోటి అనుబంధమే అతని జీవితాన్ని నడిపించటం వల్ల తండ్రి మృతి కల్గించిన అస్తిత్వ సంక్షోభం అధిగమించరానిదై అతని ఆత్మహత్యకు దారితీసింది. జీవితం అర్థంలేనిది, అసంబద్ధమైనది అని రుజువు చెయ్యడానికి ఈ కథ మరో ఉదాహరణ.

త్రిపుర అగర్తలలో (త్రిపుర రాష్ట్రరాజధాని) పనిచేస్తున్న రోజుల్లో ఆయనకు నక్సలైట్ ఉద్యమంమీద సానుభూతి కల్గింది. వాళ్ళ నాయన "రెడ్ బుద్ధిస్టులు" అనుకున్నాడు. నక్సలైట్ ఉద్యమంలో పనిచేస్తున్న వాళ్ళను గూర్చిన రెండు కథల్నీ ఆయన, ఆయన పద్ధతిలో రచించాడు. అవి : *సఫర్, అభినిష్క్రమణ, సఫర్* కథను నక్సలైట్ ఉద్యమంలో పనిచేస్తున్న వ్యక్తి తనతో తను ఘర్షణ పడ్తున్నట్టుగా రచించాడు. అతడనుకుంటాడు, "నువ్వు సీజర్‌వు కావు – కాలేవు. జూడాస్ అవగలవు. కానీ నువ్వు జూడాస్‌వి కావు. ఇప్పటిదాకా అయినా... నీలో రెండూ ఉన్నాయి. క్రైస్ట్, జూడాస్..." అనుకుంటాడతడు. ఉద్యమాన్ని విడిచేసే మనస్తత్వానికి జూడాస్... ఉద్యమంలోనే ఉండిపోవాలనుకునే మనస్తత్వానికి క్రైస్ట్... అతనిలోని జూడాస్‌కు క్రైస్ట్‌కు మధ్య సంఘర్షణే ఈ కథ. జూడాస్ కాకపోవడం తన డెస్టినీ అనుకుంటాడు. అంటే క్రైస్ట్‌గానే మిగిలిపోతాడన్నమాట.

*అభినిష్క్రమణ*లోకూడా ఉద్యమంలో పనిచేస్తున్న వ్యక్తిలోని సంఘర్షణ... ఒక వైపు భార్య పిల్లలు, విలాసంవతమైన జీవితం... మరో వైపు రోగగ్రస్తమైన దేశం. దుమ్మైపోతున్న మూగజీవాల మూల్గులు... ఒకవైపు సుశీల – అతని భార్య – మరోవైపు దుమ్మైపోతున్న మూగ జీవాల మూల్గులు ఈ సంఘర్షణే ఈ కథలో ప్రధాన వస్తువయ్యింది.

*గొలుసులు, చాపం, విడుదల భావం* అన్న కథలో పాడైపోయిన సైకిల్‌కు, పాడైపోతున్న మానవ జీవితానికి లంకె కుదిర్చాడు కథకుడు. కొత్త సైకిల్‌ను కొన్న రెండు నెలలకే అది పాడైపోయింద. రిపేర్ అవసరమైంది. సైకిల్ కొని రెండు నెలలే అయినా అది డొక్కు అయిపోయింది. అప్పుడే చప్పుళ్ళు చేస్తుంది రకరకాలవి. కుడి పెడల్ అదోలాగ తిరుగుతుంది. మోకాలు వంకర తిరిగి వదులై పోయింది దాన్దెబ్బకి. రిపేర్లు అంటే మనకు పడదు". అనుకుంటాడు ఆ సైకిల్ కొన్న వ్యక్తి. ఇలా అతనికి ఎక్కడచూసినా డిజార్డర్, అవ్యవస్థ కనిపిస్తుంది. జీవితం కూడా ఇలాగే ఉందనుకుంటాడు.

"మెదడులోని మెకానిజమ్‌ను నిజాయితీగా చూస్తే ఏమిటి చూస్తావ్? డిజార్డర్. నీ జీవితానికి అర్థం డిజార్డర్. నీ దేహానికి, నీ మెటఫిజికల్ ఉనికికి అర్థం డిజార్డర్. నీ ఆత్మే – అది డిజార్డర్ కోట్ల కొద్ది ముడతలు – గ్రేమ్యాటర్ లోతుల్లోకి వెళ్ళిపోతూ మిలియన్ల కొద్ది మడతలు ... కాంప్లెక్స్‌గా, ఒక దానికిందుగా ఒకటి, కలిసిపోకుండా తప్పించుకుంటూ అంతం లేకుండా మిలియన్ల కొద్ది ముడతలు... ఆశ్చర్యం వెయ్యదూ? అంతా డిజార్డర్". ఈ డిజార్డర్ కూడా అబ్సడిస్టు ఫిలాసఫీలో ఒక ముఖ్యభాగమే.

ఈ కథలో మరో చోట ఈ కథలోని ప్రధాన పాత్ర ఇలా అనుకుంటాడు. "కుర్రాడికి తల్లిదండ్రులు కూడా ఉత్త యాక్టర్సే... ప్రిటెండర్స్ అనిపిస్తుంది కాబోలు – అసలు

తండ్రి ఎక్కడో ఉన్నట్టు, యేమూల నుంచో ఏ రోజో వచ్చి తనను క్లెయిమ్ చేసుకుంటాడనీ కొంత మందికి ఇది అసలు ప్రపంచం కాదు. ఇదంతా ఒక కాపీ– నకలు – కౌంటర్‌ఫీట్. ఈ వింతదనం అంతా ఒక విధమైన కుట్రలాగా కూడా అనిపిస్తుంది. ఈ కుట్రని ఛేదించటానికి, అన్నదమ్ముల్ని పట్టుకొని దగ్గరగా లాక్కోవడం, తల్లి దండ్రుల్ని, స్నేహితుల్ని, మనుష్యుల్ని దగ్గరగా లోపలికి, గుండెల్లోకి, మనుష్యుల్ని.. రక్తంలోకి దగ్గరగా" ఇలా కథంతా ఇలా అంతర్లీనంగా అబ్సర్డిస్టుఫిలాసఫీని చెప్పడానికే రచించబడిందనిపిస్తుంది. అర్థంలేని జీవితానికి అర్థం కల్పించుకోవడానికి మానవులు చేసే ప్రయత్నమే తల్లిదండ్రులు, అన్నదమ్ములు, భార్యా పిల్లలతో అనుబంధాన్ని కల్పించుకోవడం. త్రిపుర రచించిన కథల్లో *వలస పక్షులు* అన్న కథ మరీ ప్రతీకాత్మకంగా సాగింది. ఓ పట్టాన అర్థం కాదు. త్రిపుర కథల్ని లోతుగా పరిశీలించిన కనక ప్రసాద్ గారికే ఈ కథ అర్థం కాలేదంటే ఇక మనకేం అర్థమవుతుంది? తన కథల్ని సామాన్య పాఠకులు అర్థంచేసుకోవటానికి త్రిపుర వాళ్ళకస్సలు సహాయపడడు. తన పాత్రలెవరో చెప్పడు. వాళ్ళ పేర్లు కూడా కథలో ఎక్కడో ఒకచోట యాదృచ్ఛికంగా కనిపిస్తాయే తప్ప రచయిత చెప్పడు – ఒక కథలో తటస్థ పడ్డ పాత్రలే ఇతర కథల్లో దర్శనమిచ్చి మనల్ని కన్‌ఫ్యూజ్ చేస్తాయి. కథలోని సంఘటనలు, సంభాషణలు మొదలైనవన్నీ పాత్రల మస్తిష్కాల్లోనే జరుగుతాయి. వాక్యాలు పూర్తికాకుండా మధ్యలోనే తెగిపోతాయి. కానీ ఆ వాక్యాలన్నీ ఎంతో కవితాత్మకంగా ఉంటాయి. ఒక కథలో "లలితా దేవి కర్టెన్ తొలగించి వచ్చింది. సర్పంలాగ కదిలే గ్రేస్" అంటాడు. సర్పంతో అందమైన ఆడవాళ్ళను పోల్చడం త్రిపురకు చాలా ఇష్టంలా ఉంది – సర్పం పోలిక చాలా కథల్లో కనిపిస్తుంది. సర్పం చాలా వాటికి సింబల్ కదా.

"అవతల దీపాలు ఒక్కొక్కటి వెలుగుతున్నాయి... మిణుగురు పురుగుల్లాగ మెరుస్తున్నాయి. లలితాదేవి ఒళ్ళు విరుచుకుంది. రాణా పొట్టికాళ్ళు పిస్టల్ లాగ ఆడిస్తూ వచ్చాడు". అంటాడో కథలో, పొట్టి కాళ్లను పిస్టల్‌తో పోల్చడం – త్రిపురకే సాధ్యం. త్రిపుర కథల్లో అక్కడక్కడ గార్డినాల్ మాత్రలు (నిద్రమాత్రలు) కనిపిస్తాయి. అవి మృత్యువుకు చిహ్నాలు. "ఆకు పచ్చ పాము వంపులు సాగదీసుకొని ఒక్కసారిగా లేచినట్లనిపించింది" "మర్రిచెట్టు నీడల్లో గుండెలు బ్రద్దలయ్యేలాగ" "ఏడో నంబర్ బస్సు బాగా బలసిన ఊరకుక్క లాగ దూరం నుంచి వస్తోంది"

"పదమూడో నంబర్ బస్సు వచ్చి ఆగింది. ఆగి ఒక మార్కొవిచ్ ముఖాన్ని యూలిసెస్‌లాగ వెడల్పుగా ఉన్న ముఖాన్ని, ఒక టెరిలిన్ కవచాన్ని, ఒక స్టెతస్కోప్‌నీ, ఒక అజ్ఞాతంలో ఉన్న అర్జునున్నీ దింపింది". ఈ వాక్యంలోని ఉపమానాల్ని అర్థం చేసుకోవటం కష్టం. అయితే ఇలాంటి రసాత్మకమైన వాక్యాలు త్రిపుర కథల్లో ఎన్నో – ఆయన కథలు ట్రాన్స్‌పరెంట్ చీకటిలా కొంచెం అర్థమై, కొంచెం అర్థం కానట్టు ఉంటాయి – మొత్తంమీద ఆయన కథల్ని మళ్ళీ మళ్ళీ చదవడం నాలాంటి వాడికి ఒక అద్భుతమైన అనుభవం.

**త్రిపురతో సుబ్రహ్మణ్య భట్టు మాటామంతీ:**

తెలుగు కథా సాహిత్యంలో త్రిపురలా తక్కువ సంఖ్యలో కథలు రాసి గురుపీఠం సాధించిన వారు మరొకరు లేరు. ఆయన కథలకు అపూర్వ పాత్రలు అసాధారణ పాత్ర చిత్రణ, ఊహకందే సందర్భ సంకలన పెట్టని కోటలు. సాధారణ సంభాషణలతోనే పాత్రలకు ఇతరులెవరూ సమకూర్చలేని ఆహార్యం, ఎవరూ నింపలేని చైతన్యం, చైతన్యరాహిత్యం కల్పించిన వారు 'త్రిపుర'. ఆ కథలు ఏ రూపానికి సూత్రానికీ లొంగనివి.

ఇటీవలే ఆయన మరణించారు.

1999 జనవరిలో విజయవాడలో రికార్డు చేసిన ఆయన ఇంటర్వూ పాఠం.

భట్టు : త్రిపురగారూ! మీరు రాసిన కథల సంఖ్య తక్కువ. కాని వాటిలో డెన్సిటీ సాంద్రత– ఎక్కువ అని అంటారు. ఇంత దట్టించి కథ రాయగల్గటానికి మీ వెనుక ఏమైనా నేపథ్యం ఉందా?

త్రిపుర :నేను చిన్నప్పటి నుంచీ కవిత్వమే ఎక్కువ చదివాను. ఫిక్షను తెలుగులో కాని, ఇంగ్లీషులో కాని ఎక్కువగా చదువలేదు. కాకతాళీయంగా కథలు రాయడం మొదలు పెట్టాను. కనుక నాకిష్టమైన కవిత్వమే నాకథలో కూర్చుంది. ఆ కవిత్వం ద్వారా – మీరన్నారే ఆ సాంద్రత కథల్లో కూర్చుంది. పద్మరాజుగారు అన్నట్లుగా ఇవి కథలా, కవితలా అన్న ప్రశ్నకి సమాధానం ఇది. ఇవి కథలూ కావు, కవిత్వాలూ కావు వాస్తవ చిత్రాలు. టెక్స్‌టులు

లేదా డాక్యుమెంట్లు. ఇది కథా, పోయమేనా, డ్రామానా అంటే అంతగా వేరు పరుస్తూ ఆలోచించను. నా మాట ఒకటే, ఇవన్నీ వాచకాలు (టెక్స్ట్స్) కేవలం డాక్యుమెంట్లు. మీరు ఉన్నదంటున్న సాంద్రత ఏదైనా, నేను అంగీకరిస్తున్నాను. ఉన్నదనే అనుకుంటున్నాను. ఎందుకున్నదీ అంటే తొలిరోజులలో కవిత్వం పట్ల నాకున్న అభిమానం.

ప్రశ్న : కల్పనతో కథలు నిలుస్తాయి. ఎంతలేదన్నా ఈ ఊహ, కల్పన మీ కథల్లో కూడా ఉన్నవా?

జవాబు: చాలా కష్టమైన ప్రశ్న. ఎందుకంటే సంఘటనల్లో గాని జరగటంలో కాని నాకథలు వాస్తవాలనే నింపుకుంటాయి. రచనలో మాత్రం కల్పన ఉంటుంది. దీనికొక కారణం ఉంది. ఆ కారణం చెప్పాలంటే కొంత నా వెనుకటి చరిత్ర కూడా వివరించాలి. నేను 1928లో పుట్టాను. చదువంతా ఇంగ్లీషు ప్రధానంగానే సాగింది. నా జీవితంలో ముప్ఫయి రెండు, ముప్ఫయి మూడు సంవత్సరాల పాటు వేరే రాష్ట్రంలో ఉన్నాను. చిన్నప్పటి నుండి వేరు రాష్ట్రంలో ఉండటమే అలవాటయింది. ఆ రోజుల్లో మా నాన్నగారు చనిపోయారు. అదొక షాక్ కొట్టిన తర్వాతి అనుభవంలాంటిది. ఈ అనుభవం నన్ను రకరకాలుగా మార్చింది. నేను తెలుగులో రాయడం కూడా ఈ అనుభవం వల్ల వచ్చిన చర్యే అని నేను అనుకుంటాను. చాలా గాఢంగానే అనుకుంటాను. మామూలుగా దీనికీ దానికీ సంబంధమెలాగో మనం చెప్పలేం. తండ్రిగారి మరణానికీ తెలుగులో రాయడానికీ గల సూటి బంధుత్వం మనకి తెలియదు. కాని నాకు లోపలా అలా ఉంది. అది వివరించాలంటే ఒక లింక్ చేయాలి. కాబట్టి అక్షరాలు తెలుగులో అక్షరాలు దాదాపు పలికే కూర్పు నుంచి సంఘటన గాని ఒక జరగటంగాని ఎలా ఉన్నా అక్షరాలతోనే కల్పించాను. సంఘటన ఊహించినది కాదు. భాష కల్పించినది. ఏమైనా కల్పన ఉంటే అది భాషలోనే ఉంది – జరిగినదాంట్లోనో, సంఘటనలోనో కాదు. నా కథలో సంఘటనలు తక్కువ జరగటాలు తక్కువ.

ప్రశ్న : ఎప్పుడో 1924 సంవత్సరంలో మరణించిన కాఫ్కా లాటి రచయిత చేసిన రచనలలోని ఏకాంతం, విపరీతమైన బాధ – ఇటువంటివన్నీ మీకథల్లో కూడా కనబడతాయంటారు? మీరు అంగీకరిస్తారా?

జవాబు: తప్పకుండా.

ప్రశ్న : కానీ మొదటి ప్రపంచయుద్ధం నాటికి యూరప్ దేశాలలోని వాతావరణానికీ, అక్కడి బీభత్సాల మధ్య ఉన్న ఆ మనిషికీ, మనమనిషికీ; వారి అనుభవాలకీ – మన అనుభవాలకీ మధ్య చాలా తేడా ఉన్నది కదా! వారిబాధ, మనబాధ; వారి దుఃఖం మన విచారం; – ఇవన్నీ ఒకటేనా?

జవాబు: యూరపు, అమెరికా, ఆఫ్రికా అంటూ విడదీస్తే అదొకరకంగా ఉంటుంది. కాని మనిషి ప్రతి ఖండంలోనూ నివసిస్తున్నాడు. యూరపులో యుద్ధం వల్ల చాలా ఫలితాలు అనుభవించారు. యుద్ధం వల్ల అక్కడి రచయితలు కూడా ప్రభావితమయ్యారని అంటారు. మొదటి ప్రపంచయుద్ధం ఈ సంవత్సరాల మధ్య అంటారు. అలాగే రెండో ప్రపంచ యుద్ధం ఇప్పటినుంచి ఇప్పటివరకు అంటారు. ఇంగ్లండ్‌కీ, ఫ్రాన్సుకీ మధ్య యుద్ధాలు సరే. మరి మనిషికి పుట్టినప్పటి నుండీ, చచ్చిన దగ్గరి నుంచీ యుద్ధమే. ఫలానా యుద్ధం యూరపుకనీ ఆస్ట్రేలియాకనీ, ఒక ఖండానికనీ మీరు చెప్పవచ్చు. కాని అది మనిషిలో ఎప్పుడూ ఉంటుంది. అది మీరు యూరపులో ఉన్నా ఒకటే, కైకలూరులో ఉన్నా ఒకటే; మీరు ఎక్కడున్నా ఒక్కటే.

ప్రశ్న : మీరు కథల్లో ఒక నమ్మకాన్నా, అస్తిత్వాన్నా, బ్రతకటానికి తప్పనిస్థితినా– దేన్ని పెట్టారు? అనుకున్నది జరగని మానవజీవితంలోని విపర్యాయాన్నా? దేన్ని మీరు మీ కథల్లో పెట్టారు?

జవాబు: మీకు నేను జవాబు చెప్తే అదొక ఎపిక్ డ్రామాగా ఉంటుంది. మీరు అడిగింది దేనిని కథల్లో పెట్టానని, నేను రాసిన కథలు నన్ను దేనిలో పెట్టాయని.

ప్రశ్న : ఓ అనుమానం వ్యక్తం చేస్తాను. సామూహికమైన బాధలు, వైయక్తికమైన డ్రామా ఎందుకు ఎన్నుకున్నారు? ఎన్నుకోరాదని కాదు, కానీ మన సమాజంలో సామూహికమైన అత్యాచారానికి బాధలకి గురికావటం,... వైయక్తిక బాధ ఎలాగూ ఉంది...

జవాబు: నేను రచన చెయ్యాలని చెయ్యలేదు. మానాన్నగారు మరణించటం రకరకాలుగా నన్ను విడదీసింది. దివాళాతీయించినట్లు చేసింది. వైయక్తికమైన సఫరింగ్, మీరు చెప్పిన సామూహికనీతి వీటికి ఎక్కువ తేడా లేదనుకుంటున్నాను. ఒక విధంగా ఈక్వేషన్‌లా చెప్తే సమాజంవల్ల వ్యక్తికి బాధ కల్గుతుంది, వ్యక్తివలన సమాజం బాధ పడ్తుంది. ఆ ఈక్వేషను అటూ ఇటూ పెరుగుతున్నపుడు ఎక్కడో ఒక బాలెన్సు ఉంటుంది. వ్యక్తిగత బాధను గురించే నేను రాస్తున్నాను అనడంలో కొంత విమర్శక వాస్తవం ఉన్నా, దానిని నేను అంగీకరించలేకపోతున్నాను. ఎందుకంటే ఈ సంఘంలో ఉన్న సామూహిక బాధ గురించి రెండు మూడు కథల్లో చూడవచ్చు. ఒకచోట వ్యక్తిపడిన బాధని ఒక రిక్షావాడు ఛాలెంజి చేస్తాడు. అతనిలోపల ఎంతో సఫరింగ్ ఉంటుంది. 'ఆగొని' ఉంటుంది. కాని అతను రోడ్డు ప్రక్కన ఉన్న కాందిశీకుల గోనెలతో కప్పిన ఇళ్లను కూడా చూస్తుంటాడు. ఈ మానసిక యుద్ధంలో తన బాధ అంతా ఉంటుంది. కాని అదేకళ్ళతో, అదే గుండెతో, అదికూడా చూస్తాడు. కాని దానిమీద (బలం-) 'స్ట్రెస్'- (వక్కాణింపు) ఉండదు. అదొక నడిచిపోయే 'రిఫరెన్సు'. కవిత్వంలో అలా సాగిపోయే రిఫరెన్సులు- సందర్భాలుంటాయి. అంటే (సూచించటం) - సజెస్టివిటీ, కవిత్వంలో 'సజెస్టివిటీ' అంటారు. సూటిగా చెప్పకుండా దేన్నో సూచిస్తారు. నేను అనుకొనేది ఏమిటంటే ఇవి కూడా నాకథల్లో ఉన్నాయని.

ప్రశ్న : అసంబద్ధ జీవితంలో, అసంబద్ధ ప్రపంచంలో, మనకి అనుకూలంగా లేని ఈప్రపంచం మనల్ని ఏకాకుల్ని చేస్తోంది. ఈ ఒంటరితనంతో మనిషి ఇబ్బంది పడుతున్నాడు అని అంటున్నారు కదా. కాని మనదేశంలో ఇది ఉందా! మంచి కుటుంబ విలువలు ఇంకా పాదుకుని ఉన్న కుటుంబాలు గల మన సాంప్రదాయిక దేశంలో ఈ ఇబ్బంది ఉందా?

జవాబు: ఈ ప్రశ్న చాలా కాలంనుంచీ ఉన్నదే. ఒకసారి ఎవరో విమర్శ వ్యాసం రాశారు. అందులో మోహన్ ప్రసాద్, అజంతా, త్రిపుర - వీళ్ళు ఎలియనేషన్‌లో (పరాయితనం) చాలా బాధపడుతూ ఉంటారు. వాళ్ళ కవిత్వం ఇలా ఉంటుంది. ఈ ఎలియనేషన్ మన దేశంలో లేదు. వీరెందుకిలా దీంతో బాధపడ్తున్నారు? ఎవరికీ బోధపడదు అని. దీనికి నేను ఎవరికీ జవాబు చెప్పలేదు. కాని నేను అనుకున్నది, అప్పుడు నేను మూర్ఖంగా మా పాత ఇల్లు రినోవేట్ (బాగు) చేయిస్తున్నాను. మూర్ఖంగా అని ఎందుకన్నానంటే నాకు ఇల్లు గురించి తెలియదు. మళ్ళీ మంచి స్థితికి బాగు చేయడం అంటే తెలియదు. కూలివాళ్ళనే తప్ప ఇటుకల్ని కూడా చూడలేదు. సిమెంటు ఎర్రగా ఉంటుందో, నీలంగా ఉంటుందో తెల్లగా ఉంటుందో కూడా తెలియదు. అలాటి స్థితిలో బాగుచేదామని, కొంత డబ్బు ఖర్చు చేదామని నిశ్చయించుకున్నాను. అప్పుడు కూలీలు కొంతమంది వారిపనులు అయ్యాక సాయంత్రం వచ్చి నన్ను డబ్బు అడిగేవారు. "ఒకడ్ని సరే నలభై ఐదు రూపాయలు తీసుకుంటున్నావుగా ఏమిటి చేస్తావు" అని అడిగాను సరదాకి. నేను ఇవ్వడం కాదు గొప్ప. ఆ డబ్బు కంట్రాక్టర్ వారికివ్వవలసిన డబ్బు. నన్నొచ్చి అడిగారు. వారి పరిస్థితిని చూసి ఇచ్చాను. "కంట్రాక్టర్ దగ్గరికి వెళ్ళాలంటే దూరం మీరిస్తే బాగుంటుం"దన్నారు. సరే డబ్బిచ్చి ప్రశ్నించేసరికి, "ఈ డబ్బు తీసుకెళ్ళి తాగుతారా" అని అడిగే సరికి, ఒక కూలీ, నారాయణపేరు, నా కథలో వచ్చే నారాయణే. "సారాకిది సరిపోదు సార్! సినిమాకి వెళ్తాం" అన్నాడు. సినీమా చూస్తే మీకు బాగుంటుందా అన్నాను. అంటే "మేము ఇక్కడికి అరవై మైళ్ళ దూరం నుండి వచ్చాం.



జనవరి (2005)

చం॥ అతులిత సేవ జేసి తుదకాంధ్రుల పోషణ పొందలేక శా
శ్వతముగ కండ్లు మూసినవి వంతల వోర్వగలేక 'భారతీ',
'ప్రతిభ'లు. కాని ఈ మిసిమి పాప మటింకొకసారి ఆంధ్రసా
హితి వికసింప జేయునట! ఈ పసికూనను, వాణి! ఏలుకో!

- గజ్జల జగత్ప్రతి (మిసిమి, ఆగష్టు 1994)

మాకు ఇక్కడేమీ లేదు. ఈ పనిచూసుకోవటమూ అది మరచి పోవటానికి సినీమా చూడటం. తాగటానికా డబ్బులేదు. ఇక్కడ మీకు బాగా ఉంటుందా అంటే ఏం చెప్పమంటారు! ప్రతిరోజూ సినీమా చూసినంతసేపూ నవ్వుతూ ఉంటాం. తర్వాత ఏడుస్తుంటాం. వాటిల్లో చూపించే దెబ్బలాటలు చూసి సంతోషిస్తూంటాం. కాని ఇంటికి వెళ్ళిపోయిన తర్వాత నిద్రపోయేముందు అరవై మైళ్ళ దూరాన మా ఇంటి వాళ్ళగురించి ఆలోచిస్తూంటాం" అన్నాడు. ఈ పరాయితనానికి యుద్ధాలు అక్కరలేదు. యూరప్‌లో ఎక్కడో ఉంది, ఆంధ్రప్రదేశ్‌లో లేదు అన్న విమర్శకుడు చాలా నమ్మకంగానే రాసి ఉంటాడు.

ఈ పరాయితనం మనకి ప్రతినిముషం, ప్రతిరోజు, ప్రతి ఊపిరి పీల్చిన తర్వాత ఉంది. ప్రధానంగా మనిషి ఒంటరి. మేట్యూ ఆర్నాల్డు చెప్పినట్లుగా "మనం లక్షలాది మర్త్యులం ఏకాకిగా జీవిస్తాం".

ప్రశ్న : యూరప్‌లో వచ్చిన అసంబద్ధ సాహిత్యం పూర్తిగా విప్పుకున్నదా? పొంగిపొరలివచ్చిందా, కొద్ది కొద్దిగానే వచ్చి సమసిపోయిందా?

జవాబు: దానికో చరిత్ర, నేపథ్యం తప్పకుండా ఉన్నాయి. ఆ మూమెంట్‌లో– అసలు మూమెంట్ అంటూ లేదు. కొంతమంది రచయితలు ఒక విధమైన ఫిలాసఫీతో – ఫిలాసఫీ అనే మాట కూడా సరికాదు. ఒక అనుభవంతో కొంతమంది రచయితలు ఒకలా రాయటం మొదలు పెట్టారనుకొంటాను. విమర్శకులు మామూలుగా కొంతమందిని కలిపి ఒక సంకల్పంగా తీసుకొద్దాం అని చూస్తారు. వీరందరూ రాస్తున్నారు కాబట్టి వీరి పేర్లన్నీ కలిపి అబ్సర్డ్ డ్రామా రాసినవారు అన్నారు. కాని వారిలో ప్రతి ఒక్కడూ తనంతటతానుగా తేడా కల్గిన రచయిత.

ప్రశ్న : మీకు తెలిసీ అసంబద్ధ వాదగుణం గల కథలు మీ కథల్లో ఉన్నవా?

జవాబు: అంటే అసంబద్ధ వాదాన్ని సూచింప చేదామని రాద్దామనీ రాసిన కథలు లేవు. జీవితంలో ఉన్న అసంబద్ధతను కొన్ని చోట్ల అనుభవించి, చదివికాదు – అనుభవించి, అలా వచ్చినవి ఉన్నాయి. కాని అబ్సర్డ్ కథ రాద్దామని, అబ్సర్డ్ పోయెం రాద్దామని అలాటి ఉద్దేశ్యంతో నేను ఎప్పుడూ రాయలేదు.

ప్రశ్న : మీ కథలోని ఈ పాత్రను అర్థం చేసుకోడానికి పాఠకుడికి కఠినంగా ఉంటుందేమో! కథని కొద్దిగా సంస్కరిద్దామని ప్రయత్నించారా?

జవాబు: చిన్నప్పటినుండీ నాకు నేనే కఠినంగా ఉండేవాడిని. నా కాఠిన్యాన్ని ప్రతిఫలించటానికి నాకు వచ్చిన తెలుగులో, లేదా మొదట్లో ఇంగ్లీషులో రాసినపుడూ ప్రయత్నం చేసేవాడిని. ఇప్పుడు నేను రాసింది కొంతమందికి బోధపడలేదు అని అంటే నాకు విచారం వేస్తుంది. నా మీద నాకే దయపుడ్తుంది. ఎందుకు పుడ్తుందంటే నాలో ఉన్న కాంప్లెక్సిటీస్ (భిన్న భావాల సంక్లిష్టతలు) నాకే బోధపడలేదు.

ప్రశ్న : మీలో ఉన్న సంక్లిష్టతలు ఏమిటసలు?

జవాబు: బహువచనం కూడా ఉపయోగించనక్కర్లేదు. కాంప్లెక్సిటీ, మనిషిగా పుట్టడమే కాంప్లెక్సిటీ. అదే నా కాంప్లెక్సిటీ. మనిషిగా ఉండటం మనిషిగా పుట్టడం అదే నా కాంప్లెక్సిటీ.

ప్రశ్న : మీరు మనిషి కావటం వల్లనేకదా వాస్తవం, కల్పన, మిత్, కొంత థియరీ తెలిసింది. ఇలా వీటిని కలబోసి రంగుల పెంకులున్న పలక (మొజాయిక్) తయారు చేయడానికి అవకాశంకల మేస్త్రీ అయ్యారు? కాంప్లెక్సిటీ ఏముంది ఇందులో?

జవాబు: మొజాయిక్ అంటే కాంప్లెక్సిటీయే కదా! తెల్లకాగితం కాదుకదా!

ప్రశ్న : మీ రచనలు చదివి ఎవరేనా వీటిలో మాజిక్ రియలిజం ఉంది అని ముద్రవేసారనుకోండి ? ఎలా ఫీలవుతారు?

జవాబు: నేనేమీ ఫీలవను. దీనికో ఉదాహరణ చెబ్తాను. నేను రాసినవాటిమీద ఒకతను వి.వి.రమణ మూర్తి సరదాకి ఎం.ఫిల్ థీసిస్ రాశాడు. ఆ రాసిన సమయంలో అతను నన్నెపుడూ కలుసుకోలేదు. ఇప్పుడు మామూలుగా కలిసి మీలా ప్రశ్నలు వేస్తూ ఉంటాడు. అది అతని గొప్పతనమే అనుకుంటాను నేను. థీసిస్ తర్వాత అతన్ని అడిగాను, ఇంత0కు ముందు నాకు ఉత్తరమైనా రాయలేదు. నన్ను కలవలేదు. ఈ విషయాలు ఎలా తెలుసుకున్నావ్

అని అడిగాను. "అలా ఉత్తరాలు రాసి మిమ్మల్ని కలిసి వుంటే ఇంకెలా ఉండేదో నా థీసిస్! అదంతా లేకుండా రాద్దామని నా కనిపించింది" అన్నాడు రమణమూర్తి. అప్పుడు నేను చెప్పాను, నీ థీసిస్ తర్వాత నా గురించి నాకు ఎప్పుడూ తెలియని విషయాలు తెలిసాయి నా గురించి అని. థీసిస్‌లో ఆయన చాలా (ముఖాలు) యాస్పెక్టులు స్పృశించారు. అస్తిత్వవాదిగా, అసంబద్ధవాదిగా తాత్త్వికుడిగా నా గురించి చెప్పాడు. అవన్నీ నాకు తెలియనివి ఆశ్చర్యంగా తెలియజెప్పాడు. ఎందుకంటే నేను అస్తిత్వవాద కథ రాద్దామనీ అసంబద్ధ వాద కథ రాద్దామనీ, ఒక తాత్త్విక కథరాద్దామని ముందే నిర్ణయించిన మానసిక స్థితిలో ఎప్పుడూ రాయలేదు. రాశాను – కథమొదలు పెట్టిన దగ్గర నుంచీ అంతం అయ్యేదాకా చచ్చాను. ఆ కథను చంపేను. ఆ చచ్చిన కథతో నేను చాలా కాలం జీవించాను. అవి అలాగే ఉన్నాయి. నేను ఇలాగే ఉన్నాను.



మార్చి (2011)

మీరు పంపిన కొత్త ***మిసిమి*** కొత్త అంశాలతో అరుదుగా వుంది. ప్రకటనలతో పేపర్లు నింపే పత్రికలు చాలా వున్నాయి. అచ్చంగా కళా రంగానికి చెందిన విషయాలను, విషయ సమగ్రత, సమర్పణలో నిజాయితీ, నిబద్ధత నియమాలుగా పెట్టుకొని పదుగురికి ఆదర్శంగా వుంటున్న పత్రిక – ***మిసిమి***. తెలుగు భారతికి వెలుగు హారతి ఇవ్వాలని కోరుతూ.

**– డా. పి.ఆర్. హరినాథ్,** మైసూర్.

వివిధ శీర్షికలతో రూపాంతరం చెందిన పత్రిక అలరించింది. మనోజ్‌దాస్ గారి వ్యాసం–జీవితానికి అర్థం....అవుతూనే వచ్చింది. 'మానాన్నగారు' పరిచయం, రచయితల బలహీనతలకు ఐతిహాసిక ప్రభావం ఉంటుంది. చిత్రకారుని అంతరంగం – వోలేటి పార్వతీశం, నటరాజ రామకృష్ణగారి నాట్యమే కాదు రచనకూడా కదం తొక్కుతోంది. సంస్కృతి...లో మానవులంతా ఒకే జాతి, ఒకే సంస్కృతి. ఇంద్రుడు శారీరక సుఖాలను కాంక్షించిన వాడు. కర్మకాలి మన అధిపతి, గతకాలమ్.... అందరూ విధిచేత చిక్కినవారమే.

నాగరకత...ఎన్ని యుగాలైన నాగరకత విషం కక్కుతూనే వుంది. ఆకలి అయినపుడు, పులికి, సింహానికి తేడా ఏముంటుంది? ఆత్మవంచన చేసుకునే పీఠాధిపతులు... ఇలా ఎన్నైనా, ఎన్నో భావాలతో అలజడిగా వుండే నా మనస్సు కాగితం మీద పెట్టలేని పిరికితనానికి అద్దం ఈ రచన. శూన్యగీతి...సంసారగీతి, రైలు పట్టాలే సంసారం. శ్రీపాద ఉత్తరం... తారీఖులుంటే బాగుండేది. కదిలించింది. 'చందమామ' గురించి – 'మిసిమి' గురించి వ్రాస్తుంటే ముగింపు వుంటుందా.

**– రత్తయ్య,** తెనాలి.



జనవరి (2013)

పురుషులందు పుణ్య పురుషులు వేరయా–అన్నాడు వేమన. పత్రిక లందు పుణ్య పత్రికలు వేరయా అంటాం మనమందరము కూడా ***మిసిమి*** పత్రిక సంచికలు రెండు మూడు చదివితే. ***మిసిమి*** ఒక విలువైన మాసపత్రిక. అసలది చూచేటప్పటికి రసజ్ఞులైన పాఠకుల హృదయాలు పులకిస్తాయి. ఇక విషయానికి వస్తే, భారతీయ దర్శనాలు పరిచయం చేయబడతాయి–ఒక సంచికలో తాత్త్వికులు జిడ్డు కృష్ణమూర్తి తో ముఖాముఖి–మరో సంచికలో చార్వాక దర్శనం మీద విమర్శ వుంటుంది. కాలక్షేపానికి చదివే పత్రిక కాదు ***మిసిమి.*** సాహిత్యం, వేదాంతం, తత్త్వశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం, మన దర్శనాలు, సామాజిక సిద్ధాంతాలు – ఇటువంటి లోతైన అంశాలకు సంబంధించిన దుర్గ్రాహ్యమైన విషయాలను కూడా, సులభ గ్రాహ్యంగా అందిస్తుంది ***మిసిమి*** 'మేధావుల మెతకలు', 'మధురవాణి ఇంటర్వ్యూలు'తో పాఠకలోకం ఆలోచనా స్రవంతిని మలుపు త్రిప్పిన రవీంద్రనాథ్ అనేక వినూత్న శీర్షికలను ***మిసిమి*** పాఠకులకు అందించారు.

**- తెలుగు విద్యార్థి ఆగష్టు 1995.**

మహాభారతంలో పాత్రలు

# కర్ణుని స్వగతం

– శ్రీమతి ఐరావతీ కర్వే ; భావపరిశీలన : రవీంద్రనాథ్

**ఒక** వ్యక్తి తన తల్లిదండ్రులు, కులము తెలియని స్థితిలో ఒక విధమైన మనోవేదనకు గురైననాడు దానినే Identity crisis అంటారు. అలాంటి బాధనే కర్ణుడు ఎదుర్కోవలసి వచ్చింది. ఈ స్థితిని విజయవంతంగా పూర్తిచేసినవారు తమ రంగంలో అఖండ విజయాలను సాధిస్తారు. ముఖ్యంగా నేటి యువత దీనిని ఎక్కువగా ఎదుర్కొంటోంది. ఇది నాటి కర్ణునికీ, విదురునికీ కూడా తప్పలేదు. అసలు ఈ సంకటస్థితి అనేది "తానెవరు?", "తానేమిటి?" అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం కనుగొనడంలో ఉంది. అందుకే "ఆత్మానం విద్ధి" "Know thyself" నిన్ను నీవు తెలుసుకోవడంలో మోక్షం ఉంది. ఈ ప్రశ్నకు సమాధానం పూర్తిగా సంతృప్తిగా చెప్పుకోగలిగినవారు ఎవరూ లేరనే చెప్పవచ్చు. పసిబిడ్డలు మొదట మాటలు నేర్చుకొనేటప్పుడు అమ్మ, అత్త, తాతలతో ప్రారంభిస్తారు. ఆ పదాల వెనుక ఉన్న అర్థం కొంచెం కొంచెంగానైనా అర్థమయ్యేది ఇక్కడే. తరువాత మరికొన్ని పదాలు నేర్చుకొన్నా, ఈ కోవలో చివరగా పిల్లవాడు నేర్చుకొనేది 'నేను' అనే పదం. ఈ పదం భావన నాలుగేళ్ళు వచ్చేసరికి గాని సరిగా ఉపయోగించి అర్థం చేసుకోలేడు. 'నీషే' అనే దార్శనికుడు తన కొడుకు ప్రథమంగా "నేను" అనే పదాన్ని ఉపయోగించిన నాడు పెద్దవిందు ఏర్పాటు చేస్తానని, అలాగే చేశాడట. "నేను" భావనతో పాటు "నీవు" భావన కూడ ఏర్పడుతుంది. క్రమంగా "నేను", "నన్ను", "నాది" పొదుకొంటాయి. కాని ఈ పదాల వెనుక అర్థం అప్పటికి ఎప్పటికి పూర్తిగా బోధపడదు. 'నేను' పదం ఏ రెండు క్షణాలలోను ఒకటిగా ఉండదు, అది గతిశీలమైంది. 'నేను' భావన విస్తృతమయ్యే కొలది, నేను, నా తండ్రి, నా తల్లి, స్నేహితుడు, నా వస్తువులు, నా నుంచి ఫలాన ఫలానావి ఆశిస్తున్నారు, వారి ఆశలను నేను దృష్టిలో ఉంచుకోవాలి లాంటి కొలతలు ఏర్పడుతాయి. అసలు 'నేను' భావన ముఖ్యంగా సామాజిక సంబంధాల నుంచి నిష్పన్నమవుతుంది. 'నేను' అంటే ఎవరు? "నేను అనుకొంటున్న నేను 'నేను' కాదు. నీవు అనుకొంటున్న 'నేనూ', 'నేను' కాదు. నన్ను గురించి నీవేమను కొంటున్నావని నేననుకొంటున్నానో అదే "నేను". (I am not what I think I am, not what you think I am, I am what I think you think I am) ఈ విధంగా సామాజిక సంబంధాల నుంచి ఏర్పడినను 'నేను'–'కొడుకు'గా, భర్తగా, తండ్రిగా, స్నేహితునిగా, క్లబ్ సభ్యునిగా, వృత్తి చేసేవానిగా ఎన్నో పాత్రలు నిర్వహిస్తుంది. ఈ పాత్రలు 'నేను' తాదాత్మ్యతను (Identity) ని నిర్ణయిస్తాయి. సామాజిక ప్రవర్తన, సమాజంలో అతని స్థాయి అతనికి విహితమైన కర్మకాండని అతడు ఏమిటో, ఎవరో నిర్ణయిస్తాయి. ఈ విషయాల్లో ఒడుదుడుకులు ఏర్పడిన వారు తాదాత్మ్యతా సంకట స్థితిని తప్పించుకోలేరు.

**సమాజంలో స్థానం :**

కర్ణుడు, విదురుడు ముఖ్యంగా ఈ స్థితి నుంచి బయటపడలేక పోవడానికి కారణం, సమాజంలో వారికి ఇవ్వబడిన స్థానం. జన్మసమాజంలో మనస్థానాన్ని, స్థాయిని నిర్ణయిస్తుంది. అలాగే వారి జన్మ వారి స్థానాన్ని అపరివర్తనీయంగా ఒక్కమాటే నిర్ణయించి వేసింది. విదురుడు సూత స్త్రీకి జన్మించాడు. అతనికి తద్విహితమైన జాతక కర్మలే నిర్వహించబడ్డాయి. ధృతరాష్ట్రుడు అతనిని తన సోదరుడని ప్రక్కన కూర్చోబెట్టుకొన్నా, అతనికి ఎవరూ క్షత్రియకన్యను అర్ధాంగిగా ఇవ్వలేదు. క్షత్రియులకు దక్కే గౌరవం అతనికి దక్కలేదు.

కర్ణుడూ ఇదే విషవలయంలో పడ్డాడు. సమాజంలో అతనికి ఒక స్థిరమైన స్థానం దక్కలేదు. అతనికి న్యాయంగా రావసిన స్థానమేదో అతనికి తెలుసు. దానికోసమే అతడు జీవితాంతం ఆక్రోశించాడు, పోరాడాడు. దానిని పొందలేక పోవడంలోనే అతని బాధంతా ఉంది.

రాధ, అధిరథులు కర్ణుని ప్రేమగానే పెంచినా, వారెప్పుడూ అతడు తమకు దొరికిన విధానాన్ని అతని నుంచి దాచలేదు. అతడొక బంగారు పేటికలో క్షత్రియోచితమైన తను త్రాణంతో, కర్ణకుండలాలతో దొరికాడని వారు అతనికి చెప్పారు. వారు అతనికి వసుసేనుడని క్షత్రియ నామమే పెట్టారు. కనుక అతడు సూతుల ఇంట పెరిగినా, అతనికి తన వర్ణమేదో తెలుసు. పెంపుడు తల్లిదండ్రులను అతడు బాగా ప్రేమించినా ఏనాటికైనా తన అసలు తల్లిదండ్రులు తనను అంగీకరించి క్షత్రియునిగా ప్రకటించకపోతారా అనే ఆశతోనే పెరిగాడు. సూతుడుగానే మిగిలిపోవడం అతనికి ఏమాత్రం ఇష్టం లేదు. ఇదీ అతని జీవన ఘర్షణ. తాదాత్మ్యతా సంకటస్థితి.

సూతుడుగా అతడు ఆయుధవిద్యకు అనర్హుడు. అందుకనే బ్రాహ్మణుడుగా మారువేషంలో గురువు దగ్గర విలువిద్య నేర్చుకొని, యాదృచ్ఛికంగా విషయం బయటపడి, "నేర్చుకొన్నదంతా మరచిపోదువుగాక", అని శపింపబడ్డాడు. ఈ కథ ప్రక్షిప్తంగా కనపడుతోంది. ఎందుకంటే అతని గురువని చెప్పబడిన పరశురాముడు కర్ణునికన్నా ఎన్నో శతాబ్దాలు ముందువాడు. దీనినిబట్టి మనకు తెలిసేది ఏమంటే, నాడు యుద్ధవిద్యలకు బ్రాహ్మణ క్షత్రియులు మాత్రమే అర్హులనీ, ఇలాంటి నియమం ఉన్నా కూడా కర్ణుడు ఎలాగో యుద్ధవిద్యల్లో ప్రావీణ్యత సంపాదించాడనీ.

తన యుద్ధవిద్యా కౌశలాన్ని ప్రదర్శించబోయి ఒకసారి కర్ణుడు భంగపడ్డాడు. ద్రోణుని దగ్గర కౌరవ, పాండవులు విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఆయన వారి ప్రావీణ్యతా ప్రదర్శనను రాజాస్థానంలో ఏర్పాడు చేశాడు. ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, విదురుడు, భీష్ముడు ఆ ప్రదర్శనను తిలకించడానికి విచ్చేశారు. అర్జునుడు ధనుర్విద్యలో అందరిని తలదన్ని అందరి మెప్పు పొందాడు. ఆ సమయంలో చిన్న కలకలం రేగింది. ప్రవేశమార్గం వద్ద బలిష్ఠుడైన యువకుడొకడు ప్రవేశించి "అర్జునుడు చేసినదంతా నేనూ చేయగలను" అని చెప్పి, ప్రదర్శనకు పూనుకొన్నాడు. తన కౌశలాన్నంతా ప్రదర్శించిన తరువాత అర్జునుణ్ణి ద్వంద్వ యుద్ధానికి సవాలు విసిరాడు. ఈ యువకుడే కర్ణుడు. అంతవరకు ఇతడెవరో రాజాస్థానంలో ఎవరికీ తెలియదు. ఈ సంఘటన చిన్నదే అయినా, బహు నాటకీయంగా జరిగింది. తరువాత జరగబోయే భారతకథకు మంచి పట్టునిచ్చింది. నూతన అర్థాన్ని కలిపించింది.

ద్రోణుడు అసలు తన శిష్యుల ప్రదర్శనను ఏర్పాటు చేశాడు. బయటవారినెవరినీ ఆహ్వానించలేదు. అధిరథునికీ తెలియదు. తన యుద్ధవిద్యాకౌశలం చూసిన తరువాత, తన క్షత్రియ మాతాపితలు తనను పుత్రునిగా అంగీకరించవచ్చుననే ఆశతోనే కర్ణుడు రంగప్రవేశం చేశాడు. ఇదే అతని ఉద్దేశ్యం అయితే, విద్యాప్రదర్శన చేసి ఊరుకొంటే సరిపోయేది. అర్జునుణ్ణి ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించవలసిన పనిలేదు.

ఈ సంఘటన మరో ప్రశ్నను లేవనెత్తుతుంది. అది వారి వయస్సుల ప్రశ్న. ఈ సంఘటనా సమయంలో ధర్మజునికి పదహారు సంవత్సరాలున్నాయనుకొంటే, అర్జునునికి పదునాలుగు సంవత్సరాల కన్నా ఎక్కువ ఉండే వీలులేదు. ఎందుకంటే ఇద్దరి మధ్యలో భీముడు ఉన్నాడు గదా. ఒకవేళ ధర్మరాజుకు పద్దెనిమిది సంవత్సరాలనుకొంటే, అర్జునిడికి పదహారు. కర్ణుడు కుంతికి వివాహానికి ముందు పుట్టాడు గనుక, అర్జునునికంటె నాలుగేళ్ళు పెద్దవాడవుతాడు. అంటే అతడు బాల్యాన్ని దాటి వయోజనుడు (adult) అవుతాడు. ఈ విధంగా చూస్తే ఒక వయోజనుడు ఒక బాలుని సవాలు చేయడం ఏమి సబబు? కర్ణుడు ఎప్పుడూ కోపంలో ఇలాంటి అనుచితమైన పనులనే చేస్తాడు. తొందరపాటును ప్రదర్శిస్తాడు. వేగిరపాటు క్షత్రియ శీల లక్షణమే అయినా సంకుచిత మనస్కుడుగా ఉండకూడదు. దీనిని కర్ణుడు ఉల్లంఘించాడు.




సెప్టెంబరు (1998)

**మిసిమి** చదవటం ఒక నాగరికత, ఒక దర్జా, ఒక షోకు,
ఒక అందం, ఒక అనుభూతి.
చదవకపోవటం ఒకటే దురదృష్టం.

**- తనికెళ్ళ భరణి, రచయిత, దర్శకులు, హైదరాబాదు.**

తానొక క్షత్రియుని అక్రమ సంతానమనే బాధ అతనిని పట్టి పీడిస్తోంది. కొన్ని పరిస్థితులలో అటువంటి అక్రమ సంతానాన్ని క్రమ సంతానంగా గుర్తించవచ్చుగాని, ఈ కర్ణుని విషయంలో అది కుదురలేదు. అతడు సూతవర్గం తరఫునకాని, యుద్ధకౌశలం ఉన్న ప్రతి ఒక్కరిని క్షత్రియునిగా గుర్తించాలనే సిద్ధాంతం కోసం కాని పోట్లాడడం లేదు. అది వర్గపోరాటం కాదు. తన స్వంతం కోసం పెనగులాడుతున్నాడు. ప్రదర్శన క్షేత్రంలో గుర్తింపూ పొందలేకపోయాడు. అతని జన్మ రహస్యమూ రహస్యంగానే మిగిలిపోయింది. ఫలితంగా కుపితుడైపోయాడు.

కర్ణుడు సవాలు విసిరినప్పుడు అక్కడ ఉన్న క్షత్రియజనం రెండు వర్గాలుగా చీలిపోయింది. ధర్మరాజు, అతని సోదరులు, భీష్ముడు అర్జునుని వైపు నిలబడ్డారు. దుర్యోధనాదులు కర్ణునికోపు కాశారు. యుద్ధనీతి తెలిసిన కృపాచార్యుడు ఇలా ప్రకటించాడు:

"ఇదిగో, పాండునందనుడు అర్జునుడు సవాలును అంగీకరిస్తున్నాడు. ఓ అజ్ఞాత అభియోక్త! మీరెవరు? మీ కులమేది?"

కర్ణుడు కన్నుల నిండ నీరు నిండగా మూగవోయాడు. అప్పుడు దుర్యోధనుడు కల్పించుకొని, "యుద్ధవీరుడు కులగోత్రాలు ప్రకటించ పనిలేదు. అర్జునునికి రాజు కాని వానితో పోరాడడం ఇష్టం లేకపోతే, అతనిని నేను ఇదే రాజును చేస్తున్నా"నని అంగరాజ్యానికి రాజును చేశాడు. (ఇదంతా కూడ తరువాత కలిపిన కథగా కనిపిస్తున్నది. ఎలాగంటే – దుర్యోధనుడు ఆ సమయంలో రాకుమారుడే కాని రాజు కాదు. అతడి తండ్రి సింహాసనాన్ని అధిష్టించగా, భీష్ముడు రాజ్యాన్ని పాలిస్తున్నాడు. తరువాతి ప్రకరణంలో ధర్మరాజు రాజవుతాడనేది స్పష్టం చేయబడింది. ఈ పరిస్థితులలో దుర్యోధనుడు కర్ణునికి రాజ్యాన్ని ఎలా ఇస్తాడు? అందుకని కర్ణ అంగరాజ్యాభిషేకం అసంభవం). కర్ణుడు ఎక్కడకు వెళ్ళింది తెలిసికొన్న అధిరథుడు బిరబిర పరుగెత్తుకొచ్చాడు. అతనిని చూచిన కర్ణుడు ఎదురేగి, 'తండ్రీ' అని సంబోధించాడు. అధిరథుడు అతనిని కౌగలించుకొన్నాడు. దీనితో కృపాచార్యుని సందేహం తీరింది. ఈవిధంగా క్షత్రియత్వం పొందాలనే అతని ఆశ అడియాస అయ్యింది. సూతుడనే విషయం బహిరంగమైంది. పుండు మీద కారం చల్లినట్లుగా భీముడు, "నీవు నీ వృత్తికి అనుగుణంగా కత్తికాక, చర్నాకోల పట్టవలసినవాడవు. అలాగే ఉండు" అన్నాడు. అప్పుడు దుర్యోధనుడు కర్ణుని కౌగలించుకొని తన స్నేహ హస్తాన్ని అందించాడు. అప్పటికే సూర్యాస్తమయమైంది. తగవు, ప్రదర్శన అలా ముగిశాయి.

తనను సతతం వేధిస్తున్న "తానెవరు?" అనే ప్రశ్నకు సమాధానం చిక్కకపోగా, కర్ణుడు మరింత అయోమయంలో పడిపోయాడు. అప్పుడు కాకపోయినా, తరువాత ఎప్పుడో కర్ణుడు అంగరాజయ్యాడు. దుర్యోధనుని కొలువులో నిలిచిపోయాడు. అతనికి హితుడు, స్నేహితుడు అయ్యాడు. కాని ఇది ఏమాత్రం అతని సామాజిక అంతస్తును పెంచలేక పోయింది. క్షత్రియునితో సమానం కాలేకపోయాడు. దుర్యోధనుడు కూడ తన కుటుంబం నుంచి ఒక క్షత్రియకన్యను కట్టబెట్టలేదు (ఉద్యోగపర్వంలో కర్ణుడు చెప్పినట్లు, తానేకాదు తన పుత్రులు కూడ సూతకులంలోనే వివాహమాడారు). కర్ణుడు దుర్యోధనుని అంటిపెట్టుకొని ఉన్నది వాత్సల్యంతో కాదు, విశ్వాసపరంగానే. తన హీనకులం బహిరంగంగా ధ్రువీకరించబడిన కొలదీ, తన క్షత్రియమూలం లోలోపల తన మనస్సులో నాటుకుపోసాగింది. దీనితో అతని మనోవ్యథ మరింత ప్రబలమైంది.




ఫిబ్రవరి (2012)

ఎన్ని అవాంతరాలు వచ్చినా రవీంద్రనాథ్ ఉత్తమ సాహిత్యాన్ని ప్రోది చేయడం మానుకోలేదు. ఏడు పదులు వయసు దాటిన తర్వాత కూడా ఆయన పత్రికా ప్రచురణ ఆపలేదు. ఉత్తమ అభిరుచి గల మిసిమి పత్రికను ఆయన వ్యయ, ప్రయాసలకోర్చి నడుపుతున్నారు. ఈ పత్రిక అనేక కారణాలవల్ల విలక్షణమైంది. దీనికి సర్క్యులేషన్ జాడ్యం అంటలేదు. ఈ రోజుల్లో అమ్మకాలతో సంబంధం లేకుండా ఉత్తమాభిరుచిని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన పత్రిక **మిసిమి**. ఈ పత్రికలో కథలు లేవు. కవిత్వం లేదు. క్రైమ్, సెక్స్ తబిసీళ్లు లేవు. కాని ఈ పత్రిక మేధావులను ఆకట్టుకుంది. **- ఆంధ్రభూమి, ఆదివారం, ఫిబ్రవరి 23, 1992).**

పాండవులతో తనకేవిధంగాను సంబంధం ఉందని అతనికి తెలియదు. మరి పాండవులను ఎందుకు ద్వేషించినట్లు? బహుశా ఈ దిగువ కారణాలు కావచ్చు: మనం ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు, భీముడు కావాలనే పుండు మీద కారం చల్లాడు. అర్జునుని విలుకానితనంపై అతనికి అసూయ ఉంది. పాండవశత్రువైన దుర్యోధనుని స్నేహం మరోకారణం. దురదృష్టం ఏమిటంటే, ఈ మొదటి సమావేశంలోనే అతని న్యూనత బయటపడింది. దానితో అతనిలో అసూయా ద్వేషాలు పెరిగాయి. ఆ తరువాత కూడా ఎప్పుడూ కర్ణార్జున సమాఘాతంలో అర్జునుడిదే పైచేయి అయింది తప్ప, కర్ణుడు గెలిచింది లేదు.

ద్రౌపదీ స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని ఛేదించినవాడు అర్జునుడే. (కర్ణుడూ ప్రయత్నించాడనీ, అతడు హీన కులజుడు కాన ద్రౌపది ఒప్పుకోలేదనీ పాఠాంతరం) అతడప్పుడు బ్రాహ్మణవేషంలో ఉన్నాడు. ఒక క్షత్రియ కన్యను బ్రాహ్మణుడు గెలవడమేమిటని క్షత్రియులంతా అర్జునునిపై బడ్డారు. అప్పుడు భీమార్జునులు ఒక ప్రక్క, కర్ణునితో సహా క్షత్రియులంతా రెండోప్రక్క. భీమార్జునులు క్షత్రియ వాహినినంతా నిర్జించారు. కొంతసేపు యుద్ధం జరిగిన తరువాత కర్ణుడు తాను బ్రాహ్మణులతో తలపడనని చెప్పి యుద్ధం నుంచి నిష్క్రమించినట్లు తెలుస్తుంది. యుద్ధంలో దెబ్బతిన్న అతడు అవమానం నుంచి బయటపడడానికి పన్నిన కుంటిసాకుగా అది కనిపిస్తున్నది.

ద్యూత సంఘటన అందరిని పరీక్షకు గురిచేసింది. అంధుడైన ధృతరాష్ట్రుడు "ఏమి జరుగుతోంది? ఏమి జరుగుతోందని" ప్రశ్నిస్తున్నాడు. దుశ్శాసనుడు సంతోషంతో ఎగిరి గంతులు వేస్తున్నాడు. విదురుడు ద్రౌపది గౌరవ రక్షణకు యత్నిస్తున్నాడు. బాహిరకుడైన కర్ణుడూ ఈ కుటుంబం తగవులో పాలుపంచుకున్నాడు. అత్యంతంగా అందరికంటే హీనుడని ఋజువు చేసుకొన్నాడు. ధర్మరాజు ద్యూతంలో ఓడి తనను, తమ్ములను, భార్యను ఒడ్డి ఓడిపోయాడు. ద్రౌపదిని రాజసభకు బరబరా ఈడ్చుకు వచ్చారు. "తనను కోల్పోయి నన్ను కోల్పోయాడా? నన్ను కోల్పోయి తనను కోల్పోయాడా?"– అనే ద్రౌపది ప్రశ్నకు సమాధానం సభ నుంచి రాలేదు. ఒక్క వికర్ణుడు (దుర్యోధనుని తమ్ముడు) మాత్రం ఒక కులీన మహిళకు ఇలాంటి అవమానం జరుగరాదని వాదించాడు. అప్పుడు కర్ణుడు లేచి వికర్ణునికి అడ్డు తగిలాడు: "పంచభర్తృక లంజకంటే గొప్పది కాదు. అటువంటి లంజను సభకు ఈడ్చుకు రావడంలో దోషం ఏమీలేదు. అదీ, దాని భర్తలూ అందరూ దాసజనమే. వాళ్ళ ఒంటిమీది బట్టలు కూడ వారివి కావు "వారి ఒంటిపై ఆభరణాలను తొలగించండి". ఇది వినగానే పాండవులు తమపై ఉత్తరీయాలను తామే తొలగించారు. అప్పుడు దుశ్శాసనుడు ద్రౌపది వస్త్రాపహరణం ప్రారంభించాడు. ద్రౌపదిని అంతగా వస్త్రాపహరణం చేసి అవమానించడానికి కారణం కర్ణుని ప్రోద్బలమే. కర్ణుడు ఈ మాటలు పలుకకముందు ద్రౌపది వస్త్రాలు తీసివేయాలనే ఆలోచనే ఎవరికీ రాలేదు. కౌరవ పాండవులు తగవు పడింది రాజ్యంకోసం. దానిని యుద్ధం ద్వారానో పాచికల ద్వారానో పరిష్కరించుకోవచ్చు. అది వారి ఇష్టం. కాని ఈ విధంగా ఒక భద్ర మహిళను అవమానపరిచే కుసంస్కారానికి కర్ణుడే మూలం. ఇందులో కర్ణుని హీన, అహీన కులానికి ఏమీ సంబంధం లేదు. అసలు ఏ పరిస్థితులలోనైనా ఒక ఉన్నత కుల సంజాతను అవమానం చేయవచ్చా? అనేది మౌలిక ప్రశ్న. అసలు దాయాదుల మధ్య తగవులో తాను తల దూర్చవలసిన అవసరం కర్ణుడికి ఏముంది? పాల్గొన్నాడు.

జనవరి (2004)

***మిసిమి*** ద్వారా ప్రపంచ "మేధావుల మెతకలు" అనే శీర్షికలో కారల్ మార్క్సు నుండి టాల్‌స్టాయి మొదలైన 6 గురు వ్యక్తుల గురించి, వాళ్ళ పుస్తకాల్లోని వాళ్ళ మేధాశక్తికి సంబంధించిన ప్రయివేటు జీవితంలో ఎన్నెన్ని ఆకృత్యాలు చేశారో తెలుసుకునేందుకు అవకాశం కలుగజేసినందుకు తెలుగు పాఠకులు *మిసిమి*కి రుణపడి వున్నారు. కొన్ని విషయాలలో వాళ్ళు చేసిన పనులు చదివితే మామూలు మనుష్యులు ఎంత మంచివారనే అభిప్రాయం కలుగుతుంది. దూరపు కొండలు నునుపు అనే విషయం ఋజువయింది.

**- సుమలత, అనంతపురం.**

పాల్గొని తన అంతర్గత ఒత్తిడి క్రింద మానవతా విలువలను మరచిపోయాడు.

ఘోషయాత్రలో కూడ కర్ణుని అవగుణం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఒక యుద్ధవీరుడుగా పాటించవలసిన ధర్మాన్ని పాటించలేకపోయాడు. దుర్యోధనుడు సపరివారంగా అంగరంగ వైభవంతో తమ పటాటోపాన్ని, వైభవాన్ని పాండవులకు ప్రదర్శించడానికి ఘోషయాత్ర నెపాన పాండవులున్న అరణ్యప్రాంతానికి వెళతాడు. దుశ్శాసనుడూ, కర్ణుడూ కూడా తోడు వెళ్తారు(అప్పుడు పాండవులు అరణ్యంలో ప్రవాసంలో ఉన్నారు). ఈ సమయంలో వనయాత్రకు వచ్చిన గంధర్వులతో దుర్యోధనాదులకు యుద్ధం జరుగుతుంది. కర్ణుడు పారిపోయి ప్రక్కగ్రామంలో తలదాచుకొంటాడు. పాండవులు గంధర్వులను నిర్జించి, బంధితుడైన దుర్యోధనుని విడిపించి, హస్తినకు పంపుతారు. ఈలోపు భీష్ముడు దుర్యోధనుని గంధర్వులు బంధించారని విని యుద్ధానికి బయలు దేరుతాడు. దుర్యోధనుని పాండవులు విడిపించారని మార్గమధ్యంలోనే భీష్మునికి తెలుస్తుంది. అప్పుడు కర్ణుడు భీష్ముని కలిసి, దుర్యోధనుని క్షేమ సమాచారాలడుగుతాడు. భీష్మునికి కోపం వచ్చి, "రారాజుకు విశ్వాసులైన వారెవ్వరూ రాజు ఎలా ఉన్నాడని అడిగేందుకు బ్రతికి ఉండరు. రాజు అపాయకర పరిస్థితులలో ఉంటే, నీ రక్షణ ఎలా చూసుకొన్నావు? రాజుమీద నీకున్న ప్రేమ కపట ప్రేమ" అని అన్నాడు. ఇప్పటివరకు తాను దుర్యోధనునికి స్నేహితుడననే భ్రమలో ఉన్నాడు. భీష్ముడు పెట్టిన చీవాట్లతో తలవాచిపోయింది. ఈ పరీక్షలోనూ కర్ణుడు ఓడిపోయాడు.

మరో సంఘటన గోగ్రహణం. కౌరవులు విరటుని ఆవులను తోలుకు వచ్చే ఘటన. అప్పుడు అర్జునుడు ఒక్కడే కౌరవులనందరినీ తరిమి, వారి దుస్తులను విరటుని కూతురుకు బొమ్మ గుడ్డలుగా బహూకరిస్తాడు. పిరికిపంద అయిన సారథిని పెట్టుకొని అర్జునుడు కౌరవులనందరిని నిర్జించడమే కాదు; కర్ణునిపై తన ఆధిక్యతను రుజువు చేసుకొన్నాడు. ఇక్కడా కర్ణుడు అర్జునునికి దీటు కాలేదు.

కర్ణుడు సూర్యసుతుడని చెబుతారు. ఆ సంగతి తెలియకుండానే అతడు మొదటి నుంచి సూర్యుణ్ణే పూజిస్తాడు. ఎందుకో తెలియదు. సహజ కవచ కుండలాలతో అతడు పుట్టాడు. వాటికి ఏవో అద్భుత శక్తులున్నాయి. కాని వీటిని ఇంద్రునికి ఇచ్చాడు. మరి ఈ సహజ కవచం, మనం ఇంతకు ముందు చూసినట్లు ఇప్పటి వరకు కర్ణుడు చేసిన యుద్ధాలలో అతనికి ఏమాత్రం దాని అద్భుతశక్తితో పనిచేసినట్లు కనపడదు. అసలు ఇంద్రుడు వాటిని కోరినప్పుడు తన శరీరం నుండి రక్తం కారుతుండగా వాటిని పెరికి అతనికి ఇవ్వవలసిన అగత్యం ఏమీ లేదు. తాను అంతటి ఉదారుడనని, దాతనని రుజువు చేసుకోవలసిన అవసరం ఏమిటి? కర్ణుడు ఎప్పుడూ కూడా మంచి, చెడూ – రెండింటిలోనూ అతికి పోతాడు. తన స్థానాన్ని గురించిన అభద్రతాభావం దీనికి కారణమా? తాను క్షత్రియుల కంటె ఎందులోను ఏమాత్రం తీసిపోనని రుజువు చేసుకోవడానికి సహజ కవచకుండలాలను దానం చేశాడా?

కర్ణుని జీవితంలో మహదానందాన్ని ఇచ్చిన సంఘటనలు లేకపోలేదు. అవిరెండు: ఇందులో ఒకటి తానెవరో తెలిసిన సంఘటన. అప్పుడు అతని మనస్సులో ఏర్పడిన శంకా స్థితి నుంచి మహోదాత్తంగా అతడు బయటపడ్డాడు. అతడు జీవితమంతా శంకాస్థితిలోనే ఉండిపోయాడు. ఈ రెండు సంఘటనల్లో అతని ఆలోచనలు, చేతలు స్పష్టంగా, నిర్ణయాత్మకంగా ఉన్నాయి. కృష్ణుడు వచ్చి పాండవులతో చేరిపోమ్మని కర్ణుని అడుగుతాడు. ఈ సందర్భంలోనే అతడు కుంతి పెద్దకొడుకని, ఆ కారణంగా అతడు పాండవులకు అగ్రజుడని చెప్పి, క్షత్రియునిగా అతనికి గుర్తింపు (అతడి జీవిత లక్ష్యం), ద్రౌపదిని పొందే అవకాశాన్ని కూడా కల్పిస్తామని, రాజ్యార్ధతలన్నీ లభిస్తాయని కృష్ణుడు వాగ్దానం చేస్తాడు. కర్ణుడు ఇక్కడ చాలా హుందాగా ప్రవర్తించాడు. ఒక్క పరుషవాక్యం కూడా మాట్లాడకుండ అతడు ఇలా సమాధానం చెప్పాడు: "మీరడిగితే జరుగనిది అసంభవం. నా జీవితం అంతా సూతుల మధ్య గడిచింది. నేను, నా కొడుకులు వారి పిల్లలనే చేసుకొన్నాం. ఇప్పుడు వారి నుంచి తెంచుకొని రాలేను. ఏదైనా నేను రాజ్యాన్ని జయిస్తే దానిని దుర్యోధనునికి కానుకగా ఇస్తాను. నన్ను బలవంతం చేయకండి." అప్పుడు కృష్ణుడు "సరే, అలాగే కానివ్వ"మని వెళ్ళిపోయాడు. కర్ణుడు మహోదాత్తుడని, నిజమైన స్నేహితుడని, ప్రేమ, విధులతో తనను పెంచిన కుటుంబానికి బంధితుడని, ప్రలోభానికి లొంగనివాడని ఈ సంఘటన రుజువు చేస్తుంది.

ఇక రెండో సంఘటన కర్ణ-కుంతీ సంవాదం. చాల

ఉగ్రంగా మాట్లాడుతాడేగాని అందులో సంకుచిత మనస్కత గోచరించదు. కర్ణుడు గంగ ఒడ్డున సూర్య నమస్కారం చేస్తుండగా కుంతి వచ్చి అతనిని కలిసింది. నమస్కారం పూర్తిచేసిన అనంతరం, ఆమె దిక్కుకు తిరిగి, "మీరు ఏమి పనిమీద వచ్చారు?" అని అడిగాడు. అప్పుడామె అతని జన్మరహస్య గాథను వివరించి, "పాండవులతో చేరు, కర్ణార్జునులంటే ఏమిటో ప్రపంచానికి చాటు" అని కోరింది. "మీరు నా జన్మరహస్యాన్ని వివరించినంత మాత్రాన నా కష్టాలు గట్టెక్కుతాయనుకొంటే మీరు పొరపాటుపడినట్లే! మీరు చెప్పిన కథ నన్ను క్షత్రియునిగా ధ్రువీకరిస్తుందేకాని, నాకు విహితంగా జరుగవలసిన క్షత్రియసంస్కారాలేవీ జరుగలేదు. పుట్టగానే మొదట జరగవలసిన జాతకకర్మ జరగలేదు. అప్పుడేమో మీరు నన్ను గాలికి వదిలేశారు. ఇప్పుడేమో స్వార్థప్రేరణంతో మాత్రమే నా దగ్గరకు వచ్చారు. కృష్ణుడు, అర్జునుడు అంటే ఎవరికైనా భయమే. ఇప్పుడు నేను కౌరవులను విడనాడితే అర్జునుడిని చూసి భయంతో పక్షం మార్చానంటారు. నా బలాన్ని చూసుకొనే దుర్యోధనుడు ఈ యుద్ధానికి తలమునకల సన్నద్ధుడయ్యాడు. మీరడిగింది నేనెప్పటికీ చేయలేను. అర్జునుణ్ణి తప్ప, మీ సుతులలో అన్యులెవరిని చంపను. అర్జునుడు నన్ను చంపితే మీ అయిదుగురు కొడుకులు మీకు ఉంటారు. అలాకాక నేనే అర్జునుని చంపితే, అప్పుడూ మీకు ఐదుగురు పుత్రులుంటారు", అని కర్ణుడు కుంతికి చెప్పాడు. అప్పుడు కుంతి, "అయితే నీ మాట నిలబెట్టుకో" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఇక్కడ కర్ణుడు చెప్పిదాంట్లో ద్వేషం ఏమీలేదు. కాని తాను అర్జునుని తప్ప తక్కిన వారిని చంపననే మాట పరీక్షకు నిలువదు. పైకి చూడడానికి అదేదో ఔదార్యంగా కనిపిస్తుందే కాని ఇది అతడు మామూలుగా ఆర్భాటంగా చేసిన ప్రతిజ్ఞలాంటిదే. అసలు అతనికి కుంతి అంటే ప్రేమగాని దయగాని లేదు. సోదరులంటే దయ చూపవలసిన అవసరం అంతకంటె లేదు. అతడు సోదరులను చంపను అని అనడంలో అతనికి ఉన్నది ఔదార్యం, ప్రేమా కావు. జుగుప్స. అతని వాగ్దానం వెనుక ఉంది సములతో తప్ప అసములతో పోరుసేయరాదని. ఈ జుగుప్స, అతి విశ్వాసం, అతిశయం క్షత్రియులకు సహజమే. అయితే ఇక్కడ అది అసందర్భ ప్రేలాపన. ఇప్పుడు జరుగుతున్నది నిజమైన యుద్ధం. యుద్ధంలో దుర్యోధనుని గెలిపించవలసిన బాధ్యత అతనికి ఉంది. అంతేకాని వ్యర్థప్రేలాపనగాదు అతడు చేయవలసింది. సోదరులను, ముఖ్యంగా ధర్మరాజును, చంపననడంలో దుర్యోధనుని కార్యానికి విఘాతం కలుగుతుంది. దుర్యోధనుని అవసరాన్ని విస్మరించి, డాంబికతతో కొట్టుకుపోయాడని చెప్పవలసి వస్తుంది.

ఈ సంఘటన అతడు నిజంగా ఎవరో అతనికి తెలియజెప్పింది. దీనితో అంతఃసంఘర్షణ, అంతరంగ అభద్రత పరిప్లుతమై ఉండాలి. అయితే పైకి మాత్రం అతడు ఈ నూతన గుర్తింపును స్వీకరించి, తదనుగుణంగా ప్రవర్తించలేదు గనుక, ఆ గుర్తింపును పరిత్యజించాడు. తన స్నేహితునికి బాసటగా నిలిచినందుకు ఆ నైతిక విభవాన్ని పొందగలిగాడు. కాని తరువాతి కాలంలో అతడు మళ్ళీ పాతగాడిలోనే పడిపోయాడు. అతడి చర్యలే అతని పతనానికి దారితీశాయి. ఇతరులూ అతనిని క్షమించలేదు.

మహారథుల ఎంపికలో భీష్ముడు కర్ణుణ్ణి రెండో శ్రేణివానిగా నిర్ణయిస్తాడు. ఈ అంచనా కర్ణుని సామాజిక అంతస్తును ఆధారం చేసుకొని చేసింది కాదు. అతని వైయక్తిక పరిమితులు, దోషాలు ఆధారంగా చేసింది మాత్రమే. దీనితో కర్ణునికి కోపం వచ్చింది కాని, తరువాతి సంఘటనలు భీష్ముని తీర్పే సరైనదని రుజువు చేశాయి. మహారథి అంటే, రథం మీద నిలబడి బాణాలు వేయడమేకాక రథాన్ని నడపడం కూడ చేతకావాలి. భీష్మ, కృష్ణ, అర్జునులకు రెండూ తెలుసు. కర్ణుడికి రథంపై నిలబడి యుద్ధం చేయడమే తెలుసుకాని, రథం నడపడం రాదు. నడుస్తున్న రథం మీద నుండి బాణాలు సరిగా సంధించాలంటే రథం నడపడం, తెలిసినవాడే రథగతి అర్థమై, సరిగా సంధించగలుగుతాడు. భీష్మ కర్ణుల ఈ తగవు కారణంగా కర్ణుడు భీష్ముని క్రింద యుద్ధం చేయనని అలిగి కూర్చున్నాడు. తొమ్మిది రోజులు యుద్ధంలో పాల్గొనలేదు. ఇక్కడ కర్ణుడు తన అభిమానం చూసుకొన్నాడేకాని, దుర్యోధనుని హితాన్ని చూడలేదు. (కర్ణుడు గనుక యుద్ధంలో పాల్గొంటే భీష్ముడు యుద్ధం చేయనిరాకరించాడని పాఠాంతరం).

ద్రోణుడు కూడా భీష్ముని అభిప్రాయాన్నే బలపరిచాడు: "కర్ణునికి తల బిరుసు. పాత్ర తెలియక కరుణ కురిపిస్తాడు. యుద్ధంలో వెన్ను చూపుతాడు. తప్పుడు నిర్ణయాలు చేస్తాడు.

రథికునిగా అతనికి పూర్తి మార్కులు వేయలేను." ఆ రోజుల్లో ద్రోణుడు యుద్ధవిద్యల్లో ఆరితేరినవాడు. అతడి విమర్శనైనా కర్ణుడు ఖాతరు చేయవలసింది. కాని అతడు ఆత్మవిమర్శ చేసుకోలేదు.

భీష్ముని అనంతరం కర్ణుడు రంగప్రవేశం చేశాడు. సైన్యం అతనిని సేనానిని చేయమనికోరింది. అప్పుడు కర్ణుడు ద్రోణుని సేనానిగా చేయవలసిందిగా సూచించాడు. ద్రోణుడు సేనానిగా చేయవలసిందిగా సూచించాడు. ద్రోణుడు మూడు రోజులు నాయకత్వం వహించాడు. ఈ మూడు రోజుల్లో కర్ణునికి అర్జునుణ్ణి ఎదుర్కొనే సందర్భం లభించలేదు. ఈ లోపు పదునారేడుల బాలుడు అభిమన్యుని ఆరుగురు యోధులు చంపితే, ఈ ఆరుగురిలో కర్ణుడూ ఒకడు. ఆ పిల్లవాని రథం విరిగిపోగా, అతడు నేలపైదూకి అక్కడినుంచే ఆ ఆరుగురు మహావీరులను ఒంటరిగా ఎదుర్కొన్నాడు. పదహారవదినం ద్రోణుని అనంతరం కర్ణుడు నాయకత్వం వహించాడు. అప్పటికే ఇరువాగులవారు ఎంతోమంది చనిపోగా, పాండవులు కొద్ది ఆధిక్యంలో ఉన్నారు. ద్రోణుని కొడుకు అశ్వత్థామ సంధిచేసుకోమని దుర్యోధనునికి సలహా ఇచ్చాడు. కర్ణుని అండచూసుకొని, ఎవరూ సాధించలేనిది కర్ణుడు సాధిస్తాడని దుర్యోధనుడు గురుపుత్రుని సలహా చెవిని పెట్టలేదు. కాని కర్ణుడు అనితరమైనదేదీ సాధించలేదు.

తరువాత రోజు శల్యుని రథసారథ్యం వహించమని కర్ణుడు కోరాడు. క్షత్రియుడు, ఒక దేశానికి రాజు అయిన తాను ఒక నీచకులజునికి సారథ్యం చేయడం కంటె ఇంటికి పోవడం మంచిదని శల్యుడు అన్నాడు. ఎలాగో దుర్యోధనుడు బ్రతిమిలాడి శల్యుని ఒప్పించాడు. శల్యుడు రథంతోలుతూ ఉండగా మార్గమధ్యంలో శల్యునికి కర్ణునికి సంవాదం జరిగింది. బహుశా ఈ సంవాదం తరువాతి కాలంలో ప్రక్షేపింపబడి ఉండవచ్చును. శల్యుడు ఇలా అంటాడు: "ఊరికే డాంబికాలు పోకు. అర్జునుణ్ణి చూడగానే నీకు గుండె జారిపోతుంది." ఇలాంటి హెచ్చరికలు అధిక్షేపాలు సైనికునికి కోపం తెప్పించడానికి చెబుతారు. అర్జునుడు యుద్ధం చేయనని విల్లంబు క్రింద పడవేస్తే, కృష్ణుడు అతనిని అధిక్షేపించి, కోపం తెప్పించి, యుద్ధానికి పురిగొల్పుతాడు. శల్యుడన్న మాటలకు కర్ణుడు కుపితుడై, శల్యుని రాజ్యమైన మద్రలోని స్త్రీలంతా త్రాగుబోతులు, తిరుగుబోతులు, గోమాంస భక్షకులు అని తిడతాడు. ఈ సంవాదాన్ని మనం అంతగా నమ్మడానికి వీలులేదు. తరతరాలుగా మద్ర, హస్తినాపుర రాజవంశాల మధ్య పిల్లల్ని ఇచ్చిపుచ్చుకోవడాలు ఉన్నాయి. పైగా శల్యుడు హస్తినాపురానికి బంధువు. రాజు. అతనిని కర్ణుడు అలాంటి మాటలన్నాడంటే నమ్మడం కష్టం. అయితే ఈ పాఠం మహాభారతం critical edition లో కూడా ఉంది. అసలు ఆ రోజుల్లో క్షత్రియ స్త్రీలంతా త్రాగేవారు, గోమాంస భక్షణ చేసేవారు. అది మామూలే. త్రాగుడు నిషేధం తరువాతి కాలానికి సంబంధించింది.

కర్ణుడు ఈ విధంగా ప్రేలిన తరువాత శల్యుడు మాట్లాడటం ఆపివేశాడు. బహుశా అర్జునుని అనుకరించడానికేమో! రథానికి తెల్ల గుర్రాలను పూన్చ వలసిందని కర్ణుడు ఆదేశించాడు. ఇది వట్టి తెలివిమాలినపని. యుద్ధం చేయడానికి నమ్మకమైన సారథి, సుశిక్షితమైన, చిరపరిచితమైన గుర్రాలు, అలవాటైన రథం ఉండాలి. ఇది సామాన్యసూత్రం. దీనిని అతడు పాటించి ఉండాల్సింది. ఇప్పటికే అతని సారథి (శల్యుడు) అతనికి కొత్తవాడు. పైగా గుర్రాలను కూడా మార్చమని ఆదేశం. అతడు వేసిన మొదటి అడుగే తప్పటడుగు. మామూలు ప్రకారం ఈ రథం వెనుక విల్లంబులు, బాణాలు పెట్టుకొని మరో రథం అనుసరించి వస్తున్నది. కౌరవశ్రేణుల మధ్యకుపోయి, "అర్జునుడు ఎక్కడ? నాకు చూపండి. అతడిని ఎవరూ చూడలేదా? నాకెక్కడా కనిపించడేం?" అని కర్ణుడు అరిచాడు. శల్యుడు అప్పుడు అర్జునుని దిశగా రథం నడిపించి "అడుగో అర్జునుడు. దుర్యోధనుని రుణం తీర్చుకొనే సమయం ఇదే" అన్నాడు. అక్కడకు వెళ్ళేసరికి అతని కొడుకు వృషసేనుడు అర్జునుని ఎదుర్కొంటున్నాడు. కర్ణుడు ఏదైనా చేయగలిగేలోపే అర్జునుడు వృషసేనుని చంపాడు. దీనితో కర్ణుడు మూగవోయాడు. కన్నుల నీరు నిండింది. అప్పుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. క్రమంగా అర్జునినిది పైచేయి అయింది. కర్ణుని కవచం ముక్కలైంది. నిస్పృహతో నాగాస్త్రాన్ని అర్జునినిపై సంధించాడు.(పాము కూర్చున్న బాణం–బహుశ దీని అర్థం అది విషపూరితమని, అది తాకినవారు విషగ్రస్తులై చనిపోతారని). "అర్జునుని కంఠానికి మీరు బాణం ఎక్కుపెడితే, మీ గురి సరిగా లేదు. సరిచూసుకోండి," అని శల్యుడు హెచ్చరించాడు. కర్ణుడు దానిని పెడచెవిని బెట్టాడు. అది గురితప్పి అర్జునుని కిరీటాన్ని తాకింది. దీనికి మరోపాఠం కూడ ఉంది. ఈ బాణం వస్తున్నప్పుడు కృష్ణుడు రథాశ్వాలను మునిగాళ్ళమీద వంచి

రథాన్ని 24 అంగుళాలు క్రిందికి దించాడట. ప్రతి సంఘటనను కృష్ణుని గొప్పతనాన్ని పెంచడానికి కలిపినట్లే, ఈ సంఘటన తరువాతి కాలంలో కృష్ణుని గొప్పతనాన్ని పెంచడానికి కలిపి ఉండవచ్చు.

ఏది ఏమైనా కర్ణుడు గురి తప్పడానికి అప్పుడే చనిపోయిన పుత్రుని వలన శోకం కారణం కావచ్చు. ఇదే సమయంలో అతని రథం బురదలో కూరుకుపోయింది (ఇది యుద్ధం మొదలైన 17వ రోజు). కర్ణుడు రథం మీది నుంచి క్రిందకు దూకి కూరుకుపోయిన చక్రాన్ని పెకలించ ప్రయత్నించాడు. ఇది ఒక మనిషికి సాధ్యమయ్యే పనికాదు. అదీగాక యుద్ధం మధ్యలో అసలు అతడు మరో రథానికి ఎందుకు మారలేదో మనకర్థం కాదు. సూర్యాస్తమయ మవుతోంది. నాటికి యుద్ధం చాలించే సమయం ఆసన్నమైంది. కొంత వెసులుబాటు దొరుకుతుందేమోనని కర్ణుడు ఆశించాడు. అతడు అర్జునుని ఇలా అర్థించాడు:

"కూరుకుపోయిన చక్రాన్ని పెకలిస్తున్నాను. యుద్ధనీతి నీ వెరుగనిది కాదు. రథం మీద ఉండి, నేలమీద ఉన్నవానితో పోరాడరాదు. యుద్ధనీతిని పాటించు."

కృష్ణుడికి కర్ణుని వదలిపెట్టడం ఇష్టంలేదు; కృష్ణుడు కర్ణుని మాటలను కర్ణునికే అప్పజెప్పాడు: "ద్రౌపది వలువలు వలవమని దుశ్శాసనుని నియోగించినప్పుడు ఈ నీతి ఏమైంది? మీరు ఆరుగురు కలిసి ఒక బాలుని, అతడు నేలపై ఉన్నప్పుడు, పడగొట్టినప్పుడు నీ యుద్ధనీతి ఏమైంది?"

పాపం! అర్జునిడికి వదిలిపెడదామనే ఉంది. కాని కృష్ణుడు అర్జునునికి విధి తెలిపి, పురిగొలుపుతాడు. కృష్ణుడు ఈ ప్రశ్నలు వేయడం ద్వారా కర్ణునికి న్యాయమడిగే అర్హత లేదని తెలియజేశాడు. అంతేకాక అర్జునునికి జరిగిన రెండు అన్యాయాలను అతనికి గుర్తుచేశాడు. "ఇతడు నా భార్యను అవమానించాడు. నా పుత్రుని క్రూరంగా చంపాడు. ఇతను బ్రతకడానికి వీలులేదు", అంటూ విల్లు ఎక్కుపెట్టి, "ఈ బాణం కర్ణుని అంతం చేసి, నన్ను సుక్షత్రియునిగా ప్రతిష్ఠించుగాక," అని అర్జునుడు బాణం వేశాడు. అది గురి తప్పలేదు. అర్జునుడు గురితప్పడం ఎరుగడు.

మహాభారతగాథలో కర్ణుడు మొదట శస్త్రాస్త్ర విద్యా ప్రదర్శనలో ప్రవేశిస్తాడు. అప్పుడతడు అర్జునుని ద్వంద్వయుద్ధానికి సవాలు చేస్తాడు. అదే సవాలును ఎదుర్కొనే అవకాశం ఈ చరమాంకంలో వచ్చింది. అప్పుడది చిన్నపిల్లల ఆట. ఇప్పుడది నిజమైన యుద్ధం చంపడమో, చావడమో–రెండేదారులు. తాను జీవితాంతం ద్వేషించిన, అసూయపడిన శత్రువును ఎదుర్కొంటున్నాడు. అటువంటి శత్రువు నుంచి ఏరకమైన ఆపేక్షను యాచించ ఉండవలసింది కాదు. మళ్ళీ ఇక్కడ కర్ణుడు ఎన్నడూ చేయరాని పనిచేశాడు. "తానేమిటి? తన హక్కులేమిటి?" అని తెలుసుకోకుండానే కర్ణుడు అంతమయ్యాడు.

*(మిసిమి, నవంబరు 1995)*



ఫిబ్రవరి (2011)

***మిసిమి*** జిజ్ఞాసువుల పత్రిక. పరిశోధకుల వేదిక. మానవీయత కాని భూమిక. ***మిసిమి*** తొలి సంచికనుండి చదివాక దాన్ని గురించి నాకు కలిగిన అభిప్రాయమిది. చదివేవారి ఆసక్తిని రేకెత్తించేవి అందులోని వ్యాసాలు. చదువరి ఆలోచనలకు పదును పెడుతుంది ప్రతి సంచిక. మేధావులు కూడా చాలామంది కొన్ని ఆలోచనా రీతులకు కట్టుబడి వుంటున్నారు. కొత్తభావాల యెడ విముఖంగా ఉంటున్నారు.

అయితే మానవ శాస్త్రాలు, భౌతిక శాస్త్రాలు ఏనాటికానాడు, సరికొత్త సమాచారాలను అందిస్తున్నాయి. ఇది పరిశోధనా యుగం. మూల విశ్వాసాలనే పునాదుల నుండి పరిశీలించి, వాటి ఆమోద యోగ్యతను పరీక్షిస్తున్నాయి. ఈనాటి భావనా స్వేచ్ఛను పెంచుతున్నాయి పరిశోధనలు. ***మిసిమి***లోని దాదాపు అన్ని వ్యాసాలూ పరిశీలన, పరిశోధనా పత్రాలే, భావ ప్రదీపకాలే. అందుకనే అది జిజ్ఞాసువుల పత్రిక అయింది. పరిశోధకుల వేదికగా రూపొందింది. పాఠకుల్లో స్వతంత్రంగా ఆలోచింపజేసే సాధనం అయింది. మానవ వ్యక్తిత్వానికి పునాది స్వతంత్ర ఆలోచనా పటిమే కదా! అందమైన ఆకృతి, స్ఫూర్తిదాయకమైన వ్యాసావళి, ***మిసిమి*** పేరును సార్థకం చేస్తున్నాయి.

**- జస్టిన్ ఆవుల సాంబశివరావు.**

# తెలుగు సాహిత్యంలో హేతువాదం

– రావిపూడి వెంకటాద్రి

90 సం॥ వయస్సులో, నిరంతర సత్యాన్వేషిగా తనదైన ధోరణిలో హేతువాద దృక్పథాన్ని ఆనాటి నుంచి ఈనాటి తరం వరకు ప్రభావితులను చేస్తున్న నిత్య సాహిత్య, చారిత్రక శాస్త్రజ్ఞుడు, హేతువాది మాస పత్రిక సంపాదకులుగా రావిపూడి ఉన్నారు.

రావిపూడి

సాహిత్యం భావప్రకటనకూ, ప్రచారానికీ సాధనంగా వాడబడడమనేది కనీసం వేదకాలం నుంచి మనం చూస్తాం. భావప్రకటనకు ఇతర కళారీతులు కూడా దోహదం చేసినప్పటికీ సాహిత్యానికున్నంత విస్తృతపరిధీ, మన్నికా వాటికున్నట్టు కన్పడదు.

దేన్ని సాహిత్యమంటాం అనే చర్చజోలికి నేను పోను. కాల్పనికతను కొలమానంగా తీసుకొని పద్యానికీ, గేయానికీ, నాటకానికీ, నవలకూ సాహిత్యాన్ని పరిమితం చేసే పని నేను చేయడం. నిజానికి వస్తు ప్రధానమైన సాహిత్యం ఈనాడు ఆ నాల్గు ప్రక్రియలకూ భిన్నంగా వచనంలోనే వస్తున్నది.

తెలుగులో రికార్డ్‌డ్ సాహిత్యం వయస్సు సుమారు వెయ్యిసంవత్సరాలుంటుందేమో. అందులో గత ఒకటీ–ఒకటిన్నర శతాబ్దాలకు పూర్వం తెలుగులో వెలువడ్డ సాహిత్య మంతా అనువాద సాహిత్యమే. చాల సందర్భాల్లో అది భాషానువాదం కాగా, కొద్ది సందర్భాల్లో మాత్రం భావానువాదం. అంటే నిన్న మొన్నటిదాక తెలుగువారికే కాదు, ఒక్క తమిళులకు తప్ప మిగతా ఏ దేశీయ భాషలవారికీ స్వతంత్ర సాహిత్యమున్నట్టు లేదు. స్వతంత్ర భావాలుంటే కదా సాహిత్యం ఉండడానికి.

తెలుగువారు అనువాదం చేసుకొంటూ వచ్చిందంతా హిందూమత వాద సాహిత్యమే. సంస్కృతంలో కాని, ఇతర ప్రాచీన భాషల్లో కాని హిందూమత వాదానికి సంబంధించని సాహిత్యం ఉన్నా, అది అనువాదానికి నోచుకోలేదు. అంటే తెలుగు అనువాద సాహిత్య లక్ష్యం బహుళ హిందూమత ప్రచారమేమోననిపిస్తుంది. హిందూమతమంటే డా.సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి భాషలో బ్రాహ్మణమతమే.

మతవాదాన్ని ప్రవేశపెట్టడంతో తెలుగు సాహిత్యంతో సరిపెట్టుకోలేదు. సంస్కృత శబ్దాలకు డు, ము, వు, లు చేర్చి దాన్నే తెలుగు భాషగా మార్చివేసింది. అందుకే మన ప్రాచీన తెలుగుకావ్యాల్లో కొన్నిచోట్ల సంస్కృత సమాసాల గొలుసులే పద్యాలుగా దర్శనమిస్తాయి.

**"అటచని కాంచె భూమిసురు డంబర చుంబి శిరస్సరర్ధురీ**
**పటల ముహుర్ముహుర్ముఖ ధభంగ తరంగ మృదంగ నిస్వన**
**స్ఫుట నటనానురూప పరిపుల్ల కలాప కలాపి జాలమున్**
**గటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్"**

– *అల్లసాని పెద్దన*

**"సంభూతాన్య విడంబడం బరమిధస్సంరంభ గర్వోర్వశీ**
**రంభా నాట్య విజృంభ మాణమతి విస్రంభాది శుంభన్మనో**
**జంఝూరి ప్రియసంభృతానక మహో సంభావనా సంభవ**
**స్తంభోదర్ముడు విక్రమార్ముడతడే తన్మాత్రుడే చూడగన్"**

వీటిని పగలగొట్టుకొని ఆస్వాదించడమే సాహితీ విమర్శగా పరిగణించబడిన రోజులున్నాయి. భాష మీద సాముగరిడీలు చేయడమే సాహిత్య కృషిగా పరిగణించబడిన ఆ రోజుల్లో, సంస్కృత సాహిత్యంలోని కథలు, గాథలు కావ్యాల రూపంలో తెలుగులో అవతరించినై. సాహిత్యానికి వస్తువుకాక, రూపమే ప్రధానమైంది. అందుచేతనే పద్య కావ్య ప్రక్రియ ప్రాచీన తెలుగు సాహిత్యంలో ప్రధానంగా చోటుచేసుకుంది.

భారత, భాగవత, రామాయణ, పురాణాది గ్రంథాలను తెనిగించినవారు తెనిగించారు. అనుసరించినవారు అనుసరించారు. అందులోని పిల్లకథలనే పెంచి, కల్పించి వివిధ ప్రక్రియల్లో పొందుపరిచారు. అదే తెలుగువారి సాహితీ కసరత్తుగా చలామణి అయింది. అందుకే కవిరాజు త్రిపురనేని–

పాయక పూర్వ గాథలని ప్రత్న కవీంద్రులు నేటిదాక, రామాయణ భారతాది కృతులన్నియు వ్రాసిరి త్రిప్పి త్రిప్పి

ఏదో ఒక కబ్బమంచు – అని బాధపడ్డాడు.

మనకున్నదంతా మత సాహిత్యమైనపుడు ఇక అందులో హేతువాదాన్ని వెదికేది ఎలా? ఎందుకంటే మతవాదాన్ని, దాని ప్రాథమిక సూత్రాలను తిరస్కరించడంతోనే హేతువాదం ప్రారంభమవుతుంది. హేతువాదం ఎన్ని దశలు మారినా, ఎంత ఉన్నత దశకు చేరినా, అహేతుకత మూర్తీభవించిన మతాన్ని తిరస్కరించడమే దాని ప్రాథమిక సూత్రం.

మతమంటే వ్యవస్థీకృతమైన విజ్ఞానం. అనుక్షణమూ పెరిగే విజ్ఞానాన్ని వ్యవస్థీకృతం చేయడమంటే దాని మరణాన్ని శాసించడమే. అందువల్ల పెరుగుతున్న జ్ఞానానికి మతం సీలు వేస్తుంది.

ఒకనాటి మనిషితనకుఅందికలో వున్న విజ్ఞానం ఆధారంగా ఆచరణ (ఆచారాలు) యేర్పరచి, దాన్ని ఉల్లంఘించిన మనిషి, దాన్ని ఉల్లంఘించడమే హేతువాదం. అలా ఉల్లంఘించ నీయనిదే మతవాదం.

మానవుడు ప్రాయికంగా హేతువాది. ముందటివారు ఆలోచించిన విధంగానే తరువాతివారు ఆలోచించాలని లేదు. కాని ఇక్కడ వేల సంవత్సరాలుగా భిన్న తరహా ఆలోచనలు తలెత్తలేదు. తలెత్తినపుడు అణచివేయడం జరిగింది.

మత మౌలిక సూత్రాలతో విభేదించని సంస్కరణ వాదాన్ని హేతువాదంగా పరిగణించడానికి వీలులేదు. అందుకే భారతదేశంలో సంస్కరణ వాదాలుగా బయలుదేరిన శాఖలన్నీ చివరకు మతవాదాలుగానే పరిణమించినాయి. వైదిక చింతనకు సంస్కరణ ఆరణ్యకాల్లోనే ప్రారంభమైంది. ఉపనిషత్తుల్లో ఆ సంస్కరణ ఉచ్ఛస్థాయినందుకొంది. ఆ తర్వాత పురాణవూబిలో దిగబడిపోయిన వైదిక సంప్రదాయం పునరుజ్జీవన వాదానికీ, పునర్వికార వాదానికీ దారితీసింది. ఆ తర్వాత బయలుదేరిన సంస్కర్తలెవ్వరూ ఆ వూబి నుంచి బయటపడలేక పోయారు.

భారతదేశంలో మతం ఎన్ని శాఖలైనా, ఎన్ని వెర్రితలలు వేసినా వేదాలను తిరస్కరించిన మతశాఖ లేదు. కాగా ఇప్పటికి రెండున్నర వేల సంవత్సరాలకు పూర్వమే వేదాలను తిరస్కరించిన చార్వాక, జైన, బౌద్ధాదులు ఉన్నతస్థాయిలో దార్శనిక చింతన చేశారు. వారి దాడిని తప్పించుకోవడానికే వైదిక సంప్రదాయం ఉపనిషన్మార్గాన్ని పట్టింది. చివరకు నేలమట్టానికి చేరి పురాణ సంస్కృతిని వ్యాపింపజేసి హేతువాద మార్గాన్ని రూపుమాపింది.

హేతువాదం ఏ దేశంలో ఎప్పుడు ప్రారంభమైనా మతగ్రంథాల ప్రమాణాన్ని తిరస్కరించడంతోనే ప్రారంభమైంది. అందుకే మనుస్మృతి సైతం హేతువాదాన్ని శ్రుతి స్మృత్యాదులకు వ్యతిరేకమైనదిగా గుర్తించింది.

**"యోవమన్యేత తేమూలే హేతు శాస్త్రాశ్రయాద్విజః**
**ససాధు భిర్బహిష్కార్యో నాస్తికో వేద నిందకః"** 2-11

అన్నది దాని వ్యాఖ్యానంలో కుల్లూకభట్టు హేతు శాస్త్రమంటే ప్రతికూల తర్కమన్నాడు. శ్రుతి స్మృత్యాదుల్ని దూషించే చార్వాకాదులు నాస్తికులన్నాడు. అంటే హేతు వాదాన్ని నాస్తికత్వంతో తుల్యంగా ఆయన భావించాడు.

మతగ్రంథాలన్నీ ఆదిమ మానవుల అజ్ఞానంతో, మూఢ నమ్మకాలతో, వాటిపై ఆధారపడిన ఆచార సంప్రదాయాలతో నిండి ఉన్నాయి. వాటిని త్రోసివేసే ఆలోచన చేయజాలని వాడు హేతువాది కాడు. అందుకే మార్క్సుసైతం Criticism begins with the Criticism of religion అన్నాడు. మతాన్ని విమర్శించలేని వాడికి స్వతంత్రాలోచన ఉండడానికే వీలులేదు.

యూరపులో పురోహిత వర్గాన్ని విమర్శించడమంటే ఒక వృత్తి అవలంబించిన వారి దుశ్చేష్టల్ని విమర్శించడమే. మధ్యయుగాల్లోని యూరోపియన్ హేతువాదం మత గురువుల దురాగతాలను దుయ్యబట్టడంతో బయలుదేరింది. అది నాస్తికత్వంలో, భౌతికవాదంలో సేదతీరింది. ఈనాడు మానవవాద మార్గాన్ని పట్టింది.

భారతదేశంలోని పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇక్కడ పుట్టుకతోనే కులాలు, వృత్తులు నిర్ణయమై కూర్చుంటున్నాయి. అందువల్ల ఇక్కడ పురోహిత వర్గాన్ని


జనవరి (2006)

నిన్ననే టపాలో నూత్న శోభతో వచ్చిన ***మిసిమి*** చూసి ఆనందించాను. ఇదే రీతిలో ***'మిసిమి'*** మిసిమి కావాలని నా కోరిక. రవీంద్రనాథ్ గారి చిరస్వప్నం పరిమళభరితం కావాలని కోరుతున్నాను.

**- అవంత్స సోమసుందర్, పిఠాపురం.**

విమర్శించడమంటే ఒక వృత్తిని విమర్శించడంగా కాక, ఒక జాతిని, వర్ణాన్ని, కులాన్ని విమర్శించడం క్రింద వస్తున్నది. అది మన దౌర్భాగ్యం. ఈ దౌర్భాగ్యాన్ని నేటిదాక మన పురాణ సంప్రదాయం పెంచి పోషిస్తూ వస్తున్నది. బ్రాహ్మణాధిక్యతను ప్రచారం చేయడానికి ఉద్దేశించిన పురాణాలు, తద్వ్యతిరేకతను బ్రహ్మ ద్వేషంగా విపరీత ప్రచారం చేసినై. అదే మన సారస్వత వారసత్వం.

వేనుని పరిపాలనలో వేద వ్యతిరేకతను పద్మపురాణం ఎలా వర్ణించిందో చూడండి.

**తత్ప్రభుత్వము నందు వేదములు పోయె,**
**జన్నములు శాంతిలెను, సదాచారముడిగె,**
**నాస్తికత్వము ప్రబలె, దేవాలయములు**
**పాడువడియెను. బ్రాహ్మణుల్ భ్రష్టులైరి.**

వేన వధను సమర్థించుకోడానికి భాగవతం కూడా ఇదే వాదం చేసింది. భారతంలో బ్రాహ్మణులు చార్వాకుణ్ణి హత్య చేయడానికీ, రామాయణంలో రాముడు జాబాలిని దూషించడానికీ వైదిక ధర్మ వ్యతిరేకతే కారణంగా చూపబడింది. ఈ హత్యోదంతాలన్నీ వేద వ్యతిరేకులకు హెచ్చరికలు. ఇంత చేస్తూ కూడా మన పురాణ సాహిత్యం ఏ విలువలను కాపాడింది? పితృహత్యలను; భాతృహత్యలను ప్రోత్సహించిన ప్రహ్లాద, పృథు, సుగ్రీవ, విభీషణాదులకు జేజేలు పలికిన, బృందను రేప్ చేసిన విష్ణువును, రుక్మిణిని కిడ్నాప్ చేసిన కృష్ణుణ్ణి కీర్తించింది. పెళ్ళాన్ని జూదంలో ఒడ్డిన ధర్మరాజును, పెళ్ళాన్ని రాచబజారులో వేలంపాట పెట్టి అమ్మిన హరిశ్చంద్రుణ్ణి తారాస్థాయిలో కీర్తించింది. పంచపతివ్రత అయిన ద్రౌపదిని పంచపతివ్రతల జాబితాలో చేర్చింది. కుష్ఠభర్తను వేశ్యవద్దకు మోసుకుపోయిన సుమతికి పరమ పతివ్రతహోదా ఇచ్చింది. ఈ గాథలన్నీ లోకానికి ఏ నీతిని బోధించడానికి ఉద్దేశించబడినై? ఏ విలువల్ని పోషించడానికి ఉద్దేశించబడినై? బ్రాహ్మణ భక్తిని ప్రోత్సహించని గ్రంథం ఒక్కటయినా మన ప్రాచీన సాహిత్యంలో ఉందా? అటువంటి వాటిపై మన సాహితీస్రష్టలకు ఈ ప్రశ్నలే రాలేదు. అందరూ ధర్మపన్నాలు చెప్పినవారే. తపస్సు చేసుకుంటున్న శూద్ర శంబుకుణ్ణి వధించిన రాముడి ధర్మాన్ని గురించి వందలాది రామాయణాలు వ్రాసిన సాహిత్య స్రష్టలకెవ్వరికీ ప్రశ్నలే రాలేదు. పైగా ఆ రాముణ్ణే దేవడుగా కొలిచే దుస్సంప్రదాయం నాలుగైదు వందల యేండ్లుగా ఈ దేశంలో విస్తృతంగా వ్యాపించింది. మన సాహిత్యం నెలకొల్పిన సంప్రదాయం వల్లనే సినిమాల సంగతి అటుంచితే రేడియోలు, టెలివిజన్లు కూడా ఒకటి విడిస్తే ఒకటి ఆ భారత, రామాయణాది కథలనే రకరకాల ప్రక్రియల్లో ప్రసారం చేస్తున్నాయి. రెండువేల సంవత్సరాల నాటి కథల్ని, గాథల్ని ఆశ్రయించి ప్రజలకు విలువల్ని, విజ్ఞానాన్ని బోధించే దశలో మనం ఉన్నామంటే అది మన భావ దారిద్ర్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఆ భావ దారిద్ర్యాన్ని తొలిసారిగా వదలగొట్టడానికి ప్రయత్నించి, అద్భుతమైన ప్రశ్నలు లేవదీసిన మొదటి తెలుగుకవి వేమన. ఆధునిక ప్రమాణాల ప్రకారం ఆయన ఒకటో తరగతి హేతువాది కాకపోవచ్చు. కాని బలమైన సంప్రదాయాన్నీ, వేదాలనూ, భారత-రామాయణాదులనూ, బ్రాహ్మణాధిక్యతనూ, కులతత్వాన్నీ, అంటరానితనాన్నీ, యజ్ఞయాగాదులనూ, శైవ-వైష్ణవ మత శాఖలనూ అపహసించడంలో, విమర్శించడంలో హేతువాద సాధనమైన వివేకాన్ని, వివేచనను తొలిసారిగా వినియోగించిన తెలుగు కవి వేమన.

చార్వాకాదుల తర్వాత వేదాలను, అవి ప్రతిపాదించిన యజ్ఞయాగాది క్రతువులను అరమరికలు లేకుండా విమర్శించినవాడు వేమన.

**వెర్రి కుక్కలవలె వేదముల్ చదివేరు**
**అన్వయంబు నెరుగరయ్య వార్లు**
**వేద విద్య లెల్ల వేశ్యల వంటివి**

అనడానికి ఎంత ధైర్యం కావాలి? ఎవరికి కావలసిన అర్థాన్ని వారికిచ్చే వేద విద్యలను వేశ్యలతో పోల్చడం

సెప్టెంబరు (2012)

తెలుగు సాహిత్యానికి మంచిరోజులు వచ్చాయి.
సినిమా కబుర్లు, కుళ్ళు రాజకీయాలు తప్ప మరొకటి కనిపించని
ఈ రోజుల్లో మీ పత్రిక ఆశాకిరణం. **– సాయి బ్రహ్మానందం గొర్తి,** USA.

సామాన్య విషయం కాదు. వేదాలకు చాల భాష్యాలున్న వంటున్నారు. వాటిలో ఒకదానికి మరొక దానికి పడదు. ఈనాడు పూర్తిగా దొరికేది సాయన భాష్యం. దాన్ని ఆమోదించని దయానందుడు మరో భాష్యం వ్రాశాడు. ఏ మూడు వందల సంవత్సరాలనాడో వేమన్న తెలుగు సాహిత్యంలో ప్రదర్శించిన ధైర్యాన్ని, సాహసాన్ని ప్రదర్శించగల సాహితీపరులీనాడు ఎందరున్నారు?

**లంజ కొరకు మేకనంజుడు తినసాగ**
**యజ్ఞమెల్ల కామ యజ్ఞమాయె**
**మొదలు సోమయాజి, తుద కామయాజిరా**

యజ్ఞయాగాదుల లక్ష్యమేమిటి? స్వర్గం. స్వర్గంలో యజ్ఞకర్తలాశించే ప్రతిఫలమేమిటి? దేవవేశ్యల తోడి పొందు. యజ్ఞంలో సోమయాజులు చేసేదేమిటి? సోమపానం, మాంసాహారం. కాబట్టి ఈ లోకంలో తిని, త్రాగడం – మరో లోకంలో కామ పిపాసను తీర్చుకోవడం – ఇవే కదా యజ్ఞ లక్షణాలు అని వేమన యెత్తి పొడుపు.

రామాయణం వేమనకు ముందు చాలామంది చదివి ఉంటారు. వారందరికీ ప్రశ్నలు వచ్చాయో రాలేదో లేక వచ్చినా ఎవ్వరూ సాహిత్యంలో ఇమడ్చడానికి సాహసం చేయలేదేమో కాని, వేమన రాముడిపై తల తిరిగే ప్రశ్న లేవదీశాడు.

**కనక మృగము భువిని కద్దులేదనకుండ**
**తరుణి విడిచిపోయె దాశరథియు**
**తెలివి లేనివాడు దేవుడెట్టాయెరా?**

అలానే భారతం గురించి కూడా ప్రశ్నలు లేవదీశాడు.

**పంచమ వేదంబు భారతం బగునని**
**పొగిడి రేల జనులు బుద్ధి లేక**
**హింస కార్యము తమకిష్ట మేలాయెరా?**

నిజానికి వేదాల్లో హింస పిలిస్తే పలుకుతుంది. అందుకే కేవలం హింసాత్మక కథలను గుదిగుచ్చిన భారతాన్ని వేదాల జాబితాలో చేర్చారేమో! ఏది ఏమైనా భారతంలో హింస కార్యాలు చేసిన ధర్మరాజును చార్వాకుడు ఆక్షేపించినట్లు వేమన కూడా ఆక్షేపిస్తున్నాడు.

**కులము నీరు చేసి గురువును వధియింప**
**పొసగ ఏనుగంత బొంకు బొంకె**
**పేరు ధర్మరాజు పెను వేపవిత్తయా!**

భారతంలో బ్రాహ్మణులు చార్వాకుణ్ణి చంపింది ఇలా అన్నందుకే కాని, వేమన జోలికెవ్వరూ వచ్చినట్లులేదు.

శైవ–వైష్ణవాల వికారాలు వేమన కాలంలో వ్యాప్తిలో ఉన్నట్లుంది. అందుకని వాటిపై కూడా వేమన చెణుకులు విసిరాడు.

**ఆరుమతములందు అధికమైన మతము**
**లింగ మతము కన్న లేదు భువిని**
**లింగధార్లకన్న దొంగలు లేరయా**

**బిందె త్రాడు తెచ్చి బంధించి కట్టంగ**
**లింగడేమి దొంగిలించినాడొ**

**పట్టుబట్ట గట్టి పట్టె నామము బెట్టి**
**వట్టి భ్రాంతి చెంది వైష్ణవుడయి**
**లొట్టి త్రాగినతడు లోకుల జెరచురా**

ఇలా మత గురువుల్ని హేళన చేయడమే కాక, వేష–భాషలతో మోసాలు చేసే వారినీ, పాప పరిహారార్థం తీర్థయాత్రలు చేసేవారినీ కూడా వేమన వదలలేదు.

**వేష భాష లెరిగి కాషాయ వస్త్రాలు**
**కట్టగానె ముక్తి కలుగు బోదు**
**తలలు బోడులైన తలంపులు బోడులా?**

**తిరుమలకును బోవ తురక దాసరి కాడు**
**కాశి కేగ పంది గజము కాదు**
**కుక్క సింగమగునె గోదావరికి పోవ**



ఏప్రిల్ (2004)

మిసిమిని ప్రశాంతంగా చదివినప్పుడే దానిని సంతోషంగా ఆస్వాదించగలను. మిసిమిని చదువుతుంటే మనసుకెంతో హాయిగా వుంటుంది... జూన్ సంచికలో గాన గంధర్వం బాలమురళీ కృష్ణ గురించి వ్రాసినది చదివితే, ఆయన తెలుగువారు అయినందులకు ఆనందంగాను, గర్వంగాను వుంది. ప్రతి ఒక్క రచనా చదవాలనిపించేలాగ వుండటమేగాక విజ్ఞానదాయకంగా కూడా మిసిమి వుంటోంది. ధన్యవాదాలు.

**- కె. సర్వమంగళ, చెన్నై.**

ఇలా కడుపు తరుక్కుపోయే విధంగా సూటి మాటలతో వేమన కపట వేషధారుల బండారాన్ని కడిగివేశాడు.

పూర్వం శ్రాద్ధాది కర్మలకూ, పిండ ప్రదానాలకూ గట్టిగా ఎదురు తిరిగి హేళన చేసిన వాడు చార్వాకుడు. హేళనల వల్ల ఆ ఆచారాలు మారేట్లయితే చార్వాకులనాడే వాటికి వీడ్కోలు చెప్పి ఉండవలసింది. కాని అది జరగలేదు. వేమన్న కాలానికి కూడా అవి మిగిలి ఉన్నాయి. తగిన భాషలోనే వేమన తిరిగి ఆ పిండ ప్రధానాదుల్ని జుగుప్సీకరించాడు. అయినా శ్రాద్ధాది కర్మల్లో అవి ఈనాటికీ జరుగుతున్నవి.

**పిండములను చేసి పితరుల తలపోసి**
**కాకులకునుపెట్టు గాడ్దెలార**
**పియ్యితినెడు కాకి పితరులకెటు బెట్టు?**

ఈ ప్రశ్నతో ఆ ఆచారాన్ని కొనసాగించేవారికి తల తిరిగవలసి ఉంది. కాని, తిరగలేదు.

ఇక బ్రాహ్మణాధిక్యతను గురించి కుల విభేదాల గురించి, అంటరానితనం గురించి వేమన చెప్పిన పద్యాలు ఎన్నదగినవే.

**తల్లి ఊర్వశి లంజ తన ఆలు మాదిగ**
**తాను బ్రాహ్మడనగ తగునె జగతి**
**వసుధ నెరుగలేరె వాశిష్ఠ కులమును.....**
**తాడు మెడనువేసి తనదు శూద్రత్వము**
**పోయెననెడిదెల్ల బుద్ధిలేక**
**మదినిలువక తాడు మరివన్నె తెచ్చునా.....**
**మాలవానినంటి మరినీట మునిగిన**
**కాటికేగినపుడు కాల్చుమాల**
**ఇప్పుడంటినంటు అప్పుడేమగునురా.....**
**ఉర్వి జనులకెల్ల ఒక్క కంచముపెట్టి**
**పొత్తుకుడిపి కులము పొలయజేసి**
**తలను చేయిబెట్టి తగనమ్మ జెప్పరా.....**

ఇంత విస్తృతంగా మనం వేమనను ఎందుకు ఉదహరించుకోవలసి వచ్చిందంటే తెలుగు సాహిత్యంలో ఆయన మొదటి విప్లవకవి, మొదటి స్వతంత్ర కవి కూడా నేమో? భాషలోనే కాదు భావంలో కూడా.

తొలిహేతువాదిలో ఉండదగిన లోపాలు ఆయన సాహిత్యంలో దొర్లి ఉండవచ్చు. అయితే గియితే, ఆయన అచల వేదాంతో, మరో వేదాంతో అయివుండవచ్చు. ఏదియేమైనా, వేదాలతో ప్రారంభించి, భారత రామాయణాలను పట్టిచూచి, మతశాఖలపై దండెత్తి, బ్రాహ్మణాధిక్యతను నిరసించి, కులనిర్మూలన కోరిన వేమన తెలుగు సాహిత్యంలో హేతువాద ధోరణిని ప్రవేశపెట్టిన వ్యక్తిగాను గుర్తించక తప్పదు.

వేమన తరువాత తెలుగు సాహిత్యం తిరిగి గొడ్డుపోయింది. దాదాపు ఒకటిన్నర శతాబ్దిదాక హేతువాద ధోరణి తెలుగు సాహిత్యంలో మరల ఎక్కడా కన్పించదు. కాగా, గత శతాబ్ది మధ్యభాగంలో(1855) సామినేని ముద్దు నరసింహానాయనివారు వ్రాసిన "హితసూచని" ఒకటి కన్పిస్తుంది. సాహిత్యవిమర్శకులు దాన్ని సాహిత్యమని అంటారో లేదో నాకు తెలియదు. అది ఆనాటి వ్యవహారిక భాషలో వ్రాయబడిన వాక్యగ్రంథము (Prose). అందులో శిల్పం కాని, కాల్పనికతకాని మచ్చుకైనా కన్పించదు. మనం వ్యవహారిక భాషలోనే రచనలు చేయాలని ఆయన ఒక ప్రమేయం (వ్యాసం) లో వాదించాడు. వ్యవహారిక భాషోద్యమానికి నాయకత్వం వహించిన గిడుగు రామమూర్తి అప్పటికింకా పుట్టనేలేదు.

స్త్రీవిద్య ఆవశ్యకమనీ, స్త్రీలకు స్వాతంత్ర్యం కావాలనీ, బాల్య వివాహాలను నిరసించాలనీ, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాలనీ ఆయన ఆ పుస్తకంలో బలమైన వాదం చేశాడు. వితంతు పునర్వివాహాన్ని సమర్థిస్తూ ఆయన ఆ పుస్తకంలో బలమైన వాదం చేశాడు. వితంతు పునర్వివాహాన్ని సమర్థిస్తూ ఆయన 'నష్టమృతే' లాంటి పరాశరస్మృతి శ్లోకాన్ని



ఏప్రిల్ (2005)

*శకముల వాడుకలోని కాలజ్ఞానం ఎంతో సమాచారాన్ని పరీక్షలకు సరిపడా ఇచ్చారు. అరవయి ఏండ్ల నుంచీ నడుస్తున్న అగతాక్రిస్టి మౌస్‌ట్రాప్ గురించి మీ పత్రికలోనే చదివాను. **మిసిమి** పబ్లిషర్లు ధన్యులు-సంపాదకులు దార్శనికులు. అందులో పనిచేసేవారు అదృష్టవంతులు. అందరికంటే ఈ పత్రికను నెలానెలా అందుకుంటున్న పాఠకులు ఋణగ్రస్తులు!..."*

**- డా॥ కె. రవీంద్ర - అంబుడ్స్‌మన్, రంగారెడ్డి జిల్లా.**

కూడా ప్రమాణించాడు. అప్పటికింకా కందుకూరి వీరేశలింగం పంతులుగారికి మైనారిటీ తీరలేదు.

అంతేకాదు, హితసూచనిలో సామినేనివారు ఆధునిక విజ్ఞానాన్ని అధ్యయనం చేయాలని సూచించాడు. అశాస్త్రీయ వైద్యాన్నీ, మూఢ నమ్మకాలనూ నిరసించాడు. మంత్రాలను, మహిమలను, బంగారం తయారుచేసే ''పరసువేది'' విద్యనూ, దయ్యాలు-భూతాలపై నమ్మకాలను, చేతబళ్ళను, పాము మంత్రం-తేలు మంత్రం-గ్రామ దేవతల కొలుపులు మొదలైన వాటిని వ్యతిరేకిస్తూ బలమైన వాదం చేశాడు. ఆయనొక విస్మృత వైతాళికుడు. ఆయనింకా ఏమి వ్రాశాడో మనకు తెలియదు. పెండ్లి మంత్రాలను, కన్యాశుల్కాలను కూడా ఆయన వ్యతిరేకించాడు. తన రచనలో బండి 'ర' లను, అర సున్నాలను, అనవసరమైన నిండు సున్నాలను తొలగించాడు. పురాణకథలపై దాడిచేయలేదు కాని, అవన్నీ కాకమ్మ కథలని గుర్తించాడు.

ఆ తర్వాత కొద్దికాలానికి గురజాడ, వీరేశలింగం పంతులు సంప్రదాయ వ్యతిరేకతతో కొంత స్వతంత్ర సాహిత్యాన్ని సృష్టించారు. వీరేశలింగంగారి ప్రహసనాలన్నీ సాంఘిక దురాచారాల మీద పరిహాసాలే. అయినా వారి సాహిత్యం సంస్కరణకుద్దేశించిందే కావడంవల్ల హేతువాద వికాసానికి అంతగా దోహదం చేయలేదు.

మతభావాల పునాదిని సాహిత్యసృష్టి ద్వారా కదిలించడానికి దీక్షతో దృఢమైన కృషిచేసి ఆధునిక హేతువాద యుగకర్తగా పరిణమించిన కవిరాజు త్రిపురనేని రామస్వామి రాకతో హేతువాద సాహిత్యంలో నూతన శకోదయమైందని చెప్పవచ్చు.

కవిరాజుకు పూర్వం తెలుగులో బండ్లకొలది సాహిత్యం ఉంది. కాని, అందులో గుప్పెడు వేమన పద్యాలు తప్ప భారతరామాయణాలను, ధర్మశాస్త్రాలను, భగవద్గీతను, పురాణాలను ప్రశ్నించిన తెలుగు గ్రంథం ఒక్కటీలేదు. ఏ సాహిత్యం జడ హిందూ సంస్కృతికి మూలమో, దాని స్వరూప స్వభావాలను బట్టి బయలు చేయకుండా మతాచార దౌష్ట్యాన్ని రూపుమాపడం సాధ్యం కాదు. ఆ పని కవిరాజు జీవితాంతందాక చేశాడు. ఆయన సృష్టించిన హేతువాద సాహిత్యం రాసిలోనూ, వాసిలోనూ అగ్రగణ్యమైనది.

సాహిత్యరూపంలో హిందూమత దౌష్ట్యంమీద కవిరాజు తిరుగుబాటు చేశాడు. సామాన్య హిందువును భావ బానిసగా మార్చిన ఇతిహాస పురాణాదులపై ఆయన ధ్వజమెత్తాడు. వాటి మూలాలను ధ్వంసం చేయడానికి అతీతశక్తుల్ని వ్యతిరేకించాడు. మతమౌఢ్యాన్ని ఎదుర్కొన్నాడు. మతధర్మాలను నిలదీసి ప్రశ్నించాడు. మతాచారాలను తిరస్కరించాడు. కులతత్వాన్ని, అంటరానితనాన్ని వ్యతిరేకించాడు. మానవ సమతాభావాన్ని నూరిపోశాడు. సాంఘిక విప్లవానికి రాచబాటవేశాడు. ఆ బాట భారత సమాజానికి మొత్తానికి ఆవశ్యకమైనదే కాని, ఏదో ఒక వర్గానికీ, శాఖకూ పరిమితమైనది కాదు. అతి సాహసంతో, ఏకబిగిని మతగ్రంథాలపై పోరాటం సాగించిన తొలివ్యక్తిగా కవిరాజు పేరు చరిత్రలో నిలిచిపోతుంది. ఆ ఒరవడిని జీవితాంతందాక, రాజీలేకుండా, దారితప్పకుండా సాగించిన తొలివ్యక్తి భారతదేశంలో కూడా ఆయన ఒక్కరేనేమో!

విద్యార్థిదశలోనే మహాభారత లక్ష్యాన్ని విమర్శిస్తూ త్రిపురనేని 'కురుక్షేత్ర సంగ్రామం' అనే రూపకం వ్రాశాడు. ఇది 80 ఏళ్ళనాటి విషయం. భారతయుద్ధానికి కారణంగా చూపబడుతున్న పాండవులు దాయభాగార్హతను ఆయన అందులో అనేక కోణాలనుంచి ప్రశ్నించాడు. కవిరాజుకంటె ముందు ఆ సమస్యను ప్రస్తావించినవారుండవచ్చు కాని, సాంప్రదాయిక విశ్వాసాలకు భిన్నంగా కవిరాజు చేసిన విమర్శలో నిర్దిష్ట లక్ష్యం ఉంది. అందుకే ఆనాటి సాంప్రదాయిక పండితలోకం ఆయనపై విరుచుకుపడింది. కవి సామ్రాట్టులయితే ఆయన్ని శూద్రకవిగా నిందించేదాక ఆయనపై దాడికొనసాగింది.

రెండోఘట్టం. 70 ఏండ్లకు పూర్వం ఆయన బ్రిటన్‌లో

డిసెంబరు (2011)

క్రీస్తు కేవలం ప్రత్యేక వ్యక్తే కాదు చరిత్రలోనే మొదట ఉన్నతమైన వ్యక్తిత్వం గలవాడు. (39వ పేజీ) - మఱి - బుద్ధుడు! వైల్డ్ దృష్టిలో బుద్ధుడు లేనేలేడా? *అగాధం* లోతైన ఆలోచనలు గల పుస్తకం. మళ్ళీ మళ్ళీ చదువుకోదగినది. ఇంతమంచి రచన చేసిన మీకు నా అభినందనలు.

**- రామమోహనరాయ్,** గుంటూరు.

ఉండగా వ్రాసిన శంబుక వధ. అందులో శంబుకుడి రూపంలో త్రిపురనేని ధర్మశాస్త్రాల నైతికతను ప్రశ్నిస్తాడు.

ఋషులో మరెవ్వరో పలువురెచ్చటనో గుమికూడి తాముకల్మషమతి పక్షపాతముగ లక్షల గ్రంథము వ్రాయగా అకల్మషములటంచు నెత్తిపయి పెట్టుక పూజయొనర్వ నేర్తుమే?

ఋషులకు మాత్రముండవలదే రుజు మార్గము?

ముక్తికోసం రామకోటి వ్రాతలు, రామభజనలు చేసే ఘనులు చేస్తుంటే, ఆ ముక్తికోసమే తపస్సు చేసుకొంటున్న శంబుకుణ్ణి కేవలం శూద్రుడనే కారణం చూపి సంహరించిన రాముడి అకృత్యాన్ని అదేమని ప్రశ్నించిన సాహితీ స్రష్టలులేరు. వందలాది తెలుగు రామాయణములు వ్రాసిన వారున్నారు. 4వ శతాబ్దిలోని భవభూతి, 18వ శతాబ్దిలోని కంకంటి పాపరాజు శంబుకవధను ప్రస్తావించినా, ధర్మాధర్మ జిజ్ఞాస చేయడానికి వారికి తీరలేదు, మనస్కరించలేదు. శంబుకవధలోనూ ధర్మాన్నే చూచించి సాంప్రదాయిక పండితలోకం, అందలి అధర్మాన్ని వెయ్యికాగడాల వెలుగులో చూపినందుకు కవిరాజు త్రిపురనేనికి 'బ్రహ్మద్వేషి' బిరుదునిచ్చింది. శంబుకవధను సమర్థించే పండితవర్యులు నాటికీ, నేటికీ వున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు అచ్చువేసిన పురుషసూక్తంలో 'బ్రాహ్మణోస్యముఖ మాసీత్' అనే రుక్కుకు అర్థం వ్రాస్తూ ఎక్కిరాల కృష్ణమాచారి ''బ్రాహ్మణులు విరాట్పురుషుని ముఖమై ఉండెను, క్షత్రియులు బాహువులై ఉండిరి, శూద్రులు విరాట్పురుషుని పాదముల నుండి పుట్టిరి" అన్నాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ముఖబాహూరువులైతే, శూద్రులు పాదాలనుంచి పుట్టారని వ్రాయడానికి ఎక్కిరాలకు సిగ్గులేకపోతే, దాన్ని అచ్చువేయడానికి టిటిడి వారికి సిగ్గెందుకు లేకపోయింది అనేది ప్రశ్న. అలాంటి గ్రంథాలను అచ్చువేయటమే టిటిడి లక్ష్యమనేది అసలు రహస్యం.

కవిరాజుగారి సూతపురాణం ఒక బృహత్కావ్యం. ఇలాంటి రహస్యాలన్నిటినీ అది బట్టబయలు చేసింది. భారత, భాగవత, రామాయణాదుల్లోని కథలు కొంతైనా జరిగివుంటే, ఎలా జరిగివుంటాయనే అంశాన్ని కావ్యభాగంలో కవిరాజు పరిశీలించాడు. అందులోనే ఎంతో ధర్మాధర్మ, ఉచితానుచిత జిజ్ఞాసచేశాడు. అందులో 1,3,4 ఆశ్వాసాలకు సుదీర్ఘంగా వ్రాసిన పీఠికల్లో పురాణాదుల వాదాలను తుత్తునియలు చేసి, క్షోదక్షమంగా విమర్శించాడు. ఈ ప్రసంగంలో వాటినన్నిటినీ వివరించడం సాధ్యంకాదు.

అదంతా ఒకెత్తు. కవిరాజు సూతపురాణం1,3,4 ఆశ్వాసాలకు ఇష్టానిష్ట దేవతాస్తుతి, మొత్తుకోళ్ళు, 'జోతలు' పేర్లతో వ్రాసిన పద్యాలొకెత్తు. కవిరాజు తార్కికదృష్టి, హేతువాద హృదయం వాటిలో కొట్టవచ్చినట్లు వ్యక్తమవుతుంది. అందులో కొన్ని

**ఒకరుడు వేదమే భగవదుక్త మటంచును పన్యసించు;**
**ఇంకొకరుడు బైబిలే భగవదుక్తమటంచును వక్కణించు; వే**
**రొకరుడు మా ఖురాన్ భగవదుక్తమటంచును వాదులాడు; ఈ**
**తికమకలేల పెట్టెదవు? తెల్పగ రాదె నిజంబు.....**

**చేసిన దోసమీశ్వరుని చింతనచే నశియించునన్నవి**
**శ్వాసము కలిరేబవలు పాపమొనర్చుచు తీరినప్పుడే**
**దోసమయంబునన్ కలము తొందరగా గొని రామకోటినిన్**
**వ్రాసెడి భక్తకోటి పదపంకజముల్ శరణంబు వేడెదన్.....**

కావ్యం లోపల ఆయన విసిరిన చెణుకులెన్నో! స్వర్గంలో ఉండే స్త్రీలంతా వేశ్యలే కదా? వారికి పెండ్లి పెటాకులు ఉండవు కదా? ఆ స్వర్గాన్ని వర్ణిస్తూ

ఇండ్లొ యున్నవి కాని పెండ్లిండ్లు లేవు ఆంద్రా యున్నారు కాని ఇల్లాండ్రు లేరు____ అంటారు

ఇక స్వర్గాధిపతి దేవేంద్రుడు పరమ వ్యభిచారి అని పురాణాలన్నీ వర్ణించినై. పైగా అతనికి వెయ్యి కళ్ళున్నాయని అన్నాయి. అతనికి ఒంటి నిండా మేహపొడలున్నాయి తప్ప అవి కళ్ళు కాదని కవిరాజు వ్యాఖ్య.

**వేయి కన్నులు నాకు కన్పింప లేదు**
**పొడలు మాత్రము కన్పించే ఒడలి నిండ**

కవిరాజు శతకంగా ఉద్దేశించి 36 పద్యాల వరకే పూర్తిచేసిన 'ధూర్తమానవా' లోని పద్యాలన్నీ హేతువాద రీత్యా చూస్తే ఆణిముత్యాలే. అందులో దేవుడు ధూర్త మానవుణ్ణి

**కాలుం జేతులు, ముక్కు మోములును,**
**చంకల్, చన్నులన్, పేర్లు నీకెలాయున్నవో నాకు అట్లె కలవా?.....**

అని ప్రశ్నిస్తాడు.

**ఉడుగకతొల్ల పెండ్లమును నొక్కతె నామెడకంట గట్టి ఆ**
**బిడ్డనెవరో హరించెనని వెంగలిమాటలు చెప్పి ఆమెకై**
**యడతెగకుండ బావురని యేడ్చితివేమిర?.....**

అని దూషిస్తాడు.

**అవతారంబులనెత్తి చేయగల అన్యాయంబులన్నింటినీ**
**నవతారంబుల నెత్తకుండా మరిచేయన్**
**శక్తిలేదంచున న్నవమానించితి వింతకాలము.....**
అని హెచ్చరిస్తాడు
**స్మృతులన్ వ్రాసితినండు వాస్మృతులలో**
**చిత్రించి శ్రుత్యరముల్**
**ప్రతిపాదించితి నండు వయ్యదినిజంబా?.....** అని నిగ్గదీస్తాడు
**ఇల్లును వాకిలి కట్టిపెట్టి ఏ**
**టేటను పెండ్లి సేయుమని ఏనెపుడైనను**
**కోరి యుంటినే**
**చీటికి మాటికిన్ పరుల జేబుల కొట్టుట**
**ధర్మమార్గమే.....** అని నిగ్గదీస్తాడు.
**తిరిపెమునెత్తి యెత్తి అతి దీనత దిర్గుచు**
**జోలిబట్టుచున్**
**తిరుపతికొండ మీదకేగదేకుచు అచ్చట**
**చెప్పుదెబ్బలీ**
**వొరువుగదిన్న లేశము ప్రయోజనముండదు.....** అని బోధిస్తాడు.
ఇదే ధోరణి కుప్పుస్వామి శతకంలోనూ కన్పిస్తుంది.
అందులో
**గుడికి తరుచుపోయి**
**గొణుగుచుండెడివాడు**
**చెడ్డ పాపమేదో చేసియుండు.....** అనీ
**పాతకునిచేత ఎప్పుడు గీతయుండు**
**మొగముపై వింతవింతగ బొట్టులుండు.....** అనీ
భగవద్గీతధారులనుసైతం ఎత్తిపొడుస్తాడు.

'భగవద్గీత' లో 'ఖూనీ' నాటకంలో కవిరాజు త్రిపురనేని వెలువరించిన హేతువాద భావాలను గురించి మరింత చెప్పుకోవచ్చు.

నిజానికి కవిరాజు సాహిత్యంలో తెచ్చింది భావ విప్లవమే కాని, భాషా విప్లవం కాదు. రూప విప్లవం కూడా కాదు. ఆయనది కవితావస్తు విప్లవం. ఆయనది నినాద కవిత కాదు – వికాస కవిత. అందువల్లనే ఆయన భావాల ప్రభావం ఆయనతో ఆగిపోలేదు. ఆయన సాహిత్యం హేతువాదయుగ కర్తృత్వానికి సారథ్యం వహించింది. హేతువాద వస్తువు తప్ప మరో వస్తువు ఆయన కలం నుంచి రాలేదు.

కవిరాజు కాలంలోను, సన్నిహిత కాలంలోను హేతువాద వ్యాప్తికి దోహదం చేసే సాహిత్యాన్ని సృష్టించిన రచయితలు అనేకమంది ఉన్నారు. పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి వ్రాసిన మహాభారత చరిత్ర ఆ రోజుల్లో అలజడి లేపింది. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి లాంటివారు ఆ రచనపై పెండ్యాల వారిని కోర్టుకు కూడా లాగారు. అయినా కోర్టు శ్రీపాదవారికే జరిమానా వడ్డించింది. కవిరాజు వలెనే పెండ్యాలవారు కౌరవుల కోపున నిలిచారు. అంటే బారత రచన ఏ పక్షాన్ని సమర్థించిందో, ఆ పక్షాన్ని పెండ్యాలవారి గ్రంథం తప్పు పట్టింది. తద్వారా భారత రచననే తప్పు పట్టినట్లయింది.

తాపీ ధర్మారావుగారి–"దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు?" "పెండ్లి–దాని పుట్టుపూర్వోత్తరాలు" హేతువాద భావాలకు మసాలాగా పనిచేసినై. సంఘంలో



జనవరి (2011)

***మిసిమి*** సంస్థాపక సంపాదకులున్నారే – ఆలపాటి రవీంద్రనాథ్‌గారు వారు ఎమ్.ఎన్ రాయ్ అనుచరుడు – ఆనాటి రాజకీయాల్లో, ఆవుల గోపాలకృష్ణమూర్తిగారితో పాటు! ఈ ఆలపాటివారు, అన్ని ఆధునిక అభ్యదయకర ఉద్యమాలకు చేయూతనిచ్చిన మనీషి! రామ్‌గారినుండే కాదు, రవీంద్రనాథ్ గారి నుండీ, నేను నేర్చిన పాఠమొకటున్నది. ఆ రోజుల్లో, అంటే మీరు పుట్టకముందు, రవీంద్రనాథ్ తెనాలినుండి *జ్యోతి* మాసపత్రిక ప్రచురించారు. అది – పుస్తకరూపంలో వుండేది. దానికి మా మేనమామ – సాంబయ్యగారు చందాదారులు! అప్పుడు నేను 8వ తరగతి విద్యార్థిని. *జ్యోతిని* చదువుతుండేవాడిని. *డాక్టరుగారులో* 'అనుభవించవలసిన వయసును హారతి ఇచ్చి, నాకు వెచ్చని జీవితాన్నిచ్చారు' ఈ వాక్యం చదువు తుంటే ఎండిపోయిన నా కళ్ళు చెమర్చాయి. నాకు 84 ఏండ్లు. బెంగుళూరు దగ్గర్లో, నేలమంగళంలో వుంటాను.

**– పెద్ది సత్యన్నారాయణ,** నేల మంగళ, బెంగుళూరు.

గూడు కట్టుకొనివున్న కొన్ని మూఢనమ్మకాల పునాదులను ఆయన గ్రంథాలు వెదకిపట్టి చదువరుల ముందుంచినై.

కొప్పరపు సుబ్బారావుగారి ''శాస్త్రదాస్యం'' చిన్న గ్రంథమైనా గొప్పగ్రంథం. అది నిజంగా ప్రమాణ విధ్వంసకి. అయిన దానికీ, కాని దానికీ ఏదో ఒక శ్లోకాన్ని వల్లించి ధర్మశాస్త్ర ప్రమాణాలు చూపడం సనాతనులకు ఆనవాయితీ. అలాంటి వందలాది శ్లోకాలను ఉదహరించి, అవన్నీ పరస్పర విరుద్ధంగా ఉన్నాయని, వాటి ప్రకారం జీవించడం సాధ్యం కాదనీ ఒక కథ ద్వారా సుబ్బారావుగారు నిరూపించారు. ఒక సంస్కృత కళాశాల అధ్యాపకుడు 'శాస్త్రం' ప్రకారం దినచర్య జరపబూని, ఆ పని చేయలేక చివరకు ఆత్మహత్యకు పూనుకొని, అది చేయడం పాపమన్న శ్లోకం జ్ఞాపకం వచ్చి – శాస్త్రదాస్యం శుద్ధదండుగ అని ఆ కథలో గ్రహిస్తాడు. అంతేకాదు వందలాది ప్రదర్శనలివ్వబడిన "తారాశశాంకం" నాటకం కూడా కొప్పరపువారి రచనే. అందులో పురాణాల విమర్శ, దురాచారాల విమర్శ మిళితమై ఉంటాయి.

ఆమంచర్ల గోపాలరావుగారి 'హిరణ్యకశిపుడు' ముద్దుకృష్ణగారి అశోకం, చలంగారి పౌరాణిక నాటికలు. ఆ పాత్రల్ని పురాణాలు పోషించిన విధానానికి భిన్నంగా హేతువాద దృక్పథంతో ఆయా పాత్రల్ని పోషించాడు.

హేతువాద ధోరణిలో పురాణాలు విమర్శకు పూనుకున్న గ్రంథాల్లో నార్ల వెంకటేశ్వరరావు గారి జాబాలి, సీతజోస్యం, నరకంలో హరిశ్చంద్రుడు పురాణాల విమర్శకు చారిత్రక మలుపు ఇచ్చారు. ఆ నాటకాలకు ఆయన వ్రాసుకున్న పీఠికలు ఆయన పరిశోధనకు దర్పణాలు. భారతంలోని చార్వాకుడి కథను తీసుకొని బి.రామకృష్ణ వ్రాసిన నాటకం "చార్వాకుడు". ఆయన ఆ గ్రంథాన్ని వ్రాసిన పీఠికలో చార్వాకదర్శనం గురించి సమర్థవంతమైన సుదీర్ఘ సిద్ధాంతచర్చ చేశారు.

ఇక హేతువాద తాత్వికధోరణి గురించి మాట్లాడుకోవాలంటే, నాస్తికత్వం పేరుతో గోరాగారు తన స్వంత మార్గంలో విశేషంగా సిద్ధాంతచర్చ చేశారు. ఆయన సాహిత్యం హేతువాదమార్గానికి కొంత దోహదం చేసింది.

అనువాద సాహిత్యంలో ఎం.ఎన్.రాయ్ వ్యాసాలు, మత మౌఢ్యంపై పిల్లిదండయాత్ర, ఎ.బి.షా గారి శాస్త్రీయదృక్పథం, రాహుల్ సాంకృత్యాయన్‌గారి భారతీయ దర్శనం, ప్రాక్పశ్చిమ దర్శనాలు ప్రముఖంగా హేతువాద రంగంలో దార్శనిక దృక్పథం కుదురుకోడానికి కొంత దోహదం చేసినై.

ఇటీవల కాలంలో ఆధునిక విజ్ఞానశాస్త్ర సహాయంతో మతాన్ని, మత పునరుజ్జీవన వాదాన్ని ఎదుర్కొనే రచనలు ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం (IRA) వారు చాల వెలువరించారు. దార్శనికస్థాయిలో హేతువాదంపై కూడా ఈ సంఘం అనేక రచనలు ప్రచురించింది.

ప్రస్తుతం ఈ రంగంలో 1) హేతువాది 2) నాస్తికమార్గం అనే పత్రికలు నడుస్తున్నాయి. హేతువాద నాస్తికవాద ధోరణులను వ్యాప్తి చేయడానికిలోగా కృషిచేసిన పత్రికలో 1) చార్వాక 2) నాస్తికయుగం 3) సమీక్ష 4) హేతువాదం అనేవి ఉన్నాయి. ఈ పత్రికలిప్పుడు ఆగిపోయాయి.

ఈనాడు మత పునరుజ్జీవనవాదం బలిసిపోతున్నది. అన్ని ప్రచార సాధనాలూ అందుకు వినియోగ పడుతున్నాయి. రేడియోలో, టెలివిజన్‌లో రామాయణ, భారత భాగవతాది కథల్ని నాటకీకరించి ప్రదర్శించడంవల్ల మతప్రచారం మరోమలుపు తిరిగి ఉధృతవేగం అందుకొన్నది.

సంజీవ దేవ్

తెలుగులో ఇటువంటి విశిష్ట మాసపత్రిక అస్తిత్వం తెలుగులోని ప్రౌఢ సాహితీరంగానికి ఎంతో గర్వకారణం. కల్పనా సాహిత్యం, కవితా సాహిత్యం వాటి రంగాల్లో అవి చాలా విలువైనవే. సందేహం లేదు. అదంతా హృదయ సాహిత్యం. కాని మనిషి హృదయ సత్తాతో మాత్రమే జీవించలేడు. హృదయానికి తోడు మేధ కూడ ఎంతో అవసరం. ఇటువంటి ప్రగాఢ పత్రికను నడపటంలో ప్రధానమైన చిక్కు ఏమంటే కల్పనా సాహిత్యాన్ని సృష్టించే రచయితల వలె ఇటువంటి మేధా సాహిత్యానికి రూపం ఇచ్చే రచయితలు ఎక్కువగా ఉండకపోవటం.

**– డా. సంజీవ దేవ్, రచయిత, కళా విమర్శకులు.**

ప్రభుత్వాంగాలుగా ఉన్న ఈ సాధనాలు మత ప్రచారానికి దిగడంతో మౌఢ్యం కట్టలు త్రెంచుకుంటున్నది. మరి దీన్ని ఎలా ఆపాలి?

నిజానికి తెలుగు సాహిత్యంలో హేతువాదాన్ని ప్రోత్సహించగలది, అందుకుద్దేశించినది 1 శాతం కాదూ, 0.1 శాతం కూడా లేదు. అంటే దాదాపు లేదనే అర్థం.

కేవలం సైన్సు పాఠాలు, చరిత్రపాఠాలు, ఇతర అంశాల పాఠాలు పుస్తకాలుగా వ్రాసి ప్రచురించుకొంటే చాలదు. అవి యేమి బోధిస్తున్నాయి, దేన్ని త్రోసివేస్తున్నాయి అనే విషయం ఆ గ్రంథాల్లో లేకపోతే నైతిక జీవితాన్ని నడపగల తాత్విక దృక్పథాన్ని అవి ఏ మార్గంలో చూపుతున్నవో అవి చెప్పకపోతే, వాటి పఠనం వల్ల చేకూరేది చెత్త చదువే.

ఈనాడు సాహిత్యరంగమంతా కసవుతో కూడుకొని ఉంది. ఆ కసవును పూర్తిగా వేయకుండా దాని మీదనే చారిత్రక, శాస్త్రీయ సాహిత్యాన్ని పేరిస్తే, ఇది కూడా ఆ కసవులో భాగమవుతుంది.

అందువల్ల మన రచన లక్ష్యమేమిటో పాఠకుడికి నేరుగా బోధపడకపోతే, ఆ రచన తన లక్ష్యాన్ని నెరవేర్చాలని చారిత్రక సంధిదశలోను, తాత్విక ప్రారంభ దశలోను మనం ఉన్నాం. కాని హేతువాద భావాలను నేరుగా చెప్పగలిగిన సాహిత్యం మనకు కొల్లగా కావాలి. వైదిక వాఙ్మయాన్ని మొత్తాన్ని విలువతేల్చి నిరాకరించి చెప్పే గ్రంథాలు కావాలి. ఆధునిక విజ్ఞాన శాస్త్రరీత్యా వాటిని ఎందుకు త్రోసి వేయవలెనో వివరించే గ్రంథం కావాలి. ఆధునిక విజ్ఞానం మనకు ఎలాంటి దార్శనిక మార్గాన్ని చూపుతున్నదో వివరించే సాహిత్యం కావాలి. అప్పుడే తెలుగులోనూ తగినంత హేతువాద సాహిత్యమున్నదనీ, అది ఆధునిక ప్రపంచంతో మనల్ని కలుపగలదనీ మనం సంతోషించగలం. – సెలవు.

***మిసిమి*, ఆగష్టు 1991)**



డిసెంబరు (2005)

అందమైన ఆహార్యం, అంతకన్నా భావస్ఫోరకమైన ఆలోచన కలగలిసిన మనిషి ఎంత ఆకర్షణీయంగా వుంటాడో, పత్రికల్లో ***మిసిమి*** అలాంటి పసిడి తునుక. సామాన్యుల్లో పరిశోధనాశక్తిని, ఆసక్తిని పెంపొందింపచేయడంలో ఆలోచనాపరుల పాత్ర ప్రపంచం ఎరిగిందే. అలాంటివారి వివేచనకు పదును పేట్టే అసమాన మాసపత్రిక ***మిసిమి***. తెలుగు పత్రికా ప్రపంచంలో అనన్య సామాన్యమైన ఈ ప్రయోగాన్ని శ్రద్ధా, దక్షతలతో పాఠకజన మనోభిరామంగా ఆలోచనామృత సంధాయిగా నిర్వహిస్తున్న శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ గారు తెలుగు చదువరుల కృతజ్ఞతాభివందనములకు సదా, సర్వదా, బహుధా పాత్రులు. ***మిసిమి*** మరింత వన్నె, వాసి సంపాందించుకొనేందుకు ఈ అయిదేళ్ల అనుభవం దోహదకరం కావాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను. **– సి. రాఘవాచారి, ఎడిటర్, 'విశాలాంధ్ర'.**

***మిసిమి*** ముద్రించిన దేవికారాణి బొమ్మ నాలో ఎన్నో జ్ఞాపకాలను రేపింది– ...న్యూస్‌స్వతంత్ర టైమ్స్ ఎడిటర్‌గా పనిచేస్తున్న శ్రీ వామనరావు పేరుగాంచిన జర్నలిస్టు. నేను క్రిందటి సంవత్సరము అతన్ని కలిసాను. నేను చేసిన ప్రసంగాలు ఆయన శ్రద్ధగా వినేవారు. మీరు ముంబయి వస్తే మా ఇంటికి రావలసినదిగా నా ఆహ్వానం. నాకు అత్యంత ఆప్తుడైన మిత్రుడు కె. బిలోక్ నాకు పుత్రసమానుడు. అతను మిమ్ములను త్వరలోనే కలుస్తాడు..."

**- సుశీలా రాణీ పటేల్, గిర్నార్ బంగళా, పాలీహిల్, నర్గీస్ దత్ రోడ్డు, బాంద్రా, ముంబయి.**

# కళాపూర్ణోదయం:
# కథా సంవిధాన వైచిత్రి

– డా.జి.వి.కృష్ణారావు

**కథా శరీరముత్పాద్య వస్తు కార్యం తథా తథా**
**యథా రసమయి సర్వ మేవై తత్ప్రతిభాసతే.**

కావ్యాన్ని ప్రాచీనులు శ్రవ్యమనీ, దృశ్యమనీ రెండు విధాలుగా విభజించారు. కవిత్వాన్నిగూడ అలాగే వర్ణకమనీ, వస్తువనీ విభజించవచ్చును. కాని ఈ విభాగం అంత తేలిక కాదు. అయినా వీటిని స్థూలంగా చెప్పుకోవచ్చును. సంఘటనా చిత్రణము వర్ణకము. నిరపేక్షమైన బహు సంఘటనా ప్రబంధం వస్తువు.

వర్ణక కవిత పువ్వైతే, వస్తు కవిత దండ, దండలో పువ్వులుంటవి. రేకులుంటవి. కాని పువ్వులో దండ ఉండదు. అలాగే వస్తు కవితలో వర్ణక కవిత ఉంటుంది. కాని వర్ణక కవితలో వస్తుకవిత ఉండదు.

పువ్వు సహజ సుందరం. దానికి నిర్దిష్ట ప్రయోజనం లేదు. అది అలంకరణకూ ఉపయోగపడవచ్చును; దేవతార్చనకూ ఉపకరించవచ్చును. దండ అలాకాదు. అందంగానూ ఉంటుంది. నిర్దిష్ట ప్రయోజన కలితమూ అవుతుంది. వాస్తవానికి అది మాల్యమో, గర్భకమో, గ్రైవేయకమో, ప్రాలంబమో, వైకక్షికమో అవుతుంది. అలాగే వర్ణక కవిత ప్రీతిని నియతంగా ఇస్తుంది. దీనికి ఋతుసంహారాదులు దృష్టాంతాలు. వస్తుకవిత ప్రీతిని మాత్రమే కాదు, నిర్దిష్ట వ్యుత్పత్తిని కూడా కలిగిస్తుంది. దృష్టాంతం రామాయణాదికం.

ఈ భేదంవల్లనే లోకం కేవల వర్ణక కవితకంటే వస్తు కవితయందు మొగ్గు చూపుతున్నది. పామరులు సైతం రామాదులను పేర్కొంటారు గాని కాళిదాసుని వర్ణనలను గూడ చెప్పుకోరు.

ఈ వస్తువు మూడు విధాలు: 1. ప్రఖ్యాతము, 2. ఉత్పాద్యము, 3. మిశ్రము. ఉత్పాద్యాన్ని ప్రాచీనులు నిషేధించలేదు. కాని రసపక్షపాతంతోను, ఔచిత్య భంగభీతితోనూ, కవి ప్రతిభాశక్తియందలి శంకతోను, నవ్యత రసపరిగ్రహ సాధ్యమన్న నమ్మికతోను ప్రఖ్యాత మిశ్రకథలను ఆదరించారు, అభిమానించారు.

ప్రపంచం ఉత్పాదస్థితి భంగపూర్వకమైన చక్రికా పరిణామం కాక అతర్కితోపనతమైన విచిత్ర పరిణామం పొందుతున్నప్పుడు, జీవనమూ జీవికలూ మారుతున్నప్పుడు విశేష వ్యుత్పత్తి ఆవశ్యకం. ఈ వ్యుత్పత్తి విశేషం ఉత్పాద్యవస్తు సాధ్యమేకాని ప్రసిద్ధ వస్తు సాధ్యం కాదు. ఇనుముతో నిర్వర్తించవలసిన కట్టడాన్ని కలపతో నిర్వర్తించలేము.

కనుక వ్యుత్పత్తిని బట్టి ఉత్పాద్య వస్తువునకు ఎంతో ప్రాముఖ్యమున్నది. ఉత్పాద్యవస్తు ప్రసిద్ధాలు పురాణేతిహాస బృహత్కథలు, కాదంబరి, అభిజ్ఞాన శాకుంతల మట్లు ప్రసిద్ధవస్తువే కాని అన్యం కాదు. కేవలం ప్రబంధ దృష్టితో పరిశీలించినప్పుడు పేర్కొనదగినవి రామాయణ మహాభారత బృహత్కథలు. తరువాత కళాపూర్ణోదయం. మొదటివి మూడూ కవికులోపజీవ్యాలుగా ఉన్నవి, ఉంటున్నవి. ఆ గౌరవానికి నోచుకోనిది కళాపూర్ణోదయమే.

కళాపూర్ణోదయంలో హృద్యాలైన వృత్తాంతాలు అనేకం ఉన్నవి. కలభాషిణీ వృత్తాంతం, సరస్వతీ చతుర్ముఖుల క్రీడ, సుగాత్రీశాలీనుల కథ, అలఘుప్రతుని చరిత్ర, రంభల కలహం, మణిహార వృత్తాంతం, మృగేంద్ర వాహనాలయ ఘట్టం హృదయావర్జకాలు. అయితేనేమి? శేషుని ఫణామణులు సుందరాలు అనర్ఘాలు కావా? చూచి భక్తిపారవశ్యంతో నమస్కరించవలసినదేతప్ప వాటిని ఆహరించటం సాధ్యమా? ఒకవేళ సౌందర్య వ్యామోహియై సాహసించి ఏ కవి అయినా ఆహరిస్తే అనౌచిత్య దష్టాలై ఆ దివ్యమణులు గాజుపూసలై పోతవి.

కలభాషిణీ వృత్తాంతాన్ని కళాపూర్ణోదయం నుంచి వేరుచేసి ఆమె మృతితో కథను ముగిస్తే, కథానాయిక ప్రియునికోసం ఇల్లు వదలి పారిపోయి భ్రష్టశీలయై దుర్మరణం పొందవలసి వస్తుంది.

సరస్వతీ చతుర్ముఖ క్రీడ స్వతోరమ్యమే. దానిని పుణికి పుచ్చుకొని వేరుగా వ్రాస్తే అది దేవతారతి వర్ణనమై నికృష్ట రసాభాసమై పోతుంది. విశేషించి ఆ క్రీడను కథాప్రపంచ పర్యవసాయితా విరహితంగా చిత్రిస్తే ఎంత సొగసు

లోపిస్తుందో సహృదయులే ఊహించుకోవచ్చును. దీనికయినా అంగీకరించి అనౌచిత్యాన్ని పరిహరించి చిత్రిస్తే, అది సాధారణ నాయికా నాయకుల శృంగారక్రీడ కావచ్చునే కాని సరస్వతీ చతుర్ముఖుల క్రీడమాత్రం కాదు. సుగాత్రీ శాలీనుల కథలను ఇల్లరికమను పేరు పెట్టి వేరొక రచయిత చక్కని నవలో, నాటకమో, పద్యకావ్యమో వ్రాయవచ్చును. అట్టి ఆలుమగల నడుమ పొరపొచ్చాలు కల్పించటం, వాటిని పరిష్కరించటం, తన్మూలంగా కథకు అందమైన ముగింపు ఇవ్వటం అంత తేలిక కాదు. వీటిని ఒకవేళ సాధించినా శాలీనుని నిగూఢ మనస్తత్వం చిక్కదు.

అలఘువ్రతుని చరిత్రను వేరుపరచి నిరపేక్షంగా వ్రాయవచ్చు. అప్పుడది పౌరాణిక కథో లేక బృహత్కథాంతర ఖండమో అయి అన్నదాన మహిమను అభివర్ణిస్తుంది. అయితే కవిలోకసూరుడైన సూరన సాధించిన వైచిత్రిని కోల్పోపోతుంది. వ్యాసమహర్షి అంతటివాడు తన భారతం వింటే కలిగే ప్రయోజనాన్ని తరచుగా ఉపాఖ్యానాల చివర ఫలశ్రుతి రూపంతో చెప్పుకోవలసివచ్చిందే కాని దానిని ఇతివృత్త శరీరాంగంగా చేయలేకపోయాడు. ఆయనకు అట్టి శక్తిలేదని కాదు. అట్టి ఆలోచనే కలుగలేదు. గడుసరియైన సూరన తన కావ్య ఫలశ్రుతిని కథాంతర్భాగం చేసి వైచిత్రిని సాధించాడు.

రంభల కలహం, మృగేంద్ర వాహనా మణిహారాల వృత్తాంతాలు మనోజ్ఞాలైనా కథాశరీరం నుంచి విడదీయలేము. ఒకవేళ విడదీస్తే ఖండిత పృథక్కృతాంగాంతాల వలె నిర్జీవాలు, నిరుపయోగాలూ అవుతవి.

అందువల్ల కళాపూర్ణోదయ ఘట్టాలు అన్య కవులకు దురవాపాలూ దురాలోకాలూ అయిపోయాయి. వాస్తవానికి కళాపూర్ణోదయంలోని సొగసు చాలవరకు కథా సంవిధానం మీదనే ఆధారపడి ఉంది.

కథ అన్నప్పుడు అనేక వృత్తాంతాలు, కార్యములు, ఘటనలు, సన్నివేశాలు ఉంటవి. విభిన్న పదాలను అర్థవంతంగా సరసంగా తీర్చి వాక్యాన్ని ఘటిస్తున్నట్లు, రకరకాల రంగు రంగుల పూలను సంస్థానుగుణంగా, ఆహ్లాదకరంగా ప్రయోజన సాధకంగా కూరుస్తున్నట్లు వృత్తాంతాలను కూర్చడంలోనే సంవిధాన వైచిత్రి గోచరిస్తుంది.

కళాపూర్ణోదయంలో కలభాషిణి ప్రాథమిక వృత్తము, నారద తుంబురుల కలహం, మణికంధరుని తీర్థయాత్ర, మణిస్తంభుని వృత్తాంతమూ, రంభల కలహము, సుగాత్రీ శాలీసుల కథ, సరస్వతీ చతుర్ముఖుల క్రీడ, స్వభావుని ఉదంతము, కళాపూర్ణుని జన్మము, శల్యానురుని వృత్తాంతము, అలఘువ్రతుని చరిత్ర, మధురలాలసా కళాపూర్ణుల వివాహం, కళాపూర్ణుని జైత్రయాత్ర, సత్వదాత్ముని పూర్వచరిత్ర, లక్ష్మీనారాయణ సంవాదము అన్న ఘట్టాలు క్రమసంవిహితాలు.

కాలక్రమాన్ని బట్టి వీటిని ఏర్పాటు చేస్తే కథను సరస్వతీ చతుర్ముఖ క్రీడతో ప్రారంభించాలి. సూరన ఈ క్రమం త్రోసిపుచ్చి కలభాషిణీ వనవిహారం ఘట్టంతో ప్రారంభించి లక్ష్మీనారాయణ సంవాదంతో తన కావ్యాన్ని ఉపసంహరించాడు. కవి అనుసరించిన ఈ క్రమంలేని ప్రతి అంశమూ బహులార్థసాధకమై సరసంగా ఉన్నది.

**సంధ్యంగ ప్రయోజనాలను భరతుడిలా ఉల్లేఖించాడు :**

**ఇష్టస్యార్థ స్వరచనా, వృత్తాంత స్యానపక్షయం**
**రాగప్రాప్తిః ప్రయోగస్య, గుహ్యానాం చైవ గూహనమ్**
**ఆశ్చర్య వదభిఖ్యానాం, ప్రకాశ్యానాం ప్రకాశనమ్**
**అంగానాంపజ్వధం హేతద్దృష్టం శాస్తే ప్రయోజనమ్...**

ఈ ప్రయోజనాలన్నిటినీ సూరన తన కథా సంవిధానంతో సాధించాడు. ఏ ఘట్టాన్నయినా చిత్రించటానికి మూడే పద్ధతులు. ఒకటి కథన పద్ధతి; రెండు ప్రయోగపద్ధతి లేదా నాటకీయ పద్ధతి; మూడు మిశ్రపద్ధతి. కవిగాని, పాత్రగాని వృత్తాన్ని నేరుగా చెప్పటం కథన పద్ధతి. పాత్రల సంభాషణలద్వారా వృత్తాన్ని ఆవిష్కరించటం

జూన్ (2013)

*ఆస్కార్ వైల్డ్* (Oscar Wilde) ఇంతవరకు తెలుగులో వచ్చిన దాఖలాలు లేవు. వైల్డ్ లాంటి ప్రతిభాశాలిని తెలియజేయటం, వందేళ్ళ తర్వాత అయినా వెలికి తెచ్చి తెలుగువారికి తెలియజేయటం, అదీ చిక్కని శైలిలో, ప్రశంసనీయం. పూర్తిసారం అందిస్తారని ఆశిస్తున్నా. **- రామారావు, మద్రాసు.**

ప్రయోగపద్ధతి. వృత్తంలో కొన్ని భాగాలు కవి నేరుగా చెప్పి కొన్నిటిని పాత్రల సంభాషణల ద్వారా ఆవిష్కరించటం మిశ్రపద్ధతి.

కళాపూర్ణోదయం ఊర్జితకథోపేతమైన మహాప్రబంధం. కనుక ఈ మూడు పద్ధతులూ ఆవశ్యకాలే అవుతవి. అయితే ఈ పద్ధతీ ప్రయోగంలో కథా సంవిధాన వైచిత్రి ఎంతో సాధించాడు.

ద్వారకా వర్ణనం కవి స్వయంగా చేసి నారద తుంబురుల కలహం; మణికంధరుని తీర్థ యాత్రాదికం మణిస్తంభుని చేత కలభాషిణికి చెప్పిస్తాడు. దీనివలన పఠితలకు విస్మయ కుతూహలాలు అధికమౌతవి. ఈ మణిస్తంభుడు ఎవడు? కలభాషిణీ నారదాదుల వృత్తాంతాలు అతనికి ఎలా తెలిసాయి? మొదలీతడు దేనికి వచ్చినట్లు? వచ్చి ఏమి చేయబోతున్నాడు? ఇలాంటి ప్రశ్నలు అనేకం ఉద్భవిస్తాయి. పాఠకుడు నిర్వేలమైన కుతూహలంతో తరువాతి కథాభాగం చదువుతాడు.

మణిస్తంభుడు కలభాషిణిని మృగేంద్ర వాహనాలయానికి కొనిపోయి ఆ దేవికి బలిపెట్టబోయి భంగపడి దూరవిక్షిప్తుడై తిరిగివచ్చి కలభాషిణినేకాక సుముఖాసత్తి మణికంధరులను గూడ కలుసుకొంటాడు. ఈ భాగం కవికథనంతో సాగింది. దీనివలన కథకు జిగిబిగువులు చిక్కాయి.

రంభామాయారంభల కలహం కవి స్వయంగా చెప్పి ఉండవచ్చును. లేదా మణికంధరునిచే గాని కలభాషిణిచే గాని చెప్పించి ఉండవచ్చును. సూరన అట్లు చేయక మణిస్తంభునిచే చెప్పించి అనేక ప్రయోజనాలు సాధించాడు.

అలాగే సరస్వతీ చతుర్ముఖక్రీడను తానుగాని బాల్యావస్థ దాటిన మరొక పాత్రచేగాని చెప్పించక కవి ఉయ్యాల తొట్టిలోని వసిపావయైన మధురలాలనచే చెప్పించి ఆశ్చర్య పర్యుత్సుకతలను ఇనుమడింపజేయుటయేకాక పాత్రపోషణల ప్రబల అనౌచిత్య దోష పరిహరణం సాధించాడు.

సత్వదాత్మని వృత్తాంతమూ, లక్ష్మీనారాయణ సంవాదమూ మధురలాలనచే చెప్పించి మిగిలిన కథాభాగాన్ని కవి నేరుగా వర్ణించి వైచిత్రిని సాధించాడు. వీటన్నిటికంటే కథా సంవిధానంలో సూరన సాధించిన అపూర్వ విశేషం మరొకటి ఉన్నది.

సాధారణంగా మనం పిల్లలకు కథచెప్పాలంటే, అనగనగా ఒక రాజు, ఆ రాజుకు ఒక కూతురు అని ప్రారంభిస్తాము. అదే పెద్దవాళ్ళకు చెప్పవలసివస్తే రాజు పేరు చెబుతాము. దేశం పేరు పేర్కొంటాము. ఫలాని కాలంలో ఉన్నాడంటాము. ఆ రాజకుమారికి కనులు చేరెడు, కురులు బారెడు అంటాము. ఇవన్నీ దేనికి? నమ్మిక చిక్కటానికి, రూపొందటానికి, రక్తికట్టటానికి. ఇవన్నీ తరువాతి కథకు భూమికలు. బుద్ధిమంతుడైనవాడు ఈ పేర్లూ భూమికలూ కథతో విరోధించకుండా చూచుకొంటాడు. అంటే వీటికీ కథకూ అంగాంగీ భావం ఉండదు.

దృష్టాంతంగా, నలోపాఖ్యానమే తీసుకొందాము. నలుడు నిషధ దేశాధీశ్వరుడు. ఆ నలునిపేరు మరొకటైనా, దేశం వేరొకటైనా, కాలం మారినా ఆ కథ యథాతథంగా సాగిపోవటానికి ఏ ఆటంకాలూ ఏర్పడవు.

కళాపూర్ణోదయంలో అలా కాదు. కొన్ని పాత్రల పేర్లు కవి పేర్కొన్నట్లు లేకపోతే కథ నడవదు. కాదు, కళాపూర్ణోదయమే సిద్ధించదు. ఉదాహరణకు మణికంధరుని పేరే తీసుకోవచ్చును. ఆ గంధర్వునికి మణికంధరుడన్న పేరుగాక మయుడనో, గయుడనో చిత్రరథుడనో మరొకపేరు ఉంటే కలభాషిణి తాను నలకూబరుని ప్రేమిస్తున్నానన్న ఆత్మవంచనకు పాల్పడి ఉండదు. ఆ నలకూబర సమాగమంకోసం మణిస్తంభుని వెంటపోయి హేతిఘాతంతో మరణించి ఉండేదికాదు. అంటే కళాపూర్ణోదయ కథే ఉండేది కాదు.

అలాగే శాలీనునికి ఉత్తరకాలంలో మణిస్తంభుడన్న

జూన్ (2009)

వైఖెలాంజిలో, డావిన్సీలేగాక ఈనాటి ప్రఖ్యాత చిత్రకారుల చిత్రాలు ప్రతినెల అట్టపై ఉంటున్నాయి. ఇవి మరే పత్రికలో కనిపించవు. ఇవి పత్రిక ఇచ్చే మరో విజ్ఞానం. ఇటువంటి పత్రికలకు తెలుగు పాఠకులు ఇతోధిక ప్రోత్సాహమిచ్చి నిలబెట్టుకోవలసిన బాధ్యత ఉంది.

- కోడూరు పుల్లారెడ్డి, హైదరాబాదు.

వ్యవహార నామం ఏర్పడకున్నట్లైతే సుముఖాసత్తి అన్న నామాంతరం పొందిన సుగాత్రి తన మగనిని మృగేంద్ర వాహనాలయంలో గుర్తించి ఉండేది. అప్పుడు మణిస్తంభుడు మృగేంద్రవాహన బలినిమిత్తం కలభాషిణిని ద్వారక నుంచి మైదుపుచ్చికొని రావటానికీ అనంతర కథ జరగటానికీ అవకాశం ఉండేదికాదు. ఇలా పాత్రల పేర్లను కథతో అవినాభూతులుగా ఏ కవి ముడిపెట్టగలిగాడు?

పాత్రల దేశ కాల జాత్యాది భూమికలను కేవలం సంభావన కోసం కాక కవి కథలోని వివిధ ఘటనలకు సాధకాలుగా నిబంధించాడు. నిజానికివి భారత కర్ణుని సహజ కవచకుండలాలను పరిహసిస్తున్నవి. మణికంధరుడు గంధర్వుడు కాక మానవమాత్రుడై ఉంటే ఆకాశగమనం ఇష్టరూప గ్రహణం, చిరస్థాయులైన యౌవన జవసత్వాలు సిద్ధించి ఉండేవికావు. ఇట్లే యజ్ఞశర్మ మళయాళదేశం వాడు కాకపోతే ఓడ వర్తకులకు తన భార్యలను అమ్ముకొని తరువాతి దురవస్థ పొందవీలుండేది కాదు. సుగాత్రీ శాలీనులు కాశ్మీరవాసులు కాకపోతే జాతి స్వభావవిరోధం ప్రాప్తించి ఉండేది.

సూరన కథా సంవిధానంలో మరొక విచ్చిత్తి గోచరిస్తుంది. కవి దుర్ఘటకార్యాలను అభివర్ణిస్తాడు. "బట్టతలకూ మోకాటికైనా ముడిపెట్టవచ్చును. కాని వీటికి ముడిపెట్టడం ఎలా?" అని పాఠకుడు విభ్రాంతి విచికిత్సలకు లోనవుతాడు. కవి తరువాత శాలీనుడు తన భార్యయైన సుగాత్రికి సంతానం కలుగకుండునట్లు, సుగాత్రి తనకు సంతానం కలుగునట్లు తమ ఇలవేలుపైన సరస్వతిని వరాలు కోరుతారు. ఆమె ఇస్తుంది. ఇవి పరస్పర విరుద్ధాలు. మరి ఇచ్చినది సరస్వతీదేవి. వరాలు వ్యర్థం కావటానికా వీలులేదు. సిద్ధించటానికి మార్గమేది? సూరన నాయికా నాయకుల శీలానికి, సరస్వతీదేవి మహిమకూ అన్యథాత్వం కలుగకుండా రెండు వరాలకూ సఫలత కల్పిస్తాడు. సూరన కథా సంవిధానం ఇలా అపూర్వ మార్గం త్రొక్కడమే కాదు, ఎట్టి నిశిత బుద్ధినైనా తన సమ్మోహజాలంతో బంధించి వేస్తుంది. మృగేంద్ర వాహనాలయంలో సుముఖాసత్తి తానే సుగాత్రినని మణికంధరునికు వెల్లడిస్తుంది. వెంటనే అందుకొని నేనే శాలీనుడను అని మణిస్తంభుడంటాడు. అతడు చెప్పినది నిజమోకాదో తేల్చుకోవటం సుముఖాసత్తికి ఆవశ్యకం. శాలీనుడు మడుగులో దూకటానికి గల కారణం సుగాత్రీ శాలీనులకు మాత్రమే తెలుసు. ఆ కారణం చెప్పగలిగితే సుముఖానత్తీ మణిస్తంభులు సుగాత్రీ శాలీనులవుతారు. సుముఖాసత్తి తాను ముందుగా ఆ కారణాన్ని కలభాషిణికి రహస్యంగా చెవిలో చెప్పినా వ్రాసి చూపినా మణిస్తంభుడు తనకున్న దూరశ్రవణ దూరదృష్టులచే గ్రహించి తిరిగి అప్పగించగలడు. కాబట్టి ముందుగా అతనిచే చెప్పించి తరువాత తాను చెబుతుంది. ఇద్దరూ చెప్పిన కారణం ఒకటే కావడం వల్ల మణిస్తంభుడే శాలీనుడని సుముఖానత్తి నమ్ముతుంది. ఔనౌనని కలభాషిణీ మణికంధరులూ పాఠకులూ సంతోషిస్తారు. పర్యాలోచిస్తే, ఏనాడో ప్రవర్తించిన నారద మణికంధరుల సంభాషణను కలభాషిణికి చెప్పగలిగిన మణిస్తంభుడు తన శక్తులచే శాలీనుని హృదయగత కారణం గ్రహించి చెప్పలేడా? కనుక హృదయగత కారణం చెప్పినంత మాత్రాన మణిస్తంభుడే శాలీనుడని నమ్మటానికి ఎలా వీలుపడుతుంది?

ఇంతకూ శాలీన మణిస్తంభుల అభిన్నతకు ఉపపత్తి కల్పించకుండా కవి తాను కథా సంవిధానం సాగించాడా? దీని పరిష్కారం శ్రోతలే ఆలోచించగలరు.

మొత్తం మీద సూరనగారి కథా సంవిధానంలో ఎన్ని వైచిత్రులనైనా పేర్కొనవచ్చును. వీటన్నిటిని మించిన విశేషం ఒకటి ఉన్నది. సామాన్యంగా కావ్యాలలో కథ కంచికి వెళుతుంది. మనం ఇంటికి వస్తాము. కళాపూర్ణోదయంలోని కథ కంచికిపోక మనతోనే వస్తుంది. ఆ కథా సంవిధాన వైచిత్రి అట్టిది.

**(మిసిమి, ఫిబ్రవరి 1993)**

జూన్ (2011)

చాలామంచి సంపాదకీయం. ఈనాటి తెలుగు సాహిత్యపు తీరు తెన్నులను ఆలోచింపజేసే ప్రయత్నం. కొన్ని సత్యాలను ఎవరూ కాదనలేనివి కూడా ప్రచురిస్తున్నారు. **మిసిమి**లో రచనలన్నీ ఆలోచింపజేసేవే.
కలంకారిలో కాళహస్తి కోణం ఇంతవరకూ నాకు తెలియదు. కలంకారి అంటే అద్దకం అనే ఉద్దేశ్యంలోనే ఉన్నాను. మీ వ్యాసం చదివిన తరువాతే కాళహస్తి కలంకారి ప్రత్యేకతని తెలుసుకున్నాను. రాబందుల సందడి చదివాను. ఈ ఆలోచన సరికొత్తగా వుంది. చెప్పిన విధానం ఆసక్తిని కలిగిస్తుంది. ధన్యవాదాలు.

**- యార్లగడ్డ బాలగంగాధరరావు, విశ్రాంత ఆచార్యులు, విజయవాడ.**

# సంత్ కబీరు మార్మికవాదం

– కోడూరు పుల్లారెడ్డి

**మా**ర్మికవాదం (Mysticism) నూక్ష్మంగా నిర్వచించాలంటే సాధకుని ఆత్మ నిర్గుణ బ్రహ్మలో ఐక్యం కావడమే. సగుణ శ్రీకృష్ణుని, శ్రీశైల మల్లికార్జునుని, తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామిని భర్తలుగ ఎంచుకొని కైవల్య మందినవారు కొందరు. భక్త మీరా, అక్కమాంబ, వెంగమాంబలు యీ కోవలోకి వస్తారు. పురుషుడై వుండి కూడా నిర్గుణరాముని భర్తగ ఎంచుకొని కబీరు ఆత్మార్పణ చేసుకున్నాడు. భగవంతుని చేరడానికి తమ కనుకూలమైన మార్గాలను ఎన్నుకొన్నవారు మరికొందరు. అన్నమయ్య, త్యాగయ్య, పురందరదాసు, సక్కుబాయి, కర్మాబాయి, నామదేవ్ మొ॥వారు ఈ కోవలోకి వస్తారు. మార్గమేదైనా బ్రహ్మలో ఐక్యం కావడం ప్రధానం. భారతదేశానికి సంబంధించినంత వరకు మార్మికవాదానికి ఆద్యుడు కబీరు. ఈ వాదానికి వ్రేళ్ళు ఎక్కడ నుండి ప్రారంభమైనాయో ప్రస్తావించుకుందాం.

2. 'భారతీయ పరంపరలో మార్మికవాద ప్రప్రథమ ప్రతిబింబం వేదాలలో ఉందని అంటారు. వైదిక మంత్రాలలోకాని, ప్రార్థనలలోకాని ఎక్కడా కల్తీలేని మార్మికవాదం లాంటి వస్తువేదీ దొరకదు. అక్కడేమో తమకు శుభం కల్గాలన్న ప్రార్థన, వినయం – యివే ప్రముఖం. నిజమే! అక్కడక్కడ ఈశ్వరునికి తండ్రి మొ॥లగు పేర్లు జోడించబడి ఉన్నప్పటికీ, మార్మికవాద ప్రముఖ ప్రవృత్తి అయిన ఆత్మ, పరమాత్మల ఉత్కంఠ ప్రేమ వేదమంత్రాల స్థానం గల్గిన సంబంధాలలో ప్రకటితం కాలేదు. రక్షణ, శుభం కల్గాలన్న భావనలకే ప్రాధాన్యత వుంది. ఉపనిషత్తులలో అద్వైతవాదం ప్రతిపాదన నుండి మార్మికవాదం ఆరంభమవుతుంది. కాని అక్కడ కూడ భావనాత్మక మాధుర్య ప్రస్తావన లేదు కాని సాక్షాత్కారాన్ని గురించిన శుష్క జ్ఞానాత్మక చిక్కును మాత్రమే అధికంగా విప్పుతూ వెళ్ళింది. అక్కడక్కడ వాటిలో విశుద్ధ మార్మికవాద ప్రసక్తికి అనుకూలమైన కొంచెం భావ వికాసం కూడ వుంది. సర్వప్రథమంగా భగవద్గీత పదవ అధ్యాయంలో భావాత్మక పరంపరలో సర్వవాద నిరూపణ జరిగింది. ఇది మార్మికవాదంలో ఒక అంశం.'

**భగవద్గీత పదవ అధ్యాయం :** విభూతి యోగంలో మార్మికవాదంను వివరించే మూడు శ్లోకాలను ముచ్చటించుకుందాం.

i. **అహం సర్వస్య ప్రభవో మత్తస్సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజం తే మాం బుధా భావ సమన్వితాः ॥**

(నేను అన్నిటికీ పుట్టుకని. నావల్లే సమస్తము నడుస్తున్నది అని తెలిసి వివేకులు భక్తిపూరితులై నన్ను సేవిస్తారు.)

**విశేషం :** *ఘన విషయాలు తెలియని వారు అల్పమైన వాటిని గురించి యోచిస్తారు. మహత్తరమైన భగవంతుని లీల అర్థమైన వాళ్ళకి భగవంతునిపైన ప్రేమ సహజంగా ఏర్పడుతుంది.*

ii. **మచ్చిత్తా మద్గతప్రాణాः బోధయంతాः పరస్పరం ।**
**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతిచ ॥**

(తమ చిత్తాలను నాలో వుంచి ప్రాణాలని నాకే అర్పించి, నన్ను గురించే పరస్పరం చెప్పుకుంటూ, బోధించుకుంటూ తృప్తిపడతారు. ఆనందిస్తారు.)

**విశేషం :** *ఒకటవ శ్లోకంలో ఉన్న 'భావ సమన్వితా'లనే పదానికిది వివరణ.*

iii. **తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకం ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముప యాంతి తే ॥**

(అలా సతతం యుక్తులై ప్రీతితో సేవించే వారికి నన్ను చేరుకోవడానికి అవసరమైన బుద్ధిని నేను కలుగజేస్తాను.)

**విశేషం :** *భగవంతుని చేరుకొనే తెలివితేటలు మన సొంతం కావు. ఆయన అనుగ్రహం వల్ల కలుగుతాయి.*

3. కబీరు తన కవితలలో ఒకవైపు కర్మకాండలలో మునిగితేలే పాఖండ – మోసపూరిత – పండితులకు, ముసల్మానులకు, జోగులకు చీవాట్లు వేస్తూ మరోవైపు సరససుందర మార్మికవాద కవితలు కూడ ప్రవచించాడు. నిజం చెప్పాలంటే మార్మికవాద కవితలు ప్రచారం చేయడంవల్లనే ఆయనకు 'సంత్' అన్న బిరుదు వచ్చిందంటారు. ఇవి రసరమ్యమైన కవితలుగ గుర్తింపు పొందాయి. ఈ కారణంవల్లే విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ కబీరు మార్మికవాద భావ ప్రభావానికిలోనై ఆంగ్లంలో తనదైన బాణీలో మార్మికవాద గీతాలు రచించాడు. తత్ఫలితంగ సాహిత్యానికి 1913వ సంవత్సరంలో నోబెల్ (Nobel) పురస్కారాన్ని పొందాడు

అని అంటున్నారు ప్రముఖ రచయిత సుదర్శన్ చోపడా. ఇందువల్ల కబీరు మార్మికవాదానికి విశ్వజనీనత లభించింది.

4. టాగూరు కబీరు ఎడల తనకు గల కృతజ్ఞత ప్రకటించటానికి తను ప్రేరణ పొందిన కబీరు నూరు కవితలను ఆంగ్లంలోకి అనువాదం (Translation) చేశాడు. ఈ నూరు కవితల అనువాదానికి ఆచార్య క్షితిమోహన్ విపులమైన పీఠికతో రూపొందించిన కబీర్ కవితాసంకలనం ఆధారంగ అజిత్‌కుమార్ చక్రవర్తి కబీరు 116 కవితలను ఆంగ్లంలో అనువాదం చేసిన పీఠిక వ్రాసిన గ్రంథంపై ఎక్కువగ ఆధారపడినామని టాగూరు అనువాదముకు సహాయం చేసి ఆ కవితల రమణీయ మార్మికవాదాన్ని చక్కగా అంచనావేస్తూ పీఠిక వ్రాసిన అమెరికా మహిళ శ్రీమతి ఎవిలిన్ అండర్‌హిల్ (Mrs. Evelyn Underhill) అన్నారు. టాగూరు అనువాదం మొదటి ముద్రణ 1915లో జరగడం గమనార్హం – అనగా గీతాంజలికి నోబెల్ పురస్కారం అందిన వెనువెంటనే జరిగిందని.

5. అసలు మార్మికవాదమంటే ఏమిటి? ఇది ఒక ప్రవృత్తి–జీవాత్మ ప్రవృత్తిలోని ప్రకాశం. ఆ వెలుగు మాధ్యమంలో కవి అలౌకిక శక్తితో రాగద్వేషాల కతీతమైన తన నిశ్చల తత్వాన్ని స్థాపించాలని కోరుకుంటాడు. క్రమక్రమంగా ఈ సంబంధం ఎంత ప్రపర్ధమాన మవుతుందంటే యిరువురి మధ్య ఎట్టి అంతరం ఉండిపోదు. జీవుడు తన అస్థిత్వాన్ని ఆ అదృశ్య మహాశక్తి పరమాత్మతో మమేకమై తన అస్తిత్వాన్ని దాదాపు మరచిపోతాడు. అతనికి ప్రతిక్షణం ఆ మనోహర దృశ్యం–కొండొకచో ఆ దృశ్యం ప్రియురాలు లేక ప్రియునిది కూడా కావచ్చు–గుర్తుకొస్తుంది. అందులో అంతర్లీనం కావాలనే కోరిక బలంగా ఉంటుంది. ఈ కోరిక ఉన్న జీవాత్మ తన లక్ష్యం చేరడానికి త్రివిధ సోపానముల నధిరోహించవలసి వుంటుంది.

6. **ప్రథమ సోపానం (సైద్ధాంతిక మార్మికవాదం) :** ఇందులో జీవాత్మ పరమాత్మతో తన సంబంధం కలుపుకొనే కోరికతో పరుగులు తీస్తుంది. సంసార జంజాటాన్ని దాటి ప్రపంచపు సరిహద్దులను తప్పించుకొని ఎపుడైతే ఆ అనంతశక్తికి చేరువవుతాడో అపుడు ఆ అలౌకిక ప్రకాశాన్ని విలోకించి ఆశ్చార్యానుభూతికి లోనవుతాడు. కబీరు సద్గురువు ద్వారా తనకు ప్రసాదించబడిన యీ జ్ఞానాన్ని యిలా వర్ణిస్తున్నాడు.

i. **సత్‌గురు సాంచా సురివాఁ, సబద్ జు బాహ్యో ఎక్ ।**
**... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**లోచన్ అనంత్ ఉఘాడియా, అనంత్ దిఖావణ్ హార్ ॥**

(సద్గురువు నిజమైన వీరుడు. ఆయన తన శిష్యునికి రామనామ మనే శబ్దజ్ఞానాన్ని ప్రసాదించాడు. ఈ జ్ఞానాన్ని బహిరంగంగా బాణాన్ని సంధించడమంటారు. ఈ శబ్దబాణం తగిలినంతనే హృదంతరంలో జన్మజన్మల నుండి లుంగలు లుంగలుగా తిష్టవేసుకున్న అజ్ఞానాంధకారం పటాపంచలైపోతుంది. ఇది గురువు ప్రసాదించిన జ్ఞానభిక్షతో మాత్రమే ఛేదింపబడుతుంది. సద్గురువు మహిమ పూర్వ పరంపరకు చెందినది. ఆయన శిష్యునికి అనంత ఉపకారం చేస్తాడు. విషయ వాసనలతో కూరుకొనిపోయిన శిష్యుని కళ్ళు జ్ఞానభిక్షతో తెరిపించి అనంత బ్రహ్మతత్వాన్ని దర్శింపజేస్తాడు.)

ii. మార్మికవాదంలో కబీరు ప్రత్యేకత కనుపిస్తుంది. అది ఒకవైపు హిందువులు అద్వైతవాద ప్రభావంలో ఉన్నట్లు, మరొకవైపు ముసల్మానుల సూఫీ తత్వాన్ని స్పర్శించినట్లూ కనబడుతుంది. అద్వైతవాదానుసారం ఆత్మ, పరమాత్మ రెండూ ఒకే శక్తికి రెండు పార్శ్వాలు. వాటిని మాయ తన పరదాతో వేరు చేసింది. ఉపాసనతో ఈ పరదాను తొలగించగలిగితే అపుడు ఆ రెండు మళ్ళీ ఒకటైపోతాయి. ఈ భావాన్ని కబీరు మాటల్లో వినండి.

**జల్ మేఁ కుంభ్ కుంభ్ మేఁ జల్ హై, బాహర్ భీతర్ పానీ ।**
**ఫూటా కుంభ్ జల్ జల్ హి సమానా, యహ్ తత్ కహో గియానీ ॥**

(నీటిలో కుండ ఉంది. కుండలో కూడ నీరు ఉంది. అంటే కుండ బయట లోపల నీరు వుంది. కుండ పగిలిందంటే కుండలో నీరు బయట వుండే నీటితో కలిసిపోతుంది. ఆత్మ పరమాత్మతో ఏకం కావడమంటే యిదేనంటాడు జ్ఞాని అయినవాడు.)

**విశేషం :** *ప్రతీకలో శరీరం కుండ. ఆత్మ కుండలోని నీరు. పరమాత్మ బయటి నీరు. శరీరం నశించడం కుండ పగలడం. ఆత్మ, పరమాత్మతో కలియడం కుండలో నీరు బయటినీరు కలిసిపోవడం.*

iii. కబీరు ఇంకా యిలా అంటున్నాడు. ఎపుడైతే చరమస్థితికి పరిపూర్ణత సిద్ధిస్తుందో అపుడు పరమాత్మ భక్తుని ఆత్మలో లీనమైపోతాడు.

**మోకో కహాఁ ఢూంఢే బందే, మైఁ తో తేరే పాస్ మేఁ ।**
**... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**కహై కబీర్ సునో భాఈ సాధో, సచ్ స్యానోఁ కీ స్వాస్ మేఁ ॥**

*టాగూరు ఆంగ్ల అనువాదం నెం.*I
servant! where dost thou seek me?
Lo! I am beside thee.

I am neither in temple nor in mosque;
I am neither in Kaaba nor in Kailash;
Neither am I in rites and ceremonies,
nor in Yoga and renunciation.

If thou art a true seeker thou shalt at once see Me;
thou shalt meet me in a moment of time.

Kabir says, O Sadhu! God is the breath of all breath.

*కొమ్మారెడ్డి వెంకటేశ్వర రెడ్డి తెలుగు అనువాదం నెం. 1 (అముద్రితము)*

***ఓ సేవకా! నన్నెక్కడని వెతుకుతావు?***
***నేను నీ ప్రక్కనే ఉన్నాను.***
***నేను గుడిలో లేను, మసీదులో లేను***
***నేను కాబాలో లేను, కైలాసంలో లేను***
***యోగంలో లేను, వైరాగ్యంలో లేను.***

*నీవు నిజమైన భక్తుడవే ఐతే నన్ను యీ క్షణమే చూడగలవు ఒక్క క్షణంలో నన్ను చేరగలవు.*

*ఓ సాధూ! భగవంతుడి శ్వాస అందరి శ్వాసలోనూ ఉంది. – అంటాడు కబీరు*

7. ద్వితీయ సోపానం (సాధనాత్మక మార్మికవాదం) : ఇందులో ఆత్మ పరమాత్మ ప్రేమలో లీనమై ఉన్మాది అయిపోతుంది. ప్రపంచంలోని వ్యామోహాలు ఆ పరమాత్మ దివ్యకాంతి ముందు తొలగిపోతాయి. అపుడు ఆత్మ ఆశ్చర్యంతో ప్రభువు ప్రేమలో పూర్తిగ లీనమై ఉఱ్ఱూతలూగుతుంది. కబీరు ఈ అనుభవాన్ని జ్యోతి రూపంలో, ముత్యాల రాశిగ చిత్రిస్తాడు.

i. **కౌతిక్ దీతా దేహ్ బిన్, రబి ససి బినా ఉజాస్ ।**
**కహిబే కూ సోబా నహీ, దేఖ్యాహీ పర్‌వాన్ ॥**

(జ్ఞాన ప్రకాశమున్నవారు నిరాకారుడైన బ్రహ్మ లీలలు కాంచగలరు. బ్రహ్మ తన స్థిరస్థానంలో లేకుంటే సూర్యచంద్రులు ఎలా ప్రకాశిస్తారు. ఇది తెలుసుకున్న ఈశ్వర భక్తులు నిశ్చింతగ ఉంటారు. పరమాత్మ ప్రకాశం ఎలా ఉంటుంది, ఎంత ప్రతిభావంతంగ ఉంటుందని అంచనాకు అందదు. అంతర్నేత్రంతో దర్శించగలిగినవారు మాత్రమే ఆ ప్రకాశ ప్రభావాన్ని అనుభవించగలరు. యిది శాస్త్ర నిబద్ధతకు దూరం, ఆత్మానుభూతికి చెందిన విషయం కాబట్టి.)

**విశేషం** – 1. *భక్తుడు భగవంతుని సేవలో నమ్మకముంచడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది, భక్తునిపై మాయ ప్రభావముండదు. రెండవది, బ్రహ్మ భక్తుని యోగక్షేమాలు మోస్తూ వుంటాడు.*

2. *తరుగ నమ్మకానికి – ప్రమాణం – నాలుగు ఆధారాలున్నాయి. i. అంచనా ii. శబ్దం–వినికిడి iii. ఉపమానం iv. సాక్షాత్కారం. మొదటి మూడు భౌతికంగా లభించే చరాచర వస్తువుల నర్థం చేసుకొనడానికి ఉపయోగపడతాయి. నాలుగవది బ్రహ్మ సాక్షాత్కారంతో సంబంధం గలది.*

ii. ద్వితీయ సోపానాన్ని వివరించే కబీరు మరో కవిత.

**హద్ ఛాండి బేహద్ గయా, హుఆ నిరంతర్ బాస్ ।**
... ... ... ... ... ... ... ... ... ... ... ...
**ముని జన్ మహల్ గ పావఈ, తహాఁ కియా విస్‌రామ్ ॥**

(సాధకుడు దృశ్య ప్రపంచం నుండి ముక్తినొంది అనంతబ్రహ్మలో కలిసిపోతాడు. అదే అతని శాశ్వత నివాసమై పోతుంది. అక్కడ నిర్గుణ నిరాకార కమలం వికసించి వుంది. సామాన్యంగా గర్భాశయం కూడ కమలానికి ఆకారమవుతుంది. కాని సృష్టి కమలంలాగ సాకారం కాదు. నిరాకారం. ఈ కమలాన్ని భక్తుడైనవాడు మాత్రమే దర్శించగలుగుతాడు. హృదయంలో బ్రహ్మ నివాసమైన కమలం ప్రకాశిస్తూ వుంటుంది. మనస్సనే భ్రమరం ఆ కమలం మోహంలో పడిపోతుంది. ఈ విషయం భక్తుడు మాత్రమే తెలుసుకోగలడు. సంత్ కబీరు చెబుతున్నాడు– శూన్యశిఖరంలో సాగరం, ముత్యపుచిప్ప, స్వాతిచినుకులు ఏవీ ఉండవు. అయినా అక్కడ జ్ఞాన ముత్యాలు మొలుస్తూ వుంటాయి. ముత్యాలు లోతైన సముద్రంలో జనిస్తాయి. కాని యిక్కడ శిఖరం మీద పుడతాయి. ఇది విరోధాభాసం. యోగ ప్రక్రియలో ఇడ, పింగళ అనే రెండు నాడులు సుషమ్నా నాడితో కలుస్తాయి. అపుడు యోగసిద్ధి కలుగుతుంది. ఇది పూర్వజన్మల కర్మఫల విశేషం. హద్దు గల లోకాన్ని వీడి అనంతంలోకి చేరుతాడు భక్తుడు. అనంత శూన్యంలోకి చేరి నిరంతరం ప్రవహించే అమృతంలో స్నానం చేస్తాడు. ఇది మహనీయ మునివర్యులకు కూడ దుర్లభం. సాధకుడు యీ స్థితిలో విశ్రాంతి పొందుతాడు. సంసార చక్రంలో విశ్రాంతి దొరకదు, నిండా దుఃఖమే. అనంతంలో మాత్రమే సుఖశాంతులు లభ్యం.)

8. తృతీయ సోపానం (ప్రేమాత్మక మార్మికవాదం) : ఆత్మ పరమాత్మతో ఏకం కావడం ఇందులో జరుగుతుంది. ఆత్మ, పరమాత్మను తనలో ఐక్యం చేసుకున్న అనుభవంతో పరమాత్మను ఆత్మ గుణగానం చేస్తుంది. ఇది సాధకుని ఆధ్యాత్మిక జీవితానికి అంత్యదశ. దీన్ని సిద్ధావస్థ అని కూడ పిలుస్తారు. అద్వైతవాదులు దీన్ని జీవన్ముక్తి అంటారు. ఈ అవస్థకు చేరుకున్న వ్యక్తిని కబీరు 'సంత్' అన్నాడు. ఇట్టి వ్యక్తి జీవితం పూర్తి పరివర్తన చెంది భ్రమ తొలగి పోతుంది. ఈ అవస్థ అందుకున్న వారికి జీవాత్మకు, పరమాత్మకు

అంతరం లేదన్న సత్యం బోధపడుతుంది. పరమాత్మ లేని చోటంటూ ఉండదు.

**i. మన్ కా భ్రమ్ మన్ హీ థై భాగా, సహజ్ రూప్ హరి ఖేలణ్ లాగా ।**

... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...

**ఆతమ్‌లీన్ అఖండిత్ రామా, కహై కబీర్ హరి మాహి సమానా ॥**

(మనసులో దొర్లిన భ్రమ తొలగిపోయింది. ప్రభువు తన సహజ రూపంలో నన్ను కూడినాడు. నేనూ నువ్వూ, నువ్వూ నేనూ అనే ద్వైదీభావం తొలగిపోయింది. అందరిలో ఆ అఖండ ప్రభువు ప్రకాశిస్తున్నాడు. ఎపుడైతే ఈ మనస్సు హఠయోగముద్ర పొందుతుందో అపుడు ఈశ్వరుని రూపురేఖలు, వర్ణవ్యవస్థలోని తారతమ్యాలు సమసిపోతాయి. శరీరం మనస్సు, మనస్సు శరీరం రెండూ కలిసి ఏకమైపోతాయి. మనస్సులో ఈ అనుభవం అనుభూతి కలుగుతుంది. ఆత్మీయుడైన సంపూర్ణ రాముని పొందగల్గడం ఆత్మ పరమాత్మతో తాదాత్మ్యం చెందడమే.)

ii. ఆత్మ మెల్లమెల్లగ తన ప్రియుని యదార్థరూపం కనుగొని ముగ్ధ అవుతుంది. ఆ ముగ్ధత్వం ఎంతవరకు వృద్ధి చెందుతుందంటే ఆత్మ స్వయంగ పరమాత్ముని భార్యనని, అర్ధాంగినని చెప్పుకుంటుంది.

ఈ విషయంలో కబీరు మాట యిది.

**హరి మేరా పీవ్ మాఈ, హరి మేరా పీవ్,**

... ... ... ... ... ... ... ... ... ...

**కహై కబీర్ భౌ జలి వహీ ఆఊ ॥**

(అమ్మా! హరి నా సర్వస్వము. హరితోడు లేకుండా నా ప్రాణం నిలువదు. ఆయన (రాముడు) నా భర్త. నేను ఆ యింటి కోడలను. రాముడు నాకంటే వయస్సులో పెద్దవాడు. రాజా రామస్వామీ! నేను నీ కోసమే శృంగార భావనలో తేలిపోతున్నాను. అయినా నీవు నన్నెందుకు కలవడంలేదు. (ఈ వాక్యం దాదాపు మీరా ప్రతిగీతంలో కనుపిస్తుంది). ఈ సారి నా ప్రభువుతో కలయిక జరిగిందంటే మళ్ళీ యీ సంసార సాగరంలోకి తిరిగి రావడమంటూ ఉండదు. ఎపుడు ఆత్మశక్తి పరమాత్మ శక్తితో పూర్తిగ కలిసిపోతుందో అపుడు మార్మికవాదం చరమస్థితికి వస్తుంది. ఈ కలయిక ఎంత పరిపూర్ణత చెందుతుందంటే ఊహకందని అనుభూతికి లోనవుతుంది. నా బ్రతుకు రామునితోనే ముడివడివుంది. ఆయన సన్నిధి లభించకుంటే నా జీవితం వృథా.)

తృతీయ సోపానాన్ని వివరించే కబీరు మరో కవిత.

**iii. బాలమ్ ఆవో హమారో గేహ్ రే, తుమ్ బిన్ దుఖియా దేహ్ రే ।**

... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...

**అబ్ తో బేహాల్ కబీర్ భయో హై, బిన్ దేఖే జీవ్ జాయ్ రే ॥**

*టాగూరు ఆంగ్లానువాదం – నం. 35*

My body and my mind are grieved for the want of Thee;
O my Beloved! come to my house.
When people say I am Thy Bride, I am ashamed;
For I have not touched Thy heart with my heart.
Then what is this love of mine?
I have no taste for food, I have no sleep;
My heart is ever restless within doors and without.
As water is to the thirsty, so is the lover to the bride.
Who is there that will carry my news to my be loved?
Kabir is restless : He is dying for sight of Him.

*కొమ్మారెడ్డి వెంకటేశ్వర రెడ్డి తెలుగు అనువాదం – నం. 35 (అముద్రితము)*

***నీ మీది కోరికతో నా శరీరం, మనస్సు ఆరాట పడుతున్నాయి ప్రియా నా యింటికి రా.***
***నేను నా హృదయంతో నీ హృదయాన్ని పలుకరించ లేదు గాబట్టి,***
***లోకులంతా నన్ను నీ వధువన్నపుడు సిగ్గు పడిపోయాను***
***అటువంటపుడు నా ప్రేమకు అర్థమేమిటి?***
***నాకు ఆహారంపై యిష్టం లేదు, నిద్రరాదు.***
***ఇంటా బయటా నా హృదయానికి నిశ్చలత లేదు.***
***వధువుకు వరుడు, దప్పిక గొన్న వారికి నీరు లాంటి వాడు.***
***నా ప్రియునికి నా వార్త అందించే వారెవరు?***
***కబీరుకు విశ్రాంతి లేదు. ఆయనను చూడకుంటే ప్రాణమే పోతుంది.***

కబీరు మార్మికవాదాన్ని వివిధ కోణాలలో వివరించే మరికొన్ని కవితలు

9. కబీరు ఆత్మ, ప్రియురాలివలె ప్రియుని కొరకు ప్రతీక్షిస్తున్నది.

**బహుత్ దినన్ కీ జోనత్, బాట్ తుహ్హారీ రామ్ ।**
**జీవ్ తర్‌పై తుఝ్ మిలన్ కూ మని నహీ విశ్రామ్ ॥**

(రామా! చాల రోజుల నుండి నీకోసం ప్రతీక్షిస్తున్నాను. దారిలో కూర్చొని నీ రాక కోసం ఎదురు చూస్తున్నాను. నీతో కలవాలని మనసు ఉవ్విళ్లూరుతూ వుంది. నా మనస్సుకు ఏవిధమైన శాంతి దొరకడం లేదు.)

10. కబీరు విరహవేదన వర్ణించ వీలుకాని దశకు పెరిగిపోయింది.

**చోట్ సతాఁతీ విరహ్ కీ, సబ్ తన్ జర్‌జర్ హోఇ ।**
**మారన్‌హారా జాఁణి హై, కై జహిఁ లాగ్ సోఇ ॥**

(ప్రభూ! నీపై విరహ వ్యథ నన్ను బాధిస్తూ వుంది. నా

శరీరమంతా జర్జరమై పోయింది. ఈ బాధ తొలగించడం నీకు మాత్రమే తెలుసు.) – ఇది మార్మికవాద ప్రేమ.

11. కబీరు ప్రియతముని చేరడానికి ప్రాణాలు సైతం పణంగా పెట్టడానికి సిద్ధంగ ఉన్నాడు.

**ఇస్ తన్ కా దీబా కరేఁ, బాత్ మేల్యాఁ జీవ్ ।**
**లోహీ సీంచేఁ తేల్ జ్యాఁ, తబ్ ముఖ్ దేఖో పీవ్ ॥**

(నా సమస్త శరీరాన్ని దీపంగా చేసి ప్రాణాన్ని వత్తిగా చేయాలనుకున్నాను. అందులో రక్తం అనే నూనెతో నింపాలనుకున్నాను. ఇటువంటి దీపకాంతి నుండి అజ్ఞానాంధకారాన్ని దూరం చేసి నా ప్రియుని ముఖం చూస్తాను.)

12. ప్రపంచానికేమి తెలుస్తుంది నా దుఃఖం అంటున్నాడు కబీరు.

**అంసడియాఁ ప్రేమ్ కసాయియాఁ, లోగ్ జానై దుఖడియాఁ ।**
**సాఁఈ అపనైఁ కారణైఁ, రోఇ రోఇ రతడియాఁ ॥**

(విరహ కారణాల వల్ల ప్రియురాలి కళ్లు ఎర్రబారినాయి. కాని ప్రపంచం ఏ దుఃఖం వల్లనో కళ్ళు ఎర్రబడినాయని అంటుంది. కాని స్వామీ! నీ కోసం ఏడ్చి ఏడ్చి నా కళ్ళు ఎర్రబడినాయి.)

13. సంతోషంలో ఓలలాడే విరహిణులకు ప్రియుని ప్రేమ దుర్లభమని తెలుసునంటాడు కబీరు.

**హంసి హంసి కంత్ న పాఇయా, జిన్ పాఇయా తినిరోఇ ।**
**జో హాఁ సీహీ మిలై, తో నహీఁ దుహాగిని కోఇ ॥**

(విషయ వాంఛలలో నవ్వుతూ కాలం గడిపిన నాకు పరమాత్మ ప్రేమ లభించదు. భవసాగర విముక్తులకే పరమాత్మ లభిస్తాడు. సుఖలంపటులకు పరమాత్మ ప్రాప్తిస్తే విరహాగ్నిలో కాలిపోయే కష్టాన్ని ఎవరూ ఎంచుకోరు.)

14. ప్రియునికి సందేశం పంపాలన్న ప్రశ్న తల ఎత్తితే ప్రియురాలు ఎంత అందమైన జవాబిస్తుందో చూడమంటాడు కబీరు.

**ప్రియతమ్ కూఁ పతియాఁ లిఖూఁ, జో కహీఁ హోయ్ విదేస్ ।**
**తన్ మేఁ మన్ మేఁ నైన్ మేఁ, తా కో కా సందేస్ ॥**

(విదేశాలకు వెళ్ళిన ప్రియునికి సందేశం, శరీరం, మనస్సు కళ్ళతో వ్రాసి పంపిస్తారు ప్రియురాండ్రు. ఆ సందేశమెక్కడుందోనని ప్రియుడు వెతుకులాటలో పడతాడు.)

15. మళ్లీ విరహిణి ప్రియుని దర్శనం కొరకు ప్రత్యేక సంభవాసంభవ పనులు కూడ చేస్తుంది.

**ఫాడి ఫుటోలా ధజ్ కరౌఁ, కామ్లడీ పహిరాఉఁ ।**
**జహి జహి భేషాఁ హరి మిలై, సోఈ సోఈ భేష్ కరాఉఁ ॥**

(విలాసవంతమైన జీవితం గడిపేవారు ఈశ్వరుని పొందలేరు. రేశం వస్త్రాలు త్యజించి తునకలు తునకలుచేసి కంబలి ధరిస్తాను (సాధువుల ఒక సంప్రదాయం కంబలి ధరించటం). ఏ వేషభాషల ద్వారా ఈశ్వరుని పొందగలనో అవే ధరిస్తాను) .

16. ప్రియదర్శన సమయం సమీపించేటప్పుడు ఆతృతపడే ప్రియురాలి మనస్తత్వం విచిత్రంగ ఉంటుంది. దీన్ని కూడ కబీరు వర్ణిస్తున్నాడు.

**ధర్‌హర్ ధర్‌హర్ కంపే జీవ్, నా జానూఁ కా కరిహై పీవ్ ।**
**కౌవా ఉడావత్ మేరీ బహియాఁ పిరానీ, కహై కబీర్ మేరీ కథా పిరానీ ॥**

(ప్రియుడు నా కొరకు వస్తున్నది లేనిది తెలుసుకోవడానికి కాకిని పలుమార్లు ఎగురవేసి చేతులు నొప్పిస్తున్నాయి. ప్రియ సమాగమం దగ్గరవుతున్న కొద్దీ ప్రియుడేమి చేస్తాడోనని భయం ఆవరించి కంపించి పోతున్నాను. నా కథ సమాప్తమైపోయిందని అంటున్నాడు కబీరు.)

**విశేషం :** *ప్రియుని రాకకోసం కాకిని ఎగురవేయడం ఆనాటి సంప్రదాయం. మన తెలుగు భాషలో కూడ కాకితో కబురంపడం అనే సామెత వుంది.*

17. ఆత్మ పరమాత్మల కలయిక చిత్రాన్ని కబీరు రమణీయంగ చిత్రిస్తున్నాడు.

**కబీర్ తేజ్ అనంత్ కా, మానో ఊగీ సూరజ్ సేణి ।**
**పతి సంగ్ జాగీ సుందరీ, కౌతిగ్ దీరా తేణి ॥**

(అనంత పరమాత్మ ప్రకాశం అనేక సూర్యులు కలిసి ఒకేసారి వెదజల్లే కాంతివలె వుంటుంది. పరమాత్మ వద్ద నిద్రించగలిగే సౌభాగ్యమున్న సాధక సుందరి మాత్రమే ఈ ప్రకాశం చూడగలదు.)

18. వాస్తవంగ ఆ ప్రియుని కాంతి ఎంత అలౌకిక జ్యోతిర్మయమైందో వర్ణించడం అసంభవం.

**పారబ్రహ్మ్ కే తేజ్ కా, కైసే హై ఉన్‌మాన్ ।**
**కహీబే కూఁ సోభా నహీఁ, దేఖ్యాహీఁ పర్‌వాన్ ॥**

(పరబ్రహ్మ ప్రకాశం ఎలా, ఎంత పరిమాణంలో ఉంటుందని అంచనా వేయలేము. ఆయన శోభ ఈ విధంగ వుంటుందిని కూడ చెప్పలేము. ఈశ్వరుని సేవ చేసే భక్తుడు మాత్రమే సర్వదా నిశ్చయించగలడు.)

19. ఇప్పుడు ఆత్మ పరమాత్మల అగ్ని విస్ఫులింగాల ద్వైదీభావం నశించింది.

**జబ్ మైఁ థా తబ్ హరి నహీఁ, జబ్ హరి హైఁ మైఁ నాహిఁ ।**
**సబ్ అంధియారా మిటి గయా, జబ్ దీపక్ దేఖ్యా మాహిఁ ॥**

(హృదంతరంలో అహంభావమున్నంత వరకు

ఈశ్వరుని బోధ అర్థంకాదు. ఎపుడైతే పరమాత్మబోధతో నీ హృదయం నిండుతుందో అపుడు అహం దూరమవుతుంది. ఆత్మలో జ్ఞానజ్యోతి వెలిగిందో అజ్ఞానమంతా సమాప్త మవుతుంది.)

20. ఇపుడు సర్వవాద స్థితి కలిగింది. ప్రేయసి ఏ వైపు దృష్టి సారిస్తుందో అక్కడే పరమాత్మ కనుపిస్తాడు.

**తూఁ తూఁ కర్తా తూఁ భయా, ముఝ్ మేఁ రహీ న హూఁ।**
**బార్ ఫేరీ బలి గఈ, జిత్ దేఖోఁ తిత్ తూఁ ॥**

(భగవంతుని స్మరణ నీవు, నీవు అంటూ ప్రారంభ మవుతుంది. అనగా ఆరంభంలో నేను, నీవు అన్న భేదభావముంటుంది. అయినప్పటికి నిత్యస్మరణ వల్ల 'నేను' అనేది బలైపోతుంది. అహం సమాప్తమై పోయింది. ఇపుడు కేవలం 'నీవు' మాత్రమే మిగిలివుంది. ఇది త్వరలో అహం విసర్జించడం, తత్ఫలితంగ యిపుడు అన్నివైపులా 'తూ' (బ్రహ్మ) మాత్రమే కనపడతాడు.)

21. తన నాలుగు వైపుల ప్రియతముని శక్తి పొంది కూడ ఆత్మ సంతృప్తి నొందదు, ప్రియుని మీద ఎల్లప్పుడు సంపూర్ణ అధికారం కోరుకుంటుంది.

**అబ్ తోహి జాన్ న దేహూఁ రామ్ పియారే।**
**... ... ... ... ... ... ... ... ... ...**
**ఇత్ మన్ మందిర్ రహే నిత్ చేఇఁ,**
**కహూ కబీర్ కరము మతి ఝోఇఁ ॥**

(ప్రియతమా! ఇంక నేను నిన్ను విడువను. ఎట్లైనా సరే నీవు నావాడివి కావల్సిందే. చాలరోజుల నా వియోగం దూరమైపోయింది. నేను ఇంట్లో వుండగనే ప్రియుడు వచ్చేశాడు. ప్రేమిక (సాధకుడు) పట్టువీడని ప్రేమ జయించింది. నీ చరణారవింద సేవ చేస్తాను. కాదన్నా వదలను. ప్రేమలో చిక్కుకొని పోతాను. మనస్సనే మందిరాన్ని ఎప్పుడూ శుద్ధంగా ఉంచాలి. అశుద్ధ మనస్సు ప్రభువుకు నివాసయోగ్యం కాదు.)

22. కబీరు తన ప్రియతమునిపై తనకు గల అభిలాష వ్యక్తం చేయడమే గాక ప్రియుడెవరికి కనపడకూడదంటాడు.

**నైనాఁ అంతరి ఆవ్ తూఁ, జ్యూఁ హౌఁ నైన్ ఝపేఉ।**
**నాఁ హౌఁ దేఖౌఁ ఔర్ కూఁ, నాఁ తుఝ్ దేఖ్ దేఉఁ ॥**

(ప్రభూ! నీవు నా కన్నుల్లో నివాసం చెయ్యి, నీ రూపు నా కళ్లలో నింపుకొని కళ్లు మూసుకోవాలనుకొంటున్నాను. నేను ఇంక రెండవ వస్తువేది చూడదలచుకోలేదు. నిన్ను కూడ ఇతరులను చూడనివ్వను.)

**విశేషం :** *1. ఇది తాదాత్మ్యం చెందిన ఏకాంత ప్రేమకు ఉదాహరణ.*

*2. మీరాబాయి కూడ గిరిధరనాగర్‌ను తన కన్నుల్లో నిలిచిపొమ్మని కోరింది.*

*3. ఆచార్య రామచంద్ర శుక్ల్ తమ వ్యాసం 'శ్రద్ధా ఔర్ భక్తి' లో ప్రేమ స్వార్థంతో కూడుకున్నదిగానూ, భక్తి నిస్వార్థంతో కూడుకున్నదిగానూ వర్ణిస్తాడు. ప్రేమికుడు తన ప్రియురాలు తనకు మాత్రమే సొంతం కావాలనుకుంటాడు. భక్తుడు, గోవిందుడు అందరివాడని భావిస్తాడు.*

23. కలయిక వర్ణన కబీరు సాధనాత్మక ప్రతీకల ద్వారానే చేశాడు.

**సురతి సమాఁణ్ నిరతి మైఁ, అజపా మోఁహై జాప్।**
**లేఖ్ సమాఁణాఁ అలేఖ్ మైఁ, యూఁ ఆపా మాఁహై ఆప్ ॥**

(ప్రభువును నిరంతరం స్మరించడంతో మార్పు వచ్చింది. బాహ్య నామ జపం అంతర జపంగ పరిణమించింది. అభ్యాసం వల్ల యోగి అంతరంలో ప్రతి నిముషం జపము జరుగుతూనే వుంది. ఆత్మను ఆత్మలో పొందితే భాగ్యరేఖ మార్పు జరిగినట్లే. అపుడు దృశ్య జగత్తు స్థానంలో కేవలం అదృశ్య నిరాకార బ్రహ్మ దర్శనం జరుగుతుంది.)

24. సాధకుడు మానస సరోవరం చేరుకున్నాడు.

**మానసరోవర్ సుభర్ జల్, హంసా కేలి కరాహిఁ।**
**ముక్తాహల్ ముక్తా చుగైఁ, అబ్ ఉడి అనత్ న జాహిఁ ॥**

(సాధక జీవుడు మానససరోవరం చేరుకొని కుత్తుకబంటి స్వచ్ఛమైన అమృత జలం త్రాగుతూ ఆనందంలో ఓలలాడుతున్నాడు. ఇపుడతడు అక్కడ నుండి ఎక్కడకూ వెళ్లడు.)

25. ఇంకో రకమైన మార్మికవాదం – అభివ్యక్తి నుండి జనించినది – కబీరులో నిండుగ ఉంది.

**ఐసా అద్‌భుత్ మేరే గురి కథ్యా, మై రహ్యో ఉమేఇఁ।**
**... ... ... ... ... ... ... ... ... ...**
**ఉలటి మూఇ సాపాణి గిలీ, యహు అచరజ్ భాఖ ॥**

(నా గురువు బోధనలతో నాలో దాగియున్న జ్ఞానం ప్రకాశించింది. సాధక జీవుడు విషయవాంఛలనే ఏనుగుతో పోట్లాడడం నేను చూస్తూనే వున్నాను. ఈ విషయం అరుదైన ప్రజలకే అర్థమవుతుంది. సాధకుడు పుట్టలో ప్రవేశించి పామును చూచి పరుగెడుతున్నాడు. మళ్లీ వెనుతిరిగి ఆ విషయవాసన సర్వాన్ని మింగేయడం ఆశ్చర్యం.)

26. సద్గురువు సహాయం లేకుండ బ్రహ్మ ప్రాప్తి అసంభవమంటాడు కబీరు.

**కబీర్ మార్గ్ అగమ్ హై, సబ్ మునిజన్ బైఠే థాకి।**
**తహాఁ కబీరా చలి గయా, గహి సత్‌గుర్ కీ సాఖి ॥**

(బ్రహ్మ ప్రాప్తి లభించే మార్గం అత్యంత కఠినమైనది. నిష్ణాతులైన మునులు కూడ అలసిపోయి కూర్చున్నారు. కాని సద్గురువును సాక్షీభూతంగ చేసుకొని కబీరు అక్కడికి చేరుకున్నాడు.)

**విశేషం :** *భగవద్గీత జ్ఞాన విజ్ఞాన యోగంలో ఈ తులనాత్మక శ్లోకం గమనించండి.*

**శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్య తతి సిద్ధయే ।**
**యతతా మపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥**

(వేలాది మనుష్యులలో ఏ కొందరో సిద్ధికోసం ప్రయత్నిస్తారు. ప్రయత్నించి సిద్ధులైన వారిలో ఏ ఒక్కరో నన్ను అసలు తత్త్వంతో తెలుసుకుంటారు.)

27. సర్వాత్మవాద దశకు చేరుకోవాలంటే సాధకునికి చాలా కష్టాలు ఎదురవుతాయి. అవి ఎన్నో రూపాలలో ఉంటాయి. వీటిని జయించాలంటే శ్రీరాముని (నిర్గుణ రాముడు) ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదు. కబీరు ఈ బాధలు – కనకం, కామిని, కుటుంబసభ్యులపై వ్యామోహం, సంశయాగ్రస్త మనస్సు రూపాలలో ఉంటాయంటాడు. పరమాత్మను కలియడానికి అడ్డుకునేది మాయా విషకుంభం కూడ ఒకటి.

**జాణీ జే హరి కౌఁ భజౌఁ, మో మని మోటీ ఆస్ ।**
**హరి బిచి ఘూలై అంతరా, మాయా బడీ బిసాస్ ॥**

(జీవుడు హరిని విశ్వాసంతో భజిస్తాడు. కాని మధ్యలో విశ్వాసఘాతకి మాయ యిరువురి మధ్య భేదం సృష్టించి సాధకుని భక్తిని అడ్డుకుంటుంది.)

28. ఆత్మసమర్పణ, ఏకాంతనిష్ట, మైత్రిని బ్రహ్మజ్ఞానం అన్నాడు కబీరు. ఈ నిర్ద్వంద్వస్థితిలో వైరభావన, కామక్రోధాలు ఉండవు. ఇలాంటి మనస్సులో శాంతి ఉంటుంది. అగ్నిజ్వాల కూడ నీటివలె చల్లగ ఉంటుంది. మమతామోహాల బంధం నీరుగారి పోతుంది.

**మమితా మేరా క్యా కరై, ప్రేమ్ ఉఘాఁడీ పౌలి ।**
**దర్‌సన్ భయా దయాల్ కా, సూల్ భఈ సుఖ్ సౌడి ॥**

(వ్యామోహం, నాది అనే భావన నశించి పోయాయి. ప్రేమకు తలుపులు తెరుచుకున్నాయి. భగవంతుని దర్శనంతో జీవితం సుఖమయమై ప్రేమానందమనే నిర్మల స్వచ్ఛమైన దుప్పటి పరచబడింది.)

29. కబీరు అంటున్నాడు "నాకు భ్రాంతి, అజ్ఞానం హరించి అమరుడిని అయ్యాను" అని.

**అబ్ మైఁ పాఇఁ బ్రహ్మ జ్ఞాన్ ।**
... ... ... ... ... ... ... ... ... ... ... ...

**అనిగత్ అకల్ అనుపమ్ దేఖ్యా, కహఁతాఁ కహ్యో న జాఈ ॥**

(ఇపుడు నాకు (సాధకునికి) బ్రహ్మజ్ఞానం ప్రాప్తిస్తుంది. నేను సహజ సమాధిలో సుఖంగ ఉంటాను. కోట్ల కల్పకాలమంతా విశ్రాంతి సుఖం పొందుతాను. కృప గల గురుదేవుని మూల మంత్రోపదేశంతో నా హృదయ కమలం విచ్చుకుంది. తత్ఫలితంగా అజ్ఞానంతో కలిగిన భ్రమ నశించింది. అన్ని దిశలలో బ్రహ్మజ్యోతి ప్రకాశిస్తూ వుంది. విషయ వాసనలతో నిండివున్న నా మనస్సు నుండి ఆయన (శ్రీరాముడు) లేచి ధనుస్సు సంధించి మృత్యురూపీ వేటగాడిని పారదోలుతున్నాడు. జ్ఞానరూపీ సూర్యోదయం వల్ల అజ్ఞాన తిమిరం కనుమరుగవుతున్నది. మోహనిద్రలో ఉన్న జీవుడు మేల్కొని అనిర్వచనీయ, సాటిలేని సుందర సంపూర్ణ దృశ్యం దర్శిస్తున్నాడు. ఈ అనుభవాన్ని వర్ణించాలనుకున్నా చేతగావడం లేదు. మాట పెగలడం లేదు.)

30. కబీరు మార్మిక వాదానికి చరమసీమ ఆత్మశక్తి పరమాత్మశక్తితో పూర్తిగా కలిసిపోవడమే. ఈ కలయిక ఎంత గంభీరమంటే 'నేనుంటే ఆయనుంటాడని, ఆయన లేకుంటే నేనుండ'నన్నంత వరకు వెళ్తుంది.

**హరి మరిఐఁ తో హమ్ హూఁ మరి ఐ ।**
**హరి న మరై హమ్ కాహే కో మరి ఐ ॥**

(హరి మరణించి వుంటే – మాకు దర్శన మివ్వకుంటే – మేమూ చచ్చిపోతాము. అయన జీవించి వుంటే – మమ్ముల కరుణారసంతో వీక్షిస్తే – మేమెందుకు చస్తాము.)

31. ఈ ప్రేమ పరిపూర్ణ ప్రతిబింబం కొరకు పతిపత్ని సంబంధం అనివార్యం. స్త్రీ పురుషుల చరమస్థితి మైథునం. ఈ స్థితిలో ఇద్దరికి ఒకటై పోవాలనే బలమైన కోరిక ఉద్భవిస్తుంది. ఆ వాంఛాఫల స్వరూపమే నిలువెల్ల నిండిన ప్రేమానుభూతి.

కబీరు యీ అనుభూతిని ఏమంటున్నాడో చూడండి.

**లాలీ మేరే లాల్ కీ జిత్ దేఖూఁ తిత్ లాల్ ।**
**లాలీ దేఖన్ మైఁ గఈ, మై భీ హో గఈ లాల్ ॥**

(ఏ ప్రదేశంలో చూచినా నా ప్రియతముడు ఆకర్షణీయంగా కనుపిస్తాడు. ఆయనను చూడడానికి వెళ్ళిన నేను అతనిలో లీనమయ్యాను.)

32. సూఫీ తత్త్వం ఇస్లాంలో ఒక భాగం. ఈ తత్త్వంలో 'ఇష్కె మజాజి' – అంటే ఐహికప్రేమ, 'ఇష్కె హకీకీ' – అంటే ఈశ్వర ప్రేమ – రెండింటికి సమానస్థాయి ఉంది.

కాని ఈశ్వర ప్రేమకు ఐహిక ప్రేమ మూలమంటుంది 'సూఫీ' సంప్రదాయం. ఈ తత్వంలో కూడ భక్తుడూ ఖుదాల ఏకీకరణ జరగడానికి అవకాశముంది. అక్కడ మాయకెక్కడా స్థానం లేదు. కాని బాటసారి (భక్తుడు) తన గమ్యస్థానం చేరడానికి మధ్యదారిలో కొన్ని మజిలీలను దాటవలసి వుంటుంది. అవి 1. శరీయత్ (ధార్మిక నియమం), 2. తరీకత్ (ఆత్మశుద్ధి), 3. హకీకత్ (వాస్తవము), 4. మారిఫత్ (ఖుదాను గుర్తించడం). ఈ నాలుగు మజిలీలు దాటగలిగితే భక్తునికి తానే ఖుదా అయిపోయిన భావన కల్గడమే కాకుండా తానే 'మతల్‌హక్' – అనగా ఖుదానని అంటాడు. ఈ విధమైన భక్తుడు ఖుదా, మధువు నీరులా కలిసిపోతారు. సూఫీతత్వంలో ప్రేమకు అధిక మాహాత్మ్యమివ్వబడింది. ప్రేమతోబాటు మత్తుకు కూడ యిందులో మహత్వపూర్ణ స్థానమిచ్చారు. కబీరు మత్తును గుఱించి ఏమంటున్నాడో గమనించండి.

**హరిరస్ సీమా జానిఏ, కబహుఁ న జాయ్ ఖుమార్ ।**
**మైమంతా ఘూమత్ రహై, నాహీఁ తన్ కీ సార్ ॥**

(సాధకుడు భగవత్తత్వసారాన్ని ఆస్వాదించి, భగవతి – వైష్ణవుల కరసీమ నలంకరించే పూసల హారంను ధరించిన స్మృతిలో తేలిపోతూ వుంటాడు. అది ఎప్పటికి దిగని మత్తు. ఆ స్థితిలో అతనికి తన శరీరంపై చైతన్యముండదు. విషయ వాంఛల నుండి విముక్తి పొందాడు కాబట్టి.)

33. సూఫీ తత్వంలో ఖుదా రూపం "మాశూకా' అనగా స్త్రీ రూపంలో ఉంటుందంటారు. భక్తులందరు పురుషులై ఈశ్వర రూపి స్త్రీని ప్రసన్నం చేసుకొనడానికి ఏ త్యాగానికైనా సిద్ధపడతారు. ఆమె చేతిలోని మధుపాత్ర నందుకొనడానికి తహతహలాడతారు. ఆమె గడపలో తల పగలగొట్టుకొని ప్రేమభిక్ష ప్రసాదించమంటారు. కబీరు సూఫీ తత్వం నుండి 'ప్రేమ మధువు' 'నిషా'ను ఎన్నుకున్నాడు. కాని పరమాత్మను స్త్రీ రూపంలో కాక అద్వైతవాదం నిర్వచించినట్లు పురుషరూపంగానే భావించాడు. ఈ విధంగ ఆయన హిందు, మహమ్మదీయ మతాల నుండి తన అభిరుచి తత్వాన్ని ఎన్నిక చేసుకొని మిగత విషయాలను వదలిపెట్టాడు.

34. ఆత్మ పరమాత్మవైపు పరుగిడి ఆ దివ్య ప్రకాశాన్ని విభ్రాంతితో విలోకించి, ఆ పరమశక్తిని అనుభవిస్తూ కూడ ఆ అనుభవాన్ని కృతజ్ఞతా పూర్వకంగా నిర్వచించలేని నిస్సహాయస్థితిలోకి జారుకుంటుంది. మూగవాడిని బెల్లం తిని రుచి చెప్పమంటే ఏమని చెబుతాడు? అలాగే అనుభవించి కూడా వర్ణించుట కలవికాని అనుభూతికిలోనై కేవలం అద్భుతమని మాత్రమే చెబుతాడు.

**కహహి కబీర్ పుకారి కే అద్‌భుత్ కహిఏ తాహి ।**

కబీరు చెబుతున్నాడు – ఆత్మ ఆ అనుభవాన్ని అద్భుతమంటుందని.

35. హిందూ, ముస్లింల బాహ్యాడంబరాలను ఈ సామాన్యుడు – కబీరు – కన్నులు మిరుమిట్లు గొల్పేలా ఖండిస్తున్నాడు.

**రామ్ దోనోఁ హమ్ దీతా ।**
... ... ... ... ... ... ... ... ... ...
**బిస్‌మిల్ బాంగ్ సాంఝ్ ముర్గా మూరై పుకారై ॥**

(మనము ఇరువురి మార్గాలను చూచాము. హిందువులకు, తురకలకు సేవాభావం రుచించదు. ఆ పేరు వింటేనే దూరం తొలగిపోతారు. హిందువులు భగవంతుని కరుణకోసం ఏకాదశి రోజున అన్నం తినకుండ ఉపవాసం ఉంటారు. కాని మనసులో కోరిక చంపుకోలేక అన్నానికి బదులు పాలు, ఫలహారాలు నిండుగ భుజిస్తారు. తురకలు కూడ అల్లా దయ కోసం 'రోజా' ఆచరిస్తారు. సాయంత్రం అయ్యేసరికి ముల్లా నమాజుకు రమ్మని పిలుపు (బాంగ్/అజాన్) యిస్తాడు. నమాజు పూర్తైన తరువాత యింటికి వచ్చి కోడిని బిస్మిల్లా చేసి ఆరగిస్తారు.

Note : తురకలు – ఈ పద ప్రాదుర్భావం జరిగిందిలా. దుర్భేద్యమైన రోమన్ సామ్రాజ్య ముఖ్యపట్టణం కాన్‌స్టాంటినోపిల్ (Constantinople) ను టర్కీ చక్రవర్తి మొహమ్మద్-II (Mohammed II) క్రీ.శ. 1453లో ఆక్రమించి తన పాలన విస్తృతపరిచాడు. టర్కీ రాజ్యపాలనలోని ముస్లింలందరిని తురకలన్నారు. పైగా నిర్దయుడైన వ్యక్తిని తురక్ అంటారు. ముస్లింలు కూడా ఈ మాటను ఈ అర్థంలోనే వాడారు.

36. మళ్ళీ తారాస్థాయిలో కబీరు తానంటే ఏమిటో విశదపరుస్తున్నాడు.

**ఏక్ నిరంజన్ అల్లాహ్ మేరా ।**
**హిందూ తురక్ దుఈ నహీఁ మేరా ॥**

(నా అల్లా ఒక్కడే దోష రహితుడు. హిందువులు, తురకలు నా వారు కారు.)

37. కబీరు అంటాడు – ఆత్మ పరమాత్మతో ఐక్యం చెందాలనుకుంటుంది. పరమాత్మ కూడ ఆత్మతో సంయోగం కావాలనుకుంటుంది. ఈ విషయాన్నే టాగూరు 'ఆవర్తన్'

అనే తన కవితలో యిలా వెలిబుచ్చుతున్నాడు.

i. **ధూప్ ఆపనారే మిలాఇతే చాహే గంధే,**
... ... ... ... ... ... ... ... ... ...
**ముక్తి మాంగిఛే బాంధోనేర్ మార్ఝే బాశా.** – *బెంగాళీ భాష*

*ధూపం స్వయంగా గంధంతో కలవాలనుకుంటుంది.*
*గంధం కూడ ధూపం పొగలో లీనం కావాలను కుంటుంది.*
*స్వరం (సరిగమపదని) – షడ్జమం, రిషభం, గాంధారం,*
*మధ్యమం, పంచమం, దైవతం, నిషాదం–*
*గీతంలో కలిసి పోవాలనుకుంటుంది.*
*గీతం తిరిగి స్వరంతో లీనమవాలనుకుంటుంది.*
*ప్రేమతలపు సౌందర్యంలో మమేకం కావాలనుకుంటుంది.*
*సౌందర్యం కూడ ప్రేమతలపు ఆత్మలో భాగమై పోవాలనుకుంటుంది.*
*మహాశక్తి పరిమిత శక్తిని ఆలింగనం చేసుకోవాలనుకుంటుంది.*
*పరిమిత శక్తి కూడ అనంతశక్తితో కలిసిపోవాలని కోరుకుంటుంది.*
*సృష్టి, వినాశాలకెవరు కారకులో నాకు తెలియదు.*
*కాని ప్రేమ, సౌందర్యం పరస్పరం*
*రూపు మార్చుకుంటాయని మాత్రం తెలుసుకున్నాను.*
*బంధం ముక్తి లభ్యత కోసం వెదకులాటలో ఉంటుంది.*
*విచిత్రం, ముక్తి కూడ బంధింపబడుటకు*
*తహతహలాడుతూ ఉంటుంది.*

– *హింది అనువాదం నుండి రచయిత తెలుగు అనువాదం*

38. మానవ జీవితం శాశ్వతం కాదన్నది తెలియనివారు లేరు.

On the day when death will knock at thy door what will thou offer to him?
Oh, I will set before my guest the full vessel of my life - I will never let him go with empty hands.
All the sweet vintage of all my autumn days and summer nights, all the earnings and gleanings of my busy life will I place before him at the close of my days when death will knock at my door.

– టాగూరు గీతాంజలి నుండి నెం. 90

**మృత్యు దేవత నీ తలుపు తట్టిన రోజు**
**నీవు ఆయనకు ఏమి అర్పిస్తావు ?**
**ఆ అతిథి ముందు నా పూర్ణ జీవిత పాత్రనుంచుతాను.**
**ఎప్పటికీ ఆయనను రిక్త హస్తాలతో పంపను.**
**నా జీవిత చరమాంకంలో మృత్యువు నా తలుపు తట్టినపుడు**
**హేమంత దినాలలో వేసవి రాత్రులలో నా మధుర**
**పంట ఫలాన్ని చురుకైన నా జీవిత కాలంలోని నా సంపాదనను**
**ఆయన ముందుంచుతాను.**

*అనువాదం: కొమ్మారెడ్డి వేంకటేశ్వరరెడ్డి గీతాంజలి నుండి నం. 90*

టాగూరు మనస్సులో కబీరు మార్మికవాదం అడుగడుగునా ప్రతిధ్వనిస్తున్నదని తెలుస్తూ ఉంది.

39. "ఉద్రేకపరిచే లోతైన తత్త్వజ్ఞానం గల గొప్ప పారశీక గూఢమతవాదులు – అత్తార్, సాదీ, రూమీ, హఫీజ్ కవులు హిందూ మతాచార చింతనపై ప్రబలమైన ప్రభావం చూపిన కాలంలో కబీరు బలమైన ముస్లింల గూఢత్వంను, పరంపరాగత బ్రాహ్మణ వేదాంత శాస్త్రంతో సఖ్యత కల్గించాలనుకున్నాడు. ప్రశంసించదగ్గ ఈ లక్షణం గల కబీరు వారి అభిప్రాయాలను ఒక అర్థవంతమైన భావనలోకి తన గీతాల ద్వారా ప్రబోధించిన ప్రజ్ఞాశాలిగ, భారతీయ మార్మికవాద చరిత్రలో మూర్తిమంతమైన వ్యక్తిగ దర్శనమిస్తాడ"ని, కబీరు 100 కవితలను ఆంగ్లంలోకి అనువదించిన టాగూరు రచన మొదటి ముద్రణ (1915) పీఠికలో అమెరికా మహిళ శ్రీమతి ఎవిలిన్ అండర్‌హిల్ (Mrs. Evelyn Underhill) పైమాటలు వ్రాసింది. అందువల్ల పై నలుగురి పారశీక కవుల జీవిత రేఖలను, కవిత్వాన్ని రేఖామాత్రంగ పరిశీలిద్దాం.

40. **ఖ్వాజా ఫరీదుద్దీన్ 'అత్తార్' (క్రీ.శ. 1088–1282) :** అత్తార్ నైషాపూర్ జిల్లాలోని కగ్గన్ గ్రామ వాస్తవ్యుడు. వంశపారంపర్యమైన పరిమళ ద్రవ్యాల వ్యాపారం. నైషాపూర్‌లో వున్న అన్ని కార్ఖానాలను వశపరచుకొన్నాడు. అతడు వైద్యుడు కూడ. తన తండ్రి గురువు కుతుబుద్దీన్ హైదర్ వద్దనే ఆధ్యాత్మిక విద్యలనభ్యసించి వైరాగ్య మొందాడు. కాని ఇస్లాం మతం సన్యాసం అంగీకరించదు. కాన గృహస్థ జీవితాన్నొదలక వాణిజ్యం, వైద్యం చేస్తూనే యోగ విద్యలో అభివృద్ధి చెందాడు. ఒకనాడు ఒక దర్వేశ్ కొట్టులోని సరుకులనన్నిటిని పరీక్షిస్తూ వుంటే "నీ అవసరమేంటని ప్రశ్నించాడు" అత్తారు. "నాకవసరమైందేదీ లేక నీమాట వింటూ నీ ఐశ్వర్యం గమనిస్తున్నానని" అన్నాడు దర్వేశ్. "అదంతా నీకెందుకు? అవతలికిపో" – కోపంతో అన్నాడు అత్తారు. "అదంతా నీకెందుకనే నేనూ నిన్నడిగేది? నాలాగ నీవు పోగలవా? ఈ ఐశ్వర్యం, యీ అహంకారం, యీ మమకారం, యివన్నీ వదలి వెళ్ళిపోగలవా? అదే నా బాధ. నా సంగతా? నాకు బంధనాలేవీ లేవు. నేనెంత సునాయాసంగా పోతానో చూడు" అంటూ అక్కడికక్కడే అసువులు బాసాడు దర్వేశ్. ఆశ్చర్య చకితుడైన అత్తారుకు ఆ దర్వేశ్ ఆధ్యాత్మిక గురువయ్యాడు. అప్పటికప్పుడు అంగడి నంతటిని అర్థాలకు పంచిపెట్టి అవతలకు నడిచాడు అత్తారు. "దర్వేశ్ ఆధ్యాత్మిక సాధనలో చేరుకున్నది ఏడవ (ఆఖరు) మెట్టు. నేనింకా మొదటి మెట్టు మీదనే నిలబడి మోహవశాన

అన్యులకు ఆత్మోపదేశం చేస్తున్నాను. నా జ్ఞానం ఎంతవరకు పెరిగిందంటే, నాకు జ్ఞానమే లేదన్న జ్ఞానం కలిగింది" అనుకొన్నాడు అత్తారు. అప్పటి నుండి అత్తారు దర్వేశ్‌లను, భక్తులను, యోగులను దర్శిస్తూ, వారి సేవచేస్తూ సాధన చేసి తాను కూడ సప్తమ సోపానాన్ని అధిష్టించాడు.

భావావేశంలో పద తత్త్వాన్ని నిర్వచించేటపుడు 'షరీయత్' పరిధులు దాటి శుద్ధాద్వైతాన్ని ప్రతిపాదిస్తాడు అత్తారు. ఎందుకంటే ఇస్లాం ద్వైతమాయె. ఆయన మహాయోగి కాబట్టి ఆనాటి ముల్లాలు మాట్లాడక ఊరుకున్నారు.

**సాధకుడు గమనించవలసినవి సప్త గమ్యాలు** :

1. ప్రయాస, 2. ప్రేమ, 3. అవబోధ, 4. నిరీహ,
5. అద్వైతం, 6. ఆశ్చర్యం, 7. విలీనత.

వీటినింకా వివరించవలసివస్తే యిలా చెప్పవచ్చు. భగవంతుని పొందవలెనన్న పట్టుదలతో ముందుకు పోవడమే 'ప్రయాస'. భగవంతుని ఎడల అనల్పమైన ప్రేమ అలవర్చుకోవడమే 'ప్రేమ'. భగవంతుని తనకు తోచిన విధంగా భావించడమే 'అవబోధ' (రాముడు, కృష్ణుడు యిత్యాదిగా). భగవంతుని మీద తప్ప ప్రాపంచిక విషయవాసనలలో ఆస్థ లేకుండడమే 'నిరీహ'. భగవంతుడు తప్ప ఏదీ లేదని గ్రహించడమే 'అద్వైతం' – అంతటా భగవంతుడే అన్నప్పుడు యింతవరకు తాననుకున్నది, తనదనుకున్నది అంతటా భగవంతుడే అన్న ఎఱుక 'ఆశ్చర్యం' – ఈ ఆశ్చర్యంలో తన్ను తాను మరచిపోవడమే 'విలీనత'.

ఇదీ సూక్ష్మంగా అత్తారు వేదాంతం. భగవంతుడినే ప్రియుడంటారు సూఫీలూ. దోస్త్ (మిత్రుడు) అని కూడ పిలుస్తారు. గజల్ కవులు ప్రియురాలంటారు. ఏమన్నా ప్రేమ మార్గమొక్కటే.

నూరేళ్లకు పైబడి జీవించిన అత్తారును ఒక మొగల్ సిపాయి తల నరికాడు. తర్వాత, తానెంత మహనీయుని వధించాడో గుర్తెరిగి ఆ మరణం అత్తారు సమాధి మీద 'ముజావిర్'గ పనిచేశాడు ఆ మొగల్ సిపాయి.

41. **షేక్ సాదీ షిరాజ్ (క్రీ.శ. 1184-1291) :**

షేక్ ముస్లిహుద్దీన్ అనుపేరు గల 'సాదీ' మహాకవి సుప్రసిద్ధులగు ఫారసీ కవితాప్రవక్త త్రయములో ఒకడు. ఫర్దూసీ, అన్వరీలతో బాటు సాదీకి కూడ ఆ గౌరవస్థానముంది. షిరాజ్ పట్టణంలో – నేటి ఇరాన్ దేశములో వుందది – జన్మించి, అక్కడే మరణించినట్టు తెలుస్తూంది. అతని 'గులిస్తాన్', 'బోస్తాన్' అనే రెండు కావ్యాలు ఫారసీ విద్యార్థులందరికీ కావ్య పరిచయం గావించు పాఠ్యగ్రంథాలు. హఫీజ్ మహాకవి గజళ్ళ తర్వాత సాదీ గజళ్ళకే ప్రాశస్త్యం యివ్వబడింది. పారసీక రచనలలో తత్త్వభావాలే స్పష్టంగా కనుపిస్తాయిగానీ, సమగ్రదృష్టితో చూస్తే సాదీ రచనలలో ఉత్తమ ఆదర్శాలను, సంపూర్ణ లౌకిక జ్ఞానంతో బాటు గృహస్థ నీతిని బోధించిన నైతిక ప్రవక్తగ చెప్పవచ్చు.

గులిస్తాన్ నుండి కథల రూపంలో ఆయన చెప్పిన కొన్ని సూక్తులు

i. అన్ని దేశాలు దేవునివే. దేవుడే మన వాడయినప్పుడు దేశాలన్నీ మనవే. ప్రజలందరూ మన బంధువులే.

ii. అర్ధరాత్రివేళ తుఫానులో తన దగ్గరకు భోజనార్థం వచ్చిన అన్యమతస్తునికీ అన్నంపెట్టక అవ్వలికి పంపిన భక్తుణ్ణి భగవంతుడు మందలిస్తాడు.

iii. మసీదుకు వెళ్దామనుకుంటే కాళ్లకు చెప్పులు లేవు. కొందామంటే చేతిలో చిల్లిగవ్వలేదు. ఎండమాడిపోతూంది. దేవునికి తనమీద దయలేదని నిందిస్తూ ఒకడు ఎలాగో ఒకలాగు మసీదుకెళ్ళాడు. అక్కడ కాళ్లులేని ఒక బిచ్చగాడు కనుపించాడతనికి. కనువిప్పు కలిగిందాతనికి. "దేవుడు ఎంత దయామయుడు. చెప్పులు లేకపోతే పోయె కాళ్లు యిచ్చాడ"ని సంతృప్తి చెందాడు.

ii. దేవుని ఎడల మంచిగా లోకుల వద్ద చెడుగా ప్రవర్తించే మూర్ఖుడు పూజాఫలం అందుకోజాలడు. ఇలాంటి సూక్తులతో కూడిన కథలతో 8 ప్రకరణాలతో అనియతమైన, అంత్యప్రాసాది శబ్దాలంకారాలతో వ్రాయబడిన చక్కని రచన గులిస్తాన్ (పూల/గులాబీతోట).

అలాంటి పది ప్రకరణాలతో వ్రాసిన పద్య కావ్యం బోస్తాన్ (పండ్లతోట) నుండి సంగ్రహంగా రెండు సూక్తులను ఉదాహరిస్తాను.

**సత్సహవాసం :** "నీ ముగ్ధ మోహన పరిమళంతో మత్తుడనైనాన"ని ఒక రసికుడు మట్టి ముద్దతో అన్నాడు. "నాకు మాన్యతగల గులాబీతో సహవాసం అబ్బింది. ఆ సువాసన నాకు కూడ అంటింది. లేకపోతే నేను ఒట్టి మట్టి బెడ్డనే" అంది మట్టి ముద్ద.

శలభం దీపంతో అంటూ వుంది. "నీపై నాకు గల

ప్రేమతో నీ చుట్టూ తిరుగుతున్నాను. మరి నీవెందుకు వేదనతో వున్నావు". దీపం అంది. "నీవేమో నాచుట్టూ తిరిగి తిరిగి నీ దుగ్ధ తీరగనే వెళ్ళిపోతావు. మరి నాకు మధుర సహవాసం కరువై ఏకాకిగ కొడిగట్టి పుర్ణాహుతి పొందటమే మిగిలిన మార్గం. అందుకే ఈ వగపు."

**గజల్ కవిత :** సాదీ మహాకవి గజల్‌ను కవితా ప్రపంచంలో అగ్రాసనాధిపత్యంలో నిలబెట్టాడు. ఈయనను గజల్ కవితాపితామహునిగ పరిగణిస్తారు. సహజ శృంగార భావోపేతుడగు సాదీ కవి తన గజళ్ళలో స్వానుభవ శృంగార భావాలను ఆకర్షణీయంగ, సూటిగ, భావుకుల మనస్సుకు హత్తుకొనేటట్లు చిత్రించాడు. తన గజళ్ళలో శిష్టాచార వ్యవహారాలకు బహిరంగ ప్రాముఖ్యాన్నిచ్చి, రహస్య సుఖలంపటులను, కుహనా యోగులను నిరసించుటలో, వారి కుట్రలను ప్రపంచానికి వెల్లడించడంలో గజళ్ళను మాధ్యమంగా చేసుకున్న గట్టివాడు. గజళ్ళలో రక్తి ప్రదర్శన సాదీతోనే మొదలైంది. గజల్ చక్రవర్తి హఫీజ్ షిరాజ్‌కు సాదీ మహాకవి మార్గదర్శకుడు.

42. **మౌలానా జలాలుద్దీన్ రూమీ (క్రీ.శ. 1207-1273) :**

మహాకవి మౌలానా జలాలుద్దీన్ 'రూమీ' బలఖ్ పట్టణంలో జన్మించి కోన్యా నగరం (దీన్ని రూమీ అనికూడా అంటారు)లో మరణించాడు. ఇతని తండ్రి పరిస్థితుల ప్రభావంవల్ల బలఖ్ పట్టణం వదలి కుమారుడు జలాలుద్దీన్‌ను వెంట నిడుకొని వెడలిపోవలసి వచ్చింది. మార్గమధ్యంలో వీరు నైషాపూర్‌లో ఖ్వాజా ఫరీదుద్దీన్ అత్తార్‌ను సందర్శించారు. ఎనిమిదేండ్ల బాలుడైన జలాలుద్దీన్‌ను చూచి ఒడిలో కూర్చోబెట్టుకొని, ముద్దాడి తన 'మస్నవీ ఇస్రార్‌నామా' పుస్తక ప్రతి ఒకటి ఆ బాలునికి యిచ్చి ''బహయుద్దీన్! ఇది వెలలేని రత్నం. దీనికి మెరుగుపెట్టు. దీని కాంతి వల్ల ప్రపంచమంతా వెలుగుతో నిండుతుంది." అన్నాడు అత్తారు. తర్వాత రూమీ పట్టణంలో స్థిరవడ్డాడు. అందువల్ల జలాలుద్దీన్ రూమీ అని పిలువబడ్డాడు.

కోన్యా పట్టణంలో 'రూమీ' క్రీ.శ. 1244లో 'షఫ్రీతబ్రీజ్' కు శిష్యుడై తత్వజ్ఞానము, యోగము అభ్యసించాడు. షఫ్రీతబ్రీజ్ సూఫీతత్వ సమూహంలో మహా విజ్ఞానవంతుడు. సోక్రటీసు (Socretes) వలె ప్రశ్న పరంపర గుప్పించి వాదము చేసేవాడు. సోక్రటీసు వలెనే యితడు కూడ బలవన్మరణం పొందాడు. గురువుపైగల అనంత భక్తి భావంతో 'దివానే - షమ్స్ తబ్రీజ్' అనే కావ్య సంపుటం రచించాడు.

తర్వాత రూమీకి హిస్సాముద్దీన్ చల్సీ శిష్యుడయ్యాడు. రూమీ తన వెంట చల్సీని 11 ఏళ్లు పర్యటింపజేసి, అతనిలో వుండే అగ్నిని రగుల్కొలిపాడు. రూమీ వక్తగా, చల్సీ శ్రోతగా మస్నవీ రాయించి రూమీని అజరామరం చేశాడు. ఇస్లాం ద్వైతమతం. సూఫీయిజం అద్వైతమతం. ద్వైతం పరిధి దాటకుండా అద్వైత సిద్ధాంతాన్ని ఆవిష్కరించే నేర్పు అతనికలవడింది.

'మజ్నువ ఉల్పసహా' ప్రకారం పారశీక భాషలో ప్రఖ్యాత రచనలు నాలుగు. i. షహనామా, ii. గులిస్తాన్, iii. మస్నవీరూమీ, iv. హఫీజ్ షిరాజ్ గజళ్ళు.

షేక్ సాదీ, మౌలానా రూమీని దర్శించాడు.

రూమీ పది సం॥ల కాలం తీసుకొని 26,660 ద్విపదలు గల 'మస్నవీరూమీ' అన్న ప్రసిద్ధ రచన చేసాడు. కవి స్వయంగ తన గ్రంథం బ్రహ్మ విద్య బోధించునని, భక్తులకు ఉపాసనామార్గం, జ్ఞానార్తులకు యోగమార్గం తెలుపునని, మతం మూలసూత్రాలను విశదీకరించగలదని వివరించాడు. ఇందులో సూఫీ సిద్ధాంతాలను స్పష్టీకరించాడు. ఈ 'మస్నవీరూమీ' సూఫీలకు మహాభాష్యం.

43. **హఫీజ్ షిరాజ్ (క్రీ.శ. 1335-1390) :**

షిరాజ్ పట్టణంలో జన్మించిన యీ కవి అసలు పేరు ఖాజా షమ్షుద్దీన్ మొహమ్మద్. ఈయన గజళ్ళ రచనలో అగ్రస్థానమలంకరించాడు.

ఆయన అంటాడు - 'ప్రపంచం సత్రమే. మనం బాటసార్లమే. కాని అణువణువునా కనుపించే అందం చూడు. ఈ అందానికి కారణమైన అందాన్ని ఊహించు. ఆ అందాన్ని అందుకోవటానికి ఆరాటపడు. ఆ ఆరాటంలో ఆనందముంది. నశ్వరమైన దాన్ని గురించి ఆలోచిస్తే బాధపడతావు. అనశ్వరమైన దాని కొరకు చింతించు. అది సాధ్యం కాదంటావా, సాఖీని ఆశ్రయించి మద్యాన్ని సేవించు.' ఇక్కడ సాఖీ, మద్యం రెండూ ప్రతీకలు.

**ఆసవపాత్ర అట్టడుగ నందొక చుక్కయె నిల్చెనేని,**
**లెమ్మా సఖి! దుమ్ము చల్లెద నిహమ్ము, పదమ్మును రెంటిపైన.**

- అంటాడు హఫీజ్.

ఈ మాటలే అత్తార్, రూమీలు వివరించి, విశదపరచి

చెప్పారు. ప్రతీకల ఆసరాతో వ్యంగ్య ధోరణిలో పదును పరచి చెప్పాడు హఫీజ్. ఏ కవికి లేని ఉద్వేగం, ఆవేశం అలవడ్డాయి ఇతనికి. అందుకే హఫీజ్ గజళ్ళకు ఉన్నంత ఆదరణ యింక ఏ కవి రచనలకు లేదు. అతని గజళ్ళు అనేక భాషలలో అనూదితాలైనాయి. పచ్చగడ్డిలో షిరాజ్ నగరం దాపున ప్రవహించే రుక్నాబాద్ నదీతీరాన హఫీజ్ మరణించిన తర్వాత ఆ గడ్డిలోనే అతన్ని సమాధి చేశారు. ఆ స్థలం పేరు ముసల్లా.

**నమీ దహింద్ ఇజాజత్ మిరా బసైరో సఫర్ ।**
**నసీమె బాదె ముసల్లా వ అబె రుక్నాబాద్ ॥**

(రుక్నాబాద్‌లో ప్రవహించే నిర్మల జలం, ముసల్లా మీద వీచే మంద పవనం నన్నెక్కడికి వెళ్లనీయవు.)

అతని సమాధికి అందమైన కట్టడం నిర్మింపజేశాడు బాబరు.

44. అత్తారు, సాదీ, రూమీ, హఫీజ్ – నలుగురు మహాకవుల బోధనలు సంగ్రహంగ విన్నాము కదా! శ్రీమతి ఎవిలిన్ అండర్‌హిల్ (Mrs. Evelyn Underhill) అన్నట్లు కబీరు కవితలలో ఇస్లాం, హిందూమత భేదాలను సమన్వయం చేసి యిద్దరికి సఖ్యత కలుగజేసే ప్రయత్నం చేశాడని పైన ఉదహరించిన కబీరు కవితలు తిరుగులేని సాక్ష్యం చెబుతాయి.

45. కబీరు మార్మికవాదంలో ద్వైతాద్వైతాల సంయోగం, నిర్గుణ బ్రహ్మోపాసన జుబ్బన చూరలుగా ఉన్నవని ఆయన నూరు కవితలను విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు ఆంగ్లంలో అనువాదం చేశాడంటే కబీరు ప్రాముఖ్యత యితోధికంగ తెలియజేస్తూ వుంది. అందువల్ల కబీరు కవీశ్వరుని జీవితరేఖలు సూక్ష్మంగా తెలుసుకుందాం.

46. మధ్యకాలీన భారత్‌లో సర్వశ్రేష్ఠ మానవతావాది, గురుశ్రేష్ఠుడు, ఉదారమూర్తి స్వామి రామానంద (క్రీ.శ. 1368–1468) జననం ప్రయాగలో కన్యాకుబ్జ బ్రాహ్మణ పరివారంలో జరిగింది. ప్రయాగలో జన్మించిన ప్రముఖులందరిలో రామానంద్ సర్వశ్రేష్ఠుడు అనడం నిర్వివాదాంశం. తన సమకాలికులు వారి మూఢ సిద్ధాంతాన్ని విడనాడక దార్శనికుడైన శ్రీరామానుజాచార్య ప్రవచించి ప్రచారం చేసిన వైష్ణవ చింతనను ప్రక్కన బెట్టినపుడు రామానందులవారు శ్రీవైష్ణవ భక్తిధారకు నేతృత్వం వహించి స్త్రీలు, మహమ్మదీయులు, శూద్రులు మొదలగువారిని ఉన్నత మార్గంలో నడిపించి వారిలో నత్పరివర్తన నింపిన సమాజ సంస్కర్తగా చరిత్రలో నిలిచిపోయాడు. ఆయన శిష్యులు అనంతానంద్, సుఖానంద్, సురసురానంద్, నరహర్యానంద్, భావానంద్, పీపా, కబీరు, రైదాసు, సేన్‌ఘఘనా, పద్మావతి – వీరందరు ఆయన బోధనలతో భారత విశిష్ట స్వరూపాన్ని, భారతీయ జనత గొప్పదనాన్ని చాటిన ప్రతినిధులు.

47. రామానంద్ రచించిన సంస్కృత గ్రంథాలు, 'వైష్ణవ మతాబ్జ భాస్కర్, శ్రీరామార్చన పద్ధతి' ఆనాటి సమాజం మీద గాఢ ప్రభావం చూపాయి. ఆయన పరిశీలన, బోధనలలో వైష్ణవప్రభ అవతారమైన శ్రీరాముడికి ప్రాధాన్యమిచ్చాడు. కబీరులాంటి ముసల్మానులకు కూడ రామమంత్రమే ప్రియమగునట్లు అంగీకరింపజేశాడు. సగుణ మార్గీయులైన గోస్వామి తులసీదాస్ మొదలగు వారిచే కూడ ఈ మంత్రమే గ్రహింపజేశాడు. చెప్పవచ్చేదేమంటే రామానందులవారు తాను నివసిస్తున్న కాశీ మొదలగు ప్రాంతాలనంతా రామనామమయం చేశాడు. ఆయన ప్రపంచ చరిత్రలో సర్వశ్రేష్ఠ ధార్మిక ప్రచారకుడుగ, నాయకుడుగ మానవతావాదిగ మహాపురుషులకు ప్రతినిధిగ నిలబడతాడు. ఆయన నిర్గుణ నిరాకార, సగుణ సాకార భక్తిభావాల రెంటికి ప్రతినిధి.

48. 15వ శతాబ్ది ఆరంభంలో సూఫీలు, బ్రాహ్మణులు తరచుగ వివాదపడేవారు. ఐనా రెండు మతాల ఆధ్యాత్మిక నాయకులు రామానందుల వారి బోధనలు ఆస్వాదించడానికి వచ్చేవారు. దైవభక్తి జన్మతః సంతరించుకున్న బాలకబీరు యిది గమనించి తను రామానందుల వారి శిష్యరికం చేశాడు. హిందూ, ముస్లిం రెండు మతాలవారి వైషమ్యాన్ని నిరోధించి, పరోపకారసేవ, క్షమ, దాతృత్వం, ధైర్యం, ధర్మం, ఈశ్వరుని ఏకత్వం, పశువధ, గోవధలను విరోధించి జనసామాన్యంలో అహింస, సంయమనం ప్రబోధించి, వారి ఐక్యత కోసం జీవిత కాలమంతా శ్రమించిన చదువురాని మనోజ్ఞమూర్తి కబీరు.

కోడూరు పుల్లారెడ్డి,
విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజనీర్,
విద్యుత్ బోర్డు, కళ్యాణ్‌నగర్-3, హైదరాబాద్-18.
ఫోన్ : 9550818495

# గురజాడ అప్పారావుతో- మధురవాణి సంభాషణలు

*– పురాణం సుబ్రహ్మణ్యం శర్మ*

"మధురవాణిని వదలడం అంటే ఏవీ మనస్కరించకుండా వుంది"–అంటాడు మొదట్లో గిరీశం. గిరీశానికే కాదు గురజాడ అప్పారావుగారికే నాటకం పూర్తి చేశాక మధురవాణిని వదలాలంటే మనస్కరించలేదు. నాటకకర్తే I am enamoured of her అని అనుకున్నారు పాపం. పాఠకులు కూడా మధురవాణిని వదలాలంటే నాటకం పూర్తయాక కూడా మనతో కబుర్లు చెబుతూ ఉండిపోతే బావుండ్ను అని అనిపిస్తుంది. ఇంతెందుకు? కన్యాశుల్కం చదివి మధురవాణి కోసం బెంగ పెట్టుకోని వారుంటారంటే నమ్మశక్యం కాదు. మధురవాణిని ఎత్తుకొని ఎక్కడికయినా పారిపోవాలనిపిస్తుంది నిజానికి. ఈ ముక్కే రావిశాస్త్రిగారన్నారొకసారి – మధురవాణి మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయడానికి వస్తే ఏంచేస్తారని అడిగా. ఇంటర్వ్యూ ఎందుకండీ టైమ్‌వేస్ట్–ఎత్తుకొని పారిపోతానని కాబోలు అన్నారు. గురజాడ అప్పారావుగారే తను సృష్టించిన మధురవాణిని మోహించి కాస్త తత్తరపడ్డారు నాటకం పూర్తిచేశాక.

కన్యాశుల్కం వంటి చీమూ నెత్తురూ ఉన్న పాత్రలతో మహత్తరమైన నాటకం పూర్తిచేశాక అప్పారావు పంతులుగారు ఎంత restless గా feel అవుతారో వూహిస్తే 'మధురవాణి' పాత్ర గురించి ఆయన బెంగ కొంత అర్థం చేసుకోవచ్చును. తిక్కనగారు మహాభారత రచన పూర్తిచేశాక అలాగే restless గా feel అయివుంటారు. అప్పారావుగారు ఒంగోలు ముని సుబ్రహ్మణ్యంగారికి రాసిన లేఖలో Have I made vice attractive? అని మధురవాణి గురించి మథన పడ్డారు.

చారిత్రాత్మకమైన ఈ అప్పారావుగారి లేఖను గుడిపాటి వెంకటచలం గారు తెనుగు చేశారు. చలంగారి అనువాదాన్ని యథాతథంగా ఇక్కడ పొందుపరుస్తున్నాను.

"కన్యాశుల్కం ప్రూఫులు దిద్దుతున్నాను. చదువుతోంటే నాకు ఆహ్లాదం కలుగుతోంది. గ్రంథకర్త తన పుస్తకాల్ని చదివి తానే ఆశ్చర్యపడితే గ్రంథంలో నిజమైన స్వారస్యం వుందన్నమాటే. గ్రంథకర్తకే పుస్తకం ఆకర్షకంగా వుంటే అందరికీ వుంటుందని నిశ్చయమే. మీనాక్షి వొచ్చిన రంగాలు చాలా జ్ఞానాపాదకాలుగా ఉన్నాయి. నేను పూర్వ గ్రంథాల్లోంచి ఉదాహరణలివ్వగలను.

కళాదృష్టితో ఆదర్శవంతంగా చేసినప్పటికీ Artistic Idealisation కూడా Realistic (ఉన్నదున్నట్టు) గా వ్రాసినట్టయితే ప్రజల నీతి అభిప్రాయములకు విరుద్ధంగా ఉండే ఘట్టాలు తటస్థించక మానవు. కొంతవరకు నైతిక ఖండనం ప్రత్యేక తత్వాల మీద ఆధారపడి ఉంటుంది. మీ జాతి పట్టాభి రామమూర్తి గారి సహవాసంలో మీరు పెరగడం వల్ల మీకు అవినీతి అంటే కంటకమని నాకు తెలుసు. వేశ్య అనేసరికి అదిరిపడతారు.

కావ్యాల్లోని న్యాయస్మృతి Poetic Justice (కావ్యన్యాయం) తో మారింది. నేను జీవితాన్ని చిత్రిస్తున్నాను. కళాపరంగా కొంత ఔన్నత్యాన్నిస్తాను.

నేను కళారాధకుణ్ణే. ఐనప్పటికీ సంఘం యెడల బాధ్యత వుంది నాకు. నా పుస్తకం చదివేవారు నన్ను ఒక ప్రశ్న వెయ్యవచ్చు, నేను దుర్మార్గాన్ని ఆకర్షణీయంగా చేశానా అని. చెయ్యలేదని నా నమ్మకం. మొదటి ముద్రణలో మధురవాణి జీవంలేని ఘోరంగా తయారైంది. ఈ ముద్రణలో ఆమెను పూర్ణంగా చిత్రించాను. నేను ఆమెను చూసి భ్రమసి పోతున్నాను. కనుక ఆమెని చివర రంగంలో సంస్కరణం చేశాను. ఇంక మీకు అభ్యంతరం ఉండకూడదు.

పైకి కనబడేదానికన్న బలమైన నైతిక భావాన్ని పొందింది నా పుస్తకం. జీవితాన్ని నేను చులకనగా భావించనని

తెలుస్తుంది. హాస్యంతో పొంగిపొయ్యే పుస్తకంలో జీవితంలో గంభీరత్వాన్ని చూపడం చాలా కష్టమైన పని. ప్రయత్నించాను నేను.

వేశ్యలోని మానుషత్వాన్ని మరచిపోకండి. ఆమె సుఖదుఃఖాలు మీవిగానీ, నావి గానీ అయిన సుఖదుఃఖాలకు ప్రాముఖ్యతలో తీసిపోవు. సంఘంలో లెఖ్ఖలేని వ్యభిచారులైన భర్తలూ, భార్యలూ ఉన్నారు. స్పష్టంగా తన వృత్తిని తెలియబరిచే వేశ్య వారందరి కన్న అధమురాలెట్లా అవుతుంది? పైగా వేశ్య వివాహ ప్రమాణాన్ని భగ్నం చెయ్యడం లేదు వీళ్ళవలె.

'ఆంత్రోపాలజీ' (పురాతన మనుష్యుల చరిత్ర నుంచి తెలుసుకునే శాస్త్రం) వల్ల మన సాంఘికాభిప్రాయాలు మార్చుకోవలసిన అవసరం కలిగింది. స్పష్టంగా గోచరించే విషయాన్ని కప్పిపుచ్చడం వల్ల ఏమీ లాభం లేదు.

వివాహ (Sexual) బంధాలను ఇంతగొప్ప చెయ్యడంలో అర్థమేమిటి? సాంఘిక పరిణామంలో వివాహ సంస్థ యొక్క ప్రాముఖ్యతను నేను తగ్గించ చూస్తున్నాననుకోకండి. గడిచిన శతాబ్దంలో ప్రపంచం జ్ఞానంలో మారింది. వివేకవంతులైన మనుష్యులు పాత అభిప్రాయాల విలువలను పరీక్షించడం ప్రారంభించారు. వివాహ సంస్థ మానవాభివృద్ధికి తోడ్పడిన మాట వాస్తవమే కాని వివాహబంధం ఛేదించకూడదనే అభిప్రాయం వల్ల ఎన్ని చెప్పతరం కాని దారుణ కృత్యాలు తటస్థిస్తున్నాయో మరవకూడదు. అంతేకాదు. ఇంగ్లీషు వారిలో పెళ్ళి (సివిల్ కాంట్రాక్టు) చట్ట సంబంధమైన వొదంబడికగా వుంది. షెల్లీ, జార్జి ఇలియట్ దాన్ని తోసేసి తిరిగారు. (Modern Woman will rewrite history) నవీనయుగపు స్త్రీ చరిత్రను పునర్లిఖింపబోతోంది.

గొప్ప నవలలో ప్రేమకథ అపురూపమవుతోంది లేక ప్రాముఖ్యతలేని స్థానానికి వెడుతోంది. ఈ స్త్రీ పురుష శరీర ఆకర్షణ విషయమై వాఙ్మయం ఎందుకు అనంతమైన భేదాలతో చిత్రిస్తుంది? కామ (Sexual) సంబంధమనే మాటను గమనించండి. శుద్ధ శరీర సంబంధాన్ని స్పష్టంగా చూపుతోంది. వొడిలిపోయిన యాభై ఏళ్ళ సుందరిని యువకుడెందుకు మోహించడు? చక్కగా వికసించిన రోజా పువ్వువలె, బాగా ఉడికే కూరవలె యవ్వనవంతురాలు ఇంద్రియాల్ని ఆకర్షిస్తుంది. పాచిన ఆహారంగాని, వొడిలిన పువ్వుగాని ఎంత అయిష్టమో ముదిరిన స్త్రీ కూడా అంతే. ముందెప్పుడో రొట్టె పాచి పోతుందని గాని, రోజా వొడిలి పోతుందని గాని అవి కొత్తగా, మనోహరంగా వున్నప్పుడు ఎవడన్నా అనుభవించడం మానుకుంటాడా? జీవితమూ, సౌందర్యమూ అశాశ్వతములనే వేదాంతం సరైనది కాదు. పైగా తరుణమందే అనుభవించాలనే అభిప్రాయానికి బలమైన ప్రోత్సాహ కారణమవుతుంది. పాపం, అమితత్వంలో వుంది. అమితత్వం ఎక్కువ కాలం ఎట్లాగూ దాగదు.

జీవితంలోనూ, వాఙ్మయంలోనూ కూడా మోహం తన ఉచిత స్థానాన్ని అధిష్ఠించాలి. ప్రస్తుతం దానికి అమితమైన ప్రాముఖ్యాన్నిస్తున్నారు. 'కేటో' తన భార్యని ఎవరికో ఎరువిచ్చాడు. పురాణాలు చదవండి తెలుస్తుంది.

నిజంగా జరుగుతున్న సంగతుల్ని చూడాల్సి వొస్తుందని కళ్ళు మూసుకోవద్దు. డాక్టరులాగు కత్తి తీసి పుండుకోసి పరీక్షించాలి. ఆశయంగా చూపించతగినది మానవుడి ప్రేమ. క్రీస్తు బోధించిందిగాని, బోధించాడని అనుకునేది గాని అదే. తన కవిత్వంలో షెల్లీ చాటింది ఆ ప్రేమే. జీవించే మతం కింద బుద్ధుడు బోధించింది ఆ ప్రేమనే. బౌద్ధాన్ని యేనాడు నాశనం చేసిందో ఆనాడే హిందూదేశం మతీయమైన ఆత్మహత్య చేసుకుంది.

ఈ ఆచారాలనే ఎర్రకాంతిని, పరిశోధనాలయం (Laboratory) నుంచి తొలగించి, ఈ కామ సంబంధాన్ని పూర్తిగా, వివరంగా పరీక్షించాలని నా కోరిక. చరిత్రాత్మ జీవశాస్త్రాత్మకంగా (biologically) పరిరక్షించి, దాని సరియైన స్థానాన్ని ఈ కామానికి ప్రసాదించి తీరాలి. జీవితంలో యథార్థాన్ని మీరు ప్రేమిస్తున్నారు. 'సెంటిమెంట్' లోని యథార్థాన్ని ఎందుకు ప్రేమించరు? పురుషుడి అధికారం కింద, ఎంత నీచమైన బానిసత్వాన్ని స్త్రీ అనుభవిస్తుందో నాకు తెలుసు. మీరు మాత్రం ఆలోచించుకోలేరా?

బీదలూ, కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భర్తల విషయమై ఆ భార్యలేమనుకుంటూ వుంటారో ఆలోచించుకోండి. మీ చుట్టూ కనపడే కుటుంబాలను 'స్టడీ' చెయ్యండి. కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భార్యలో? అంటారు మీరు. కాని వారు పురుషుల బానిసలే కద. మనకన్న ఆడవాళ్ళు ఎక్కు పవిత్రత చూపాలని

విధిస్తున్నాము. దానివల్లనే ఇంత వ్యత్యాసం కలుగుతోంది. నిర్మలులుకాని పురుషులందరినీ మీరు ద్వేషిస్తారనుకోండి పనిబట్టి. ఇంక మీరు ద్వేషించని స్నేహితులు ఎంతమంది మిగులుతారు? స్త్రీకి సాధ్యమైన దానికన్నా ఎక్కువ ప్రజ్ఞను పురుషుడు కోరుతున్నాడు గనక స్త్రీ బాధపడుతోంది. తన మనసు తీరేట్టు, స్త్రీ తనని పూజించడం లేదని పురుషుడు దుఃఖభాజనుడైనాడు. 'జెలసీ' అంటే ఏమిటి? భర్త అందంగావున్నా పర పురుషుడి ఎడల అనురాగాన్ని ఆపుకోలేదు. కాని అట్లాంటిది మహాపాతకమంటారు మీరు. ఎంత దుస్సాధ్యం! భర్త చవట అయినా భార్య మాత్రం ఆయన మేధాశక్తుల్ని మెచ్చుకునే తీరాలి. ఇట్లా ఎంతవరకన్నా, ఎన్ని విషయాల్లోనో ఊహించుకోవచ్చు ఈ అగచాట్లు.

జపానులో గెయిషా పద్ధతి సంగతి వినేవుంటారు మీరు. కామ విషయమైన నీతి జపానులో చాలా తక్కువ. కాని వారి జాతీయతకికాని, మత జీవనానికి గాని, భాగ్యసమృద్ధికి గాని యే లోటూ రాలేదు. ఆశ్చర్యం ఏమిటంటే, ఆ దేశంలోనే ముఖ్యంగా గొప్ప రాజకీయ ఆదర్శాలుంటాయి.

సెంటిమెంట్ అవతల పెట్టి, ఈ కామ విషయమై నా అభిప్రాయం ఇదీ. సంఘం వల్ల విధింపబడిన చట్టాలు ఉన్నాయి, వాటిని మన్నించడం మన విధి. కామ వ్యవహారాన్ని శాంతంగా నడిపించేందుకు అవి వుండవల్సిందే.

ఆ చట్టాలు అన్యాయమని తలిచి వాటిని బహిరంగంగా సంస్కరింప పూనినప్పుడు తప్ప వాటిని మీరడం గొప్ప నేరం. ఆ చట్టాలకి లోబడి ఉన్నా వాటిని పరీక్షించి వాటి న్యాయాన్యాయ విచారణ చేసేందుకు ప్రతివారికీ స్వతంత్రం వుంది. నిర్మలత్వం అవసరం అనే సెంటిమెంటుని నేను మన్నిస్తాను. కాని ఆ సెంటిమెంటు యొక్క నిజస్వభావమేమిటి, దాని హద్దులెంతవరకు, దాని అసలు అర్థమేమిటి, అది ఏ మార్గంగా పని చేస్తోంది, నిర్మలత్వమంటే దేంటో వుంది? నేను నమ్ముతున్నదేమిటంటే ప్రస్తుత సాంఘిక శాసనాలు ఈ కామ విషయమై ఎవరికీ అందుబాటులో లేనంత కఠినంగా ఉన్నాయి. కనకనే నేరాలు మీరిపోయినాయి. మనలో మనం వాస్తవం ఒప్పుకోవలసిన కాలం వొచ్చింది. ఇదంతా ఎందుకు వ్రాశానంటే నేను వ్రాయబొయ్యే నాటకం ఈ సమస్యల్ని గురించి". అని వ్రాశారు అప్పారావు గారు.

విజయనగరంలో ఆనంద గజపతి మహారాజా వారి సంస్థానంలో వారి ఆధీనంలో రామస్వామి, వెంకటస్వామి అనే ఇద్దరు వేశ్యారత్నాలు ఉండేవారట. వారిలో 'రామస్వామి' కడు పెంకి. వారిరువురినీ గురజాడ అప్పారావు పంతులుగారు కంట్రోలు చేసేవారట. ఈ రామస్వామి, వెంకటస్వామి అనే ఆనందగజపతి మహారాజా వారి ఉంపుడుకత్తెల గురించి కృష్ణశాస్త్రి గారికీ, రాయప్రోలు వారికీ బాగా తెలుసు. ఇది ఇలా ఉండగా విజయనగరంలో 'మహాలక్ష్మి' అనే వేశ్యారత్నము ఉండేదట. ఆవిడ మహా సంగీత విద్వాంసురాలు. ఆనందగజపతి మహారాజు గారైనా ఆమెకు మూడ్ వచ్చి ఆమె పాడితే వినాల్సిందే, కాని పాడమంటే ఆమె పాడేది కాదట. మొట్టమొదటి కన్యాశుల్కంలో ఈ మహాలక్ష్మి అనే వేశ్యారత్న పాత్ర ఉంది. ఈమె గిరీశం వుంచుకున్న సాని అని మొదట్లో ఉంది. తరువాత ఈమె పేరు కొట్టివేశారు అప్పారావుగారు.

ఆనందగజపతి మహారాజాగారికి బాలాజీ నాయుడు అనే ఏజెంటు మద్రాసులో వుండేవాడు. వారి మేనగోడలు రామతిలకం అనే ఆమె ఎల్లప్పుడూ మహారాజా వారితోనే గడిపేది. ఆమెకు రాజావారి వద్ద ఎక్కువ స్వేచ్ఛ ఉండేది. ఈ రామతిలకానికి తాగుడు అలవాటు బాగా ఉండేది. అప్పుడప్పుడు తప్పతాగి స్పృహ తప్పిపోయేది. ఈమెను అప్పారావుగారు మధురవాణిగా స్వకపోల కల్పితంగా తీర్చిదిద్దారు. కన్యాశుల్కం రెండవ ఎడిషన్‌లోని మధురవాణి మీద అప్పారావుగారి పై పరిచయాలసారం అంతా దిగిందని అనుకోవచ్చు.

అప్పారావుగారు, రామస్వామి అనే వేశ్యారత్నంతో మహారాజావారితో కలిసి చీట్లాట ఆడివుండవచ్చును. ఈ వేశ్యలు బ్రాందీ పుచ్చుకునేవారట. మధురవాణిగాని, గిరీశంగాని, పంతులు తప్ప (ఒక్క రామప్పపంతులు తప్ప) ఎవరూ మద్యం సేవించరు. గిరీశానికి చుట్ట కాల్చే వ్యసనం వుండేది. గురజాడ అప్పారావుగారు మాత్రం కోకో వైన్, పురిడిపిట్ట మాంసం తీసుకున్నట్టు ఆయన రాతల్లో వెల్లడయింది. రీవావాణి సేవలో అప్పారావుగారు కొన్ని అలవాట్లు చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ డైరీలు, నోట్సులు పరిశీలించి తిరగరాసిన సందర్భంలో నార్లవారు, అప్పారావు పంతులుగారి మీద అభిప్రాయాన్ని మార్చుకున్నారు. అప్పారావుగారు, ఆనందగజపతి మహారాజుకి, రామస్వామికి, వెంకటస్వామికి మధ్య 'డాఫర్' పనిచేశారని విసుక్కున్నారు. వ్యక్తిగత శీలం స్వచ్ఛత విషయానికి వస్తే వీరేశలింగం పంతులుగారితో, అప్పారావుగారు

సరితూగలేరని గమనించి కోపం తెచ్చుకున్నారు. సాహిత్య అకాడెమీకి రాస్తున్న గురజాడ మీద మోనోగ్రాఫ్ ఆ కారణంచేత అలస్యమయింది కూడా. రామస్వామిని వుంచుకున్నారని, ఆనందగజపతి మహారాజావారి మీద భిన్నాభిప్రాయాలు కలిగి వున్నారుగాని అప్పారావుగారికి రామస్వామి మీద కోపం లేదు. ఆమె వృత్తి అనివారు సరిపెట్టుకున్నారు. అప్పారావుగారు రామస్వామి బాధ్యత స్వీకరించాక (H.H) ఆనందగజపతిమహారాజావారు ఇలా అన్నారని అప్పారావుగారు రాసుకున్నారు.

'విద్యావంతులు ఆడవారి పట్ల దయగా ఉంటారు. మీకు అధికంగా ఋణపడ్డాను. చర్మం కోసి ఇచ్చినా మీ ఋణం తీర్చుకోలేను.' మహారాజావారికి పత్నీ వియోగం (15-05-1896) సంభవించాక, రామస్వామి వచ్చి రాజావారితో జీవించసాగింది. ఆమె గురించి అప్పారావు గారు తీసుకున్న శ్రద్ధను కీర్తిస్తూ ఇంకా రాజావారు ఇలా అన్నారట-'లోకులు ఉదాత్తమైన ఉద్దేశ్యాలను అర్థం చేసుకోలేరు. మిమ్మల్ని చూసి, అతగాడు ఆ పిల్ల మీద మర్లుకొని, ఆమె వద్దకు వెళుతున్నాడేమో, లేదా ఆవిడ ద్వారా ఏదో లాభం చేసుకొందామనుకొంటున్నాడు కాబోలుననో, కాదంటే రాజావారి ఇచ్చకం కోసం ప్రాకులాడుతున్నాడనో అంటూ అజ్ఞానులూ, అవివేకులూ పరిపరి విధాల లేనిపోని నిందలు వేయడానికి ఆస్కారమున్నా దేనినీ లక్ష్యపెట్టకుండా మీరు ధైర్యంగా మలుచుకొచ్చారు'. ఇవి ఆనందగజపతి నుండి అప్పారావుగారు పొందిన ప్రశంసలు. అయితే యీ అనుభవం లేకపోతే గురజాడ మధురవాణిని తీర్చిదిద్ద గలిగి వుండేవారు కాదేమో! చూసీ చూడనట్లు అప్పారావుగారు ఆడవాళ్ళను లోతుగా పరిశీలించేవారు.

ఆనందగజపతి మహారాజావారి స్వంత నౌఖరిలో ఉండే 'భోగం పాపలందరినీ' అప్పారావుగారు చాలా నిశితంగా పరిశీలించారు. వాళ్ళ కళ్ళలోనే వారి స్వభావాన్ని, శీలాన్ని చదవడానికి ప్రయత్నించారు. కరుణ కళ్ళు లోతు కళ్ళు. రామస్వామి కనుబొమ్మలు విశాలంగా సోగగా తెలివితేటలను సూచిస్తాయి. భాస్కరం కళ్ళు నిద్రమత్తుతో తూగుతూ ఉంటాయి. చంద్రవదనవి ప్రశాంతమైన చూపులు. ఆమె చెల్లెలు కళ్ళలో అన్నీ ఆలోచనలే-ఇలా సాగేవి అప్పారావుగారి ఆలోచనాలోచనలు. మధురవాణిని తీర్చిదిద్దడానికి ఈ అనుభవాలు చాలవా? మధురవాణికి తల్లి చెప్పిన నీతులు, అవి సౌజన్యారావు వద్ద ఏకరువు పెడుతుంది. ఒకటి 'చెడని వారిని చెడగొట్టవద్దని'. ఇంకోటి 'మంచివారి ఎడల మంచిగాను, చెడ్డవారి ఎడల చెడ్డగానూ ఉండమని', మొగవాడికయినా, ఆడదానికయినా నీతి వుండాలి' అంటుంది ప్రారంభంలో మధురవాణి, మధురవాణికి డబ్బు విలువ బాగా తెలుసు- "కొద్ది కాలం వుండే యౌవనాన్ని ఆధారంగా చేసుకొని బతికే మా కులానికి వలపు ఒక్కటే. (అది ఎక్కడంటే) బంగారం మీద. శృంగారం వన్నె చెడిన దగ్గర్నుంచీ, బంగారం గదా వన్నె తేవాలి" అంటుంది కరటక శాస్త్రులతో. మధురవాణి గురించి సౌజన్యారావు పంతులు ఇలా చక్కగా అంటాడు-'నువ్వు మంచిదానివి! ఎవరో కాలు జారిన సత్పురుషుడి పిల్లవై వుంటావు (విశ్వామిత్రుడు+మేనక=శకుంతల లాగ). ఈ వృత్తి మానలేవా? స్థితిలోపమా? అంటాడు. మధురవాణి కన్యాశుల్కం నాటకాంతమందు వృత్తి మానేస్తుంది.

మధుర : రండి రండి కామ్రేడ్ గురజాడ గారూ!

గురజాడ : ఏమిటీ వికారం?

మధుర : రెండు కాళ్ళ గాడిదలు మిమ్మల్ని కవిగా గుర్తించలేదనీ, అటువంటి గాడిదలకి యింకా సన్మానాలు జరుగుతున్నాయనీ...(నవ్వుతుంది)

గురజాడ : గాడిద లేమిటి? నన్ను చూసేనా ఆ నవ్వు...

మధుర : రామ, రామ! శ్రీశ్రీ మాటలకి నవ్వొచ్చి అలా నవ్వాను. కమ్యూనిష్టులు మిమ్మల్ని కామ్రేడ్‌గా మార్చారని అంటేనూ, (నవ్వుతుంది)

గురజాడ : నిన్ను ముద్దుచేసి నా పీకలమీదికి తెచ్చుకున్నాను.

మధుర : అవురా ఎంత మాటన్నారు? మీ రచనలన్నీ నష్టమైపోయి ఒక్క దేశభక్తి గీతం మిగిలినా చాలన్నాడు, మీ శిష్యుడు కామ్రేడ్ శ్రీశ్రీ. అంటే కన్యాశుల్కం నష్టమైపోయి మధురవాణి లేకపోయినా ఈ లోకానికీ అందులో ఈ కళింగ రాజ్యానికీయేవీ లోటు వుండదనే గదా తాత్పర్యం?

గురజాడ : నువ్వు అడిగావు గనక చెబ్తున్నాను విను. వెనక సభల్లో రాయప్రోలు గీతం 'ఏదేశ మేగినా యెందుకాలిడినా,

పొగడరా నీ తల్లి భూమి భారతిని' పాడుతూ వుంటే, మన కుర్రాళ్ళకి, దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని పాడేలాగా దేశభక్తి గీతం రాసిచ్చా–వాళ్ళు అది పాడినప్పుడల్లా వీళ్ళు యిది పాడేవారు. అదీ కథ.

మధుర : అందుకా వాళ్ళు మిమ్మల్ని కామ్రేడ్ గురజాడ అన్నారు? (నవ్వుతుంది)

గురజాడ : మీరు వేగుచుక్క అయితే మీకు తోకచుక్క కదా శ్రీశ్రీ. మధ్య నేనెవతను? సానిదాన్ని కామ్రేడ్ అని పిలిచే ధైర్యం ఎవరికుంది? మీరు మొదట రాసిన నాటకంలో నేను దిష్టిబొమ్మలా వున్నాను. అలా చేశారేమిటి కామ్రేడ్?

గురజాడ : వుండు జ్ఞాపకం చేసుకోనీ, బేహద్భీ. మొదట్లో రామప్పంతులుంచుకున్న సానిగా కదూ చిత్రిస్త–అందుకే నిన్నపుడు Colourless Iniquity గా వున్నావన్నాను.

మధుర : అదుగో మిమ్మల్ని కామ్రేడ్ అన్నందుకు నన్నేదో ఇంగ్లీషులో తిడుతున్నారు. (గునుస్తుంది) మీకిది తగునా?

గురజాడ : సొగసైన నీవంటి స్త్రీకి అలకే అలంకారం. Colourless Iniquity అంటే 'అందంలేని పాపం' లాంటిది. కోపం తెచ్చుకోకు. అన్నట్లు నీకు కామ్రేడ్ గిరీశం గారు కొన్నాళ్ళు ఇంగ్లీషు చెప్పేవాడు కదా.

మధుర : అతణ్ణి కామ్రేడ్ అని, పాపం వాళ్ళు అనలేదు, మీరంటున్నారు. గిరీశం గారు కొన్నాళ్ళు నన్నుంచుకున్నారు.

గురజాడ : వాడి సంగతి నాకా చెప్తావు? మొట్టమొదటి నాటకంలో వాడుంచుకున్న సాని 'మహాలక్ష్మి', నువ్వు కాదు.

మధుర : మరయితే ఆ మహాలక్ష్మి నెందుకు తప్పించేశారు?

గురజాడ : అది వేరే కథ. నేను చెప్పగూడదు. నువ్వు వినకూడదు.

మధుర : కామ్రేడ్ మహాలక్ష్మి మీరు చెప్పిన మాట వినలేదు. అందుకు తీసేశారు. ఆవిడ రణపెంకె. అవునా?

గురజాడ : ఈ 'కామ్రేడితం'తో నన్ను చంపేస్తున్నావు. ఆవిడ ఆనంద గజపతి మహారాజా వారి ఆస్థాన విద్వాంసురాలు. ఆమె పాట వినదల్చిన వారు ఆమె పాడినప్పుడు వినాల్సిందే కాని, మహారాజా వారైనా సరే పాడమన్నప్పుడు పాడేది కాదు. మహాగొప్ప సంగీత విద్వాంసురాలు. సాయంత్రం చీకటి కనుమరుగయ్యే వేళకు ఆదిభట్ల నారాయణదాసు వంటి హేమాహేమీలు ఆమె ఇంటి వద్ద హాజరయి కల్వంలో భంగుపత్తి నూరుతూ ఆమెకు చేదోడు వాదోడుగా పనుల్లో కల్పించుకొంటూ పడిగాపులు పడివుండేవారట.

మధుర : ఎందుకట?

గురజాడ : ఉండీ ఉడిగీ ఆమె ఓ రాగం, ఓ కీర్తన, ఓ పల్లవి విసిరితే పట్టుకుందామని. ఈమెని మద్దెల మహాలక్ష్మి అని కూడా అనేవారు.

మధుర : బాగుంది. ఇంతటి మహా సంగీత విద్వాంసురాలినా మీరు ఆ గిరీశానికి సానిని చేసింది!

గురజాడ : అదే పొరపాటయింది. ఎస్టేటు ఎస్టేటంతా గొడవ చేస్తే ఇక మన ఆ బోరు దక్కదని మహాలక్ష్మిని తీసేసి నిన్ను అక్కడ తగిలించాను.

మధుర : చాల్సాలు! ఆనంద గజపతి మహారాజా వారు ఒకవేళ హఠాత్తుగా మద్దెల మహాలక్ష్మి పాట వినాలని వస్తే అప్పుడు నారాయణదాసు గారు వగైరా మీరంతా మహాలక్ష్మి మంచం క్రింద దాక్కునేవారా?

గురజాడ : మంచం కింద దాక్కోవడమేమిటి? మహారాజా వారెక్కడకూ వెళ్ళరు. అందర్నీ వారి వద్దకే పిలిపించుకుంటారు. ...తెలుసా?

మధుర : ఏమి మహాకవులండీ మీరు? పూటకూళ్ళమ్మ వస్తే గిరీశం గారు వచ్చి మా మంచం క్రింద దాక్కోలేదా? ఆ సీను మహాలక్ష్మి గారింట్లో మహారాజావారు వస్తే మీ కల్లాటి అనుభవం అయిందేమోనని నా అనుమానం.

గురజాడ : ఏ సభకయినా, నాటకానికైనా, దర్జాగా, మహారాజా వారి కూడా వెళ్తే వెళ్తాను. మంచం క్రింద దాక్కోవడం ఖర్మ నాకేమి?

మధుర : అహ ఊరికే తెలుసుకుందుకు అడిగా. అన్నట్లు మీ బావమరుదులిద్దరూ చదువుకుంటూనే

సానుల్నుంచుకున్నారని విన్నా. మీరు వెళ్ళినపుడు మీ బావమరిది నరసరాజు, మీరు వస్తున్నారని జడిసి పొడుగు సుందరి మంచం కింద దాక్కుని వుండవచ్చు కదా!

గురజాడ : పొడుగు సుందరెవత్తి?

మధుర : అదేమో, మీకే తెలియాలి! (ఇద్దరూ నవ్వుతారు) మీరు యాంటీ నాచ్చా, ఆ?

గురజాడ : కాక?

మధుర : మరైతే సాన్ని మీ నాటకానికి కథానాయికగా ఎంచుకున్నారే!

గురజాడ : నా హీరోయిన్ సాన్దే అయినా, ఆమెకు తన వృత్తిపట్ల నిజాయితీ వుంది. వివాహబంధాన్ని తేలికచేసి పవిత్రులుగా నటిస్తూ వ్యభిచారం చేసే అనేకమంది స్త్రీ పురుషులకన్నా, నేను రూపొందించిన సానిదే మంచిదీ గొప్పదీ.

మధుర : అందుకే కాబోలు, ప్రోనాచి, యాంటీనాచీ అన్న తేడా లేకుండా కామ్రేడ్సంతా మీకు బ్రహ్మరథం పట్టేరు (నవ్వు)

గురజాడ : జీవితాన్ని నేనెప్పుడూ చులకనగా తీసుకోలేదు. పైకి హాస్యంగా కనపడే దాని వెనుక బలమైన నైతిక భావాల్ని జొప్పించాను. గ్రహించు, నేను సీరియస్ మనిషిని.

మధుర : తెలుస్తోంది. నాటకం చివర నాచేతిలో భగవద్గీత పెట్టించి అమ్మయ్య అని మీరు తప్పుకున్నారు.

గురజాడ : మరి నేను కామ్రేడ్‌ని ఎలా కాగలిగాను. బేహద్దీ, వుండు; నీ చెవి – (అని మధురవాణి చెవి మెలిపెట్టబోతాడు)

మధుర : ఇవుగో మీకిష్టమైన మామిడి పళ్ళు. అదిగో మామిడి తాండ్ర. నా చెవి వదిలేయండి.

గురజాడ : I shall has be terrible as I was humorous

మధుర : మీ ఇంగ్లీషు బాగుంది. గిరీశం గారు ఇంగ్లీషు మాట్లాడుతూ వుంటే దొరలు మాట్లాడుతున్నట్లు వుండేది. మొదట్లో మీరు నా కంటెకిచ్చిన ప్రాముఖ్యం నాకిచ్చారు కాదు. అందుకే అందం లేని పాపంలా నిలబడ్డాను. తరవాత–

గురజాడ : తరువాత నీవే నేను, నేనే నీవు.

మధుర : రాజా! ఆ రోజుల్లో నిన్ను చూసి అంతా భయపడే వారట, నిజమా?

గురజాడ : నన్ను, రాజా అనే పేరుతో తాతాచార్యులు పిలిచేవాడు. నీకెల్లా తెలుసు? నీకు పుణ్యం వుంటుంది. నన్ను నువ్వూ నువ్వూ అనకు.

మధుర : త్వమే వాహం. వీణ వాయిస్తారా? ఇవ్వనా? అదేవిటి చేతులు అలా వణుకుతున్నాయి?

గురజాడ : కొంచెం కోకోవైనియ్యి. కాస్త ఆగి కాఫీ ఇయ్యి. నరాల నిస్సత్తువ పట్టుకుంది.

మధుర : గిరీశంగారికి చలిదివణ్ణం, చేదతో బావిలోంచి నీళ్ళు తోడ్డం ఇలాటివే ఏర్పాటుచేశారు గాని, కాస్తవైనుగాని విస్కీ గాని ఇవ్వలేకపోయారు. మీరేం మహాకవులండీ?

గురజాడ : నన్ను కవిగా ఎవరూ వప్పుకోందే? డ్రాయింగ్ షీటు, పట్రా నీ బొమ్మ గీస్తా.

మధుర : అవును మీరు చిత్రకారులే. నా బొమ్మ గీస్తే నాకివ్వరు. దాన్ని మీరే మోహించి వుంచేసుకుంటారు.

గురజాడ : ఒక కవి తన రచన చూసి తానే పరవశించి పోయాడంటే, అందులో నిజంగా, జీవం వుందన్న మాట.

మధుర : నన్నెదురుగా పెట్టుకునా, మీరా మాటలనడం?

గురజాడ : నువ్వు రామప్పంతులుతోనూ, గిరీశంతోనూ, పిల్లి ఎలుకలతో ఆడుకున్నట్లు ఆడుకున్నావు. నాతో మాత్రం ఆడుకోలేవు. వచ్చేటప్పుడు నీ దగ్గరకు కళ్ళు మూసుకుపోయి వచ్చినవాడు భ్రమలు పటాపంచలై వెళ్ళేటప్పుడు కళ్ళు తెరుచుకుని వెళ్ళిపోతాడు, గిరీశం లాగా.

మధుర : 'డామిట్ కథ అడ్డంగా తిరిగింది' అన్నారు కదా; అది గిరీశం గారికా, లేక మీకేనా? (నవ్వు)

గురజాడ : నీకు కోపం వస్తే చెంబుతో నీళ్ళు తెచ్చి, నా నెత్తిమీద దిమ్మరించినా దిమ్మరిస్తావు. నాటకం నీకు నచ్చలేదా?

మధుర : అన్నం మెతుకును అన్నంగా నచ్చిందా అంటే ఏవంటుంది? కన్యాశుల్కం బీభత్స రసప్రధానమైన విషాదాంత

నాటకం అన్నాడుగా కామ్రేడ్ శ్రీశ్రీ, రామ-రామ

గురజాడ : నేనల్లా అనుకున్నానా?

మధుర : కనిపించని వంద కల్పవృక్షాలకన్న ఒక "దేశభక్తి" గీతం మిన్న. సన్మానాలు పొందే లక్ష సామ్రాట్టుల కన్న ఒక కామ్రేడ్ గురజాడ మేలు అన్నాడు శ్రీరంగం వారి చిన్నవాడు.

గురజాడ : అదేవిటి విశ్వనాథ మనవాడే-అతని మీద దేనికంట వీడు విరుచుకుపడటం?

మధుర : చిత్రం చిత్రం మహాచిత్రం అన్నట్లు వుంటాయి మీ మాటలు. మిమ్మల్ని కామ్రేడ్ గురజాడ అన్న శ్రీశ్రీని పక్కన పెట్టి, మిమ్మల్ని అకవి అన్న విశ్వనాథని మెచ్చుగుంటున్నారు. ఏవి చోద్యం?

గురజాడ : (నవ్వి) యెంచాతంటే వాడు రాసిన వేయి పడగలు బీభత్స రసప్రధానమైన నవల; నా నాటకం కాదు. (నవ్వు) అది అంతే - పైగా అతను నా నాటకంలో రామప్పంతులు వేషం వేశాడు నాలుగేళ్ళు దీక్షగా. మాధవాచార్యులు - మీనాక్షి.

మధుర : కన్యాశుల్కంలో వేషం వేసిన వాడు అందులో నా ముద్దుల్ని జుర్రిన రామప్పంతులు, కన్యాశుల్కానికి ఎదురుతిరగడమేమిటి అంటారు పంతులు గారు. శ్రీశ్రీ మీ నాటకం బీభత్సం అన్నందుకు మీరు వారిని వొదిలి వీరిని చేరదీయడం సవబా?

గురజాడ : నువ్వుండగా నా నాటకంలోకి బీభత్సం ఎలా వస్తుందీ?

మధుర : నాతోపాటు గిరీశంగారుండగా నాటకం బీభత్సం ఎలా అవుతుంది?

గురజాడ : నా నాటకం రసగంగాధరం. అది నాకు తెలుసు, నీకూ తెలుసు. శ్రీశ్రీ కేం తెలుసు?

మధుర : నేను మిమ్మల్నో మాట అడుగుతాను. ఏవీ అనుకోరు గదా?

గురజాడ : నాకు పద్యాలు కావ్యాలు రాయడం చాతగాక గేయాలు రాస్తున్నానన్నారు. నాటక లక్షణాలు నాకు తెలియవన్నారు. అదీ యిదీ చాతగాక ఇందులో దిగానని వెక్కిరించారు. నేనేమీ అనుకోలేదే? నువ్వడిగితే నేనేవనుకుంటాను? అందులో నా అతి మధురానివి-

మధుర : ఇందాక నా నాటకం నీకు నచ్చిందా అని అడిగారు. నేనేవంటాను? ఆ నాటకం మీకూ లొంగలేదు. కొత్త కవిలా అలా రాసుకుంటూ పోవడమేనా? ఎంత రాసినా మీకు తృప్తిలేదు. మీజాతే అంత-వాళ్ళంతా ఎలా నడిపిస్తే అలా నడిచారు. పాత్రల్ని గారం చేసిన జనక తండ్రి మీరు. దశరథునికున్నంత పుత్ర వ్యామోహం మీకూ వుంది మీ పాత్రల మీద. అవునా?

గురజాడ : నా నాటకాన్ని నేను జాగ్రత్తగా నిర్వహించ లేకపోయానంటావు అంతేనా? పాత్రల మీది వ్యామోహంతో అది ఎటునడిస్తే అటు వెళ్ళాననీ అలా పెంచుకుంటూ పోయాననీ నీ పాయింటు. అది తప్పా? ఒక వేళ నిజమైనా-

మధుర : మీకు తెలిసిందంతా ఆ ఒక్క నాటకంలో చెప్పెయ్యాలని మీకు వూహ్ఁ ఆత్రం. తెలుగులో మొదటి నవల మీరే రాసివుంటే అందులో ఎంచక్కా మీరు చెప్పదలుచుకున్నదంతా విప్పిచెప్పగలిగి వుండేవారు. అవునా?

గురజాడ : నవల రాయకుండా నాటకం రాయడం తప్పయి పోయిందంటావు? నాకు కుదురులేదని నీ ఉద్దేశ్యమా?

మధుర : రామ! రామ! నా ఉద్దేశ్యం అది కాదు. నవల్లో చెప్పవలసినంత గోలనాటకంలో తెలిసి కావాలని చేశారు. అయితే కథ మీకే అడ్డం తిరుగుతోందని తెలిసి అట్టే రంగూ, రుచీ, వాసనా లేని సౌజన్యారావు పంతుల్ని తెచ్చి అతనిచేత నాకు భగవద్గీత ఇప్పించి బతుకుజీవుడా అని మీరు చల్లగా తప్పుకున్నారు. అవునా?

గురజాడ : నాటకం రాసింది పాత్రలచేత మాటలు పడ్డానికే-అను, అను; నీ సొమ్మేం పోయింది! నీకు లోకువయ్యాను. పాత్రలకీ లోకువయ్యాను. నా జాతకం అలాటిది మరి.

మధుర : పంతులు గారికి కోపం వచ్చినట్లుంది. వీరేశలింగం గారి వితంతువివాహాలు, సంఘ సంస్కరణా మీకు నచ్చలేదు. రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు యాంటీనాచ్ గనుక ఆయన్ని సౌజన్యారావు పంతులుగా చేసి మీ లౌక్యం ప్రదర్శించారు. మిమ్మల్ని కామ్రేడ్ అన్న వాళ్ళే అచ్చంగా గాడిదలు. (నవ్వు)

గురజాడ : రోకలి తలకు చుడుతున్నావు. కానీ, వితంతు జీవితమే నరకం. అందులో గిరీశం లాంటి వాళ్ళను పెళ్ళాడితే ఇంకా మహానరకం కదా! మన పెళ్ళిళ్ళలో ఆడదానికి లభించని ప్రేమా, స్వేచ్ఛా వీరేశలింగం గారు జరిపే వితంతు వివాహాల్లో మరింత దుర్లభం కదా! ఇదే నన్ను బాధించిన నిజం పిల్లా!

మధుర : ఒప్పుకుందాం. మరి యాంటీనాచ్ సంగతితో...

గురజాడ : నాయుడుగారి గ్రూపుది వాస్తవ లోకంతో సంబంధం లేని వట్టి నైతిక దృష్టి. నాచ్ కొశ్చెన్‌ను ఆర్థిక దృష్టితో సంస్కర్తలు పరిశీలించలేదు. నిజమే ఆ లోపం నన్ను బాధించింది సుమా.

మధుర : మరి మీరు ఆనంద గజపతి మహారాజులుంగారుంచుకున్న రామస్వామి, వెంకటస్వామి రామతిలకం వంటి వేశ్యలకు గార్డియన్‌గా వున్నారు. రీవా రాణిగారి ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేశారు. కాలేజీలో మేష్టరీ వెలగబెట్టారు. మీకున్న ప్రత్యక్షానుభవం పంతులుగారికి గాని, నాయుడుగారికి గాని యేది? మీ మనస్సు గొప్పది. మీ దృష్టి మరీ కొత్తది. నిజవేనా?

గురజాడ : రాజమండ్రి, కాకినాడా ముందుకుపోతుంటే విజయనగరాన్ని వెనకబడనిస్తానా?

మధుర : గిరీశానికి కర్రకత్తీ, ఇత్తడి కిరీటం, కొయ్యగుఱ్ఱం ఇచ్చి వినాయకుణ్ణి చేసి రెండు సమస్యల్నీ నవ్వులపాలు చేశారు.

గురజాడ : అంటే నీ ఉద్దేశ్యం. గిరీశానికి బుచ్చెమ్మనిచ్చి పెళ్ళి చేయలేదనా?

మధుర : కాదు. సంఘసంస్కర్తలకి కొంచెవైనా లోకజ్ఞానం లేకపోవటం నవ్వు పుట్టించదా? మానవ సమాజంలోని చెడుతోనే సానివారమైన మాకు పరిచయం గాని మంచివాళ్ళు మమ్మల్ని దగ్గరకైనా రానివ్వరు కదా?

గురజాడ : అందుకే నీకు మగవేషం వేసి కోటు తొడిగి తలపాగా చుట్టి సౌజన్యారావు పంతులు దగ్గరకు పంపించాను. నా ఆల్టర్ యిగోవి నువ్వు. అందుకే త్వమేవాహం అన్నాను. నాది వాక్కు, నువ్వు నా అర్థానివి.

మధుర : చాలు! మీది ముందు చూపు. పంథొమ్మిదో శతాబ్దంలో వుండి ఇరవై ఒకటో శతాబ్దంలోకి చూడటం గొప్పే కాని, అదే పాపం, మీ అయోగ్యత. సమకాలిక ప్రగతి ఉద్యమాల పట్ల సానుభూతి లేకుండా వెక్కిరించేలా చేసింది మీ ముందుచూపు. వీరేశలింగం నిశ్చయంగా మహాపురుషుడు అని చెప్పడానికి మీకు చాలా కాలం పట్టింది కదా! మీ లెక్కలన్నీ తప్ప లేదా?

గురజాడ : మరి నీ లెక్క ప్రకారం అదంతా నా పొగరనా నీ ఉద్దేశ్యం?

మధుర : కాదు కోపం. సజ్జనులకు అధర్మాన్ని చూస్తే కలిగే ఆగ్రహం. మీ కోపమే మీ నాటకం. ఆలోచిస్తే కోపం కూడా ఓ రసమే. అదీ ఓ సొగసే.

గురజాడ : ఇక నీ కవిత్వాలు చాలించు. కొంపదీసి నాకే పాఠాలు చెప్పేట్లున్నావు?

మధుర : తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడేను మనిషోయ్ అన్నారు. ఇదేం కవిత్వం? మీకు కండలేక ఒంట్లో సేరు మాంసం లేదు గనక కండ కలవాళ్ళంతా మీకు మనుషుల్లా కనుపించారు. అవునా? (నవ్వు)

గురజాడ : ఈవేళ నన్ను పట్టించావేమిటి? నేన్నిన్ను నెగ్గగలనా?

మధుర : ఆలోచిస్తే ఇరవైయేళ్ళ, మెట్రిక్ ప్యాసయిన మీరే వెంకటేశం ఎందుకు కాకూడదు అని నవ్వు వచ్చింది. అంత టైం ఎందుకు తీసుకున్నారు?

గురజాడ : నాలాగే వీరేశలింగం గారు కూడా ఆలిస్సెం చేశారు మెట్రిక్ దాటేందుకు. ఇద్దరం ఫస్టుగా ప్యాసయిన వాళ్ళమే.

మధుర : బావుంది పోలిక, తోడు దొంగల్లా–చదువుల్లో వెనకబడిన వాళ్ళే తరవాత చదువుల్ని శాసిస్తారు. కాదా? (నవ్వు)

గురజాడ : నా నాటకం లాగే నేనూ కొందరికి అందను. అంటే అర్థం కాను.

మధుర : కన్యాశుల్కం నాటకం కాదన్న వాళ్ళకి నాటకం అంటే ఏమీ తెలియదని మనం సరి పెట్టుకోవాలి.

శిథిలమవుతున్న రాజరికానికి మీరు నమ్మినబంటు. అందుకే మీరంటే అదో లోకువ కొందరికి. కాదా?

గురజాడ : శిథిల వ్యవస్థలో వుండి, దానికి సేవచేసి ఆరోగ్యం చెడగొట్టుకున్నాను. తరవాత దాని గురించే నాటకం రాసుకుని తరించాను. కబుర్లాడుతున్నావు గాని నువ్వూ ఆ గూటి చిలకవే, ఆ ఆటే ఆ పాటే నీది.

మధుర : కాదన్నానా? పెద్దబావా, కోటలో కొలువూ మిమ్మల్ని మీ ఆరోగ్యాన్నీ హరించి వెయ్యకపోతే కొండు భట్టీయం, బిల్హణీయం మరిన్ని నాటకాలు రాసివుండే వారు కాదా! నన్ను మీరు వదలలేకపోయారు, గిరీశం గారు మిమ్మల్ని వదల్లేదు. మే గాడ్ బ్లెస్ యూ సర్! (అని రొమ్ముపై క్రాస్ వేసి ఆమెన్ అన్నట్లు వంగి సలాం కొడుతుంది)

గురజాడ : నేను కన్యాశుల్కానికి సీక్వెల్ రాద్దామనుకున్నా. ఓ మాటు ట్రంకు పెట్టి రాసుకున్న కాగితాల్తో రైల్లోపోయింది. తరువాత పెద్దదావా వల్ల రాయడం కుదిరింది కాదు. ఏమిటో? అనుకున్నవి అనుకున్నట్లు సాగవు.

మధుర : మీకెందుకండీ ఆ శాసనాలు? కళింగదేశ చరిత్ర ఏదో రాద్దామనుకున్నారు. లక్ష్యశుద్ధిలేక దారితప్పారు అవునా?

గురజాడ : అదేం మాట-కోటలో నా ఉద్యోగం ఎఫిగ్రఫిస్టే. అది నా డ్యూటీ.

మధుర : అందుకే దొరలచేత మాటలు పడ్డారు. నీ ఉద్యోగమేదో నువ్వు చూసుకోక, కోటలో జొరబడతావు, నీకేం పనయ్యా అని. కోట అంతా నాదే అన్నట్లు పూసుకు తిరిగేవారు అవునా?

గురజాడ : నాకు చదువు చెప్పించి నన్ను పెంచి పెద్దవాణ్ణి చేసిన ఆనంద గజపతి మహారాజా వారికి నేనేం చేసినా నా ఋణం తీరదు. ఆ కృతజ్ఞతా భావం నన్ను కోటకు కట్టిపడేసింది. అది తప్పెలాగవుతుంది?

మధుర : మిమ్మల్ని వాళ్ళు అలా వాడేసుకోవడం వలన, మీ సాహిత్య కృషి చాలా కుంటుపడింది. రాయవలసినంత రాయలేక పోయారు. పైగా పరీక్షా పత్రాలు, పాఠాలూ-పుస్తకాలూ ఒకటా మీకు.

గురజాడ : నా రథానికి నాలుగు చక్రాలు. రథస్యైకం చక్రం కాదు.

మధుర : ఏమిటో ఆ నాలుగు చక్రాలు?

గురజాడ : మహారాజా వారి కొలువు తదనంతరం దివాణం సేవ, పెద్ద దావా ఇదంతా ఒక చక్రం అయితే-

మధుర : రెండోది శాసన పరిశోధన, కళింగదేశ చరిత్ర, రాజా వారి పూర్వులను వెతికి (ఆగి) కీర్తిశేషుల్ని తవ్వి కీర్తిని వెలికి తీసి చూపడం-ఇదంతా శుద్ధ దండగ చాకిరీ-గిరీశంగారే మీ చరిత్ర రాస్తే మీ జీవితం అంతా శుద్ధ దండగ అనగా వేస్టయి పోయిందని రాసుండేవాడు.

గురజాడ : ఔరా ఇంద్రజాలీ! నువ్వే ఇంగ్లీషు చదువుకుంటే లాయర్ మధురవాణివయి జడ్జీల యెదుట నీ వాగ్ధాటితో ఫెళ ఫెళలాడించే దానివి.

మధుర : మిగతా చక్రాల సంగతి నన్ను చెప్పమంటారా? మీరే చెబుతారా?

గురజాడ : ఒకటి సోషల్ రిఫాం అనగా సంఘ సంస్కరణ, రెండోది లాంగ్వేజి రిఫాం అంటే, వ్యావహారిక భాషా ఉద్యమం.

మధుర : కొంప ముంచారు అంకుల్. వరవీణామృదుపాణిని యేం చేశారు?

గురజాడ : అంతా నాకు ఓ నమస్కారం చేసి, మహాకవో, యుగకర్తో అని పండితుల చేత తిట్టించి తమ దారిని రాసుకుపోయారు గాని ఒక్కడూ నా మార్గం ఫాలో అవలేదు.

మధుర : అదా మీ విచారం. పాపం రమణారెడ్డి 'మహోదయం' అని మీ గురించి ఒక బృహత్ కవిలికట్ట రాశాడు చూడలేదా?

గురజాడ : నన్ను తిట్టిన వాళ్ళతో పేచీల్లేవు కాని అంతా నన్ను కావిలించుకున్న వాళ్ళనించే ప్రాబ్లమ్స్. ఒకడు నన్ను మహాకవి అన్న వాళ్ళమీద విరుచుకుపడ్డాడు, ఏమో అన్నారు. నేను రాసినట్లు రాయకుండా నన్ను కేవలం సమర్థించే వాళ్ళ వల్ల నాకు ఎక్కువ డామేజి జరిగిందనుకుంటున్నాను. నేను కన్యాశుల్కం రాశాక ఎన్నాళ్ళకో

నా నాటకంలో రామప్పంతులు వేసి నన్ను తన శిష్యుడి చేత అకవి అని తిట్టించిన సత్యన్నారాయణ 'వేయి పడగలు' రాశాడు.

మధుర : గురూజీ మీరు వేయి పడగలు చదివారా?

గురజాడ : అసిరిగాణ్ణి పంపించి తెప్పించాను లైబ్రరీ ఆఫ్ ది హెల్ నుంచి.

మధుర : అన్నట్లు శ్రీశ్రీ, విశ్వనాథ అంతా నరకంలోనే గదా వుంట. రామాయణం రాసినా మహాకవులు వుండేది అక్షరాల నరకంలోనే.

గురజాడ : నువ్వో మాటు అక్కడికి రారాదూ మన వాళ్ళందర్నీ చూడొచ్చు.

మధుర : చెడిన వారిని పూర్తిగా చెడగొట్టమని చెప్పలేదు మా తల్లి. ఏదో చెప్పబోయారు?

గురజాడ : కన్యాశుల్కంలో ముసలాళ్ళకు డబ్బు తీసుకుని చిన్న పిల్లల్నివ్వకూడదని నేను రాస్తే, ఈ కవి సమ్రాట్టు తన హీరోకి తన ఫ్రెండ్ కూతుర్ని (పెళ్ళం పోతే) అదే పేరిటి చిన్న గుంటని కట్టబెడతాడు. ఎనిమిదేళ్ళ పిల్లకి పెళ్ళి చేస్తే దాని బుర్రలోకి అన్య పురుష ప్రభావం ప్రవేశించకుండా పెళ్ళికొడుకు అంటే వరుని ప్రతిమ బ్లాక్ చేస్తుందట. రైళ్ళు, బస్సులు రావడం ధర్మగ్లాని అంటాడు. పంపులు పెట్టడం మునిసిపాలిటీలు ఏర్పడడం, ప్రజాస్వామికం రావడం అంతా పతనమే దోషమే. మార్పుని ఇంతగా ద్వేషించే మహాకవి నేనెక్కడా చూడలా.

మధుర : మీరేం వర్రీ అవకండి నాన్నగారూ! ఈ కవి సమ్రాట్ గారి మనుమలు మనవరాళ్ళు, కొందరు అమెరికాలో మరికొందరు ఇప్పుడు కాన్వెంట్లలో చదువుకుంటున్నారు. వాళ్ళెవరికీ తెలుగురాదు. తాత గారి పుస్తకాలు చదివి బాగుపడే అవకాశం లేదు. కవులు ఫాలో గాకపోయినా రచయితలు మిమ్మల్నే ఫాలో అయ్యారు.

గురజాడ : నన్ను ఫాలో అయ్యారా లేదా అన్నది కాదు ప్రశ్న – దేశం ముందుకెళ్తోందా, వెనక్కెళ్తోందా అన్నది సమస్య.

మధుర : బ్రాహ్మల్లో గొప్పవాళ్ళనీ, మంచివాళ్ళనీ, పండితుల్నీ, జ్ఞానుల్నీ, కవుల్నీ వదిలేసి లుబ్ధావుధాన్లు, అగ్నిహోత్రావధానులు వంటి పాత్రల ద్వారా చెడును పైకెత్తారనీ – కన్యాశుల్కం ద్వారా బ్రాహ్మణ ద్వేషాగ్నిలో ఆజ్యం పోశారనీ ఇలాంటి మాటలే కవి సమ్రాట్‌గా రన్నార్ట. యు వర్ ఎ బ్యాడ్ పొయెట్!

గురజాడ : ఆయనేవన్నాడో ఆయన్నే ఇంటర్వ్యూ చెయ్యరాదా? ఎవరో అన్న దానికి జవాబులు చెబుతూ కూర్చోవాలా? బ్రాహ్మలు నవ్వుల పాలయ్యింది నా వల్ల కాదు.

మధుర : ఏ కర్రకు నిప్పుంటే ఆ కర్రే కాల్తుంది అంటారు. అయితే నాకు విశ్వనాథ వారితో ఇంటర్వ్యూ తప్పదంటారు. జో ఆజ్ఞా–

గురజాడ : ముందు శ్రీశ్రీని కదిలించి చూడు. నేను రాసిందంతా పోయి దేశభక్తి గీతం ఒక్కటి వున్నా చాలు అన్నాడని గదా నీ అలుక – అన్నీ అడుగు. వదలకు.

మధుర : కన్యాశుల్కం మీరు రాయలేదనీ, ఎవడో శ్రీనివాసాచారి రాశాడనీ వావిళ్ళశాస్త్రుల్లు జరుక్‌శాస్త్రికి చెప్తే, జరుక్ ఆంధ్రపత్రికలో అల్లరి లేవదీశాడు. వాళ్ళంతా ఇప్పుడు ఇక్కడ్నే మన హెల్‌లోనే వున్నారు. పిలిపించనా?

గురజాడ : బ్రాహ్మల్లో కూడా మహాత్ములుంటారని రుజువు చెయ్యదలచుకొంటే పిలిపించు.

మధుర : తప్పయింది. లెంపలు వాయించుకుంటాను. అవును మొదట దీన్ని ఈ నాటకాన్ని మీరు ప్రబంధ భాషలో రాసి అది రుచించక పోవడం వల్ల గ్రామ్యంలో తిరగ రాశారని మీరే వేలూరి శివరామశాస్త్రి గారితో అన్నార్ట అది నిజమా?

గురజాడ : సత్యన్నారాయణ, డైలీ, యమధర్మరాజుకి 'రామాయణ కల్పవృక్షం' వినిపిస్తున్నాట్ట. ఆ సభకి వేలూరి శివరామశాస్త్రి, అధ్యక్షుడు. నేవెళ్ళినప్పుడు నువ్వుకూడా వస్తే నువ్వే అడుగుదువు గాని ఆ మాట–

మధుర : నన్ను కూడా ఎందుకా నరకంలోకి లాగాలని చూస్తారు?

గురజాడ : నువ్వెక్కడ వుంటే అక్కడది స్వర్గం గాక మరేమవుతుంది?

మధుర : అన్నట్లు బ్రింజాల్స్ అంటే ఏవిటండీ?

గురజాడ : మధ్యలో నీకు బ్రింజాల్స్ చింత దేనికి?

మధుర : అవసరాల సూర్యారావు మీరు బ్రింజాల్స్ అని ఇంగ్లీషులో రాసిందానికి పచ్చిమిరపకాయలని తెనుగు చేశాడ్ట.

గురజాడ : నా కాగితాల ట్రంకు పెట్టి వాడికి వెళ్ళినట్లుంది. (నవ్వు) వాడికి తోచినట్లు వాడు రాశాడు. నాకు అంతే ప్రాప్తి.

మధుర : యుగకర్త, మహాకవి అన్న వాళ్ళు ఆ మాత్రం చనువు తీసుకోకూడదా యేమి?

గురజాడ : సి.ఆర్.రెడ్డిని పిలు. వాడూ తెలుగు నరకంలోనే వుంటాడు. వాడికి చెప్పు నీ ఫిర్యాదులు. రెడ్డి వీళ్ళకు బాగా డోస్ ఇస్తాడు.

మధుర : మీది నిర్మలమైన హాస్యం అని, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ మెచ్చుకున్నాడు. సద్బ్రాహ్మడు. ఇక్కడకి రాడు. ఇహరెడ్డి గారి సంగతి సరేసరి. ఆయన పగలబడి నవ్వేవారట. అందరూ కలుసుకున్నప్పుడు కన్యాశుల్కం డైలాగులు అప్పజెప్పడం అదో వేడుక. కావలిస్తే జరుక్‌ని, హనుమచ్ఛాస్త్రిని, శ్రీశ్రీని అడగండి. ఇక్కడా అదే గోల.

గురజాడ : నువ్వుండగా నేనెవర్నీ ఏదీ అడగదల్చుకోలేదు.

మధుర : విజయనగరంలో మీ విగ్రహం చూశారా? (నవ్వు) విజయనగరం నిర్లక్ష్యానికి మీరు అప్పుడూ ఇప్పుడూ గురవుతూ వస్తున్నారు. మిమ్మల్ని సప్రైస్ చేసిందీ విజయనగరమే. విజయనగరానికెంత చేశారు?

గురజాడ : డామిట్-కథలు అడ్డాలు తిరక్కేంచేస్తాయి? అన్నట్లు బంగోరె అనే నెల్లూరి కుర్రాడొకడు సట్లిజ్‌లో దూకి ఇక్కడకు వచ్చుండాలి. రేపు వాడికొకసారి కబురంపించు. నా నాటకం ఒక్కసారి చదివినా వాడు ఎన్నడూ ఆత్మహత్య చేసుకోలేడు. ఎందుకంటే నా హ్యూమర్ ఫెయిలవదు. హాస్యం నా చక్రాయుధం.

మధుర : అడుగో - అసిరిగాడు ఒక వేలు చూపించి ఓ రూపాయి తెమ్మంటున్నాడు.

గురజాడ : దేనికి?

మధుర : శ్రీశ్రీని పిల్చుకు రావడానికి.

గురజాడ : శ్రీశ్రీ దగ్గర నీ పేరు చెప్పి మరో రెండ్రూపాయలు గుంజుతాడు.
(ఉభయులూ నవ్వు)

(*మిసిమి* - మార్చి, ఏప్రిల్, మే - 1991)

---

## పురాణం సుబ్రహ్మణ్యం శర్మ

సుబ్రహ్మణ్యం శర్మ

తెలుగు పాఠకులెవరూ మరువలేని వార పత్రిక సంపాదకులలో పురాణం ముఖ్యులు. ఆంధ్రజ్యోతి వార పత్రిక సంపాదకులుగా ఆయన ఎందరో వర్ధమాన రచయితలను గుర్తించి, ప్రోత్సహించారు. కొత్తపోకడలలో సాగిన ఎన్నో రచనలు ఆయన ద్వారా వెలుగుచూశాయి. *మిసిమి*కోసం ఆయన ప్రత్యేకించి వ్రాసిన వ్యాస సంపుటి 'మధురవాణితో ప్రముఖుల సంభాషణలు' ముఖ్యమైనవి. ఇది పూర్తిగా ఊహాజనిత సంభాషణే అయినా, ప్రముఖుల వ్యక్తిత్వంలోనికి ఆయన చేసిన పరకాయ ప్రవేశం - ఆయన నిశిత దృష్టికి ఒక తార్కాణంగా నిలుస్తుంది. పురాణం సీత పేరుతో ఆయన వ్రాసిన 'ఇల్లాలి ముచ్చట్లు' తెలుగు నాట చదవని ఇల్లాలు లేదనటం అతిశయోక్తి కాదు.

---

మధురవాణి సంభాషణలు చాలా మధురంగా భావస్ఫోరకంగా వున్నాయి. ఇంకా ప్రచురిస్తారా? పురాణం వారి ప్రతిభకు ఇవి నిదర్శనం..."

- జోగి శాస్త్రి, బాలానగర్.

అక్టోబరు (2011)

# మానవవాద అనుభవాల పర్యటన

– *నరిసెట్టి ఇన్నయ్య*

ఇటీవల కొన్ని తూర్పు యూరోప్ దేశాలు, ఆస్ట్రియాల్లో, కొత్త విశేషాలు చూచినవి స్వేచ్ఛాలోచన గల పాఠకులతో పంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. ప్రాగ్, బుడాపెస్ట్, సాల్స్ బర్గ్, వియన్నా ప్రాంతాలు సందర్శించిన తరువాత టూరిజంలో వారు బాగా క్రమపద్ధతిని ప్రవేశపెట్టినట్లు తెలుసుకున్నాము. నేను, నా కుమార్తె డాక్టర్ నవీన కలసి ఈ ప్రాంతాలు సాధ్యమైనంతవరకు తిరిగి చూచాము. మేము వెళ్ళినచోట వైజ్ఞానిక పరిశోధనలు, సైన్సుపట్ల శ్రద్ధ, స్పష్టంగా కనిపిస్తుంది. హేతువాద, మానవవాద, ఉద్యమాలు అంతగా లేవుగాని సమస్యలపట్ల ప్రజలు ప్రభుత్వాలు శాస్త్రీయ పంథాను అవలంబించటం గమనార్హం. మరోపక్కన మతపరంగా కళాఖండాలు, కట్టడాలు, ఆకర్షణీయంగా సందర్శకులకు చూపుతున్నారు.

**వియన్నా నగరం :**

ప్రపంచంలో నివసించదగిన నగరాలు సర్వేచేయగా వియన్నాకు కొన్నేళ్ళుగా అగ్రస్థానం లభిస్తున్నది. మనం వియన్నా అనిపిలిచేది అక్కడివారు వయన్ అంటారు. అది జర్మన్ భాష. అక్కడ ఉన్న 20 లక్షల మంది ప్రజలు జర్మన్ భాషలో మాట్లాడతారు. వియన్నాకు *స్వప్న నగరం* అనే పేరుంది. మానవుల కలల గురించి పరిశోధన చేసి వాటి ప్రాధాన్యతను వెలికితెచ్చి, శాస్త్రీయంగా విడమరిచి, అవసరమయితే చికిత్స కూడా చేయవచ్చునని వెల్లడించిన ఫ్రాయిడ్ అక్కడి వాడే. ఆయన సిద్ధాంతాలు శాస్త్రీయంగా రుజువు కాలేదు. ఆయన ప్రభావం వలన కలలపై బాగా పరిశోధన జరుగుతున్నది. మేము ఫ్రాయిడ్ మ్యూజియంకు వెళ్ళి ఆయన నివాసాన్ని, వాడిన పరికరాల్ని, గడిపిన జీవితాన్ని ప్రదర్శనలో చూశాం. వియన్నా నగరంలో ఒక వీధిలో ఉన్న మూడంతస్తుల భవనం ఏమంత గొప్పది కాదుగాని ఫ్రాయిడ్ రీత్యా దానికి ప్రాధాన్యత సంతరించింది. అటు హిట్లర్, నాజీల దాడికి గురయి నగరం వదిలేసిన ఫ్రాయిడ్ వస్తువులు ఆయన కుమార్తె ఆన్ కొన్ని సేకరించి, ఒక ప్రైవేటు మ్యూజియంకు ఇవ్వగా వాటిని భద్రపరిచారు. ఆ మ్యూజియం సందర్శన మేధస్సుకు సంతృప్తినిచ్చే విషయం. ఆ తరవాత నగర కేంద్రంలో ఉన్న లాంట్ మన్ హోటల్‌కు వెళ్ళాం. ఫ్రాయిడ్ తరచు నడుచుకుంటూ వచ్చి అక్కడ కాఫీ తాగేవాడు. ఆయన కూర్చున్న టేబుల్ వద్దే కూర్చోవాలని వెళ్ళాను. అప్పటికే అక్కడ ఎవరో కూర్చుని ఉన్నారు. వారు ముగించేవరకూ వేచి వుండి, వారు వెళ్ళిపోతుండగా వారిని పలకరించి మీరు కూర్చున్న చోటుకు ప్రాధాన్యత ఏమిటో తెలుసా? అని అడిగాము. తెలియదన్నారు. అది ఫ్రాయిడ్ కూర్చునే చోటు అని చెప్పగా వారు ఆశ్చర్యపడి సంతోషించారు. మేము అక్కడ కూర్చొని భోజనం చేసి, ఫోటోలు తీసుకుని, సంతోషించాము.

అలాంటి నగరంలో గడుపుతూ మ్యూజియంలను, ప్యాలెస్‌లను,థియేటర్లను, శిల్ప సంపదకలిగిన మందిరాలను చూచి ఆనందించాము. అందులో ఎలిజబెత్ రాణివాసం పేర్కొనదగినది. అమూల్యమైన వస్తువులను అపూర్వంగా భద్రపరిచివుంచారు. కోట్ల విలువ చేసే రత్న ఖచిత మంచం ఒకటి చూచాము. దానిపై ఇంతవరకు ఎవరూ పడుకోలేదట! అంటే కేవలం ప్రదర్శన వస్తువుగానే మిగిలిపోయిందన్నమాట. వియన్నా అంతటా రోమన్ కాథలిక్ ప్రభావం కనిపిస్తుంది. వారి చర్చీల ఔన్నత్యం, పూజలు, సంగీత మయమయిన భక్తి పాటలు, వినిపిస్తూ వుంటాయి. వియన్నాలో అప్పటికప్పుడు టిక్కెట్లు కొనుక్కుని థియేటర్లకు ఒపెరా, బాలేకు వెడదామంటే కుదరదు. చాలా ముందుగా రిజర్వు చేయించుకుని వెళ్ళాలి. ఇప్పటికీ సుప్రసిద్ధమయిన సంగీత ప్రదర్శనలు నిత్యనూతనంగా జరుగుతుంటాయి. వియన్నాలో ఎటు వెళ్ళాలన్నా సౌకర్యాలు చాలా బాగా వుంటాయి. ట్రాంలు, రైళ్ళు, బస్సులు, టాక్సీలు, పుష్కలంగా తిరుగుతుంటాయి గనుక సులభంగానే ప్రయాణం చేసి,

చూసి రావచ్చు. ఫ్రాయిడ్ అనుచరుడు, వ్యక్తి స్వేచ్ఛపై సైకాలజీలో పరిశోధనలు చేసిన యాడ్లర్ కేంద్రం కూడా చూసాము. అయితే అది మ్యూజియం కాదు.

వియన్నాలో చాలా కేంద్రాలలో హోటళ్ళు నడిపేవారు పేవ్‌మెంట్లను కూడా వినియోగిస్తారు. అయితే అక్కడక్కడ బిచ్చగాళ్ళు వచ్చి అడుక్కోవటం కనిపించింది. ఇదేమంత పెద్ద సంఖ్య మాత్రం కాదు. కానీ, స్త్రీలు, పురుషులు కూడా చాలామంది సిగరెట్లు తాగటం గమనార్హం. హోటళ్ళలో ప్రధానంగా మాంసాహారం, వైన్, బీర్ ఎక్కువగా కనిపించింది.

వియన్నా అంతర్జాతీయ కేంద్రాలకు, యూనివర్సిటీలకు ప్రసిద్ధి. భావ పోరాటాలు, తాత్విక వైజ్ఞానిక ఆలోచనలు నిరంతరం సాగిస్తున్న నగరం ఇది. యునెస్కో కేంద్రం, సాంకేతిక విద్యాలయం, ఫైనార్ట్స్ అకాడమీ గమనార్హం. ఫుట్ బాల్ ప్రధానమైన ఆటగా ఉన్నది. చాలా ప్రాంతాలు ఓపిగ్గా తిరిగి చూడవచ్చు. ప్రజల సహకారం కూడా బాగానే వుంటుంది. ఏ విధంగా చూసినా వియన్నా నగరం ఆకర్షణీయంగా కనిపించేదిగానే ఉన్నది. అలాంటి నగరంలో నా పుట్టిన రోజు గడపటం ఆనందాన్నిచ్చింది.

**సౌండ్ ఆఫ్ మ్యూజిక్ :**

వియన్నా నుండి బస్సులో గాని రైల్లో గానీ, 3 గంటలు ప్రయాణం చేస్తే సౌండ్ ఆఫ్ మ్యూజిక్ సినిమా తీసిన సుప్రసిద్ధ ప్రదేశం సాల్స్‌బర్గ్ చేరుకుంటాము. సినిమా ఎంత ప్రసిద్ధమో, ఆ ప్రదేశం కూడా అంత ఆనందదాయకమైన చోటు. ఎన్నాళ్ళనుండో చూడాలనుకుంటున్న ప్రకృతి సౌందర్య దృశ్యానికి చేరుకున్నాము. అది ఆల్ప్స్ పర్వతాలలో ఉన్న చిన్న వూరు. కనీసం వంద రమణీయ దృశ్యాలు షూటింగుకు పనికొచ్చే తీరులో ఉన్న ప్రాంతం అది. కొండలు మబ్బులు, లోయలు, కొలనులు, నది, ఆపిల్ చెట్లు, అన్నీ ప్రకృతి సౌందర్యాన్ని ఇనుమడింప చేసే దృశ్యాలు.

సౌండ్ ఆఫ్ మ్యూజిక్ సినిమాను 50 సార్లు చూసామన్న వారూ మాకు తటస్థ పడ్డారు. ఆశ్చర్యమేమంటే ఇది ఇంగ్లీషులో ఉన్న సినిమా. సాల్స్‌బర్గ్‌లో ప్రజలు జర్మన్ భాష మాట్లాడతారు. వారిని పలకరిస్తే సౌండ్ ఆఫ్ మ్యూజిక్ సినిమా చూడలేదన్నారు. ఆశ్చర్యం వేసింది. సాల్స్‌బర్గ్ దగ్గర సాల్జక్ నది ప్రవహిస్తున్నది. ఆ నదిపై ఉన్న వంతెన ఇరువైపులా 'తాళాలు' విపరీతంగా ఉన్నాయి. అదేమిటని తెలుసుకోగా 'ప్రేమ తాళాలు' అని చెప్పారు. దంపతులెవరైనా తమ పేర్లు రాయించుకుని గుర్తుగా అక్కడ పెట్టుకోవచ్చు. ఆ దృశ్యం బాగుంది. పాత కొత్త నగరాలను కలిపే వంతెన అది. సాల్స్‌బర్గ్ చిన్న ప్రాంతం. ఊరంతా యాత్రికులపై ఆధారపడే ప్రదేశం. అది ప్రపంచ ప్రసిద్ధ సంగీతకారుడు మొజాక్ నివసించిన ప్రదేశం. అతడి ఇల్లు మ్యూజియంగా మార్చి చూపుతున్నారు. అతను వాడిన సంగీత పరికరాలు చూచి హెడ్ ఫోన్స్ లో సంగీతం విని ఆనందించాము. అక్కడ జూన్ నుండి ఆగస్టు వరకు సంగీతోత్సవాలు జరుగుతాయి. అది ప్రత్యేక ఆకర్షణ. మొత్తం చిన్న నగరమే కనుక నడచి చూచి ఆనందించవచ్చు. అయితే ఇక్కడొక వింత విశేషమున్నది. ఆర్చి బిషప్ ఉల్ఫ్ డైట్రిట్జ్ అనే అతను రహస్యంగా ఒక స్త్రీని అట్టేపెట్టుకుని 15 మంది పిల్లలను మాత్రమే కన్నాడట. ఆమె పేరిట ఒక సుందర భవనాన్ని నిర్మించాడు. ఆల్టివర్ అని ఆ భవనాన్ని పిలుస్తారు. అది ఆమె పేరు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న పోప్ అతన్ని తొలగించాడట. అయితే ఆ సుందర భవనాన్ని పేరు మార్చి *మిరాబెల్* అని పిలుస్తున్నారు. అదిప్పుడు సందర్శకులకు కనువిందు చేస్తున్న భవనం. చిన్న స్థలమైన సాల్స్‌బర్గ్‌లో ఒక యూనివర్సిటీ ఉన్నది. ఇక్కడ ప్రజాస్వామికంగా ఎన్నికలు జరుగుతాయి. మాంసాహారం ప్రధానం కాగా స్థానికంగా ద్రాక్షతోటల నుండి వైన్ తయారు చేస్తారు. సందర్శకులకు సౌండ్ ఆఫ్ మ్యూజిక్ సినిమా తీసిన ప్రదేశాలను తిప్పి చూపుతారు. ఎంతసేపు చూసినా విసుగు పుట్టని ప్రకృతి సౌందర్య ప్రదేశం అది. వూరంతా సందుగొందులుగా ఉన్నప్పటికీ అది కూడా ఆకర్షణీయంగా మార్చి చూపటం సాల్స్‌బర్గ్ విశేషం.

**బ్రాటిస్లేవియా :**

వియన్నాకు ఒక గంట ప్రయాణంలోనే స్లోవేకియా రాజధాని బ్రాటిస్లేవియా చేరతాము. అది డాన్యూబ్ నది తీరాన ఉన్నది. చరిత్ర ప్రసిద్ధి చెందిన డాన్యూబ్ నది తూర్పు యూరోప్ లో ఇంచుమించు తొమ్మిది దేశాల గుండా ప్రవహిస్తుంది. ఆ దేశాల నాగరికత చరిత్రపై ఎంతో ప్రభావం చూపిన నది డాన్యూబ్.

బ్రాటిస్లేవియాలో సుమారుగా నాలుగున్నర లక్షల జనాభా వున్నారు. నదికిరువైపులా నగరం ఉన్నది. ఒకవైపున పాత నగరం, మరొక వైపు కొత్త నగరం అంటారు. మొరావా నది కూడా ఇక్కడ ప్రవహిస్తున్నది. స్లోవేకియాకు సాంస్కృతిక కేంద్రంగా బ్రాటిస్లేవియాను పేర్కొనవచ్చు. ఇక్కడ

గమనించిన తొలి ఆకర్షణ స్వీట్ వైన్. తేనె కలిపిన వైన్ ఇక్కడ తయారు చేస్తారు. ఇది స్థానికంగానే ఉంటుందని తెలిసింది. ఇక్కడ నిరుద్యోగం లేదని గర్వంగా చెప్పుకుంటారు. సాంకేతికపరమైన పరిశ్రమలు ఉండటం వలన ప్రతిఒక్కరికీ ఏదో ఒక ఉద్యోగం లభించటం గమనార్హం. చిన్న ప్రదేశమే కనుక ఓపిగ్గా తిరిగి చూడవచ్చు. అటు జర్మనీ వాళ్ళూ, ఇటు కమ్యూనిస్టులూ ఎడాపెడా వాయించిన ఈ ప్రదేశంలో ప్రజలు తట్టుకొని స్వతంత్ర దేశంగా ఆవిర్భవించి పెంపొందారు. ఒక చిన్న విశ్వవిద్యాలయం కూడా ఉన్నది. కేథలిక్ మతం ప్రధానమైంది. గోతిక్ ఆర్ట్ ఎక్కడ చూసినా కనిపిస్తుంది. మేము చూసిన వాటిలో బ్రాటిస్లేవియా కాజిల్ (కోట) పేర్కొనదగినది. డాన్యూబ్ నది ఒడ్డున ఒక కొండపై ఉన్న కోట ఇక్కడ సుప్రసిద్ధమైనది. ఇది సైనిక కేంద్రంగానూ, మత స్థావరంగానూ పనిచేసింది. ప్రతిష్ఠాత్మకమైన స్థానంగా దీనిని స్థానికులు పేర్కొంటారు. దాడులలో విధ్వంసమైన ఈ కోటను థెరీసియన్ శైలిలో పునర్మించారు. ఊళ్ళో ఉన్న కొలనులు పార్కులు సుందరంగా యాత్రికులకు చూపించే తీరులో అమర్చారు.

ఇది ప్రజాస్వామిక దేశం. స్లోవాక్ పార్లమెంటు ఇక్కడ ఉన్నది. ప్రజాస్వామికంగా ఎన్నికలు జరుగుతున్నాయి. మేము వెళ్ళినప్పుడు అంతకుముందే జరిగిన ఎన్నికలలో ఓటర్లకు ఆకర్షణీయమైన బహుమతులు లభించాయని, కొందరు వెల్లడించారు. కమ్యూనిస్టు పార్టీ ఇప్పటికీ బలంగా ఉన్నా, ఓట్లు మాత్రం రావట్లేదని చెప్పారు. మ్యూజియంలు, గాలరీలు చాలా చూడముచ్చటగా అమర్చారు. ఇక్కడ ఉన్న చిన్న మార్కెట్ చేతి పరిశ్రమల వస్తువులతో కళకళలాడుతున్నది. యూనివర్సిటీలో 27 వేలమంది విద్యార్థులున్నారు. సాంకేతిక విశ్వవిద్యాలయంలో 18 వేల మంది విద్యార్థులున్నారు. నది అవతల కొత్త నగరంలో ఒకప్పుడు కమ్యూనిస్టుల ఆధిపత్యాన నిర్మించిన ఇళ్ళు, బొత్తిగా సౌకర్యంలేని గూళ్ళ వలె ఉన్నాయి. ఇంత చిన్న ప్రదేశంలో కూడా కొన్ని దేశాల రాయబార కార్యాలయాలుండడం విశేషం. యాత్రికుల నిమిత్తం, ఆకర్షణీయంగా నగరాన్ని తీర్చి దిద్దటం ఇక్కడి ప్రత్యేకత.

**బుడాపెస్ట్ :**

మనం చరిత్రలో బుడాపెస్ట్ అని చదువుకున్న నగరానికి వెళ్ళాము. ఇది హంగరీ రాజధాని. అక్కడికి వెళ్ళిన తరవాత కానీ, ఇది జంటనగరాల కేంద్రం అని తెలియలేదు. పర్వతాల మధ్య ఉన్న బుడ నగరం, పల్లపు ప్రాంతంలో ఉన్న పెస్ట్ నగరం కలిపిన జంట నగరాల రాజధాని ఇది. వీటి మధ్య ఉన్న డాన్యూబ్ నదిపై వంతెనలు నిర్మించి, ఒకే నగరంగా రూపొందించారు. 18 లక్షల జనాభా కలిగిన బుడాపెస్ట్ చరిత్ర ప్రసిద్ధమైనది. విదేశీ దాడులలో, పాలనలో వారి కట్టడాలు, చర్చీలు, నదిపై వంతెనలు మాటి మాటికీ ధ్వంసమవుతుండగా పట్టుదలతో తిరిగి నిర్మించి, ఇప్పుడు స్వతంత్ర దేశంగా అనుభవిస్తున్నారు. కమ్యూనిస్టులు పరిపాలించినా కూడా ఎక్కడా ఆనవాళ్ళు లేవు. ఆనవాళ్ళేవీ నేడు కనిపించవు. కమ్యూనిస్టు నాయకుడు లెనిన్ మొదలైన వారి విగ్రహాలు.

బుడాపెస్ట్ నగరమంతా గుహలమయం వాటిపైనే నగరం నిర్మితమైంది. యూరోప్‌కు ఒక రకంగా బుడాపెస్ట్ ఆర్థిక కేంద్రంగా కూడా మారింది. బుడ కోట, డాన్యూబ్ నదీ తీరాన మిలీనియం అండర్ గ్రౌండ్ రైల్వేలను ప్రపంచ సంపదగా ప్రకటించారు. సాంకేతికతకు ప్రధాన కేంద్రంగా మారిన బుడాపెస్ట్ చైనాకు ఆకర్షణీయ కేంద్రంగానూ పరిణమించింది. బుడాపెస్ట్ సందర్శన స్థలాలలో కేజిల్ (కోట), స్టేట్ అపరా, యూదుల స్మారక కేంద్రం పేర్కొనదగినది. ఇక్కడ యూదులు చాలా హింసలకులోనై తట్టుకున్నారు. వారి సినగాగ్‌లు సుప్రసిద్ధమైనవి. బుడాపెస్ట్‌లో కూడా పార్లమెంట్ భవనం గోతిక్ కళను ప్రస్ఫుటం చేస్తుంది. చిత్రహింసల భవనం ఇక్కడొక మ్యూజియంగా మార్చి చూపుతున్నారు. ఒకప్పుడది నాజీలకు కేంద్ర స్థానం. ఇక్కడి కేజిల్ హిల్‌ను యునెస్కో భద్రపరిచిన కేంద్రంగా అట్టిపెట్టారు. కేథలిక్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. హంగరీ సైన్స్ అకాడమీ పేర్కొనదగిన అంశం. బుడ ప్రజలు సహకార భావంతో మెలుగుతున్నారు. చూస్తుంటే చరిత్రను మరోసారి తిరగవేస్తున్నట్లుంటుంది.

**ప్రాగ్ :**

వియన్నా నుండి మూడు గంటలు బస్సులో ప్రయాణం చేస్తే ప్రాగ్ నగరం చేరుకుంటాము. ఇది చెక్ రిపబ్లిక్ రాజధాని. అయితే అక్కడి ప్రజలు దీన్ని ప్రాహా అంటారు. ప్రాహా ప్రత్యేకతలో బొహీమియన్లు పేర్కొనదగిన ప్రజలు. చరిత్రలో దీన్ని గురించి చదువుతున్నప్పుడు చాలా స్వతంత్ర ధోరణిగల ప్రజలని మన లంబాడీ సంచార జాతుల వంటివారని తెలుసుకున్నాము. వారిని స్వయంగా చూచినప్పుడు

అందమైన ప్రజలుగా కనిపించారు. మామూలు నియమ నిబంధనలకు కట్టుబడని స్వేచ్ఛాప్రియులని కొందరు కావాలని పేదరికాన్ని స్వీకరిస్తారని చెప్పారు. వీరి ప్రత్యేక చేతి కళలలో క్రిస్టల్స్ తో పాత్రలు చేయటం విశేషం. వారు చేసిన ఈ చేతి వస్తువులు కొంచెం ఖరీదనిపించినా వారి నైపుణ్యతను చాటేవిగా ఉన్నాయి. వియన్నా నుండి ప్రాగ్‌కు వెళ్ళేటప్పుడు యాత్రికుల నిమిత్తం పల్లెటూళ్ళ నుండి బస్సులు తీసుకెళ్ళారు. మధ్యలో బొహేమియన్లు నడిపే ఒక హోటల్ దగ్గర ఆపారు. ఆ విధంగా వారిని చూడటం వారి వస్తువులని తిలకించటం సంతోషకరమైన విషయం.

ప్రాగ్ కేథలిక్ మత ప్రాథాన్యతగల ప్రాంతమయినా వారిని తిరస్కరిస్తూ క్రైస్తవ సంస్కరణలు కోరిన లూథర్ ప్రభావం కూడా కొంతవరకు కనిపిస్తుంది. ఒక చోట లూథర్ విగ్రహాన్ని కూడా చూశాము. ప్రాగ్ వద్ద  విటావా నది ప్రవహిస్తుంది.  ఇక్కడ 13 లక్షల మంది ప్రజలు ఉన్నారు. ఈ నగరంలో కేంద్ర స్థానమైన కోటను, మ్యూజియంలను, గాలరీలను, థియేటర్లను గమనించాము. టూరిస్టు కేంద్రంగా యూరోప్‌లో ప్రాధాన్యతను సంతరించుకున్నది. ప్రాగ్ లో ఒక వింత గడియారాన్ని చూశాము. అది మన గడియారాలకు విరుద్ధమైన ధోరణిలో రివర్స్‌లో తిరుగుతాయి. అది ఖగోళ గడియారం. మధ్య యుగాల్లో చిత్రహింసలు ఎలా పెట్టేవారో చూపించే పరికరాలను ఒక మ్యూజియంలో అట్టిపెట్టారు. పొరుగు దేశమైన రుమేనియా నుండి చాలామంది ఉపాధి నిమిత్తం రావటం ఒక ప్రత్యేకత. సాంస్కృతిక కార్యకలాపాలు విపరీతంగా జరుగుతున్నాయి.

**రచయిత ఫ్రాంజి కాఫ్కా :**

సుప్రసిద్ధ రచయిత ఫ్రాంజి కాఫ్కా ఇక్కడివాడే. అయితే అతను జర్మనీలో ఎక్కువ కాలం గడపడం వలన ఇక్కడ ప్రజలకు అంతగా జ్ఞాపకాలు లేవు. అతని రచనల్లో కనిపించిన కోట, తిరిగి చూచాము. నగరం అంతా పాత కొత్త కేంద్రాల కూడలిగా నదికిరువైపులా ఉన్నది. నగరంలో ఎక్కడ చూచినా విగ్రహాల మయం. పునర్వికాస, గోతిక్ కళా క్షేత్రాలు, బాగా కనిపిస్తాయి. కాఫ్కా మ్యూజియం ఒక ప్రత్యేక విశేషం. అలంకరణ కళాకృతులతో కూడిన మ్యూజియం ప్రాగ్‌కు ప్రత్యేకత. నగరంలో చాలా ప్రాంతాలు తిరిగి చూడడానికి వీలుగా ఉన్నాయి.

మొత్తం మీద మేథస్సుకు సంతృప్తినిచ్చే సందర్శనగా మిగిలిపోయిన పర్యటన పేర్కొనదగినది. వీలున్నప్పుడు ఈ ప్రాంతాలను చూస్తే చాలా విషయాలు నేర్చుకుంటాము.

నరిసెట్టి ఇన్నయ్య

*ఆలపాటి రవీంద్రనాథ్‌గారికి అత్యంత సన్నిహితులు. మిసిమి తొలి సంచిక నుంచి ఇప్పటి వరకు తన సహకారాన్నందిస్తూ, మానవవాదాన్ని ప్రపంచంలో ఎన్నో దేశాలలో ప్రచారం చేస్తూ ప్రస్తుతం అమెరికా మేరీలాండ్‌లో స్థిరపడిన నరిసెట్టి ఇన్నయ్యకు మిసిమి రజతోత్సవ సంచిక వెలువడుతున్న సందర్భంలో ధన్యవాదాలు తెలుపుతున్నాం.*

---

చాట్ల శ్రీరాములు

***మిసిమి*** మార్చి సంచికలో *డాక్టరుగారు* చదువుతుంటే కళ్ళమ్మట నీళ్ళు వొస్తున్నాయి. ఎంత గొప్ప జీవితం. ఎంత సింపుల్‌గా చెప్పారు. *యాత్ర* బొమ్మ ఎంత బాగుందో అంత దుఃఖ భూయిష్టంగా ఉంది. *యాత్ర* కవితకు వేసిన బొమ్మ చాలాచాలా ఆర్ద్రంగా వుంది. కన్నుల్లో నీరు తిరుగుతుంది.

ఘంటసాల

# ఘంటసాల – జ్ఞాపకాలు

*– వి.ఎస్.ఆర్ మూర్తి*

ఆయనపేరు తెలుగువారికి నుపరిచితం. వైనతేయంగా ఎన్నివేల పాటలు, ఎన్ని లక్షలసార్లు మోసిమోసి మురిసిందో ఆ గాలికి ఎరుక, ఆయన, తెలుగు మాగాణి తన చరణాలకు పూసుకొని పులకరించిన నిత్యపారాణి. ఆయన పేరు లలితసంగీత సరస్వతి, తెలుగు సాహిత్య వాణీరమణి, రమణీయంగా సమలంకృతం చేసుకొన్న ముత్యాలమాల. ఇది ప్రతి తెలుగువాడి స్వానుభూతి.

ఆయన మూర్తీభవించిన వినయమని, రూపుదాల్చిన కృతజ్ఞతాభావమని, నిరాడంబరుడనీ, సహనశీలియని, పాటకు మెత్తందనాలను, మాటకు భావశుద్ధిని, మనసుకు చల్లందనాలను, కంఠానికి కమనీయ సుభగశయ్యా చలనాలను, గుండెకు హాయి చందనాలను అనుగ్రహించిన మధురగానలోలుడని సర్వాంధ్రలోకము ఎప్పుడూ అనుకొనే మాట. అనుకొని మురిసిపోయే నిత్య సత్యం.

ఆ ఘంటసాలను ఒక్కసారైనా ఈ కళ్ళతో చూడగలనా? తరచు ఆయన ఆరోగ్యం గురించిన కథనాలు పత్రికలు మోసుకొస్తుంటే ఆయనను చూడటం, కలవటం తీరని కోరికై మిగులుతుందా? మనకు అవకాశం వచ్చేదాకానైనా ఈ వార్తలన్నీ అబద్ధాలు కావాలి. ఎంత స్వార్థం! ప్రేమకు పరాకాష్ఠ భక్తి. రెండూ కలబోసుకొంటే అది ఆరాధన.

ఆ కలలన గానకళామూర్తి నేను ఉంటున్న ఊరికి వస్తున్నాడట! ఊరికే ఎందుకు వస్తాడు? అయితే సందర్భంలేదే! ప్రచారం లేదే! ఎవరో పుట్టించిన పుకారు కాబోలు! సందేహం! పుకారు నిజం కాకూడదూ! ఆశ!! తటపటాయింపుల మధ్య ఘంటసాల వచ్చారన్న వార్త. ఫలానా చోట ఉన్నారన్న నిజం, అతి కొద్దిమందికి మాత్రం తెలిసిపోయింది. నాకు ఆహ్వానము అందింది.

కల నిజంకాబోతుంటే, నిజం మనముందు నిలుస్తుంటే ఎంతో ఆశ్చర్యం. నా ఇద్దరు తమ్ముళ్ళు, ప్రియ స్నేహితులు కలిసి ఆయన ఉన్న చోటికి చేరుకొన్నాం. అప్పటికే ఆయన స్నానాదికాలు పూర్తి చేసుకొని, పడక కుర్చీలో కూర్చొని ఉన్నారు. పడుకొన్నట్లుగా! అందరం సామూహికంగా, నిశ్శబ్దంగా, హృదయ పూర్వకంగా చేతులు జోడించి ఆయనకు నమస్కారం చేశాం.

"రండి! బాబు రండి! కూర్చోండి. మీ అందరను కలవడం నా కెంతో సంతోషంగా ఉంది. ఎన్నేళ్ళ క్రితమో ఈ ఊరు చర్చిలో గంట కట్టిస్తానని మొక్కుకున్నాను. శరీరంలో ప్రాణం ఉండగానే వాగ్దానాలు నెరవేర్చుకోవాలి. అందుకని వచ్చాను. ఇదిగో? విజయ్‌కుమార్. మా పెద్ద బ్బాయి. భగవాన్ సత్యసాయిబాబావారిని ప్రార్థించుకున్నాను. వీడి వివాహం మీ చేతుల మీదుగా జరపించండి అని 'చూద్దాం' అన్నారు బాబా!

కాస్త ఆయాసం!! కాళ్ళు అటూ ఇటూ కాస్త సర్దుకొని.

'ఏమన్నా అడగండి'? అన్నారు. మాలో ఒకరు, 'మీ ఆరోగ్యం ఎలా ఉంది'? అడిగారు.

'చూస్తున్నావుగా బాబూ! అంత బాగాలేదు. అన్నిరకాల వైద్యాలు ప్రయత్నిస్తున్నాను. బాబా గారి దయవల్ల కాస్త నెమ్మదిస్తున్నది. బండి నడుస్తున్నది. దానికేం? మిమ్మల్ని చూస్తుంటే చక్కగా చదువుకొంటున్న మంచి పిల్లల్లా ఉన్నారు.

'మీరు సంగీత దర్శకత్వం వహించి, మీరు స్వరకల్పన చేసిన అన్ని చిత్రాల్లో మీకు బాగా నచ్చిన, మీరు మెచ్చిన చిత్ర సంగీతం ఏది?' మరొకరి ప్రశ్న.

"ఎంతో శ్రమించి చేసిన పాటలన్నీ 'రహస్యం'లో ఉన్నాయి. సినిమా ఆడలేదు. సునాయాసంగా పనిచేసిన చిత్రం 'లవకుశ' సినిమా ఆగలేదు. అఖండ విజయం పొందింది. కానీ నా దృష్టిలో 'చిరంజీవులు' మంచి పాటల చిత్రం. అలాగే అన్ని ప్రైవేటు సాంగ్స్".

'ఏడుకొండల స్వామీ ఎక్కడున్నావయ్యా?' వంటి పాటలు ఎప్పుడు విన్నా బాగుంటాయి. మీరు పద్యం పాడితే ఎంతో బాగుంటుంది. 'ఇన్ని రకాల పాటలు అందరికీ నచ్చేవిధంగా పాడటం కష్టం కదా?' మరొకరి ప్రశ్న.

'కష్టమనే వెంకన్న బాబు కథంతా నడిపిస్తున్నాడు'.

ఇంతలో విజయ్‌కుమార్ తన తండ్రికి కొన్ని మందులు ఏవో ఇచ్చి వెళ్ళాడు. ఆయనే మరికొద్ది సేపు మంచి పాటల గురించి మాట్లాడారు.

'బాగా చదువుకోండి! జాతి గౌరవం నిలబెట్టండి! తల్లిదండ్రులకు, గురువులకు కీర్తి సంపాదించి ఇవ్వండి'!

క్షణం ఆగారాయన, శక్తి కూడగట్టుకోవడానికి.

ఇంతలో 'సాయంత్రం చర్చిలో కాసేపు మాట్లాడండి' మరొకరి అభ్యర్థన.

'ఘంటసాల మాటలు ఎవరికి కావాలి బాబూ! పాడుతాను. పాడుతున్నప్పుడు అలుపేమీ ఉండదు. మీరందరూ రండి. చక్కగా వినండి' అంటూ ఆర్గనైజర్ వైపు చూస్తూ 'పిల్లలను ముందు వరుసలో కూర్చోబెట్టండి' అన్నారు.

నా చేతిలో తిలక్ వ్రాసిన 'అమృతం కురిసిన రాత్రి' పుస్తకం ఉంది.

'మీ ఆశీర్వచనం కావాలి!' అన్నాను.

'ఆశీస్సులతో ఘంటసాల' వెంటనే వ్రాసి ఇచ్చారు.

నా మరో స్నేహితుడి దగ్గర ఏ పుస్తకం లేని కారణంగా రెండు రూపాయల నోటు మీద ఆయన ఆటోగ్రాఫ్ కోసం అడిగాడు.

నా ఆశీర్వచనం నీకూ ఉంది బాబూ! రెండు రూపాయలు ఎంతో విలువైనవి. నా సంతకం ఉంటే వాడడానికి వీలుండదు. అవసరానికి పనికి రాదు. కాగితం, రూపాయి విలువ సంపాదించుకోవాలి. రూపాయి, కాగితంలా వృధా కాకూడదు. సాయంత్రం మనందరం కలుద్దాం'.

'మీతో మాకు ఫోటో కావాలి. అంగీకరిస్తారా'?

'తప్పకుండా'

వెంటనే ఫోటోగ్రాఫర్ రావడం, ఫోటో తీయడం క్షణాల్లో జరిగిపోయింది.

ఎదురు చూసిన సాయంత్రం రానే వచ్చింది. నిండు వేదిక మీద అపర గానగంధర్వమూర్తి కొలువై ఉంటే స్వప్నం నిజమౌతున్నట్లు...

ప్రార్థనా శ్లోకం, పాట వెంట పాట సుమారు మూడున్నర గంటలు మహాయోగి వలె సాగించిన కచ్చేరి ముందు, చప్పట్లు అలసిపోయినాయి.

'ఎవర్రా అన్నది ఘంటసాలకు అనారోగ్యమని! ఆయన ఇంకా ఇరవైఏళ్ళు పాడుతాడు. పాడాలి'. జనం ఆశ. ఆశంస. మా అందరకూ ఆశ్చర్యం ! మాట్లాడడానికి ఎంతో శ్రమపడిన ఘంటసాలకీ, ఆయాసం లొంగదీసుకొన్న ఘంటసాలకీ, కదలటానికి వీలులేనంతగా కళ్ళ నిండా నీళ్ళు నింపుకొన్న ఘంటసాలకీ, తనకి అన్నం పెట్టిన వారిని తలచుకొని కన్నీళ్ళు పెట్టుకొన్న ఘంటసాలకీ, తెలుగుజాతి సంస్కారానికి తాను నిలువెత్తు రూపమైనా, కించిత్తు గర్వం ఎరుగని ఘంటసాలకీ... మూడున్నర గంటల సంగీతోపాసన అలవోకగా సాగించిన ఘంటసాలకీ ఎంత తేడా!

ఆనందంతో ఆయనతో గడిపిన మధుర క్షణాలను, ఆయన సాగించిన కచ్చేరిలో ప్రేక్షకులపై మిగిలిన దివ్య క్షణాలను ప్రతిరోజూ నెమరు వేసుకొంటూ కాలం గడుస్తూ వున్నది. కలలో నుంచి ఇలలోకి, ఇలలోంచి కలలోకి అటూ ఇటూ ప్రయాణం చేస్తూ, అందరూ మమ్మల్ని 'ఘంటసాలను కలిసి మాట్లాడిన అదృష్ట వంతులుగా గుర్తిస్తుంటే' సుంత గర్వాన్ని, యోగ్యతని మోస్తూ మురిసిపోతున్న కాలం...

రెండు నెలల తర్వాత గాలి మోసుకొచ్చిన వార్త 'ఘంటసాల అస్తమయం'.

ఆ ప్రాంతీయ వార్తను ఒక స్నేహితుడి ఇంట్లో ఉండగా వినవలసివచ్చింది. జనం ఓడిపోయినారు. ఆయన పంచిన వాత్సల్య పూరితమైన ప్రేమను తలుచుకోగానే ఒక్కసారిగా అదుపు తప్పి ఏడ్చాను.

'మూర్తీ! నిదానించు. ఆయనకు నువ్వు ఇవ్వగలిగిన నివాళి ఏమిటో తెలుసునా? ఆయన పాడిన ఒక పాట పాడు'. 'పెదవులపైన సంగీతం, హృదయంలోన పరితాపం'. కంఠం రుద్ధమైంది.

ఆ మర్నాడు ఆయన సంతాప సభ. తాడేపల్లి గూడెంలో ఆయన కచ్చేరి ఆయనకు ఆఖరిది.

మాకు మొదటిది-ఆఖరిది. అందరిదీ ఒకే భావన-

ఆయన మరణం ఆశ్చర్యం. ఆయన పాట, స్మృతి, ప్రేమ-నిత్య వైభవం. ఆయన గురించి విన్నది, చదివినది అవనిపై చరించిన దివ్వపురుషుడు. ఆయన, మంచితనం, గొప్పతనం కలబోసుకున్న జాతి రత్నం.

వల్లూరు శ్రీరామచంద్రమూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త, ఫోన్ : 9440603499

# చదవండి...

– ఎన్నార్కె

✦ **భగవాన్ శ్రీ సత్యసాయి శతవసంతం :** సాయి జీవితంలోని ఘట్టాలను భక్తి భావ భరితంగా రాధశ్రీగారు ఆటవెలదులలో చేసిన రచనిది.

*పేజీలు : 40, వెల : ₹ 20/–, ప్రతులకు – ఫోన్ : 9908648474.*

✦ **శ్రీనాథుని పంచప్రాణములు :** పరిశోధనా వ్యాసాలు. రచయిత పెదపాటి నాగేశ్వరరావు. శ్రీహర్ష నైషధకావ్యాన్ని శ్రీనాథులు శృంగారనైషధంగా మలచటంలో శృంగారాన్ని అమలిన శృంగారంగా మార్చిన తీరును, కాశీలో నివసించిన వ్యాసుని ప్రతినాయకునిగా మలచిన తీరుని, వ్యాసునిలోని దోషాలను చూప గలిగింది ఒక్క శ్రీనాథుడేనని రచయిత పేర్కొన్నారు.

*పేజీలు : 55, వెల : ₹ 50/–, ప్రతులకు – ఫోన్ : 9949486529.*



✦ **ప్రేమ ఇలా సాగిపోనీ :** హిందీలో సుప్రసిద్ధ కవి ఋషభ్ దేవ్ శర్మ రచించిన ప్రేమ్ బనారహె అనే కృతి సంపుటికి గుడ్ల పరమేశ్వర్ చేసిన తెలుగు అనువాదమిది. ప్రేమేనిత్యం, ప్రేమేసత్యం అనే తత్వంలో ఆత్మతత్వం వైపుకు తీసుకు వెళ్ళే భావాలున్నాయి. సత్యం అనే తత్వంలో ఆత్మతత్వం వైపుకు తీసుకు వెళ్ళే భావాలున్నాయి. అనువాదం సరళంగా సాగింది.

*పేజీలు : 80, వెల : ₹ 120/–, ప్రతులకు – ఫోన్ : 9849986346.*




✦ **పొరుగు వెన్నెల :** ఎలనాగ వ్రాసిన అనువాద కవిత్వం. పాలపిట్ట బుక్స్ ప్రచురణ. ప్రపంచంలోని వివిధ భాషల నుండి ప్రతిభావంతులైన రచయితలు చేసిన వచన కవిత్వం నుండి సేకరించిన 40 కవితల అనువాదాలు. ఇవి మనసుకు సూటిగా తాకే గేయాలు.

*పేజీలు : 72, వెల : ₹ 50/–, ప్రతులకు – ఫోన్ : 040–27678430.*

✦ **ఐనా నేను ఓడిపోలేదు :** జ్యోతి రెడ్డి, జి.వల్లీశ్వర్ కలిసి వ్రాసిన వాస్తవ జీవన గాథ. ఇది ఒక స్త్రీ ఆర్తనాదం, ఆత్మఘోష, ఆత్మ విశ్వాసంతో సాధించిన జీవన విజయం. ఈ ఆత్మకథ చదివిన తరువాత మన మనసు ఊరుకోదు. ఈ కథను పదిమంది చేత చదివింప జేయాలనిపిస్తుంది. ఇటువంటి ఆత్మకథలను స్కూలు కరికులంలో ఎందుకు జేర్చరు? పిరికితనంతో, క్షణం క్షణం మరణిస్తూ జీవితాన్ని వెలమార్చుకుంటున్న ఎందరికో ఇది గుణపాఠం కాగలదు. దీనిని ప్రచురించిన ఎమెస్కోవారు రచనను ప్రోత్సహించిన కె.రామచంద్ర మూర్తి అభినందనీయులు.

*పేజీలు 130, వెల : ₹ 60/–, ప్రతులకు – ఫోన్ : ఎమెస్కో బుక్‌హౌస్.*

✦ **నూతన పరిచయం :** చేయి తిరిగిన రచయితగా ఆశారాజు పాఠకలోకానికి సుపరిచితులు. తెలుగునాట ఉన్న అన్ని పత్రికలలో ఆయన రచనలు ప్రచురించబడ్డాయి. వాటిలో కన్నీటి సంగ్రహ సమూహమే ఈ సంపుటి. రచయిత శైలి మనల్ని విడవకుండా చదివింపజేస్తుంది.

*పేజీలు : 107, వెల : ₹ 90/–, ప్రతులకు – ఫోన్ : 040–24642387*



✦ **ఉత్తమ లాటిన్ అమెరికన్ కథలు :** ఎలనాగ అనువాద రచనలు. పాలపిట్ట ప్రచురణలు. సుమారు 20 కథలు ఎంపిక చేసిన అనువాద శైలి ఉత్తమ శ్రేణిలో నడిచింది.

*పేజీలు : 170, వెల : ₹ 150/–, ప్రతులకు – ఫోన్ : 040–27678430*

✦ **ఆ నేల, ఆ నీరు, ఆ గాలి :** వేలూరి వెంకటేశ్వరరావు కథలు. ఇది అమెరికా తెలుగువాళ్ళు వ్యవహార శైలిపై సుతిమెత్తగా చురకలంటించిన వ్యంగ్యకథలు – సునిశితమైన హాస్యం తొణికిసలాడుతూ మనల్ని గిలిగింతలు పెడుతుంది. మన జీవన వ్యవహార శైలిపై ఆలోచింపజేస్తుంది కూడా.

*పేజీలు : 190, వెల : ₹ 80/–, ప్రతులకు – ఫోన్ : 0866-2573500*



✦ **ఇందులేఖ :** రచయిత పాటిబండ్ల క్రాంతికుమార్ – ఒ. చందుమీనన్ వ్రాసిన మళయాలీ నవలకిది తెలుగు అనువాదం. నవలను సమగ్రంగా అర్థం చేసుకోవడం కోసం నవలా ప్రారంభంలో నే ఆనాటి సాంఘిక పరిస్థితులపై వ్యాసం ఉంది. మళయాలీ జీవన విధానాన్ని ఆకళింపు చేసుకోవాలనుకేనే వారికి ఈ నవల కర దీపిక.

*పేజీలు : 221, వెల : ₹ 100/–, ప్రతులకు – ఫోన్ : 9441265688*



✦ **వేమన బోధ :** వేమన రచనలపై ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం వ్రాసిన వ్యక్తిత్వ, సామాజిక, యోగ, ఆధ్యాత్మిక విశ్లేషణ. హితోపదేశం చేయని వాడు కవికాలేడని, లోక హితాన్ని సంపాదించడం కవి బాధ్యత అంటూ వివరణాత్మక విశ్లేషణ చేసి చూపారు రచయిత.

*పేజీలు : 275, వెల : ₹ 185/–, ప్రతులకు – ఫోన్ : 9246830320*



✦ **నవనీతం :** డాక్టర్ నలిమెల భాస్కర్ సాహిత్యంపై విశ్లేషణాత్మక వ్యాసాలు. సంపాదకులు నగునూరి శేఖర్. మన చుట్టుపక్కల రాష్ట్ర భాషలోని సాహిత్య సుమధురాలను అందించిన వారుగా నలిమెల భాస్కర్ ప్రసిద్ధులు. ఒక విశ్వ విద్యాలయపు బాధ్యతను ఆయన అలవోకగా చేశారు.

*పేజీలు : 185, వెల : ₹ 100/–, ప్రతులకు – ఫోన్ : 9985411275*

✦ **డావిన్సీ - కళ జీవితం :** మహోజ్వల చిత్రకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన డావిన్సీపై రెండు సంవత్సరాల సుదీర్ఘ పరిశోధనానంతరం పి. మోహన్ మన ముందించిన డావిన్సీ సమస్తం అని చెప్ప దగ్గరచన. ఈ రచనలో రచయిత యొక్క కఠోర పరిశ్రమ ప్రతి పేజీలోను కనిపిస్తుంది. డావిన్సీ గురించి ఇంతకు మించి తెలుసుకోదగ్గది ఇక ఏమీ లేదు అన్నంత సమగ్రంగా సాగింది రచన. సి. మోహన్ మరిన్ని చిత్ర, శిల్పకారుల జీవిత గాథలను భవిష్యత్‌లో మనం ముందుంచి తెలుగులో ఇప్పటి వరకూ ఉన్న లోటును పూరిస్తారని ఆశిద్దాం. కాకి ప్రచురణలు.

*పేజీలు : .... , వెల : ₹ 150/–, ప్రతులకు – ఫోన్ :* 9949052916

✦ **గుణాఢ్యుని బేతాళ కథలు :** రచయిత సహవాసి. ఇది బేతాళ పంచవింశతి– అని చెప్పబడిన 25 కథలు. చందమామలో వచ్చిన వాటిలో కొన్ని కల్పిత కథలున్నాయి. ఇవి మూలకథలు– ఇది సహవాసి చిట్టచివరి అనువాదం. పీకాక్ క్లాసిక్స్ ప్రచురణ.

*పేజీలు : 140, వెల : ₹ 75/–, ప్రతులకు – ఫోన్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.*

✦ **ముప్పన్నెలు ॥ గేయాలు :** రచయిత్రి సబ్బతి సుమిత్రా దేవి. ఆజన్మాంతం గుర్తుండే మధుర జ్ఞాపకాలలో ముఖ్యమైన జాతీయ పండుగలు – జాతీయ భావాలను నిండుగా తనలో దాచుకొని రచన సాగించారు.

*పేజీలు : 20, వెల : ₹ 10/–, ప్రతులకు – ఫోన్ : 7207550867*

# జన్మనివ్వని తండ్రి

*గాంధీ తనకు వచ్చిన ఎన్నో ఉత్తరాలకు 'నవజీవన్' ద్వారా సమాధానం వ్రాసేవారు. అలాంటి ఉత్తరాల్లో ఇది ఒకటి.*

సారాంశం మాత్రమే ఇవ్వడం వీలవుతుంది కాబట్టి ఒక యువకుడు రాసిన ఉత్తరంలోని సారాంశం ఈ క్రింద ఇవ్వడం జరిగింది :

"నేను వివాహితుణ్ణి. విదేశాలకు వెళ్ళి వచ్చాను. నాకు, నా తల్లిదండ్రులకు విశ్వాసపాత్రుడైన ఒక మిత్రుడు ఉన్నాడు. ఆ మిత్రుడు నా భార్యను తప్పుత్రోవకు లాగాడు. నేను విదేశాల నుంచి వచ్చేసరికి అతనితో ఆమె గర్భవతి అయిన విషయం తెలిసింది. నా తండ్రికి ఈ విషయం చెప్పినప్పుడు ఆయన ఆమెకు గర్భస్రావం చేయించి తీరాలని పట్టుపడుతున్నాడు. అలా చేయకపోతే కుటుంబ గౌరవం మంటకలిసి పోతుందని ఆయన అభిప్రాయం. నాకు మాత్రం గర్భస్రావం చేయించడం ధర్మసమ్మతం కాదని అనిపిస్తూంది. పాపం నా భార్య చాలా పశ్చాత్తప పడుతూంది. ఆమె ఏమీ తినకుండా, త్రాగకుండా ఉంటూంది. ఎప్పుడూ ఏడుస్తూంటుంది. ఇలాంటి పరిస్థితిలో నా కర్తవ్యమేమిటో దయ చేసి చెప్పండి."

ఈ ఉత్తరం నేను చాలా సంకోచంతో ప్రచురిస్తున్నాను. ఇలాంటివి సమాజంలో జరుగుతూ ఉంటాయనే విషయం అందరికీ తెలుసు. వీటిని గురించి తగిన సంస్కారంతో బహిరంగంగా చర్చించడం అనుచితమని నాకు అనిపించడం లేదు. అంతే కాదు, అది అవసరమని కూడా నాకు అనిపిస్తుంది.

ఇందులో గర్భస్రావం అనే తప్పు పని చేయించకూడదనేది మాత్రం సూర్యుని వెలుగు లాగా స్పష్టంగా తెలుస్తూంది. పాపం ఈ స్త్రీ చేసినటువంటి తప్పు వేల మంది భర్తలు చేస్తూ ఉంటారు. అయినా వాళ్ళను ఎవరూ ఏమీ అనరు. సమాజం దీన్ని సహిస్తుందేగాని నిందించదు. పురుషుడు ఎలాంటి వికారాలకు లోనై ఉంటాడో, స్త్రీ కూడా అలాంటి వికారాలకు లోనై ఉంటుంది. తేడా ఏమిటంటే, పురుషుని దోషం బయట పడదు. స్త్రీ దోషం బయట పడుతుంది.

ఈ స్త్రీ దయ చూపడానికి అర్హురాలు. ఆ శిశువును ప్రేమతో పోషించి పెద్ద చేయడం, తండ్రి సలహాను పాటించకుండా ఉండడం ఆమె భర్త కర్తవ్యం. భర్త ఆమెతో కలిసి కాపురం చేయాలా లేదా అనేది చిక్కు ప్రశ్న. భర్త పత్నీపరాయణుడై ఉండి, తానెప్పుడూ దోషం చేయకుండా ఉండి ఉంటే అతడు భార్యను వదలిపెట్టడం సమంజసమే. కానీ అతడు భార్యను పోషించాలి, ఆమె విద్య నేర్చుకోడానికి అవకాశం కల్పించాలి. పవిత్రమైన జీవితం జీవించడానికి ఆమెకు సహాయ పడాలి. భార్యకు నిజమైన పశ్చాత్తాపం కలిగినప్పుడు భర్త ఆమెను స్వీకరించడంలో కూడా ఏమీ దోషం లేదని కూడా నేను భావిస్తున్నాను. తప్పుచేసిన భార్య మనసు పూర్తిగా నిర్మలమైపోయినప్పుడు ఆమెని స్వీకరించడం భర్త ధర్మంగా భావించబడే స్థితిని నేను ఊహించగలను. – **అనువాదం : జె. లక్ష్మీరెడ్డి.**

కొంగర జగ్గయ్య

**మిసిమి పత్రికను ఆదినుంచీ క్రమం తప్పకుండా చదివే పాఠకులలో నేనొకణ్ణి. ఆ అర్హతతో మీకు రెండు ముక్కలు వ్రాయాలనిపించింది. ఇది Elite పత్రిక. ఇలాంటి పత్రికలు పూర్వం ఉండేవి కాని ఇప్పుడు అరుదు. ఆ కొరతను మీరు తీరుస్తున్నందుకు నా అభినందనలు. పాక్షికదృష్టి లేకపోవడం మీ Policy లో సుగుణం. విషయ సంకలనంలో కావలసినంత వైవిధ్యం ఉంది. వ్యాసాలు చాలా వరకు మంచి స్థాయిలో ఉండడమేకాక, ఆసక్తికరంగా కూడా ఉంటున్నై. 'దర్శనాలు', 'చిత్రకళ' గురించిన వ్యాసాలు ఈ సందర్భంగా పేర్కొనదగినవి. అక్కడక్కడా కొన్ని రచనల్లో మాత్రం Clarity ఉండడం లేదు. వ్రాసే వాళ్లు పండితులు కావచ్చు. కాని వాళ్లు వ్రాసేది మాత్రం పండితులు కానివాళ్లకోసం (అలాగని పామరులు కాదు) అని గుర్తుంచుకోవడం అవసరం. Devil's Dictionary ప్రచురణ ఒక ప్రత్యేకాకర్షణ. ఎక్కడా దొరకనిది ప్రచురించి గొప్ప సేవ చేశారు.**

**- కొంగర జగ్గయ్య (మిసిమి ఆగష్టు 1994)**

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు** ₹

1. బాపు బొమ్మలు 200.00
2. మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు 500.00
3. బుద్ధుని దీర్ఘ సంభాషణలు – *ఎ.వి.రెడ్డి* 200.00
4. బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 ” 200.00
5. బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 ” 200.00
6. బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 ” 200.00
7. ఆచార్య నాగార్జునుడు 150.00
8. దూర తీరాలలో... – *వి. అశ్వినీకుమార్* 60.00
9. అమాహ ” 60.00
10. అంతర్వీక్షణం ” 50.00
11. సిద్ధార్థ ” 50.00
12. నాలో నేను ” 30.00
13. అగాధం ” 75.00
14. చార్లీ చాప్లిన్ (నా కథ) – *వి. అశ్వినీకుమార్* 299.00
15. కథాంజలి–1 & 2 – *ఎస్సారె* 110.00
16. THE THUNDERCLOUD ” 120.00
17. మిసిమి వ్యాసాలు – *నరిసెట్టి ఇన్నయ్య* 125.00

**ఇతరములు**

18. భట్టిప్రోలు కథలు 150.00
19. రెండు దశాబ్దాలు – కథ 1990–2009 150.00
20. సప్తపర్ణి – *కాండ్రేగుల నాగేశ్వరరావు* 777.00

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

1. లోకకవి వేమన – *ఎమ్. కోదండ రామిరెడ్డి* 100.00
2. మన వేమన – *ఆరుద్ర* 80.00
3. వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* 50.00
4. VEMANA - *V.R. Narla* 50.00
5. VEMANA - Through Western Eyes. - *V.R. Narla* 50.00
6. విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* 100.00
7. పురాణ ప్రలాపం *((ప్రొ.హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* 100.00
8. THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* 50.00
9. వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* 100.00
10. వేమన ఉపదేశామృతం –*ఎన్.ఎమ్. సుభాని* 25.00

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు** ₹

1. మహాపరిత్తం – *బోధ చైతన్య* 100.00
2. జాతక కథలు – *శివశంకర స్వామి* 60.00
3. బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* 70.00
4. మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* 75.00
5. మిళిందపన్హ : ఉపమలు – *బోధ చైతన్య* 75.00
6. బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* 40.00
7. వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* 50.00
8. జయమంగళం – *బొర్రా గోవర్ధన్* 40.00
9. బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* 30.00
10. భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* 150.00
11. విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* 50.00
12. మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య* 150.00
13. బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* 100.00
14. ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* 60.00
15. శీలం–ధ్యానం – *బోధ చైతన్య* 150.00
16. లోకక్షేమ గాథలు – *బోధ చైతన్య* 75.00
17. జాతకమాల – *బోధ చైతన్య* 150.00
18. సంఘమిత్ర కథలు – *బొర్రా గోవర్ధన్* 75.00
19. తథాగత – *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* 50.00
20. నిత్యజీవితంలో అభిధర్మం – *ఆంగ్లమూలం: ఉకోలే, తెలుగు: వోలేటి* 150.00
21. బుద్ధవచనం – *బోధ చైతన్య* 200.00
22. బుద్ధ – ధమ్మ – సంఘ – *ఆంగ్లమూలం: ధర్మానంద కోసంబీ, అనువాదం: జె. లక్ష్మీరెడ్డి* 80.00

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

1. తెలుగా, ఆంధ్రమా? – *వాగరి* 40.00
2. యతిగీతం – *స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి)* 50.00
3. తిరుపతి తిమ్మప్ప – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* 250.00
4. రైతు రాయలు – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* 50.00
5. తెలుగులో పాళీ పదాలు – *చీమకుర్తి శేషగిరిరావు* 50.00
6. ఆంధ్రనగరి – *సాయి పాపినేని* 290.00

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹300/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు:** .....

**2. చిరునామా:**

ఇం.నెం. .....

వీధి .....

పేట .....

ఊరు .....

పిన్ .....

సెల్ .....

**3. సంతకం:** .....

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

*చందాలు* ***మిసిమి*** *పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.*

★ **మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : ***అగాధం*** **పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

★ రెండు సంవత్సరాల చందా దారులకు ***బాపు బొమ్మల*** **పుస్తకం పంపిస్తాము.**

★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **నా కథ *చార్లీ చాప్లిన్*** **గంథాన్ని బహుమతి.**

★ ఐదు సంవత్సరాల చందా దారులు 2013 ***మిసిమి*** **సంచికల బౌండును అందుకోవచ్చు.**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

సంక్రాంతి

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



మేఘైర్మేదురమంబరం